

వ్యక్తిత్వ వికాసానికి

# వెలుగు వెన్నెల దీపాలు

## యండమూరి వీరేంద్రనాథ్

వివిధ వ్యక్తిత్వ పుస్తకాల్లో నుంచి ఏరి కూర్చిన కథల సమాహారం

# యండమూరి వీరేంద్రనాథ్


వ్యక్తిత్వ వికాసానికి

# వెలుగు వెన్నెల దీపాలు

వివిధ పుస్తకాల్లో నుంచి ఏరి కూరి కూర్చిన కథల సమాహారం


**నవసాహితి బుక్‌హౌస్**

**ఏలూరు రోడ్ • విజయవాడ-520 002.**

**VELUGU VENNELA DEEPALU**

*By :*
**YANDAMOORI VEERENDRANATH**
36, U.B.I. Colony,
Road No. 3, Banjara Hills,
**HYDERABAD - 500 034.**
**Ph : 924 650 2662**
yandamoori@hotmail.com
w.w.w.yandamoori.com

**SARASWATHI VIDYA PEETAM,**
Kakinada - Samalkot Road,
MADHAVAPATNAM,
E.G. Dist. (A.P.)


*First Edition* : **1st December, 2017**

*Publishers :*
**NAVASAHITHI BOOK HOUSE**
Eluru Road, Near Ramamandiram,
Vijayawada - 520 002.
Ph : 0866 - 2432 885
navasahithiravi@gmail.com

*Printers :*
**Nagendra Enterprises**
Vijayawada-3, Ph : 2575115.

*Price :*
**₹ 150/-**

# ప్రేమ ప్రకటన



ప్రేమ ప్రకటనకి చాలా మార్గాలున్నాయి. పుట్టిన రోజు నాడు కేకు ముక్క నోట్లో పెట్టటం నుంచీ, నిద్ర పోతున్నప్పుడు నుదుటి మీద ముద్దు పెట్టుకోవటం వరకూ అన్నీ ప్రేమను ప్రకటించే చర్యలే. అయితే కొన్ని అసంకల్పిత చర్యలు కూడా ఆప్యాయతల్ని అద్భుతంగా పట్టిస్తాయి.

విజయవాడ నుండి పాలకొల్లుకు ట్రైన్ లో వెళ్తున్నాను. సాయంత్రం 6 కావస్తోంది. గోధూళివేళ కావడంతో కిటికీలోంచి పొలాలు, అందమైన ప్రకృతి, స్వచ్ఛమైన గాలి... అక్కడక్కడా పెంకుటిళ్ళు, డాబాలు... ఇంత అందమైన ప్రకృతిలోనూ, ప్రకృతికే అందాన్నిచ్చే అద్భుతమైన దృశ్యం నా కంట పడింది.

డాబా పెరట్లో మొక్కల మధ్య గట్టు మీద కూర్చున్న తండ్రి, పక్కన నిల్చుని తల రుద్దుతూన్న అతని భార్య, చెంబుతో నీళ్ళు అందిస్తున్న పదేళ్ళ కొడుకు, గిన్నె పట్టుకొని కుంకుడు కాయో, శీకాయ రసమో తల మీద పోస్తున్న పద్నాలుగేళ్ళ కూతురు... ఇలాంటి దృశ్యం చూసి ఎన్నో ఏళ్ళు అయింది.

చేస్తున్న పనిలో ఇలా కుటుంబ సభ్యులందరూ మమేకమవడం ఈకాలంలో చాదస్తంగా, కాస్త పాత చింతకాయ పచ్చడిగా ఉంటుందని అనేవారూ ఉండకపోరు. అన్నం తినడానికే సమయం దొరకని ఈ కాలంలో, ఏ షాంపూతోనో రెండు నిముషాల్లో అయిపోయే స్నానానికి తమ సొంత పనులు మానుకొని ఒక మనిషి చుట్టూ ఇంతమంది చేరడం ఏమిటని వాదించే వారూ ఉంటారు.

మనిషి జీవితంలో చెరిగిపోని సంపదలు ఏవైనా ఉన్నాయంటే ఇటువంటి మధురానుభూతులే అని మరి కొందరు భావిస్తారు. *(టీన్స్ పిల్లల పెంపకం ఒక కళ)*

# మనసులో మాట



ఒక మనిషి తన మనసులో భావాలని ఇతరులకి చెప్పడం కోసం మాట్లాడతాడు. ఐతే అది అవతలి వారికి చేరే లోపులో దాని అర్థాలు మారిపోవచ్చు. అందుకే మనుష్యుల మధ్య విబేధాలు వస్తాయి. చెప్పేవాడు అవతలివారికి అర్థమయ్యే రీతిలో చెప్పాలి, వినే వాళ్ళు అవతలి వారి మనసుని అర్థం చేసుకుంటూ వినాలి. ఈ ఉదాహరణ చదవండి.

"నేను అందంగా ఉంటానా?" అడిగింది ఒక అమ్మాయి. ఉండవన్నాడు అబ్బాయి. పైగా నవ్వాడు.

అమ్మాయికి కోపం వచ్చింది. "నేను దూరమైతే ఒక్క కన్నీటి చుక్క కూడా రాల్చవా?" అంది రోషంగా.

రాల్చనన్నాడు అబ్బాయి.

"అయితే గుడ్ బై..." అంటూ ఆ అమ్మాయి లేచి విసవిసా వెళ్ళి పోబోయింది.

అతడామె చేయి పట్టుకొని ఆపి "నువ్వు అందంగా కాదు. అద్భుతంగా ఉంటావు. నువ్వు నా నుంచి దూరమైతే నేను ఏడవను. ఎందుకంటే అప్పటికే నేను మరణిస్తాను కాబట్టి" అన్నాడు.

మనసుకు వయసొచ్చి, అమ్మాయి కనురెప్ప పావురం రెక్కలా టపటపా కొట్టుకుంది.

*(ప్రేమ ఒక కళ)*

# ఒక పాఠం-ఒక నమ్మకం

మామని చంపటానికి కోడలు చేసే ప్రయత్నాలూ... రక్త సంబంధీకుల మధ్య చిచ్చులు పెట్టే విలన్ కథలూ చూస్తూ, సాడిస్టిక్ భావప్రాప్తి చెందే టి.వి. సమయం నుంచి, ఒక పది నిముషాలు పిల్లలకి కథలు చెప్పటానికి కేటాయిస్తే బావుంటుంది. ఎన్నో మంచి మంచి కథలు ఉన్నాయి. ఉదాహరణకి ఈ క్రింది జపనీస్ కథ చదవండి. చిన్న మనసుపై పెద్ద ప్రభావాన్ని చూపదా ఇది? మీరే చెప్పండి.

ఒక యువకుడు తన ఎనభై ఏళ్ళ ముసలి తాతని ఆయన పుట్టినరోజు నాడు డిన్నర్‌కి తీసుకువెళ్ళాడు. భోజనం మధ్యలో పొలమారి, ఆ వృద్ధుడు పాత్ర సరిగ్గా పట్టుకోలేక వదిలెయ్యటంతో అది ప్లేటు మీద పడి, క్రిందికి దొర్లింది. ఆ హడావుడీ, కంగార్లో అన్నం ఆయన బట్టల మీద పడి, దాని మీద చిక్కటి సూపు జారి, అసహ్యంగా తయారైంది.

పెద్ద శబ్దంతో పాత్ర క్రింద పడటంతో అటు తిరిగిన కస్టమర్లు, వాళ్ళ వైపు జిగుప్సగా చూసారు.

ఇదేమీ పట్టనట్టు ఆ యువకుడు, పెద్దాయన భోజనం పూర్తయ్యే వరకూ ఆగి, తరువాత వాష్-బేసిన్ దగ్గరకు తీసుకు వెళ్ళి, అన్నం మెతుకులు చేత్తో దులిపి, బట్టల మీద పడిన సూపు శుభ్రంగా కడిగి, తడి చేసిన జేబు రుమాల్తో మొహం తుడిచి, దువ్వెన తీసి తల దువ్వి, కళ్ళజోడు తిరిగి సరిగ్గా సర్ది, మొత్తం పరికించి సంతృప్తి చెంది, తిరిగి టేబుల్ దగ్గరికి తీసుకొచ్చాడు.

అప్పటి వరకూ శబ్దపు వర్షంలో మునిగిపోయిన రెస్టారెంటు ఒక ఇబ్బందికరమైన స్వీయ అపరాధనా భావపు అవమానంతో నిశ్శబ్దమై పోయింది. బిల్లు పే చేసి ఇద్దరూ బయటకు వెళ్తూ ఉండగా, వెనుక నుంచి ఒక కస్టమరు "బాబూ... నువ్వు ఇక్కడ ఏవో వదిలేసి వెళ్తున్నావ్" అని అరిచాడు.

ఆ యువకుడు వెనక్కి తిరిగి తన టేబుల్ వైపు చూసి "ఏమీ లేవే. ఏమిటి?" అని అడిగాడు.

"ప్రతి కుర్రాడికీ ఒక పాఠం. ప్రతీ వృద్ధుడికీ ఒక నమ్మకం".

*(టీన్స్ పిల్లల పెంపకం ఒక కళ)*

# ఆలోచన బావుంటే...

అత్తారింట్లో అందరితోనూ అవినాభావ సంబంధం కుదరకపోవచ్చు. ఆడపడుచుని చూస్తే ఆక్రోశం కలగొచ్చు. వదిన్ని చూస్తే వళ్ళు మండవచ్చు. మరి కొందర్ని చూస్తే ఎందుకో గానీ వారి నుంచి దూరంగా వెళ్ళి పోవాలనిపిస్తుంది. వారి ఆలోచన రాగానే మనసు వికలమౌతుంది. అటువంటి వారితో తప్పనిసరిగా ఒకే ఇంట్లో ఉండ వలసి వచ్చినప్పుడు జీవితం నరకం అవుతుంది. వారిని క్షమిస్తే, ఆ 'క్షమ' మనశ్శాంతినిస్తుంది.

చెప్పటం సులభమే కానీ అదంత సులభం కాదు. అయినా ప్రయత్నించటంలో తప్పు లేదు కదా. ఈ సందర్భంగా ఒక ప్రాచీన నేపాలీ కథ చదవండి. ఈ కథకు నాదైన రీతిలో బాగా నాటకీయత, సంభాషణలూ చేర్చటం జరిగింది.

చిన్నపుడే తల్లిని కోల్పోయిన పరిణీత చాలా అందమైన, నెమ్మదస్తురాలైన అమ్మాయి. తాను ఇలా మారిపోతుందనీ, అసలిలా ఆలోచిస్తుందనీ కలలో కూడా ఆమె అనుకోలేదు. వివాహం జరిగి అత్తారింటికి వెళ్ళిన మొదటి పది రోజులూ బాగానే ఉంది కానీ, ఆ తరువాత ఆమె కష్టాలు ప్రారంభం అయ్యాయి.

భర్త మంచివాడు. కానీ నోట్లో నాలుక లేదు. అతని తండ్రి చిన్నప్పుడే చనిపోవటంతో తల్లే పెంచింది. దాని వల్ల అతనిపై తనకే పూర్తి అధికారం ఉన్నదని ఆమె అనుకుంటూ ఉంటుంది. అతను కూడా తల్లి పట్ల సదా అదే భావంతో ఉంటాడు. దాంట్లో ఎవరికీ ఏ అభ్యంతరమూ లేదు గాని, కోడలు ఆ ఇంట్లో అడుగు పెట్టగానే, తన కొడుకు ఎక్కడ చేతిలోంచి జారిపోతాడో అన్న భయం ఆమె అత్తగారికి పట్టుకుంది. అందుకని, కొడుకు చుట్టూ ఒక వృత్తం గీసేసింది.

బయటవారికి ఆమె చాలా మంచిది. కానీ అసలు విషయం పరిణీతకే తెలుసు. ప్రతి చిన్నపనికీ దెప్పి పొడవటం, పుట్టింటివారిని విమర్శించటం, కొడుకుతో గంటల తరబడి గుసగుసలాడటం ఆ అమ్మాయిని చాలా బాధ పెట్టేవి. పెళ్ళయినప్పటి నుంచీ ఆమెకు ఒకటే అనుమానం. తనని అతను చేసుకున్నాడా? ఆమె చేసుకుందా? అని.

ఎన్నో కలల్తో ఆ ఇంట్లో అడుగుపెట్టిన ఆమె కలలు కల్లలయ్యాయి. రోజులు వారాల్లోకీ, వారాలు నెలల్లోకీ మారేకొద్దీ, పరిణీత జీవితం దుర్భరంగా మారింది.

నేపాల్ దేశపు కట్టుబాట్ల ప్రకారం ప్రతీ కోడలూ అత్తగారి మాట వింటూ అణిగిమణిగి ఉండాల్సిందే. కానీ పరిణీత వ్యక్తిత్వం కలది. దాంతో ఎదురు తిరిగింది.

ఎదురు జవాబులు చెప్పటం, ధిక్కారం, పెడసరిగా మాట్లాడటంతో అత్తా కోడళ్ళ మధ్య చిన్నగా మొదలైన కలహం, త్వరలోనే తీవ్ర స్థాయికి చేరుకుంది. ఈ పరిణామాల్తో

అందరికన్నా ఎక్కువ నలిగిపోయినవాడు భర్త. ఇటు తల్లికీ, అటు భార్యకీ చెప్పలేక ఇంటి పట్టున ఉండటం మానేసాడు.

ఆ ఇంట్లో అత్తగారితో పాటు తాను ఉండలేనని ఆమెకు అర్థమైపోయింది. ఒక్కగాను ఒక్క కొడుకుని వదిలి ఆ ముసల్ది ఎక్కడకూ వెళ్ళదని కూడా రూఢీ అయింది. ఏదో ఒక నిర్ణయం తొందరగా తీసుకోవాలని తెలుసు. కానీ ఏం తీసుకోవాలో తెలియ లేదు.

ఆమె ఇటువంటి కన్ఫ్యూజన్‌లో ఉండగా, ఆమె మామయ్య (తల్లి అన్నయ్య) ఇంటికి వచ్చాడు. ఆయన ఒక ఆయుర్వేద డాక్టరు. చిన్నప్పటి నుంచీ ఆమెని ఎత్తుకుని పెంచాడు.

పరిణీత ఆయనకి ఏ విషయమూ దాచకుండా చెప్పేసింది. చివర్లో "ప్రతీ చిన్న దానికీ నా భర్త నోటి వెంట 'అమ్మా' అన్న పదం తప్ప మరో మాట రాదు. ఈ సంసారం చేయటంకన్నా ఒకోసారి ఆత్మహత్య చేసుకోవటం మంచిదనిపిస్తుంది..." అంటూ ఏడ్చింది.

ఆయన ఆ ఇంట్లో రెండు రోజులు ఉండి, అత్తా కోడళ్ళ మధ్య జరుగుతున్నదంతా గమనించి ఒక నిర్ణయానికి వచ్చినట్టూ, "ఆమె చనిపోతే గానీ సమస్య పరిష్కారం కాదు" అన్నాడు.

ఆ మాటకి ముందు కలవరపడ్డా క్షణం ఆగి, ఒక నిశ్చయానికి వచ్చినట్టుగా, "అవును ఆమె చనిపోవాలి" అన్నదామె. తాను ఇలా మారిపోతుందనీ, అసలిలా ఆలోచించగలదనీ ఆమె కలలో కూడా అనుకోలేదు. తరువాత ఇద్దరూ ఆ విషయమై చాలా సేపు మాట్లాడుకున్నారు.

ఆయన రెండు రోజులపాటూ అడవి అంతా తిరిగి, కొన్ని మూలికలు తెచ్చి వాటితో మాత్రలు తయారు చేసి ఇస్తూ, "ఇవి రోజుకొకటి చప్పున ఆర్నెల్ల పాటూ వాడాలి. నీ అత్తగారు మొదటి రోజే చనిపోతే అందరికీ అనుమానం వస్తుంది" అన్నాడు రహస్యంగా.

పరిణీతకి కూడా ఈ ఆలోచన బాగానే ఉన్నదని అనిపించింది. అతడి దగ్గర నుంచి ఆ పొట్లాలు తీసుకుంది.

ఆ మరుసటి రోజు ఆయన వెళ్ళిపోతూ "నా మూలికలు ఆమెని కొద్దికొద్దిగా రక్తహీనం చేసి చంపుతాయి. ఆమె బలహీనం అవుతున్న సమయంలో ఏమాత్రం ఉద్వేగం చెందినా, కోపం వల్ల ఆవేశపడినా, గుండె ఆగిపోతుంది. అటువంటి పరిస్థితులు రానివ్వకు" అన్నాడు.

"కానీ ఆమె మరణించటమేగా మనకి కావాలి" అన్నది పరిణీత.

"పిచ్చిదానా. ఒక్క విషయం గుర్తుపెట్టుకో. ఈ విషప్రయోగం వల్ల, మరణించిన అరగంటలో ఆమె శరీరం నల్లగా కమిలిపోతుంది. నీకూ ఆమెకూ మధ్య పచ్చగడ్డి వేస్తే

భగ్గుమంటుందని ఈ గ్రామంలో అందరికీ తెలుసు. ఎవరికైనా అనుమానం వచ్చి శవ పరీక్షలు జరిపితే నీతో పాటూ నేను ఉరికంబం ఎక్కక తప్పదు”

ఆమె అప్రతిభురాలైంది. ఈ అనుమానం ఆమెకు ఇంతకు ముందు రాలేదు.

“...ఆర్నెల్ల వరకూ ఆమె మరణించకూడదు కానీ బలహీనం అవ్వాలి. చుట్టు పక్కల వారికి ‘ఆమె అనారోగ్యం పాలవుతోంది’ అన్న అభిప్రాయం కలగాలి. అన్నట్టూ మరో విషయం. ఈ ఆర్నెల్ల కాలం ఎవరికీ అనుమానం రాకుండా నువ్వు ఆమెతో స్నేహంగా ఉండు. ఆమెకే మాత్రం కష్టం రాకూడదు” అన్నాడు.

మామయ్య చెప్పింది పరిణీతకి స్పష్టంగా అర్థమయింది. చుట్టుపక్కల వాళ్ళు చూస్తూండగా అత్తగారితో చాలా ప్రేమగా ఉండటం సాగించింది. ఆవిడ ఆవేశం చెందకుండా, ఉద్వేగ పడకుండా జాగ్రత్తలు తీసుకుంది. వాదన ఏమాత్రం శృతి మించుతోందని అనుమానం వచ్చినా దాన్ని అక్కడితో ఆపు చెయ్యటం, తిట్టినా తల దించుకొని అక్కడి నుంచి వెళ్ళిపోవటం, కొడుకుతో ఆవిడ ఎంత సేపు గడిపినా యాగీ చెయ్యకపోవటం, ఆ ముసలిదానికి ఇష్టమైనవి చేసి పెట్టటం ప్రారంభించింది. వాదనలు పూర్తిగా తగ్గించింది.

కొన్ని వారాలు గడిచాయి.

అత్తగారు అనుకున్న దానికన్నా తొందరగా బలహీనమవటం, వయసు మీద పడటం తెలుస్తోంది. ఇంతలో ‘బడాదషాయి’ వచ్చింది. ఇంట్లో పెద్దవాళ్ళకి చిన్నపిల్లలు బట్టలు పెట్టే పండగ అది. నేపాల్ దేశమంతా బాగా జరుపుకుంటారు. ఆ సందర్భంగా అత్తగారికి చీరె కొన్నది.

మరి కొన్ని రోజులు గడిచేసరికి ఆ ఇంట్లో ఆశ్చర్యకరమైన మార్పులు రావటం ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా తన భర్తలో..! అతడు ప్రశాంతంగా ఉంటున్నాడు. తొందరగా ఇంటికి వస్తున్నాడు. ఇంటి పట్టున ఉంటున్నాడు.

అత్త కూడా మునపటి లాగా ఉండటం లేదు. “పరిణీత నా కోడలు కాదు. కూతురు” అని పక్కింటివాళ్ళతో చెప్పసాగింది. కూర్చోబెట్టి కబుర్లు ముచ్చటించటం ప్రారంభించింది. ఆవిడలో ఇంత జ్ఞానం ఉన్నదని గ్రహించి పరిణీత ఆశ్చర్యపోయింది. తన బాల్యం గురించిన ఎన్నో విశేషాలు చెప్పేది. ముఖ్యంగా, మామగారు చనిపోయిన తరువాత వరి చేలో కూలి పని చేస్తున్నప్పుడు పాము కుట్టిన వైనం, ఉన్న కాస్త బంగారం అమ్మెయ్యటం, కొడుకుని పెంచటానికి ఆమె పడిన కష్టాలూ చెప్తూంటే పరిణీత కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

అకస్మాత్తుగా ఆ ఇంట్లోంచి నిశ్శబ్దం పారిపోయినట్టూ అనిపించసాగింది. ముగ్గురూ కలిసి మొదటిసారి ప్రసిద్ధ నేపాలీ కవి భానుభక్త ఆచార్య ప్రవచిత భాను రామాయణ బొమ్మలాటకి కూడా వెళ్లారు.

మరి కొన్ని రోజులు గడిచాయి. ఆ రోజు పెద్ద తుఫాను. అర్ధరాత్రి గడిచింది. వృద్ధురాలి మరణం ఆసన్నమైంది. క్రమక్రమంగా ఆమె కళ్ళలోంచి జీవం వెళ్ళి పోవటం తెలుస్తూంది.

పరిణీత తల మంచానికి బాదుకుంది. తుఫాను అని కూడా చూడకుండా మామయ్య కోసం తన ఊరికి పరుగెత్తింది. మధ్యలో పెద్ద అడవి. అయినా అధైర్యపడలేదు. పరుగెడుతూనే ఉంది. అడవి మధ్యలో ఒక పాడుపడిన బావి. చీకట్లో ఆమె చూసుకోలేదు. అందులో జారిపడిపోయింది. ఆమె తన కోసం బాధపడలేదు. తల్లిలాంటి అత్తగారి కోసం దుఃఖించింది.

అంతలో ఆమెకి మెలకువ వచ్చింది. వచ్చిన కలకి కలత చెంది, మరుసటి రోజు పొద్దున్న ఆగమేఘాల మీద రమ్మని మామయ్యకి కబురు చేసింది. ఆయన రాగానే కన్నీళ్ళతో, "నా అత్త మరణించటానికి వీల్లేదు. ఇప్పుడు ఆమెని నా తల్లికన్నా ఎక్కువ ప్రేమిస్తున్నాను. ఆమె చాలా మారిపోయింది" అంది.

ఆమె మామయ్య నవ్వి, "మారింది ఆమె కాదు. నువ్వు" అన్నాడు. ఆమెకు ఆ మాటలు వెంటనే అర్థం కాలేదు. ఈలోపు ఆయన తిరిగి అన్నాడు "నీ అత్త మరణించదు".

సంభ్రమాశ్చర్యాలు ముప్పిరిగొనగా, "మరి విషం?" అని అడిగింది.

"విషం నీ ఆలోచనల్లో ఉండేది. ప్రేమ వల్ల అది పోయింది. ఆమె పట్ల నీ కోపం, ద్వేషం తగ్గించుకోవటం వల్ల ఆమె నీకు కొత్తగా కనపడింది. ఆమెకి నేను ఇచ్చింది విషగుళికలు కావు. బలానికి మాత్రలు..." *(ప్రేమ ఒక కళ)*



# నువ్వు ఎవరికి మంచి?

నాలుగు సంవత్సరాల నుంచీ శేఖర్ని గాఢంగా ప్రేమిస్తోన్న రమణి, ఇంట్లో వత్తిడి వల్ల వేరే వివాహానికి ఒప్పుకుంది. "నన్ను మర్చిపో శేఖర్. వేరే వివాహం చేసుకో" అంది. శేఖర్ ఆ మాటలకి షాక్ తిన్నా, వెంటనే నిభాయించుకున్నాడు. సుఖంగా సంసారం చేసుకోబోతున్న ప్రియురాలితో వాదిస్తే ఏం లాభం? అందుకని "...నీ ఇష్టం రమణీ. నువ్వు సుఖంగా ఉండటమే నాకు కావాలి" అన్నాడు.

ఆమె రోషంగా తలెత్తి, "ఛీ! నీ ప్రేమ ఇంత తేలిక అనుకోలేదు. ఎంత సులభంగా అనేశావ్? నా రెక్కపట్టుకుని విసురుగా దగ్గరకు లాక్కుని, కళ్ళలోకి సూటిగా చూస్తూ 'ఏదీ! ఆ మాట మరొకసారి అనూ. చంపేస్తాను. మనల్నెవరూ విడదీయలేరు' అంటావనుకున్నాను" అంది. శేఖర్ బిక్కమొహం వేసి, అంతలోనే ఆనందంగా "నీ ఉద్దేశ్యం అదే అయితే, తప్పకుండా మనం వివాహం చేసుకుందాం" అన్నాడు.

"అవసరం లేదు. తల్లిదండ్రులను ఎదిరించే ధైర్యం నాకు లేదు. కనీసం నువ్వలా అని ఉంటే, నాపై నీ ప్రేమకు ఆనందించి, ఈ చివరి క్షణాల్లో ఎంతో సంతృప్తితో వెళ్ళి పోయేదాన్ని" అంటూ అక్కణ్ణుంచి విసవిసా వెళ్ళిపోయింది.

జరిగిపోయిన దాని గురించి చింతించే మనస్తత్వం కాదు శేఖర్ది. పునర్నిర్మాణం మీద నమ్మకం ఉన్నవాడు. ఈసారి జయంతి అతడిని ప్రేమించింది. ఏడాది గడిచాక "సారీ శేఖర్, ఇంట్లో వర్ణాంతరం కుదరదంటున్నారు. ఎవరో ఐ.ఏ.యస్ కుర్రాడిని చూశారు" అంది.

శేఖర్ ఆమె రెక్క పట్టుకుని విసురుగా దగ్గరకు లాక్కుని సూటిగా కళ్ళలోకి చూస్తూ "ఏదీ! ఆ మాట మరొకసారి అనూ. చంపేస్తాను. మన ప్రేమను ఎవరూ విడదీయలేరు" అన్నాడు. జయంతి విసురుగా అతడిని విడిపించుకుని, "ఛీ. నువ్వింత స్వార్థపరుడివి అనుకోలేదు. మనసారా ఆశీర్వదిస్తావనుకున్నాను. కలెక్టర్ కి భార్య కాబోతున్నానని నీకు అసూయ" అంటూ అక్కణ్ణుంచి విసవిసా వెళ్ళిపోయింది.

ఏడాది తరువాత రమణి గుమ్మడి పండంటి పిల్లాణ్ణి ఎత్తుకుని వచ్చింది. ఆమె మొహం ఆనందంతో వెలిగిపోతోంది. "...ఆ రోజు నువ్వు నా కళ్ళలోకి చూసి, రెక్క పట్టుకుని పెళ్ళాడమని గట్టిగా అడగనందుకు అనవసరంగా తిట్టాను. అడగకపోవటం ఎంత మంచిదయిందో! అలా అడిగి ఉంటే ఇప్పటికీ అదే తలుచుకుని నీకు అన్యాయం చేసేనేమో అని బాధపడేదాన్ని. మా పచ్చటి సంసారంలో అదే ఒక మచ్చలా కలచివేస్తూ ఉండేది" అంది తృప్తి నిండిన కళ్ళతో.

ఏడాది తరువాత జయంతి వచ్చింది. "...మా ఆయన శాడిస్టు. ఆరోజు నువ్వు నారెక్క పట్టుకుని కళ్ళలోకి చూస్తూ అడిగినందుకు అనవసరంగా తిట్టాను. ప్రస్తుతం, ఆయన నన్ను కొట్టినప్పుడల్లా నిన్నే తలచుకుంటాను. అదే నాకు కాస్త తృప్తి" అంది.

కొంత కాలానికి శేఖర్‌తో ప్రేమ వ్యవహారం తెలిసి, రమణి మొగుడు విడాకులు ఇచ్చాడు. పుట్టింటికి వచ్చేసిన రమణి రోషంగా, "శేఖర్! నీమూలానే ఇదంతా జరిగింది. ఆ రోజే నా రెక్క పట్టుకుని, పెళ్ళికి వప్పించి ఉంటే ఇదంతా జరిగి ఉండేది కాదు కదా! ప్రేమించే ముందు, తనకి రెక్క పట్టుకునే ధైర్యం ఉందో లేదో ప్రతి మనిషీ తెలుసుకో గలగాలి" అంది.

ఈ లోపులో జయంతి కలెక్టర్ మొగుణ్ణి నక్సలైట్లు కాల్చటం వల్ల కాళ్ళు పోయి, చక్రాల కుర్చీలోనూ, పశ్చాత్తాపంలోనూ ఒకేసారి పడ్డాడు. సేవ చేస్తున్న భార్య గొప్పదనం తెలుసు కున్నాడు. పుట్టింటికి చుట్టపు చూపుగా వచ్చిన జయంతి, శేఖర్ని కలిసింది. ఆర్ద్రమైన కళ్ళతో "ఆరోజు నువ్వు నా రెక్కపట్టుకుని అడక్కపోయి ఉంటే ఎంతబాగుండేది. నా సుఖ సంసారంలో తరచు అదే గుర్తొస్తోంది. నీ గురించే నా దిగులు శేఖర్" అంది.

ఇలా ఎన్నైనా వ్రాసుకుంటూ పోవచ్చు.

మన పట్ల అవతలివారి అభిప్రాయాలూ, వాదనలూ, మాటలూ... అన్నీ వారి వారి వర్తమాన (లేటెస్టు) అనుభవాల మీద, మన వల్ల వారికి కలిగే ఉపయోగాల మీదా ఆధారపడి ఉంటాయి. వారితో మంచి అనిపించు కోవటం కోసం, మన మనసు మీద కృత్రిమమైన ముసుగు వేసుకోనవసరం లేదు. అలా వేసుకోవటం వల్ల వచ్చే లాభం లేదు కూడా.

తమకేది బాగుంటుందో అవతలివాళ్ళు నిర్ణయించు కోవాలి. మనకేది బాగుంటుందో మనం నిర్ణయించుకోవాలి. ఒకసారి వినటం ప్రారంభిస్తే ఎదుటి వాళ్ళు రకరకాల కథలు చెబుతారు. మనం ఎలా ప్రవర్తించి ఉంటే (తమకు అనుగుణంగా) బావుండేదో మనకే బోధిస్తారు.

సెంటిమెంటలిస్టులు దీనికి ఒప్పుకోరు. తమకి వచ్చిన కష్టాల్ని అవతలివారి తప్పుగా అభివర్ణిస్తారు (ఈ వాక్యం మరో సారి చదవండి). అవతలి వారి మీద నెపం వేస్తారు. దెప్పి పొడుస్తారు. తమ చేతకానితనానికి మంచితనం అన్న ముసుగు వేస్తారు. నెం.1 ఇలాంటి నిరర్థక సెంటిమెంట్లకి విలువ ఇవ్వడు. "...అవతలి మనుషులు తరచు తమ అభిప్రాయాలను మార్చుకుంటూ ఉంటారు. వారి అభిప్రాయాలు మారటానికి చిన్న సంఘటన (కలెక్టర్ కాళ్ళు నక్సలైట్లు కాల్చటం లాంటిది) చాలు. అటువంటి అభిప్రాయాలకి విలువ ఇవ్వటం అనవసరం" అని నెం.1 కి తెలుసు. ఈ విషయమై అతడు అనవసరమైన వాదనలకి దిగడు కూడా. *(మైండ్ పవర్– నెంబర్ 1 అవటం ఎలా?)*

# బంధం

ఒక రాజ గురువు ప్రతీ సమస్యకీ పరిష్కారాలుగా అద్భుతమైన స్వరంతో, సంస్కృత శ్లోకాలు గానం చేస్తూ ప్రవచనాలు చెప్పేవాడు. వాటి వల్ల లాభం ఎంత వరకూ ఉన్నదో తెలీదు కాని, రాజుగారు ప్రతి విషయానికీ ఆయన మీదే ఆధారపడేవాడు. దాంతో, గురువు శిష్యులతో, శిష్యురాండ్రతో, భోగభాగ్యాలతో తులతూగుతూ ఉండేవాడు. అతని కొడుకు నిర్వాణయోగాన్ని నమ్మినవాడు. తండ్రి పటాటోప జీవన విధానం పట్ల అంటీ ముట్టనట్టూ ఉండేవాడు. సిద్ధాంతాలు వేరైన తండ్రీ కొడుకులు ఎక్కువగా మాట్లాడుకునేవారు కాదు.

ఒక రోజు రాజు వేటకు వెళ్లినప్పుడు అడవిలో ఒక వృద్ధుణ్ణీ, అతడి శిష్యుడినీ, దూరం నుంచి చూశాడు. ఈ ప్రపంచంలో ఇంత కన్నా సంతోషం లేదన్నట్టూ వారు చిన్న పిల్లల్లా నదిలో కేరింతలు కొడుతూ స్నానం చేస్తున్నారు. రాజుకి ఈర్ష్యతో పాటూ ఆశ్చర్యం కూడా కలిగి దగ్గరికి వెళ్లి, "మీరింత సంతోషంగా ఎలా ఉండగలుగుతున్నారు" అని అడిగాడు.

"విహాయ కామాన్ యస్సర్వాన్ పుమాంశ్చరతి నిస్పృహః" అన్నాడు శిష్యుడు. రాజుకి ఒక్క ముక్క అర్థం కాలేదు. తిరిగి వచ్చాక గురువుని అర్థం అడిగాడు. గురువుకి ఇలాంటి శ్లోకాలన్నీ వెన్నతో పెట్టిన విద్య. తన పాండిత్య ప్రకర్షకి పురప్రజల మధ్య అవకాశం దొరకటంతో పొంగి పోయాడు. "రాజా..! సమస్తములైన కోరికల యందు ఏ మాత్రం ఆశలేక ఎవడు ప్రవర్తించునో, అట్టివాడే శాంతిని పొందుచున్నాడు. ఇట్టి బ్రాహ్మ స్థితిని బొందిన వాడు మరలనెన్నటికి విమోహమును జెందనేరడు" అని భగవద్గీత ప్రవచనం చెప్పాడు.

ప్రజలందరూ చప్పట్లు కొట్టారు. రాజుకి మాత్రం 'పిల్లి' అంటే 'మార్జాలం' అన్నట్టూ అనిపించింది. గురువుతో, "ఆ అడవిలో వాళ్ళు అంత ఆనందంగా ఎలా ఉన్నారో, అలా ఉండాలంటే ఏమి చెయ్యాలో ఆ రహస్యం నాకు రేపు పొద్దున్నలోపు కావాలి. ఏం చేస్తారో మీ ఇష్టం. చెప్పక పోతే ఉరికంబం ఎక్కటానికి సిద్ధంగా ఉండండి" అని ఆజ్ఞాపించాడు.

మిన్ను విరిగి మీద పడ్డట్టయింది రాజగురువుకి. ఇంటికొచ్చి దిగులుగా కూర్చున్నాడు. తండ్రి పరిస్థితికి కారణం అడిగాడు కొడుకు. జరిగినదంతా చెప్పాడు రాజగురువు. కొడుకు తండ్రి తో "నిన్నటి రోజు రాజుగారు నదిలో ఈత కొడుతూ చూసింది మరెవర్నో కాదు నాన్నా. నన్నూ, నా మార్గదర్శిని. ఆ పద్యం చెప్పింది నేనే" అన్నాడు.

తండ్రి నిశ్చేష్టుడయ్యాడు. ఇంతకాలం కొడుకు ఏం చేస్తున్నాడో అతడికి తెలియదు. "ఆ పద్యానికి అర్థం... విమోహముతో బ్రహ్మ స్థితి చేరటమేగా" అని అడిగాడు. అవునన్నాడు

కొడుకు. "మరి ఇంకా అర్థం చెప్పమంటాడేమిటి ఆ రాజు?" అంటూ వాపోయాడు. నిర్వాణయోగంలో నిష్ణాతుడైన కొడుకు తండ్రితో, "భవబంధాలు ఎలా తెంచుకోవాలో నేను చెపుతాను. నన్ను రాజుగారి దగ్గరకు తీసుకొని వెళ్ళండి" అని అడిగాడు. రాజగురువు అహం దెబ్బ తిన్నది. కానీ అంతకంటే మార్గం కనబడలేదు. మరుసటి రోజున ఇద్దరూ రాజ ప్రాంగణానికి వెళ్ళారు. సభ కిటకిట లాడుతోంది. సభికులందరూ ఆశీనులై ఉన్నారు. రాజగురువు ప్రాణాల కోసం కొందరు ప్రార్థనలు చేస్తున్నారు. కొడుకు లేచి నిలబడి "మహారాజా! నేను చెప్పినట్టు చేస్తే, మీరు నిజమైన సుఖానికి అర్థం తెలుసుకోగలరు. దాని కోసం నాకొక బలమైన తాడు కావాలి" అన్నాడు. కొడుకు చేస్తున్నదేమిటో రాజగురువుకి అర్థం కాలేదు.

తాడు రాగానే దాంతో రాజుగారిని ఒక స్తంభానికి కట్టేయమన్నాడు కొడుకు. ఉలిక్కిపడ్డాడు రాజగురువు. రాజుగారు తన కొడుకు తల నరుకుతాడేమో అని భయపడ్డాడు. అయితే, అలౌకిక సుఖం గురించి తెలుసుకోవాలన్న కోరికతో ఉన్న రాజు, కొడుకు చెప్పినదానికి వప్పుకున్నాడు. భటులు రాజుగారిని స్తంభానికి కట్టేసారు.

తనకి మరొక తాడు కావాలన్నాడు కొడుకు. రాజుగారి ఎదురుగా తనని ఉరి తీయటానికేమో అని భయపడ్డాడు తండ్రి. ఆ తాడుతో ఎదురుగా మరో స్తంభానికి రాజగురువుని కట్టేయమన్నాడు కొడుకు.

అతడు చేస్తున్నదేమిటో ప్రేక్షకులకేమీ అర్థం కాలేదు. స్తంభానికి బందీకృతుడైన రాజు కూడా ఉత్సుకంగా చూడసాగాడు. భటులు రాజగురువుని బలంగా కట్టేసారు. కొడుకు తండ్రితో "రాజుగారి కట్లు విప్పండి నాన్నగారూ" అని కోరాడు.

"మూర్ఖుడా..! ఇలా కట్టేసి ఉండగా ఆ కట్లు నేను ఎలా విప్పగలను?" అన్నాడు రాజగురువు కోపంగా. కుర్రవాడు రాజుగారి వైపు తిరిగి "చూశారా రాజా! తనే ఇన్ని బంధాల్లో ఉన్న మనిషి మీ బంధాలు ఎలా తొలగించగలడు? తామే స్వయంగా స్త్రీ, ధనం, కీర్తి మొదలైన వాటి మాయలో ఉన్న గురువులు ఉపదేశించేది... మరొక మనిషిని మాయ నుంచి ఎలా రక్షిస్తుంది?" అన్నాడు.

వయసులో చిన్నవాడైన ఆ కుర్రవాడి ముందు రాజు వినమ్రంగా మోకరిల్లి, "ప్రాపంచిక బంధాల్ని తెంచుకుని, తాను చెప్పేది ఆచరించే గురువే ఇంకొకరి బంధాల్ని తెంపగలడన్న చిన్న విషయాన్ని, కోటానుకోట్ల నా రాజ్య ప్రజల్లాగే, నేనూ అర్థం చేసుకోలేక పోయాను. ఇంతకాలం నేను ఎంత మూర్ఖంగా ప్రవర్తించానో నాకు తెలుస్తోంది" అన్నాడు.

పై కథ చదివి, "అసలు బంధాలే ఉండకూడదు" అని ఈ రచయిత చెప్తున్నాడా అన్న అనుమానం వద్దు. దుఃఖ కారణమైన బంధాలు ఉండకూడదని చెప్పటమే ఇక్కడ ఉద్దేశ్యం. *(ప్రేమ ఒక కళ)*

# నీతి – నిజాయితీ



ప్రయాణాల్లోనూ, వేసవి సెలవుల్లో పిల్లల్ని బయటికి తీసుకువెళ్ళినప్పుడూ, రాత్రిళ్ళు పక్కలో పడుకోపెట్టుకుని కథలు చెప్పేటప్పుడూ (బెడ్ టైం స్టోరీస్), జానపద కథలూ, వీరుల చరిత్రలతో పాటుగా, చక్కటి నీతిని బోధించే కథలు కూడా చెప్తూ ఉంటే సుహృద్భావ భావాలు వయసుతో పాటే పెరుగుతాయి.

ఉదాహరణకి ఈ కథ చూడండి.

భారత దేశంలోని విదేశీ రాయబారి కార్యాలయంలో కూర్చొని ఉన్నాడు మూర్తి. అతడి వొళ్ళో ఒక సంచి ఉంది. అందులో దాదాపు విదేశానికి సంబంధించిన వంద నాణేలు (కాయిన్స్) ఉన్నాయి. వాటికో ప్రత్యేకత ఉంది.

ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాలూ అప్పుడప్పుడు నోట్ల రూపంలోను, నాణేలు గాను ఆకర్షణీయమైన, చిత్రమైన కరెన్సీని విడుదల చేస్తాయి. ఒక దేశం విడుదల చేసిన కాయిన్స్ మీద ఫుట్ బాల్ ఆట ముద్రించబడి ఉంది. ప్రస్తుతం మూర్తి దగ్గర ఉన్న కాయిన్స్ అలాంటివే.

వాటిల్ని అతడికి ఇచ్చింది కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్.

దానికి కొన్నిరోజుల ముందు, పదిమంది సీనియర్ అధికారులను తన ఛాంబర్‌కి పిలిచి ఒక ప్రకటన చేసాడు. "మీలో ఒకరిని మనం విదేశాల్లో పెట్టబోయే కంపెనీకి సంపూర్ణ అధికారిగా పంపిద్దాం అనుకుంటున్నాను."

అది ఎవరా అని అందరూ ఊపిరి బిగపట్టారు.

అందరికి తలో గిఫ్ట్ పాకెట్ ఇచ్చి ఒక మాట చెప్పాడు "...మన కంపెనీ ఇంత కాలం ఎంత విలువల్తో నైతికంగా పని చేసిందో మీ అందరికి తెలుసు. అదే పేరు విదేశాల్లో కూడా మన కంపెనీకి రావాలి. దానితో పాటు లాభాలూ ముఖ్యమే. నిజాయితీగా ఒక రూపాయి పెట్టుబడి పెట్టి పది రూపాయలు సంపాదించగల చతురుడు మీలో ఎవరున్నారో చూద్దాం. మీకిచ్చిన గిఫ్ట్ పాకెట్స్ లో వెయ్యి విదేశీ నాణేలు ఉన్నాయి. రిజర్వ్ బ్యాంకు ద్వారా వాటిల్ని మీరు రూపాయలుగా మార్చుకునే వీలు కూడా ఉంది. ఆ తక్కువ డబ్బుతో మీరు మూడు నెలల్లో ఎంత సంపాదిస్తారో ఆ యుక్తులు మీ శక్తి

సామర్థ్యాలని రుజువు చేస్తాయి. మూడు నెలల తరువాత మళ్ళీ కలుద్దాం” అని ఉపన్యాసం ముగించాడు.

ప్రస్తుతం మూర్తి విదేశీ రాయబారి కార్యాలయంలో ఉన్నది అందుకే. హైదరాబాద్ లో ఉన్న రిజర్వ్ బ్యాంకు వాటిని మార్చటానికి నిరాకరించింది. రకరకాల ప్రయత్నాలలోనే నెల రోజులు గడిచిపోయాయి. అందుకనే అతడు స్వయంగా ఢిల్లీ వచ్చి రాయబారి కార్యాలయంలో కూర్చున్నాడు. ఐదు నిమిషాల తరువాత అతడికి పిలుపు వచ్చింది.

రాయబారి ఆ నాణేలు చూస్తూ “క్షమించండి. వీటిల్ని భారత దేశపు కరెన్సీగా మార్చటానికి మాకెవ్వరికి అధికారం లేదు. ఇవి కేవలం ప్రెస్టేజ్ కి సంబంధించిన నాణేలు మాత్రమే. పూర్తి వెండితో చేయబడిన ఈ నాణెం, మీ దేశ కరెన్సీ ప్రకారమైతే కేవలం వేయి రూపాయలు ఉంటుంది. కానీ ఇందులో ఉండే వెండి ఖరీదు అంతకన్నా నాలుగు రెట్లు ఎక్కువ. మీ దగ్గర ప్రెస్టేజ్‌గా పెట్టుకోవడానికి మాత్రమే ఈ నాణేలు ఉపయోగ పడతాయి” అని వాటిని తిరిగి ఇచ్చేసాడు.

మూడు నెలల తరువాత మళ్ళీ మీటింగ్ జరిగింది. అందరు తమ పెట్టుబడిని ఉపయోగించి ఎలా మూడు నెలల్లో ఎంత లాభం సంపాదించారో చెప్పసాగారు. చివరికి మూర్తి వంతు వచ్చింది. లేచి నిలబడి ఈ విధంగా అన్నాడు:

“నేను ఈ పోటీలో ఘోరంగా ఓడిపోయాను. నా దగ్గర ఉన్న నాణేలు కేవలం అద్దాల బీరువాలో పెట్టుకోవడానికే తప్ప మార్పిడికి పనికి రావు. భారత ప్రభుత్వం వీటిల్ని కరెన్సీగా ఒప్పుకోవటం లేదు. చివరికి రాయబారి కూడా అదే సలహా ఇచ్చాడు. అందువల్ల నేను ఈ అవకాశాన్ని ఉపయోగించుకో లేకపోయాను” అని కూర్చున్నాడు.

మిగతా వారందరు ముసి ముసిగా నవ్వసాగారు.

ఆ సమయంలో మేనేజింగ్ డైరెక్టర్ నిలబడి “మూడు నెలల క్రితం నేను ఇచ్చిన ఉపన్యాసం మీరందరు మర్చిపోయినట్టున్నారు. రిజర్వ్ బ్యాంకు ద్వారా దీన్ని మార్పిడి చేయించమన్నాను. కానీ మీరందరు మీ నాణేలను అమ్మి, లేదా కరిగించి వెండిని అమ్మి ఆ డబ్బుని పెట్టుబడిగా పెట్టారు. నా ఉపన్యాసంలో ‘మన కంపెనీ నిజాయితీకి మారు పేరు’ అన్న విషయం కూడా చెప్పాను. కాబట్టి ఈ పరీక్షలో నెగ్గింది మూర్తి మాత్రమే” అని ప్రకటించాడు.

నిముషం తరువాత అందరూ మనస్ఫూర్తిగా చప్పట్లు కొట్టారు.

*(టీన్స్ పిల్లల పెంపకం ఒక కళ)*

# బజార్లో నీ ధర ఎంత?

తాను చేస్తున్న పని విలువని ఎప్పటికప్పుడు విశ్లేషించుకుంటూ ఉండటాన్ని "స్వీయ నిర్ధారణ" అంటారు. 'పని చేసినా చేయక పోయినా ఫలితం (జీతం) అదే కదా' అనుకునే వాడికి ఆ పనిలో ఆనందం ఉండదు. అలా కానిదాన్ని స్వీయ సంతోషం అంటారు. ఇది ఒక వైపు. మరో వైపు, 'తాను చేస్తున్న పనికి ఇతరులు ఎంత విలువ ఇస్తున్నారు?' అని తెలుసుకోవటం నిర్ధారణ. దాని కన్నా ఎక్కువ ఆశించటం అత్యాశ. అదే సెల్ఫ్ అసెస్మెంట్. దాని గురించి ఈ కథ చదవండి.

ఒక పన్నెండేళ్ళ కుర్రాడు మెడికల్ షాప్ అరుగు మీద ఉన్న పబ్లిక్ ఫోన్ దగ్గరకు వెళ్ళాడు. ఫోన్ అందక పోవటంతో, షాపు యజమానిని అడిగి స్టూలు తీసుకుని ఎక్కి నంబర్ డయల్ చేసాడు.

అట్నుంచి ఎవరో 'హలో' అనేసరికి, "అమ్మా! నేనొక చదువుకుంటున్న కుర్రవాడిని. మీ ఇంటి ముందు తోట శుభ్రం చేసే పని నాకు అప్పగిస్తే, వారానికి ఒకసారి వచ్చి దాన్ని అందంగా తీర్చిదిద్దుతాను " అన్నాడు.

"అవసరం లేదు. మా దగ్గర ఒక కుర్రవాడు ఉన్నాడు" అని అట్నుంచి సమాధానం వచ్చింది.

"అతడికిచ్చే జీతంలో నాకు సగం ఇస్తే చాలు" కుర్రాడు బ్రతిమాలాడు.

"అవసరం లేదు" అని జవాబిచ్చింది ఇంటి యజమానురాలు.

కుర్రవాడు పట్టు విడవకుండా, "తోట పని అప్పగిస్తే, ముందు అరుగులూ, వెనుక వరండా కూడా అదే జీతానికి శుభ్రంగా కడుగుతానమ్మా" అన్నాడు.

"అవసరం లేదు. నువ్వు ఫ్రీగా చేస్తానన్నా, ఇప్పుడు చేస్తున్న వాడిని తీసెయ్యం" అంటూ ఫోన్ పెట్టేసింది ఆవిడ.

ఈ సంభాషణ అంతా వింటున్న మందుల షాపు యజమాని, కుర్రవాడి అణుకువకీ, శ్రద్ధకీ ముచ్చట పడి, "నా దగ్గర చెయ్యి బాబూ. నేనిస్తా ఉద్యోగం. నువ్వు నాకు చాలా నచ్చావు" అన్నాడు.

కుర్రాడు నవ్వేసి, "అవసరం లేదండీ. నేను ఇప్పుడు ఫోన్ చేసింది నేను పని చేస్తున్న చోటుకే..." అన్నాడట.

*(విజయానికి ఆరో మెట్టు).*

# మనిషిలో టార్చి

ఒకరు తన స్నేహితుడిని డిన్నర్ కి పిలిచి, తిరిగి వెళ్తూండగా టార్చిలైట్ ఇచ్చాడట. "ఇదెందుకు? నాకు రాత్రిళ్ళు కళ్ళు కనపడవు కదా" అంటూ ఆ స్నేహితుడు బాధపడ్డాడు.

"ఇది నీకోసం కాదు మిత్రమా! ఎదుటి వ్యక్తి నిన్ను గుర్తించటానికి..." అన్నాడు హెూస్టు.

అతిథి ఆ టార్చి తీసుకుని వీధిలో వెళ్తూ ఉండగా ఒక సైకిలిస్టు ఎదురుగా వచ్చి ఢీకొన్నాడు. "నా చేతిలో టార్చి కనపడటంలేదా? నేను గుడ్డివాడిని" అని అతడు కోపంగా అరిచాడు.

ఆ మాటలకి కన్ఫ్యూజ్ అయిన సైకిలిస్టు "అయ్యో! క్షమించండి. కానీ... మీరు టార్చి ఆన్ చెయ్యలేదు" అన్నాడు.

ప్రతి మనిషిలోనూ ఒక టార్చిలైటు ఉంటుంది. అదే జ్ఞానం.

దాని బ్యాటరీ హేతువు. బల్బు అనుభవం.

కొందరు దాన్ని వెలిగిస్తారు. తమ జ్ఞానంతో ఇతరులలో ఉన్న టార్చిలైటు వెలిగించటానికి ప్రయత్నం చేస్తారు.

కానీ దురదృష్టవశాత్తు వీళ్ళు ఎంత ప్రయత్నం చేసినా కొందరు దాన్ని వెలిగించరు. అసలు తమలోనే ఒక టార్చి ఉన్నదనన విషయాన్ని నమ్మరు. తమ ఖర్మకి దురదృష్టం కారణమని బలంగా నమ్ముతూ, సమస్యని గెలవటం కోసం చేతికి తాళ్ళు, వ్రేళ్ళకి రాళ్ళు ధరిస్తారు. వీళ్ళకి రెడీమేడ్ పరిష్కారాలు కావాలి.

వీళ్ళని లోబరుచుకోవటానికి మరికొందరు రెడీగా ఉంటారు. టార్చిని తమ వైపు తిప్పుకున్నవారన్నమాట. తమ సూడో–జ్ఞానం ద్వారా, మనిషి అజ్ఞానాన్ని మూర్ఖ విశ్వాసం వైపు తిప్పటానికి ఉపయోగిస్తారు.

*(లోయ నుంచి శిఖరానికి)*



# ప్రేమ తత్వం–మోక్ష సాధన



జీవితం గురించి చెప్పే ఇంత మంచి కథలు చాలా అరుదు.

ఒక వ్యక్తి భార్య దగ్గరికి వెళ్ళి "నాతో వస్తావా?" అని అడిగాడు.

"ఎక్కడికి?" అని అడిగింది ఆమె.

"చెప్పను" అన్నాడు.

"ఎంతకాలం?" అర్థం కాక అడిగింది.

"అక్కడకు వెళ్ళాక మనం మళ్ళీ వెనక్కు తిరిగి రాము."

"మరి ఈ డబ్బు, కంపేనీలూ, ఇల్లూ?" అన్నది.

"అన్నీ వదిలేసి వెళ్ళక తప్పదు" అన్నాడు.

"కోర్టు కేసా? హత్యా నేరమా? ఇన్–కమ్–టాక్సా?" అనుమానంగా అడిగింది.

"అవేమీ కాదు" అన్నాడు.

"మరి? నీకేమయినా పిచ్చెక్కిందా?"

అతను మాట్లాడలేదు.

"నేను నీతో ఎలా వస్తాననుకున్నావ్? ఎక్కడికెళ్తున్నామో చెప్పవు. అంతగా కడుపు చేత్తో పట్టుకుని వెళ్ళాల్సిన పరిస్థితులేమిటో చెప్పవు. 'తిరిగి రాము' అంటున్నావు..." ఆమె కొనసాగించింది. "...క్షమించు. ఈ డబ్బూ, పనివాళ్ళూ, ఇంత సౌఖ్యం వదిలేసి నేను నీతో రాలేను" అన్నదామె.

"నువ్వు ఇంత కృతఘ్నురాలివను కోలేదు" నిష్ఠూరంగా అన్నాడు.

"నీకుందా కృతజ్ఞత? మొదట్లో నా గురించి చాలా శ్రద్ధ తీసుకునేవాడివి. నా కోసం ఎంతో ఖర్చు పెట్టేవాడివి. రెండో వివాహం ఆలోచన రాగానే నన్ను నిర్లక్ష్యం చేయటం మొదలుపెట్టావు. కాదని గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పగలవా?"

అతడి మొహం వివర్ణమైంది. ఆమె చెప్పినదాన్లో అసత్యమేమీ లేదు. రెండో భార్య దగ్గరకు వెళ్ళాడు. "నేను ఒక చోటికి వెళ్తున్నాను. నాతో రా ప్లీజ్"

"ఇంతకాలం నీకు తెలియని ఒక రహస్యం చెపుతున్నాను విను. నీ అల్లుడు నన్ను ప్రేమించాడు" అన్నదామె. అతడు షాకయ్యాడు. "అ... అల్లుడా?" అన్నాడు తడారి పోతున్న గొంతుతో.

"అవును. నీకన్నా వెయ్యి రెట్లు ఎక్కువగా నన్ను ఇష్టపడతాడు. నీ కన్నా నా పట్ల ఎక్కువ శ్రద్ధ తీసుకుంటాడు. అందుకే నేనూ అతణ్ణి ప్రేమించాను. అతడితో ఉండి పోవటానికి సిద్ధమవుతున్న సమయంలో ఈ శుభవార్త చెప్పావు".

తెల్లబోయి "నిన్ను నా దానిగా చేసుకోవటం కోసం, భార్యతో సహా ఎన్నో వదిలేసాను. మా అమ్మ చెప్పినా వినలేదు. ఇందుకోసమా నా భార్యని నిర్లక్ష్యం చేసింది? ఇందు కోసమా ఇంత శ్రమించింది?" అన్నాడు.

"నువ్వు నా కోసం శ్రమించలేదు. నీ అందమైన భార్యని చూస్తూ పదిమందీ ఈర్ష్య పడాలనీ, నువ్వేమో నా అందాన్ని అనుభవిస్తూ సుఖంగా ఉండాలనీ, నీ కోసం, నీ సుఖం కోసం కష్టపడ్డావు. ఒకసారి ఆలోచించు" అన్నది.

అతడు తన స్నేహితురాలి దగ్గరకు వెళ్ళాడు. "నేను నా ఇద్దరు భార్యల్తో చెప్పలేదు. నీకు మాత్రమే చెపుతున్నాను. నేను మరణించబోతున్నాను. నాతో రాగలవా?"అని నిజాయితీగా అడిగాడు.

ఆమె కూడా అంతే నిజాయితీగా "శ్మశానం వరకూ రాగలను" అని కాస్త ఆగి, "...నువ్వు నిజంగానే నాకు చాలా సంతోషాన్నిచ్చావు. ఆ కృతజ్ఞతతో శ్మశానం వరకూ రాగలను. నిజాయితీగా చెపుతున్నందుకు ఏమీ అనుకోకు. నాకు ఈ ప్రపంచంలో ఇంకా చాలా ఆనందం ఉంది. నీతో ఉండే ఆనందం కంటే ఈ ప్రపంచంతో ఉండే ఆనందమే ఎక్కువ. కాబట్టి నేను నీతో రాలేను" అన్నది.

అతడు చివరి స్త్రీ దగ్గరకు వెళ్ళాడు. "నువ్వు నాతో వస్తావా...?" అని అడక్క ముందే ఆమె అతడి చేతులు తన చేతుల్లోకి తీసుకొని "తప్పకుండా వస్తాను మిత్రమా..! పద" అన్నది.

ఇద్దరూ వెళుతూండగా "...ఆ ముగ్గురూ నాతో ఎందుకు రాలేదు?" అని అడిగాడు.

ఆమె చెప్పింది: "మొదటి స్త్రీ నీ ఆరోగ్యం. రెండో స్త్రీ నీ ఐశ్వర్యం..! రెండోదాని కోసం పని యావలో పడి నువ్వు మొదటిదానిని పట్టించుకోలేదు. మరోలా చెప్పాలంటే డబ్బు సంపాదించటం కోసం నిద్రనీ, ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేశావు".

"అవును. డబ్బు సంపాదనలో నా ఆరోగ్యం పాడయిన మాట నిజమే"

"నీ అల్లుడికి నీకంటే ధనాశ ఎక్కువ. నువ్విచ్చిన ఆస్తిని రెట్టింపు చెయ్యటానికి నీ కూతుర్ని కూడా పట్టించుకోవటం లేదు. 'నువ్వెళ్ళిపోగానే అతడితో స్థిరపడడానికి సిద్ధంగా ఉన్నాను' అని ఐశ్వర్యం చెప్పిన మాటలు ఆ ఉద్దేశ్యంతోనే. నువ్వెళ్ళి పోయాక నీ వారసులకే చెందాలని, ఆమె భూమ్మీదే ఆగిపోయింది. "

"మూడో స్త్రీ ఎవరు?" అని అడిగాడు.

"ఆమె నీ భవబంధం. నీ మిత్రులూ, బంధువులూ, నీ వారసులూ... వాళ్ళకు ఆనందాన్ని ఇచ్చినంత కాలం నీతో ఉన్నారు. వృద్ధాప్యంలో నీ వల్ల వారికేమీ సంతోషం లేదు. కేవలం తమ కర్తవ్యం పూర్తిచెయ్యటానికి నీతో శ్మశానం వరకూ వస్తాం అన్నారు."

"నువ్వెవరు" అని ప్రశ్నించాడా వ్యక్తి చివరగా.

"నేను తృప్తిని. నువ్వు మనస్ఫూర్తిగా చేసిన మంచి పనుల వల్ల, సాధించిన విజయాల వల్ల, నీ కరుణ వల్ల, దయ వల్ల, ఇతరులకి చేసిన సహాయం వల్ల ఉద్భవించిన తృప్తిని" అన్నదామె. *(ప్రేమ ఒక కళ)*

## అ...మ్మా

అతడామె కడుపుమీద బలంగా కొట్టాడు.

విలవిలలాడిపోయింది.

మళ్ళీ బలంగా తన్నాడు.

నిలబడలేక పోయింది. కళ్ళనీళ్ళు తిరిగాయి.

కడుపు నిమురుకుంటూ, "ఇంకా ఎంతకాలంరా. తొందరగా రా" అన్నది– ఆప్యాయత నిండిన కంఠంతో.

*(టీన్స్ పెంపకం ఒక కళ)*

# ఒక వాస్తవం జీవితాన్ని మారుస్తుంది

పిల్లలకు మీ కుటుంబ, వాస్తవ ఆర్థిక పరిస్థితులు అర్ధమయ్యేట్టుగా చెప్పండి. తమ స్నేహితులతో పోలుస్తూ వారు తాహతుకి మించిన కోరికలు కోరినప్పుడు, "వాళ్ళు వేరు, మనం వేరు" అన్న మాట తరచూ వాడుతూ ఉండండి.

డెలాయిట్ కంపెనీలో సెమినార్ పూర్తయిన తరువాత ఒక యంగ్ ఎగ్జిక్యూటివ్ నన్ను కలిసి, "మీ ఉపన్యాసంలో చెప్పిన 'యూ ఆర్ డిఫరెంట్...' కాన్సెప్ట్ బాగా పాపులర్ చెయ్యండి సర్" అంటూ తన అనుభవం చెప్పాడు.

"నేను ఇంటర్ చదివే రోజులవి. మాది మధ్య తరగతికి కన్నా దిగువ కుటుంబం. డిగ్రీ చదువుతున్న అన్నయ్య. పెళ్లి కావలసిన ఇద్దరు అక్కలు..! మా స్నేహితులందరికీ మోటర్ సైకిల్స్ ఉండేవి. రైడింగ్ నాకు చాలా ఇష్టం. మా నాన్నని కొనమని అడిగాను. మా నాన్న వప్పుకోలేదు. 'ఎలాగైనా కొనాల్సిందే' అని తిండి మానేసి ఎమోషన్ లాగా బ్లాక్‌మెయిల్ చేసాను.

రెండు రోజులు గడిచాయి. గదిలో పడుకుని ఉన్నాను. అమ్మ నా పక్కనే కూర్చొని బ్రతిమాలుతోంది. మామూలుగా కన్నా ఎక్కువ నీరసం నటించాను.

మూడు రోజులు అయ్యేసరికి నాన్న దిగివచ్చారు.


లోపలికి వచ్చి అమ్మతో ముక్తసరిగా, "వాణ్ణి తిండి తినమను. రేపు కొనిస్తానని చెప్పు" అని వెళ్ళిపోయాడు.

నాన్న అంత తొందరగా దిగి వస్తాడనుకోలేదు. ఎవరెస్టు ఎక్కినంత సంతోషం వేసింది. అమ్మ తడి గుడ్డతో మొహం తుడిచి వంటింట్లోకి తీసుకెళ్తూండగా, పక్క గదిలో వాష్ బేసిన్ దగ్గర నాన్న నోటికి చెయ్యి అడ్డుపెట్టుకుని ఏడుస్తూ ఉండటం చూసాను.

వణికిపోయాను. వెన్నెముకలో ఏదో పాకినట్టయి వళ్ళంతా జలదరించింది. బహుశా అప్పుడే నా జీవితం మలుపు తిరిగి ఉంటుంది. నేనీ రోజు ఇక్కడ ఇలా ఉన్నత స్థితిలో ఉన్నానంటే ఆ సంఘటనే కారణం. ఆ దృశ్యం ఇప్పటికీ నా కళ్ళల్లో కదులుతూనే ఉంటుంది. ఆ తరువాత మా చిన్నక్క పెళ్ళి నేనే చేసాను."

*(టీన్స్ పిల్లల పెంపకం ఒక కళ)*

# సమస్యకి మూల కారణం



వింధ్యారణ్య ప్రాంత లోయలో ఒక చిన్న పల్లె ఉంది. పచ్చటి చెట్ల మధ్య సంతోషంగా కాలం గడిపే ఆ గిరిజనులకి ఆకస్మాత్తుగా ఒక విపత్తు వచ్చి పడింది.

గుంపులు గుంపులుగా పులులు వచ్చి వాళ్ళ ఆవుల్నీ, గేదెల్నీ పొట్టన పెట్టుకోవటమే కాక ఇళ్ళ మీద కూడా దాడి చేయసాగాయి.

ఆ గ్రామస్థులు ద్రోణాచార్యుడి దగ్గరకు వెళ్ళి శరణు వేడారు. వాళ్ళని రక్షించడం కోసం ద్రోణుడు ధర్మరాజుని పంపాడు.

ధర్మరాజు ఆ గ్రామం వెళ్ళి పులుల కోసం కొన్ని రోజులపాటూ ఓపిగ్గా ఎదురు చూసి, అవి వచ్చినప్పుడు వాటి నాయకుడ్ని చంపి, మిగతా వాటిని పాలద్రోలాడు.

గిరిజనులు విజయోత్సాహంతో నాట్యాలు చేశారు. ధర్మరాజుకి ఘనంగా సన్మానం చేసి పంపారు.

కానీ వాళ్ళ సంతోషం ఎక్కువ కాలం నిలవలేదు. నెల తిరిగేసరికి ఆ మృగాలు ఈసారి మరింత పెద్ద గుంపుగా గ్రామం మీద పడ్డాయి.

ద్రోణుడు భీముడ్ని పంపాడు. భీముడి ఆయుధం 'గద'. ప్రపంచంలోకెల్లా గొప్ప ఆయుధాల్లో అది ఒకటి. అయితే అది ఏనుగుని సంహరించ గలదు, రథాల్ని బద్దల గొట్టగలదు. అది 'చురుకైన' పులుల మీద ఏ ప్రభావమూ చూపించలేక పోయింది.

భీముడు క్షతగాత్రుడై పడిపోయాడు.

అప్పుడు అర్జునుడు వెళ్ళి తన విలువిద్యా నైపుణ్యంతో పులుల్ని చంపి సోదరుడిని రక్షించి వెనక్కి తెచ్చాడు.

అయితే సమస్య తీరలేదు. ఏడాది తిరిగేసరికి యవ్వనంతో బలసిన తరువాతి తరం పులులు గ్రామం మీద భయంకరంగా దాడి చేశాయి.

ద్రోణుడు ఈసారి ఆఖరి ఇద్దరినీ పంపించాడు.

నకుల సహదేవులు వెంటనే రంగంలోకి దిగలేదు. ముందు గ్రామ పరిసర ప్రాంతాలని పరిశీలించారు. గ్రామం చుట్టూ కందకాలు తవ్వించే పని నకులుడు చేపడితే, సహదేవుడు వారికి తగినంత ధైర్యాన్నిచ్చి, పులులతో ఎలా యుద్ధం చేయాలో వాళ్ళకి నేర్పి యుద్ధానికి సంసిద్ధం చేసాడు.

ఈసారి పులులు దండెత్తినప్పుడు ఏమాత్రం ప్రాణ నష్టం లేకుండా గ్రామస్థులే వాటిని ధైర్యంగా ఎదుర్కొని తరిమికొట్టారు.

తిరిగివచ్చిన నకులసహదేవుల్ని "ఇది నిశ్చయంగా మీ విజయం" అంటూ ద్రోణుడు పొగిడాడు.

ఈ కథ మూడు సూత్రాల్ని చెపుతుంది.

1. ఒక సమస్య తాలూకు కొమ్మల్ని కత్తిరిస్తే, తాత్కాలిక విజయం దొరుకుతుందేమో తప్ప పరిష్కారం దొరకదు.

2. మన ఆయుధం 'గద' లాగా ఎంత గొప్పదైనా, సమస్యని పరిష్కరించేదిగా ఉండాలే తప్ప కేవలం గొప్పదిగా ఉన్నంత మాత్రాన దానితో సమస్యని పరిష్కరించలేం.

3. సమస్యని ఎదుర్కోవడానికి ముందు దాన్ని నిశితంగా పరిశీలించి, ఏ ఆయుధం వాడాలో తెలుసుకుంటే సగం సమస్య తీరినట్టే.

*(లోయ నుంచి శిఖరానికి)*

# జ్ఞానం అంటే...

'చదువు చెప్పేది స్కూలయితే, తెలివి పెంచేది ఇల్లు' అని దాదాపు ప్రతి పుస్తకంలోనూ వ్రాస్తూ ఉంటాను. పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి కేవలం పాఠశాలలు మాత్రమే సరిపోవు. తల్లిదండ్రులే పిల్లలకు ప్రధమ గురువులని గుర్తుంచుకోవాలి. ఈ అద్భుతమైన వాస్తవ సంఘటన చదవండి.

'పది నిమిషాల్లో ఈ లెఖ్ఖ చేస్తే, ఎప్పటి నుంచో నువ్వు అడుగుతున్న సైకిల్ కొని పెడతాను. ఒక వేళ చెయ్యలేకపోతే రేపు శని, ఆదివారాల్లో వంట పనంతా నువ్వు చేసి, అమ్మకి విశ్రాంతి ఇవ్వాలి" అని ఒక తండ్రి తన కొడుకుని ఉత్సాహపరిచాడు. కొడుకు పేరు జాన్ హాల్. కుర్రవాడు ఆ ఛాలెంజ్‌కి ఒప్పుకున్నాడు.

తండ్రి ఈ విధంగా ప్రశ్నించాడు "...కాబుల్ నుంచి 'డిజర్ట్ ఎక్స్‌ప్రెస్' గంటకి 80 మైళ్ళ వేగంతో ఇస్లామాబాద్ వైపు, ఇస్లామాబాద్ నుంచి 'తుఫాన్ మెయిల్' గంటకి 60 మైళ్ళ వేగంతో కాబుల్ వైపు బయలుదేరింది. కాబుల్‌కి, ఇస్లామాబాద్‌కి మధ్య దూరం 480 మైళ్ళు అయితే, రెండు రైళ్ళూ మధ్యలో పెషావర్ దగ్గర కలుసుకున్నప్పుడు, ఏ ఇంజన్ కాబుల్‌కి దగ్గరగా ఉంటుంది?"

ఆ కుర్రవాడు 'కాలము–దూరం' పై రకరకాల లెక్కలు వేసి బుర్ర బద్దలు కొట్టుకుని, చివరికి ఆ ప్రశ్న లెక్కలకి సంబంధించినది కాదనీ, ఇంగితజ్ఞానానికి (కామన్–సెన్స్‌కి) సంబంధించిందని తెలుసుకొని "ఒకే స్టేషన్లో ఆగి ఉన్నప్పుడు రెండూ కాబుల్‌కి ఒకే దూరంలో ఉంటాయి" అని చెప్పాడు.

ఇచ్చిన వాగ్దానం ప్రకారం కొడుక్కి సైకిల్ ఇవ్వటానికి ఒప్పుకుంటూ, "... సైన్సు, లెక్కలూ తర్కం మీద ఆధారపడి ఉంటాయి. నువ్వు అనవసరంగా లెక్కలు కడుతూ సమయం వృధా చేసావు. ప్రశ్నని అర్థం చేసుకోవడం ఇంకా ముఖ్యం. నేను ఇంజన్ గురించి అడిగానే తప్ప, రైలు గురించి కాదు. కాబుల్ వైపు వెళ్తూన్న రైలు తాలూకు ఇంజన్ కాబుల్‌కి దగ్గరగా ఉంటుంది. నువ్వు ఇంకా బాగా ఆలోచించి ఉంటే మరొక విషయం కూడా అర్థమయ్యేది. దాన్ని భౌగోళిక పరిజ్ఞానం అంటారు. ఆఫ్ఘనిస్థాన్‌లో అసలు రైళ్ళే లేవు."

తన తప్పు అర్థం చేసుకున్న ఆ కుర్రవాడు రెండు రోజుల పాటు వంటింటి పని చేపట్టాడు....! అతడే జాన్ హాల్. పెద్దయ్యాక ఫిజిక్స్‌లో నోబుల్ ప్రైజ్ సంపాదించాడు.

*(టీన్స్ పిల్లల పెంపకం ఒక కళ)*

# విజయానికి ఫుల్ స్టాప్ లేదు

భయంకరమైన పక్షవాతపు స్ట్రోక్‌తో స్పృహ తప్పి, ఇరవై రోజుల తరువాత కళ్ళు విప్పిన జీన్ డామ్నిక్ అనే యువకుడు, తన ఎడమ కన్ను తప్ప మిగతా శరీరమంతా అచేతనమైపోయిందని తెలుసుకున్నాడు.


తానింకా బ్రతికి ఉన్నానని చెప్పటం కోసం, గదిలోని మిగతా నిర్జీవమైన వస్తువుల్నుంచి తనని వేరుపరుస్తోంది– కేవలం 'కదిలే తన కనురెప్ప ఒక్కటే' అన్న విషయం అతనికి అర్థమయింది.

అయితే జీవితం మొత్తం ఉడకబెట్టిన బంగాళాదుంపలా పక్కమీద పడి ఉండటం అతనికి ఇష్టం లేకపోయింది. ఒక పుస్తకం 'వ్రాయ' సంకల్పించాడు.

చేతుల్తో కాదు. కనురెప్పల్తో..!

అసిస్టెంట్ ఒక్కో ఆల్ఫాబెట్ చెప్తూంటే, సరి అయిన అక్షరం వచ్చినప్పుడు డామ్నిక్ రెప్ప అల్లల్లాడించేవాడు. ఆ విధంగా రెండు మిలియన్ కనురెప్ప కదలికల్తో తయారయిన 'ది డైవింగ్ బెల్ అండ్ ది బట్టర్ ఫ్లై' అన్న పుస్తకం మార్కెట్లో విడుదలై, నెల రోజుల్లో సంచలనం సృష్టించింది. ఆ తరువాత సినిమాగా కూడా వచ్చి విజయం సాధించింది.

చిన్న చిన్న కారణాలకే ఆత్మహత్య చేసుకుందామనుకునే నిరాశాజీవులు ప్రేరణ పొందాల్సిన యదార్థగాథ ఇది.




*(లోయ నుంచి శిఖరానికి)*

# నాలెడ్జ్ కరెంట్ – కుతూహలం దాని స్విచ్

ఒక వృద్ధుడు, అతడి భార్య, నలభై ఏళ్ళ కొడుకు, వాళ్ళ మనవడు రైల్లో వెళ్తున్నారు. కొడుకు కిటికీ పక్కసీట్లో కూర్చుని కంప్యూటర్లో పని చేసుకుంటూ ఉండగా అతడి కొడుకు ప్రశ్నలతో విసిగించసాగాడు. "నోర్మూసుకుని కూర్చోక పోతే వళ్ళు చీరేస్తాను" అని తిట్టాడు తండ్రి. మనవడు మొహం చిన్న బుచ్చుకుని దూరంగా వెళ్లి కూర్చున్నాడు.

ఇంతలో రైలు అడవి మధ్యలో ఆగింది. దూరంగా చెట్టు మీద ఒక పక్షి గూడు ఉన్నది. ఒక కాకి వచ్చి దాని పక్కనే వాలింది. పెద్దాయన దాన్ని చూపిస్తూ కళ్ళు చిట్లించి, "అదేం పక్షి రా..." అని కొడుకుని అడిగాడు.

కొడుకు అటు పరికించి చూసి, "కాకి" అని సమాధానం చెప్పాడు.

"ఇదేమిటి రా.... కాకి బూడిద రంగులో ఉంది" అన్నాడు తండ్రి.

"కాకులు అలాగే ఉంటాయి నాన్నా"



"ఎక్కడో తెల్ల కాకులు కూడా ఉంటాయి అని చదివాను" సాలోచనగా అన్నాడు వృద్ధుడు.

"ఉన్నాయేమో నాకు తెలియదు" అన్నాడు కొడుకు కంప్యూటర్లో తల దూరుస్తూ.

"ఇలాంటిదే మరో పక్షి ఉంటుంది కదారా... అందంగా కూస్తుంది" వదిలి పెట్టలేదు పెద్దాయన.

"అది కోకిల."

"ఆఁ.... ఆఁ... కోకిలే. రెండిటికి ఏదో సంబంధం ఉన్నది కదా."

"సంబంధం ఏమిటి?"

"ఏదో గుడ్లు... గుడ్లకి సంబంధించిన సంబంధం ఉన్నట్లు గుర్తు."

"దీని గుడ్లు దాని గూట్లో పెడుతుంది"

"ఇంతకీ ఆ చెట్టు మీద గూటి దగ్గర కూర్చున పక్షి కాకా? కోకిలా?"

కొడుకు విసుగ్గా "నాన్నా... వయసు పెరిగే కొద్దీ నీకు చాదస్తం ఎక్కువ అవుతోంది. ఇప్పటికి పదహారు ప్రశ్నలు వేసావ్. విసిగించకు" అన్నాడు.

పక్కనే కూర్చున్న ఆ యువకుడి తల్లి నవ్వుతూ, "అది చాదస్తం కాదురా. పాఠం. పాతికేళ్ళ క్రితం ఇలాగే రైల్లో ప్రయాణం చేస్తున్నప్పుడు, నువ్వు సరీగ్గా ఇవే ఏడు ప్రశ్నలు

వేశావు. నాకు ఇప్పటికీ గుర్తుంది. నిన్ను వళ్ళో కూర్చోబెట్టుకుని మీ నాన్న విసుక్కోకుండా అన్నిటికీ సమాధానాలు చెప్పారు. ఆయన ఇప్పుడు అది నీకు గుర్తు చేస్తున్నారంతే" అంది.

ఎదిగే పిల్లలకి రోజుకి సగటున నలభై దాకా అనుమానాలు వస్తూ ఉంటాయని అంచనా. వాటిలో కొన్నిటికైనా సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత పెద్దలదే. అందులో కొన్ని చొప్పదంటు ప్రశ్నలు కూడా ఉండవచ్చు గాక. వాటికి హేతువు ఎందుకు లేదో, ఆ విషయం కూడా విడమర్చి చెప్పాలి. పెద్దలు ఎప్పుడయితే విసుక్కున్నారో, పిల్లల ఆలోచనలకి ఆనకట్ట పడుతుంది. అది మంచి పద్ధతి కాదు.

"రోదసీలో ప్రయాణం చేసేవారు ముక్కు దురద పెడితే ఎలా గోక్కుంటారు?" అని ఒక పాప తండ్రిని ప్రశ్నించింది. తండ్రికి సమాధానం తెలియ లేదు. అయితే ఆయన అక్కడితో ఊరుకో లేదు. రోదసిలో ప్రయణం చేసిన ఆరుగురి అడ్రస్సులు కనుక్కొని వారికి ఉత్తరాలు వ్రాశాడు. ఆశ్చర్యమేమిటంటే అందులో అయిదుగురు తిరిగి సమాధానం ఇచ్చారు.

విండీ లారెన్స్ అనే రోదసీ యాత్రికుడు (పదహారు రోజుల పాటు భూమి చుట్టూ తిరిగినవాడు), "రోదసీలో ప్రవేశించేటప్పుడు, దిగేటప్పుడు, స్పేస్ వాక్‌లోనూ కేవలం 3 సార్లు మాత్రమే సూట్ ధరించవలసి ఉంటుంది. అందువల్ల పెద్దగా సమస్య రాదు" అని చెప్పాడు. విలియం పోక్ అనే మరో యాత్రికుడు, "కేవలం ముక్కే కాదు, చెవి వెనుక కూడా దురద పెడుతూ ఉంటుంది. మొహానికి ఎదురుగా ఉన్న హెల్మెట్‌కి శరీరాన్ని రుద్దటం ద్వారా దురద తగ్గించుకొనే ప్రయత్నం చేస్తాము. కానీ అది అంత గొప్ప ఫలితాన్ని ఇవ్వదు" అని వ్రాసాడు. మరో యాత్రికుడు "దురద పెట్టినప్పుడు ఆ బాధ నుంచి బయట పడాలంటే, అది మరచి పోయి ఇంకో విషయం ఆలోచించటమే మార్గం" అని వ్రాశాడు.

ఇక్కడ సమాధానాలు ముఖ్యం కాదు. ఒక కూతురి సమస్య తీర్చేందుకు తండ్రి చేసిన ప్రయత్నం గురించి చెప్పటమే దీని ఉద్దేశ్యం. కుతూహలానికి సంబంధించిన మరొక కథ చూద్దాం.



'...సుక్షత్రియుడైన లక్ష్మణుడు, కోరి వచ్చిన శూర్పణఖ ముక్కూ చెవులూ ఎందుకు కోసాడని...' చిన్నప్పుడు నాకో అనుమానం వచ్చింది. మా తండ్రిగారిని అడిగితే ఆయన తనకీ తెలీదన్నారు. ఆ తరువాత పాతికేళ్ళకి విశ్వనాథ వారు రామాయణ కల్పవృక్షం వ్రాశారు. దాన్ని చదివి నాన్నగారు నాకు వివరణ ఇచ్చారు.

శూర్పణఖ తనని పెళ్ళాడమని కోరినప్పుడు, ఆమె నుంచి తప్పించుకోవటానికి లక్ష్మణుడు, "ఇప్పటికే అన్నా వదినల కోసం వేటాడి వండలేక చస్తున్నాను. మళ్ళీ నీవొకదానివా? నీ బాన కడుపు చూస్తూంటే బేజారవుతోంది" అన్నాడట.

అప్పుడు శూర్పణఖ మనోహరమైన రాక్షస నవ్వుతో, "కంగారు పడకు నా మానస చోరా. నన్ను నీవు వివాహమాడితే అక్కకీ, బావగారికీ కూడా నేనే వేటాడి వండి పెడతాను. నా చెవులకు ఎంత శక్తి ఉన్నదంటే, వెయ్యి యోజనాల దూరంలో కుందేలు కదిలినా ఆ సవ్వడి నాకు వినిపిస్తుంది. నేను గట్టిగా గాలి పీలుస్తే, ఏనుగైనా నా ముందు వచ్చి పడాల్సిందే" అన్నదట.

అది విని మతి చెడి కలవర పడి లక్ష్మణుడు "ఓసీ! మేమీ అరణ్యవాసం చేస్తున్నదే నీలాంటి రాక్షసుల బారి నుంచి సాధు జంతువుల్నీ, సాధువులైన మునుల్నీ రక్షించటానికి" అంటూ ఆమె ముక్కూ చెవులూ కోసేసాడట.

ఇందులో వాస్తవం ఎంతున్నదో కానీ విషయం మాత్రం తార్కికంగా ఉన్నది.

అయినా ఇక్కడ చెప్పదలచుకున్న విషయం అది కాదు. పదేళ్ళ వయసులో కొడుకు అడిగిన ప్రశ్న, పాతికేళ్ళ పాటు గుర్తు పెట్టుకుని మా తండ్రిగారు సమాధానం చెప్పటం.



*(టీన్స్ పిల్లల పెంపకం ఒక కళ)*

# గులాబీ పైన ముల్లు


గులాబీ క్రింద ముల్లు ఉన్నందుకు విచారిస్తాడు నిరాశావాది. పైన లేనందుకు ఆనందిస్తాడు ఆశావాది. "గాలిని చీల్చటమేమిటి? నాన్సెన్స్" అంటాడు నిరాశావాది. "వాయుశక్తిని కూడా వాడుకోవచ్చు" అంటాడు ఆశావాది.

1870లో ఇండియానాలో 'మిల్టన్ రైట్' అనే బిషప్ ఉండేవాడు. ఆయన చర్చిలో ప్రార్థన చేస్తున్న టైములో అక్కడికి ఒక ప్రొఫెసర్ వచ్చాడు. బయటి ప్రపంచంలో జరుగుతున్న అద్భుత విషయాలను గురించి అక్కడున్న భక్తులకు నాలుగు సైన్సుకి సంబంధించిన మాటలు చెప్పమని ఆయన్ని కోరాడు రైట్.

అప్పుడు ప్రొఫెసర్ "మనం సాంకేతికంగా చాలా పురోగమించే దిశలో ఉన్నాము" అన్నాడు. ప్రొఫెసర్ చెప్పేది అర్థం కాక దానికి మరింత వివరణ ఇవ్వమన్నాడు బిషప్. తనకి తెలిసిన కొత్త విషయాల గురించీ, ప్రయోగాల గురించీ వివరిస్తూ, "ఇంకొక 25 సంవత్సరాల్లో మనిషి గాలిలో ఎగురుతూ, ఒక చోటు నుంచి మరొక చోటుకి వెళ్తాడు" అని చెప్పాడు ఆ ప్రొఫెసర్.

బిషప్‌కి చాలా కోపం వచ్చింది. 'మన గ్రంథంలో చెప్పిన ప్రకారం, గాలిలో ఎగరటం అనేది కేవలం పక్షులకి, దేవతలకి మాత్రమే సాధ్యం. నిరర్ధకమైన ఇటువంటి సంభాషణ మన చర్చిలో జరగటం నేనొప్పుకోను' అంటూ తన ఇద్దరు పిల్లల్ని తీసుకుని కోపంగా బయటకు నడిచాడు.

మిల్టన్ బిషప్ తాలూకు ఆ ఇద్దరు పిల్లల పేర్లు ఓర్విల్ రైట్, విల్బర్ రైట్. ఆ పిల్లలే రైట్ సోదరులు. విమానాన్ని కనుగొన్నది వారే.



*(విజయానికి ఆరో మెట్టు)*

# అమ్మా... అమ్మా

ఒక రోజు  థామస్ అల్వా ఎడిసన్ స్కూల్ నుంచి ఒక ఉత్తరం తీసుకు వచ్చి తల్లికి ఇచ్చి, "అమ్మా! దీన్ని నువ్వే విప్పాలి' అని ప్రిన్సిపాల్ చెప్పారు" అన్నాడు. అతడు వింటూ ఉండగా, ఆమె దాన్ని పైకి చదివింది: "మీ కొడుకు ఒక జీనియస్. అంత గొప్పవాడికి చదువు చెప్పే సామర్థ్యం ఈ చిన్న స్కూల్‌కి లేదు. టీచర్లు కూడా సరిపోరు. క్షమించండి. స్కూల్ నించి పంపించి వేస్తున్నాము. మీరే మీ పిల్లవాడికి చదువు నేర్పించగలరు".

అదృష్టవశాత్తూ ఎడిసన్ తల్లి కూడా టీచరే. దానికి తోడు అతడి ఆరోగ్యం అంతంత మాత్రమే. అందువల్ల కొడుకుని స్కూల్‌కి పంపకుండా తనే ఇంట్లో చదువు చెప్తూ పెంచింది.

ఎడిసన్ పుస్తకాల పురుగు. పదేళ్ళ వయసులో రైల్లో పేపర్లు అమ్ముతూ వెళ్లి, తిరుగు ప్రయాణంలో కంపార్టుమెంటులో ఓ మూల కూర్చుని పుస్తకాలు చదువుతూ వెనక్కి వచ్చేవాడు. కొంతకాలానికి తనే ఒక సెకండ్ హాండ్ ప్రింటింగ్ మిషన్ కొని, రైల్లో అమ్మటానికి పత్రిక ప్రింట్ చేయటం ప్రారంభించాడు. ఆ విధంగా తన పన్నెండేళ్ళ వయసులోనే కొందరు పిల్లలకి ఉద్యోగం ఇచ్చే స్థాయికి ఎదిగాడు.

అదే సమయంలో చెవుడు వచ్చి, క్రమక్రమంగా చెవులు వినిపించటం మానేసాయి. దాన్ని పాజిటివ్ గా తీసుకుని, మరింత అంతర్ముఖుడు అయ్యాడు. ఇంటి క్రింద బేస్మెంట్లో చిన్న లాబ్ ఏర్పాటు చేసుకుని పరిశోధనలు చేయటం మొదలుపెట్టాడు. వరుసగా మెమొగ్రాఫ్, టైప్-మిషన్, రైలు బ్యాటరి, పారాఫిన్ పేపర్, రికార్డ్ ప్లేయర్... ఈ విధంగా ఎడిసన్, 'నెలకో కొత్తవస్తువు' కనుక్కున్న సైంటిస్ట్‌గా, ఆ మిలీనియం మేధావిగా, 1600 పైగా పరిశోధనలకి హక్కుదారుడిగా ప్రసిద్ధి చెందాడు. ఎలెక్ట్రిక్ బల్బు సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఈ వాస్తవ కథకి అద్భుతమైన ముగింపు అది కాదు.

ఈ మధ్య కాలంలో తల్లి మరణించింది. ఆ సమయంలో బట్టలు సర్దుతూంటే, చిన్నప్పుడు ఆమె చదివిన ఉత్తరం బయట పడింది. అందులో ఈ విధంగా ఉంది. "మీ కొడుకు మానసిక రోగి. ఎందుకూ పనికిరాడు. దేవతలు కూడా అతడికి చదువు చెప్పలేరు. స్కూల్ కే అప్రదిష్ట. అందుకని  స్కూల్ నించి శాశ్వతంగా పంపించి వేస్తున్నాం".

అది చదివి అతడు అశ్రుపూరిత నేత్రాలతో, "ఎందుకూ పనికిరాని ఒక మానసిక రోగికి, స్వయంగా చదువు చెప్పి, పదహారు వందల పేటెంట్లకి హక్కుదారుగా మార్చింది నా తల్లి" అన్నాడు. *(టీన్స్ పిల్లల పెంపకం ఒక కళ)*

# తెలివి – అతి తెలివి

మన పనులు సులువుగా, లాభవంతంగా చేసుకోవడానికి ఉపయోగపడే దాన్ని 'తెలివి' అంటారు. అవతలివారికి మనం తెలివైన వాళ్ళమని నిరూపించడానికి, ఉన్న తెలివికన్నా ఎక్కువ ఉపయోగించి భంగపాటు చెందడాన్ని 'అతి తెలివి' అంటారు.

ఒక డాక్టరు తన క్లినిక్ ముందు "ఫీజ్ వంద రూపాయలు. రోగం తగ్గకపోతే తిరిగి వెనక్కి వెయ్యి రూపాయలు" అని బోర్డు పెట్టాడు.

అతడి దగ్గర వెయ్యి రూపాయలు కొట్టేద్దామని ఒక లాయరు కన్సల్టేషన్‌కు వచ్చి "...నాకు ఏం తిన్నా రుచి తెలియడం లేదు, మజ్జిగ తాగినా, కజ్జికాయలు తిన్నా ఒకలాగే ఉంటోంది" అన్నాడు.

డాక్టర్ నర్స్‌తో "ఇంజెక్షన్లు వేడిచేసే స్టవ్ పక్కనే ఒక నల్ల సీసా ఉంది చూడు. ఆ సీసాలో మందు రెండు చుక్కలు ఈయన నోట్లో వేయి. నిముషంలో రోగం తగ్గిపోతుంది" అన్నాడు. ఆమె అలా వేయగానే లాయర్ చివాలున లేచి "థూ... ఇది కిరసనాయలు" అని అరిచాడు. డాక్టర్ నవ్వి "మీ రోగం నయమైపోయింది. వంద ఫీజ్ ఇచ్చి వెళ్ళండి" అన్నాడు.

ఇంటికి వెళ్ళిన లాయరుకి పది రోజులైనా ఒళ్ళు మంట తగ్గలేదు. ఎలాగైన కసి. తీర్చుకోవాలని మళ్ళీ వెళ్ళి "నా కనుచూపు పూర్తిగా పాడైపోయింది. బాగు చెయ్యాలి" అని అడిగాడు.



"క్షమించండి. దానికి సరిపడా మందు నా దగ్గర లేదు. ఓడిపోయాను" అంటూ చేతిలో డబ్బు పెట్టాడు డాక్టరు. లాయర్ కోపంగా "వేయి రూపాయలు ఇస్తామని బోర్డు పెట్టి వందే ఇచ్చారేంటి?" అని దబాయించాడు.

"చూశారా. మీ చూపు బాగుపడింది" అన్నాడు డాక్టరు.

అతి తెలివితో అవతలివాళ్ళను మోసం చేద్దాం అనుకుంటే ఏం జరుగుతుందో ఇంతకన్నా ఉదాహరణ ఏం కావాలి?

*(సమస్యలు – సందేహాలు)*

# ఆవేశపు నిర్ణయాలు

దాదాపు ముప్పై సంవత్సరాల క్రితం జరిగిన ఒక సంఘటన ఇది. అలహాబాద్‌లో గంగ, యమున, సరస్వతి అనే మూడు నదులు కలిసే ప్రదేశం 'త్రివేణీసంగమం' అయింది. అక్కడ యమున ఆకుపచ్చ రంగులో గంభీరంగా ఉంటుంది. గంగ క్లియర్ గా ఉంటుంది. మూడో నది 'సరస్వతి' అంతర్–ప్రవాహం. పైకి కనిపించదు. కేవలం భక్తుల నమ్మకమంతే.

ఈ మూడు నదుల సంగమం దగ్గర అస్తికల నిమజ్జనం కోసం నది మధ్యలో చిన్నప్లాట్–ఫాంలా కట్టారు. అక్కడ పూజ చేస్తే ఆత్మలు సంతోషిస్తాయని కొందరి నమ్మకం. అలాంటి నమ్మకం ఉన్న నా స్నేహితుడు, తన తండ్రి అస్తికలు తీసుకుని అక్కడకు వెళ్ళాడు. పడవలోంచి ప్లాట్–ఫాం మీదకి ఎక్కుతూ నీళ్ళల్లో పడిపోయాడు.

అప్రస్తుతమైనా ఇక్కడో విషయం ప్రస్తావించాలి. బల్లకట్టు వంతెన మీద నుంచి పడవలోకి ఎక్కేటప్పుడు (లేక దిగేటప్పుడు) కాస్త అనుభవం కావాలి. కదిలే పడవ మీద ఒక కాలు, పాతిన చెక్క మీద ఒక కాలు వేసి చాలామంది నిలబడతారు. గాలికి పడవ ముందుకు కదులుతూ ఉండటంతో రెండు కాళ్ళూ ఒకదాని కొకటి దూరమై, దానికి మరింత గాబరా తోడై, నీళ్ళల్లోకి జారిపోతారు. నది ఒడ్డున లోతు ఎక్కువ ఉండదు కాబట్టి ప్రమాదమేమీ జరగదు. కృష్ణ, గోదావరిలాంటి నదీ పరివాహిక ప్రాంతాల వారికి ముసిముసి నవ్వులు తెప్పించే చాలా సామాన్య దృశ్యం ఇది.

ఐతే అలహాబాద్ సంఘటన తీవ్రమైనది. మూడు నదులు కలిసే చోట, ముందే చెప్పినట్టు లోతెక్కువ. మా మిత్రుడు అక్కడ నీళ్ళలోకి జారిపోగానే ఒడ్డున ఉన్న అతడి భార్య బిగ్గరగా "బచావ్... బచావ్... జోభీ చాహెూ లేలో... ఉన్కో బచావో... (ఎంత కావాలంటే అంత తీసుకో... ఆయన్ని రక్షించు)" అని అరవసాగింది. ఇదంతా తరచు మామూలుగా జరిగే ప్రమాదమన్నట్టు అనుభవజ్ఞుడైన పడవవాడు నీళ్ళలోకి దూకి, క్షణాల్లో మా స్నేహితుడ్ని బయటకి తీసుకొచ్చాడు.

ఆ తరువాత మొదలైంది అసలు గొడవ. ఐదువేలు ఇమ్మంటాడు వాడు, ఐదొందలు ఇస్తామంటారు వీళ్ళు. "ఎంత అడిగితే అంత ఇస్తానన్నావు కదా" అని వాడు, "అరనిముషం పనికి ఐదువేలా" అని అతడి భార్యా; "నీ మొగుడి ప్రాణం అయిదొందలేనా" అని వాడూ, "అంతకన్నా తక్కువే అయ్యుండవచ్చుగాక. అది కాదు క్వశ్చను" అని ఆవిడా, అలా అరగంట వాదించుకున్నాక మేటర్ వెయ్యికి సెటిల్ అయ్యింది.

కోపంలో, ఆకలిలో, అంతులేని ఇష్టంలో, దుఃఖంలో ఉన్నప్పుడు నిర్ణయం తీసుకోకూడదు. నష్టాన్ని కలుగజేసే నిర్ణయాన్ని హేస్టీ డెసిషన్ అంటారు.

*(లోయ నుంచి శిఖరానికి)*

# బట్టర్ ఫ్లై ఎఫెక్ట్

ఎప్పుడో జరిగిన 'చిన్న' సంఘటన, తరువాత ఒక పెద్ద మార్పుకి దోహదపడటం 'బట్టర్ ఫ్లై ఎఫెక్ట్'. ఇంటర్వ్యూకి వెళ్తున్నప్పుడు బస్సు మిస్సయి, ఉద్యోగం రాక, వ్యాపారం పెట్టి కోట్లు సంపాదించటం ఒక ఉదాహరణ. మంచో చెడో మన అందరి జీవితాల్లో ఇలాంటి చిన్న చిన్న సంఘటనల ప్రభావం ఉండే ఉంటుంది. బట్టర్ – ఫ్లై – ఎఫెక్ట్ కి నూరు శాతం సరిపోయే భారత దేశచరిత్రకి సంబంధించి ఒక సంఘటన, డామేనిక్ లాపెర్రి వ్రాసిన 'ఫ్రీడం ఎట్ మిడ్ నైట్' అన్న పుస్తకంలో ఉన్నది. ప్రేమ్‌జి భాయ్ అనే వ్యక్తి, గుజరాత్‌లో చేపల వ్యాపారస్తుడు. అందువల్ల అతడు (శాకాహార) కులం నుంచి వెలివేయ బడ్డాడు. వ్యాపారం మానేసి తిరిగి కులంలో చేరతానన్నా కులపెద్దలు వప్పుకోలేదు. దాంతో కోపగించిన ప్రేమ్‌జి కొడుకు ఇస్లాం మతం పుచ్చుకున్నాడు. అతడి కొడుకే భారత విభజనకి కారణమైన మహమ్మద్ అలీ జిన్నా.

నెహ్రూ, జిన్నా సిద్ధాంతరీత్యా బద్ధ శత్రువులు. ముస్లింలకి ప్రత్యేక దేశం కోసం పట్టు బట్టిన జిన్నా, భార్య మరణంతో లౌకిక విషయాలపై విరక్తి చెంది లండన్ వెళ్ళిపోయి దాదాపు ఒంటరి జీవితం గడపసాగాడు. ఆ సమయంలో, భారత దేశంలో ఒక ప్రైవేట్ డిన్నర్ పార్టీలో జవహర్‌లాల్ నెహ్రూ "జిన్నా ఫినిష్ అయిపోయాడు" అంటూ చేసిన కామెంట్ గురిచి తెలిసి, అగ్గి మీద గుగ్గిలమై ఇండియా తిరిగి వచ్చి ముస్లిం లీగ్ పార్టీని పునరుద్ధరించాడు. అది అనూహ్యంగా పెరిగి ఇండియా పార్టిషన్ కి దారి తీసింది.

విభజన మరో ఏడాదిలో జరుగుతుందనగా జిన్నాకి ప్రాణాంతకమైన టి.బి. వచ్చింది. అయన ఫ్యామిలి డాక్టరు పటేల్ హిందూ. జిన్నా మరణం అంచున ఉన్నాడని తెలిసినా, వృత్తి విలువలకి కట్టుబడి, ఈ విషయం ఎవరికీ చెప్పలేదు. చెప్పి ఉంటే గాంధీ, నెహ్రూలు దేశ విభజన (పార్టిషన్) విషయం ఏదో రకంగా మరికొంతకాలం వాయిదా వేసేవారు. ఆ తరువాత ఉద్యమం దానంతట అదే చల్లారి పోయి ఉండేది.

హిందూ కుల పెద్దలు జిన్నా తాతని తిరిగి తమ కులంలో చేరటానికి ఒప్పుకున్నా, ఆ రోజు పార్టీలో నెహ్రూ ఆ మాట అనకపోయినా, జిన్నా ఆరోగ్యం సంగతి డాక్టరు ముందే వెల్లడి చేసినా, పాకిస్తాన్ ఉద్భవించేది కాదు. కొన్ని లక్షల మంది శరణార్థులు మరణించి ఉండేవారు కాదు. కాశ్మీరు సమస్య ఉండేది కాదు. బట్టర్–ఫ్లై–ఎఫెక్ట్‌కి దీన్ని గొప్ప ఉదాహరణగా చరిత్ర కారులు చెపుతారు.

*(సమస్యలు – సందేహాలు)*

# అనిర్వచనీయం

నేషనల్ హైవే పక్క నుంచి ఒక చిన్న ప్రైవేటు రోడ్డు కొండల్లోకి వెళ్తుంది. అలా పది కిలో మీటర్లు లోపలికి వెళ్తే, అడవి మధ్యలో ఒక ఫామ్ హౌస్. అటువంటి ఘాట్ రోడ్ మీద మిట్ట మధ్యాహ్నం పన్నెండింటికి ఒక కారు ఆగిపోయింది. దాన్ని డ్రైవ్ చేస్తున్న నడి వయస్కురాలు దిగి చుట్టూ చూసింది. చుట్టూ చెట్లూ, గుట్టలూ తప్ప మరింకేమీ కనబడలేదు. కనుచూపు మేరలో ఎక్కడా మానవ సంచారం లేదు.

దాదాపు అరగంట గడిచింది. ఆమెకి ఏమి చేయాలో అర్థం కాలేదు. ఆ సమయంలో ఒక యువకుడు సైకిల్ మీద అటుగా వచ్చాడు. ఆమె పరిస్థితి చూసి కారు బాగు చేయటానికి ప్రయత్నించి, ఒక ముఖ్యమైన పార్టు పోయిందని, పక్కనున్న పట్నంలో ఆ పార్టు దొరుకుతుందని చెప్పి వెళ్ళిపోయాడు.

ఏదైనా బస్సు వస్తుందేమో, తను వెళ్ళి మెకానిక్‌ని పంపించాలని ఆమె ఉద్దేశ్యం. గంట గడిచినా అటుగా ఏ వాహనమూ రాలేదు. ఎండ మాడ్చేస్తోంది. వడగాడ్పులు బలంగా వీస్తున్నాయి. మంచినీళ్ళు అయిపోయాయి. ఇంకొంచెం సేపు ఉంటే స్పృహ తప్పటం ఖాయం అనుకుందామె.

ఆ సమయంలో ఒక చిత్రం జరిగింది. కారుకి సంబంధించిన విడి భాగాన్ని తీసుకుని, భారంగా సైకిల్ తొక్కుకుంటూ కొండమలుపు ఎత్తులో ఆ యువకుడు కనపడ్డాడు. ఆమె ఆశ్చర్యంతో అవాక్కయింది.

అతడు అయిదు నిముషాల్లో కారు రిపేరు చేసాడు. పర్సులోంచి వెయ్యి రూపాయల నోటు తీసి అతడికి ఇచ్చింది. అతడు అయిదొందలు తిరిగి ఇస్తూ, "ఆ పార్టు ఖరీదు నాలుగువందలా యాభయ్యే మేడం. నా దగ్గర మిగతా చిల్లర లేదు" అన్నాడు.

"మొత్తం అంతా నీకే. పాపం ఎండలో చాలా కష్టపడ్డావు" అంది. వద్దన్నాడు. ఇచ్చిన డబ్బు సరిపోలేదేమోనని ఆమె మరొక వెయ్యి నోటు జత చేసింది. అతడు సున్నితంగా తిరస్కరించాడు. "క్షమించండి. నాకు డబ్బు అవసరం లేదు. మీరు ఇబ్బందిలో ఉన్నారు. ఇటువైపు ఏ వెహికిల్సూ రావు. అందుకని నేనే తీసుకు వచ్చాను".

ఆమెకింకా నమ్మశక్యం కాలేదు. నిజానికి అతడు ఇదంతా డబ్బు కోసమే చేసాడని అనుకుంది. లేకపోతే అంత ఎండలో కొండ ఎక్కి వెనక్కి ఎవరొస్తారు? "అదే పది వేలు ఇస్తే వద్దంటావా? నువ్వు నాకు చేసిన సహాయం చిన్నది కాదు. సాధారణంగా ఎవరూ చెయ్యరు" అన్నది.

అతడు అదే చిరునవ్వుతో, "పదివేలు కాదు. లక్ష ఇచ్చినా వద్దంటాను" అన్నాడు.

ఆమె అహం దెబ్బతింది. కారులోంచి చెక్-బుక్ తీసి వ్రాస్తూ "ఇదిగో లక్ష... తీసుకో" అంది. అతడు దాన్ని కూడా మర్యాదగా తిరస్కరించాడు. ఆమె ఆశ్చర్యంతో "నీలాంటి వాడిని ఎక్కడా చూడలేదు. ఈ ఎండలో కొండల మధ్య నన్ను వదిలేసి

వెళ్ళకుండా అంత దూరం వెళ్ళి నీ డబ్బులతో సామాన్లు తీసుకు వచ్చావు. అంతకన్నా ముఖ్యంగా, ఏమీ ఆశించకుండా ఈ పనులన్నీ చేసావు. ఎందుకు?" అని అడిగింది.

"ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటే భగవంతుడు మనకు సహాయం చేస్తాడని మా నాన్న చెప్పారు. ఆ పనే నేను చేసాను మేడం. నా కన్నా అవసరం ఉన్నవారు ఈ ప్రపంచంలో చాలా మంది ఉన్నారు. వారికి సాయం చేయండి. మీ డబ్బే నా దగ్గర యాభై ఉంది" అని అక్కడి నుండి వెళ్ళిపోయాడు. ఆమె అవాక్కై అటే చూస్తూ ఉండి పోయింది.

అతడు ఇంటికి వెళ్ళేసరికి ఎనిమిదేళ్ళ కూతురు ఎదురు చూస్తూ ఉంది. ప్రతి శనివారం సాయంత్రం ఇద్దరూ కలిసి గుడికి వెళ్ళటం అలవాటు.

"ఆలస్యం అయిందేమిటి నాన్నా?" అని అడిగింది.

అతడు జరిగింది చెప్పాడు.

గుడికి వెళ్ళినప్పుడు మెట్లపై కూర్చున్న బిచ్చగాళ్ళకి కూతురి చేత ఆ యాభై రూపాయలూ దానంగా వేయించాడు. దిగి వస్తూండగా "దేవుడిని ఏం కోరుకున్నావమ్మా?" అని అడిగాడు.

"నాయనమ్మ తొందరగా బాగుపడాలని కోరుకున్నాను" అంది.

అది ఎన్నటికీ సాధ్యం కాదని అతడికి తెలుసు.

ఇక్కడ సంభాషణ జరుగుతూ ఉండగా, అక్కడ ఆమె కారు ప్రయాణం కొనసాగించింది. ఇంకా హైవే ఎక్కలేదు. కొండల ప్రాంతం దిగిన తర్వాత చిన్న తటాకం కనబడింది. చాలా సేపు ఎండలో ఉండడం వల్ల అలసిపోయినట్టు అనిపించి కారాపి చల్లటి నీళ్ళతో మొహం కడుక్కుంది. ఎంతో రిలీఫ్‌గా, ఆహ్లాదంగా అనిపించింది.

ఆ సమయంలో అక్కడ చెట్లు కొడుతున్న ఒక వృద్ధుడిని చూసింది. ఎముకల గూడులా బలహీనంగా ఉన్నాడతను. ఆ వయసులో అతను అంత శ్రమ పడటం చూసి ఆమెకి ఆ యువకుడి మాటలు గుర్తొచ్చాయి.

తను చేస్తున్న పని ఏ తర్కానికీ అందదని, ఈ విషయం ఎవరికైనా చెప్పినా తనకి పిచ్చెక్కిందని అనుకుంటారనీ ఆమెకి తెలుసు. కానీ ఎందుకో ఆమెకి అలా అడగాలని అనిపించి, "...నీకు లక్ష రూపాయలు అవసరం ఉందా?" అని అడిగింది.

ఆ వృద్ధుడు గొడ్డలి కింద పెడుతూ "డబ్బు అవసరం లేనిది ఎవరికమ్మా?" అన్నాడు.

ఆమె అతడికి ఆ చెక్కు అందిస్తూ "ఎందుకు? ఏమిటి? అని అడక్కు. ఇది నీకు సహాయపడితే నాకు చాలా ఆనందంగా ఉంటుంది" అని వెళ్ళిపోయింది.

అ వృద్ధుడు ఇంటికి వచ్చి "బాబూ, ఒక చిత్రం జరిగిందిరా. మీ అమ్మ ఆపరేషన్‌కి లక్ష అవుతుందని డాక్టరు చెప్పగా ఆశలు వదిలేసుకున్నాం కదా. భగవంతుడు పంపించినట్టు ఎవరో దేవత, దయతో ఈ డబ్బు ఇచ్చింది" అంటూ చెక్కు కొడుకు ముందుంచాడు. *(ప్రేమ ఒక కళ)*

# చదువు

చేస్తున్న తప్పులూ, బ్రతుకుతున్న జీవిత విధానం... వీటిల్ని నిరంతరం విశ్లేషించుకుంటూ, తనని తాను కరెక్టుగా ప్రాసెస్ చేసుకున్న మనిషే గెలుస్తాడు. ఒక తల్లి కొడుకుని ఒక జ్ఞాని అయిన స్వామి దగ్గరకు తీసుకు వెళ్ళింది. "స్వామీ! నా కొడుకు తెలివైన వాడే కానీ మాట వినడు. చదువు తప్ప అన్ని విషయాల్లోనూ ఆసక్తి ఉన్నది. వాడికేదైనా చెప్పి మార్చండి" అన్నది. "ఏం చెప్పను? దేని గురించి చెప్పను?" అని స్వామి చిరునవ్వుతో కుర్రాణ్ణి అడిగాడు. కొంటె కుర్రవాడు రోడ్డు చూపిస్తూ వెటకారంగా "దాని గురించి చెప్పండి" అన్నాడు. కొత్తగా వేస్తున్న ఆ రోడ్డు పక్కనే పడి ఉన్న ఒక తారు ముద్దని తీసుకుని రమ్మని "ఈ ఉండ ఖరీదు ఎంత ఉంటుందో ఉజ్జాయింపుగా చెప్పగలవా?" అని అడిగాడు స్వామి. "అయిదు నుంచి పది రూపాయలు" అన్నాడు కుర్రవాడు.

"కానీ ఇందులోని పెట్రోలియంని సింథెటిక్ వైరుగా మారుస్తే, అది గుండె ఆపరేషన్లో పదివేలు ఖరీదు చేసే దారంగా పనిచేస్తుంది. ఈ ముద్దలోంచి వెయ్యి వైర్లు తయారు చేయవచ్చు. మరోలా చెప్పాలంటే ఈ పది రూపాయల తారుని మరొక రకంగా ప్రోసెస్ చేస్తే, దాని విలువ కోటి రూపాయలు అయి ఉండేది." వింటూన్న కుర్రవాడు నిశ్చేష్టుడయ్యాడు. అతడి కళ్ళలోని కుతూహలం గమనించి స్వామి కొనసాగించాడు.


"వర్తమానాన్ని ఎలా ప్రోసెస్ చేసుకుంటే నీ భవిష్యత్తు అలా మారుతుంది. నీవిప్పుడు ఇంటర్మీడియెట్ స్టేజిలో ఉన్నావు. ఇంటర్ అంటే 'మధ్యలో' అని అర్థం. అదొక రైల్వే జంక్షన్. రకరకాల రైళ్ళు అక్కడికి వస్తూ ఉంటాయి. ఒక రైలు నిన్ను కాశ్మీరుకి, మరొకటి జైసల్మీర్ ఎడారికీ తీసుకెళ్తుంది. పూలవనానికి వెళ్తావా, ఇసుక ఎడారికి వెళ్తావా అన్నది నీవే నిర్ణయించుకోవాలి. ఒక సారి రైలు ఎక్కిన తరువాత మారటం కష్టం. లక్షరూపాయల ఉద్యోగంతో ప్రారంభిస్తే కోటికి చేరుకోవటం సులభం. పదివేలతో మొదలు పెడితే లక్షకు చేరుకోవటం కష్టం".

వింటున్న కుర్రవాడు అర్థమైనట్టుగా వినమ్రతతో నమస్కరించాడు. మీకు కనపడిన ప్రతి విద్యార్థికీ పై కథ చెప్పండి. చివర్లో ఒక ప్రశ్న వేయండి. "మొదటి ఇరవై సంవత్సరాలు నీ జీవితం అద్భుతంగా ఉండి, తరువాత కఠినమైన సమస్యలతో నిండిపోతుంది. లేదా, మొదటి ఇరవై సంవత్సరాలూ సామాన్యంగా ఉండి, తరువాత అద్భుతంగా ఉంటుంది. నీకేది కావాలి?' అని భగవంతుడు ప్రత్యక్షమై, అడిగితే, ఏది కోరుకుంటావ"ని ప్రశ్నించండి. అందరూ 'రెండోదే' అంటారు. 'మొదటి ఇరవై సంవత్సరాలంటే విద్యార్థి జీవితమే కదా' అనండి. చాలు. అర్థమయ్యేవారికి అర్థమౌతుంది. మారేవారు మారుతారు.

*(లోయ నుంచి శిఖరానికి)*

# భయం ఎక్కడ ఉంటుంది?

జైనులు చీమకు కూడా హాని తలపెట్టరు. అటువంటి జైన ధ్యాన ప్రార్ధనా మందిరంలో శిష్యుడి పక్కన కత్తి ఉండడం చూసి గురువు నివ్వెరపోయి కారణం అడిగాడు.



"ఆచార్యా! ధ్యానం చేస్తూండగా నన్ను కబళించటానికి ఒక పెద్ద తేలు వస్తోంది. రోజు రోజుకూ దాని పరిణామం పెరుగుతోంది. భయం వల్ల ధ్యానంపై మనసు నిలవటం లేదు. ఈ విషయం మీకు చెప్పాలంటే ఇబ్బందిగా అనిపించి, నేనే స్వయంగా దాన్ని సంహరిద్దామని కత్తి తెచ్చుకున్నాను" అన్నాడు శిష్యుడు.

గురువు క్షణంపాటూ కళ్ళు మూసుకుని ధ్యానించి, ఆ తరువాత కనులు తెరిచి అన్నాడు. "కత్తి బదులు ఒక సుద్దముక్క పెట్టుకో. రేపు అది కనపడగానే వీపు మీద గట్టిగా 'X' గుర్తు పెట్టు. ఆ తర్వాత ఏమి జరిగిందో నాకు చెప్పు" అన్నాడు గురువు.

మరుసటి రోజు శిష్యుడు ధ్యానం చేస్తూ ఉండగా ఆ తేలు మళ్ళీ వచ్చింది.

చేతిలోని సుద్దనే కత్తిగా భావిస్తూ, కసి తీరా దాని మీద లెక్క లేనన్ని సార్లు అడ్డంగా నిలువుగా గీశాడు. అది అక్కణ్ణుంచి వేగంగా పారిపోయింది.

ధ్యానం పూర్తయిన తర్వాత గురువు మందిరంలోకి వెళ్ళి జరిగింది చెప్పాడు.

"నీ కడుపు మీది వస్త్రం పైకెత్తు" అన్నాడు గురువు.

అక్కడ చూసిన శిష్యుడు నిశ్చేష్టుడయ్యాడు.

అతడి కడుపుపై లెక్కలేనన్ని 'ఇంటూ' మార్కులు ఉన్నాయి.

అప్పుడా జైన గురువు 'భయము బాహ్యము కాదనీ అంతర్గతమనీ' చెపుతూ, భయంతో పోరాడటానికి సోపానాల మార్గాన్ని చెప్పాడు.

*(ప్రేమ ఒక కళ)*

# మూడు అలవాట్లు

ట్రైన్ కి టైం అయిపోతోంది. ఆటోడ్రైవర్ని తొందర పెడుతున్నారు. ముందున్న వాహనాలు నత్తల్లా నడుస్తూ మరింత విసుగు కలిగిస్తున్నాయి.

పడిన ప్రతీ ఎర్రలైటూ వెర్రెక్కిస్తోంది.

ఇంకొద్ది  సెకన్లు మాత్రమే టైముందనగా స్టేషన్ ముందు ఆటో ఆగింది.

హనుమంతుడిలా క్రిందికి గెంతి, సంజీవినీ పర్వతాల్లాంటి సామాన్లు ఎత్తుకుని, చిల్లర కూడా తీసుకోకుండా ప్లాట్‌ఫాం మీదకు ఒక్క అడుగులో పరుగెత్తేసరికి, తెలిసిన విషయం ఏమిటంటే... ట్రైన్ గంట ఆలస్యం అని..!

ఆనందంతో విసుక్కుంటూ(!) కూల్ డ్రింక్ తాగి సేద తీరుతూండగా ఆకస్మాత్తుగా అనుమానమొచ్చి వెతుక్కుంటే జేబులో టిక్కెట్టు లేదు.

ఇంట్లో బల్లమీద మర్చిపోయారని గుర్తొచ్చింది.

క్లయిమాక్స్ సీన్లో రౌడీల్తో హీరోలా పోరాడి, వాళ్ళందరినీ కొట్టి, పెళ్ళి మండపానికి వెళ్ళేసరికి విలను ఆల్రెడీ హీరోయిన్ మెళ్ళో మంగళ సూత్రం కట్టేసిన భావన.

కొన్ని క్షణాల తరువాత, గుండె తిరిగి కొట్టుకోవటం ప్రారంభమయ్యాక, పక్కింట్లో ఉన్న ఫ్రెండ్‌కి ఫోన్ చేసి... అతడు దొరికి... అరగంటలో తీసుకొస్తానని అన్నప్పుడు కలిగిన ఆనందం... గంటైనా అతను రాకపోయేసరికి ఆవిరై... అంతలోనే ట్రైన్ వస్తూందన్న ప్రకటన వినిపించి, గుండె జారి...

తరువాత ఏం జరిగిందన్న సంగతి పక్కనుంచి, అసలు విషయానికి వద్దాం. ఇన్ని టెన్షన్ల నించీ మూడు రకాల మంచి అలవాట్ల ద్వారా బయటపడవచ్చు. ట్రైను లేట్‌గా వచ్చే టైము 139 నుంచి తెలుసుకోవటం ద్వారా (ప్లానింగ్), కాస్త ముందు బయల్దేరటం ద్వారా (టైమ్ మేనేజ్‌మెంట్), వస్తువుల లిస్టు ముందే వ్రాసుకుని ఉంచుకోవటం ద్వారా (స్పేస్ మేనేజ్‌మెంట్). ఈ మూడూ గెలుపుకి మూడు మెట్లు.

ఇరవై రూపాయలు కడితే స్టేషన్లోనే డూప్లికేట్ టికెట్ ఇస్తారని తెలిసి ఉండటం 'జ్ఞానం'.

అది పై మూడిటి కన్నా ముఖ్యమైనది.

*(లోయ నుంచి శిఖరానికి)*

# తల్లి పనులు

ఒకామెకి  డ్రైవింగ్ లైసెన్స్, వీసా అప్లికేషన్.... రెండు పనులు ఒకేసారి వచ్చి పడ్డాయి. డ్రైవింగ్ లైసెన్స్ కోసం వెళ్ళినప్పుడు, అక్కడి అధికారి అప్లికేషన్ ఫారం పూర్తి చేస్తూ "మీరేం పని చేస్తూ ఉంటారు" అని అడిగాడు.

ఆమెకి అర్థం కాలేదు.

కాస్త వివరిస్తున్నట్టు "అంటే ఏదైనా వృతిలో ఉన్నారా? లేక ఉద్యోగం చేస్తున్నారా?" అని అడిగాడు అధికారి.

"తల్లిని" అన్నది ఆమె. అధికారి కొంచెం అయోమయంగా, "ఇక్కడ 'తల్లి' అన్న ఆప్షన్ లేదు మేడమ్. హౌస్-వైఫ్ అని రాస్తాను" అని మిగతా వివరాలు పూర్తి చేసాడు.

ఆ తరువాత ఆమె వీసా కోసం వెళ్ళింది. అక్కడ అధికారి ఒక స్త్రీ. ఆమె కూడా అప్లికేషన్ ఫారం పూర్తి చేస్తూ "మీ వృత్తి ఏమిటి?" అని అడిగింది.

"పిల్లల అభివృద్ధి, ఆహారం, వ్యక్తిత్వం, మానవ సంబంధాలు అనే అంశాల పై నేను రీసెర్చ్ స్కాలర్ని" అని చిరునవ్వుతో సమాధానం ఇచ్చింది గృహిణి. అధికారిణి అయోమయంతో "నాలుగు రంగాలలో ఒకేసారి రీసెర్చ్ చేస్తున్నారా" అన్నది. గృహిణి నవ్వుతూ తలూపింది. ఫారం పూర్తి చేస్తూ "నాకు సరిగ్గా అర్థం కాలేదు మేడమ్. మీరు ఈ రీసెర్చ్ ఎక్కడ చేస్తున్నారు?" అని ప్రశ్నించింది.

"మా ఇంట్లో" అన్నది తల్లి. అధికారిణి మరింత అయోమయంతో చూసింది. అప్పుడా గృహిణి నవ్వుతూ "ఈ రీసెర్చ్ చాలా సంవత్సరాల నుంచి చేస్తున్నాను. దీనికి నాకు ఇద్దరు మార్గ దర్శకులు. ఒకరు భగవంతుడు. మరొకరు నా భర్త. రోజుకి పద్నాలుగు గంటలు పని చేసినా అది పూర్తి అవ్వదు. అన్నిటిలోకి కష్టమైన రీసెర్చ్ పిల్లల సైకాలజీ. దీనికి నా సీనియర్ రీసెర్చ్ స్కాలర్ మా అత్తగారు. మా అమ్మ అప్పుడప్పుడు నా పేపర్స్ దిద్దుతూ ఉంటుంది. మా తాతమ్మ, అమ్మమ్మ, నానమ్మ వీళ్ళందరూ నా యూనివర్సిటీ డైరెక్టర్లు. ఇప్పటికే నాకు రెండు డిగ్రీలు వచ్చాయి. ఒక అబ్బాయి, ఒక అమ్మాయి" అంటూ ముగించింది.

అధికారిణి ఆహ్లాదంగా నవ్వి, ఆమెతో పాటూ గుమ్మం వరకు వచ్చి, కరచాలనం చేసి సాగనంపుతూ "తల్లికి ఇంతకన్నా గొప్ప నిర్వచనం నా జీవితంలో నేనెప్పుడూ వినలేదు మేడమ్. థాంక్స్" అన్నది.

*(టీన్స్ పిల్లల పెంపకం ఒక కళ)*

# కృషికి శత్రువు ఓటమి

ఓడిపోయేవాడు ఒకసారే ప్రయత్నిస్తాడు. గెలిచేవాడు ఓటమి దూరం అయ్యేవరకూ ప్రయత్నిస్తూనే ఉంటాడు.

ఒక కుర్రవాడు రాత్రింబవళ్ళు కృషిచేసి వెయ్యిమీటర్ల రేసుకి తయారయ్యాడు. అనుకున్న రోజు వచ్చింది.

పిస్టల్ సౌండు వినపడగానే పరుగెత్తటం ప్రారంభించాడు.

గమ్యం తప్ప మరేమి కనపడలేదు.

అయిదో రౌండులో గీత చేరుకుంటూండగా, ప్రేక్షకుల నుంచి జయజయ ధ్వానాలు వినిపించాయి.


తనకన్నా ముందే నలుగురు లైను దాటటం గమనించి అతడు కళ్ళనీళ్ళ పర్యంతమయ్యాడు.

ఇంతలో పోటీ నిర్వాహకులు తనవైపు రావటం గమనించాడు.

వాళ్ళు కంగ్రాట్స్ చెప్తూంటే, "కానీ ఆ నలుగురూ నా కన్నా ముందే వెళ్ళారుగా" అన్నాడు దిగులుగా.

నిర్వాహకులు అటుచూసి, "లేదు లేదు. వాళ్ళింకా నాలుగో రౌండు దాటుతున్నారు. ఆ చప్పట్లు మీకోసం" అన్నారు.

*(లోయ నుంచి శిఖరానికి)*



# ఫుట్‌బాల్ ఆట

మూడువేల సంవత్సరాలకు పూర్వం గ్రామస్థులు తమ గ్రామం నుంచి ఒక పుర్రెని తన్నుకుంటూ పక్క ఊరి పొలిమేర్లలో తీసుకు వెళ్లి పడేయటానికి ప్రయత్నించేవారు. సాధారణంగా ఈ పుర్రె ఒక నీచుడిదో, నేరస్తుడిదో, మంత్రగాడిదో అయి ఉండేది. అవతలి గ్రామ ప్రజలు ఆ అరిష్టం తమ ఊరు ప్రవేశించకుండా దాన్ని నిరోధించడానికి ప్రయత్నించేవారు. రెండు గ్రామాల నడుమ విశాల ప్రదేశంలో, ఇరువర్గాల మధ్యా హోరాహోరీ పోరాటం జరిగేది. కొన్ని తలలు తెగిపడేవి.

తరువాత కాలక్రమేణా (అంటే దాదాపు రెండొందల సంవత్సరాల క్రితం) ఇది యుద్ధంలా కాకుండా ఒక క్రీడలా రూపాంతరం చెందింది. పుర్రెలకు బదులు ఎద్దుల, ఆవుల 'బ్లాడర్లు' బంతిగా వాడటం మొదలైంది. భూమ్మీద దొర్లటం వరకూ బాగానే ఉండేది గాని, మనిషి పుర్రెలా కాకుండా, ఈ బ్లాడర్లు మాటిమాటికీ పిగిలి పోతూ ఉండేవి. అప్పుడే చర్మం వాడుకలోకి వచ్చింది. బ్లాడరు చుట్టూ చర్మం కట్టి దాన్ని బంతిగా తయారు చేసేవారు.

ఈ కథ ఎంతవరకూ వాస్తవమో తెలిదు కానీ, కోరిక వల్లే జ్ఞానం పెరుగుతుందన్నది మాత్రం తిరుగులేని వాస్తవమే కదా. ఫుట్‌బాల్ ఆట ప్రారంభమైనదీ, అభివృద్ధి చెందినదీ ఇంగ్లండ్‌లోనే. అయితే, అదే దేశంలో ఆ ఆటని నిషేధించారు. కారణాలు మూడు. ఆ రోజుల్లో తుపాకులు అంతగా లేవు. సైన్యం విల్లంబుల మీదే ఆధారపడి ఉండేది. యువత విలువిద్య ప్రాక్టీసు మానేసి ఫుట్‌బాల్ ఆడటం మొదటి కారణం. రక్తం వచ్చేలా తోసుకోవటం, ముష్టిఘాతాలు, ఎక్కడ ఖాళీ కనపడితే అక్కడ ఆడుతూ బంతిని ఇళ్లల్లోకి కొట్టటం లాంటి క్రమశిక్షణా రాహిత్యం రెండోకారణం. అన్నిటి కన్నా ముఖ్య కారణం మూడోది. యువకులు చర్చికి రాకుండా ఆదివారాలు కూడా ఫుట్‌బాల్ ఆడుతూ ఉండటంతో మతాధిపతులు రాజుపై ఒత్తిడి తీసుకువచ్చారు.

స్వార్ధ రాహిత్యం, సొంత కీర్తి కోసం కాకుండా సమిష్టి గెలుపు కోసం అవతలి వారికి బంతి అందించడం, క్షణాల్లో నిర్ణయం తీసుకోగలిగే నాయకత్వ లక్షణం, టీం-స్పిరిట్ లాంటి అత్యుత్తమ లక్షణాలు నేర్పే గేమ్ ఫుట్‌బాల్ (అప్పట్లో 'హాకీ/బాస్కెట్ బాల్' మొదలైనవి లేవు). ఈ ఆటలో సగటున ఒక్కొక్క ఆటగాడు దాదాపు పది కిలోమీటర్లు పరుగెడ్తాడు. మానసిక వికాసంతో పాటు శారీరక దారుఢ్యం కూడా పెంచే ఆటల్లో ఈ బంతాట ఒకటి. డిన్నర్ టేబిల్‌పై మీ టీన్స్‌కి ఈ కథ చెప్పండి.

*(టీన్స్ పిల్లల పెంపకం ఒక కళ)*

# మనసుకి ఉరిశిక్ష

మొదటిసారి మీకీ విషయం తెలిస్తే తల మునకలయ్యేటంత విస్తుబోతారు. రోమన్ సంస్కృతిలో ఒకప్పుడు కుటుంబపెద్దకి విశేషాధికారాలు ఉండేవి. తన కుటుంబంలో ఎవరినైనా, ఏ విధంగానైనా శిక్షించే అధికారం తండ్రికి ఉండేది. కొడుకుతో సహా, ఎవర్ని చంపినా సరే, దానికి అతడికి న్యాయస్థానమూ, శిక్షా లేదట.

అంతకంటే ఆశ్చర్యకరమైన విషయం తెలుసా? ప్రస్తుతం ఆ అధికారం పిల్లలకి వచ్చింది. తల్లిదండ్రుల్ని చంపినా శిక్ష లేదు. నమ్మరా? వృద్ధులైన పెద్దల్ని తిండి పెట్టకుండా వీధిలో పడేస్తున్న పిల్లలకి ఏ శిక్షా లేదు కదా. అవునా కాదా? ఈ కథ చదవండి.

శ్రీధర్ ఇంజనీరు. భార్య, ఇద్దరు ముచ్చటైన పిల్లలు. ప్రస్తుతం అతడికి ఒకటే సమస్య. తల్లి కిడ్నీ ఆపరేషన్‌కి అయిదు లక్షలు అవుతుందన్నాడు డాక్టరు. పిల్లాడి స్కూల్ డొనేషన్ కోసం తీసి ఉంచిన లక్ష కాక, బంగారం అమ్మితే మరో నాలుగు దాకా వస్తుంది. భార్య సరే అన్నది కానీ, మనస్ఫూర్తిగా వప్పుకున్న ధ్వని వినిపించలేదు. తల్లి మాత్రం, “ఆపరేషన్ కాకపోతే కొన్నాళ్ళు, అయితే కొన్నేళ్ళు బ్రతుకుతాను. దానికింత ఖర్చు ఎందుకురా. నాకన్నా పిల్లాడి చదువు ముఖ్యం కాదా? అలోచించు” అంటూ కోడల్నే సపోర్ట్ చేసింది.

ఆమె మరణించిన కొన్నాళ్ళకి డాక్టర్ శ్రీధర్‌ని, “నీ తల్లికి ఒకటే కిడ్నీ ఉంది. నీకా విషయం తెలుసా?” అడిగాడు. తెలిదన్నాడు శ్రీధర్.

“మీ నాన్న పోయాక నువ్వు అడ్డదార్లు పట్టావు. చదువు అబ్బలేదు. మీ అమ్మ చాలా కష్టపడి నిన్ను చదివించాలని ప్రయత్నం చేసింది. నీకు మంచి మార్కులు రాలేదు. మంచి కాలేజిలో డొనేషన్ కోసం తన కిడ్నీ అమ్మేసింది.”

ఆ సాయంత్రం అతడు శ్మశానానికి వెళ్ళి తల్లి సమాధి ముందు మోకరిల్లాడు. “అమ్మా. నేను రాక్షసుడిని. ఈ రోజునుంచీ మనిషిగా మారటానికి ప్రయత్నిస్తాను. నేను రాక్షసుడిని అయింది నీకు వైద్యం చేయించక పోవటం వల్ల కాదు. పక్క గదిలో నువ్వు వింటున్నావని తెలిసీ, తెలియాలనీ, పిల్లాడి చదువూ, భార్య బంగారం గురించి బిగ్గరగా మాట్లాడినందుకు”. *(టీన్స్ పిల్లల పెంపకం)*

మనసు బరువైందా? తేలికపడటం కోసం తరువాతి కథ చదవండి.

# భార్య - అమ్మ



"మీకు మీ అమ్మ అంటే ఎందుకు అంత ప్రేమ? నేనూ అంతే ప్రేమిస్తున్నాగా" ఎత్తి పొడుస్తున్నట్టు అన్నది భార్య.

"నా పట్ల నీ ప్రేమలో ఏ మాత్రం అనుమానం లేదు" అన్నాడు భర్త.

"కానీ మీకు మీ అమ్మ అంటేనే ఎక్కువ ఇష్టం" నిష్టూరంగా అన్నది ఆమె.

"మొన్న రాత్రి పాయసం చాలా బావుంది" అన్నాడు భర్త.

అతడు టాపిక్ ఎందుకు మారుస్తున్నాడో అర్థం గాక, "అవును నేనే చేశాను" అన్నది భార్య.

"నిజంగా చాలా బావుంది"

భార్య కాస్త మొహమాటంగా, "చెప్పానుగా. నేనే చేసాను" అంది ఆనందాన్ని దాచుకుంటూ.


"...ఇంకొంచెం పెట్టమని నేను అన్నప్పుడు, నీ పాయసం నుంచి రెండు స్పూన్లు నా గిన్నెలో వేస్తూ, ప్రేమతో నువ్వు 'ముగ్గురికే చేశాను. ఇక లేదు' అన్నావ్" అంటూ ఆప్యాయంగా చేతి మీద చెయ్యి వేసాడు.

"అవును. వేసాన్లెండి. అయినా ఇప్పుడెందుకు అదంతా" అన్నది భార్య కాస్త సిగ్గు పడి.

"అదే టేబిల్ మీద మనతో పాటు తింటున్న అమ్మ, 'నాకు రాత్రి షుగరు ఎక్కువైనట్టుంది రా" అంటూ తన గిన్నె నా ముందుకు జరిపేసింది. అదీ తేడా" అన్నాడు భర్త.

*(టీన్స్ పిల్లల పెంపకం ఒక కళ)*

# జన్మ సాఫల్యం



వందలమంది వికలాంగులకీ, బీదవారికీ ఒక దాత గుడిలో ఉచితంగా అన్నదానం చేస్తున్నాడు.

ఆ అపురూపమైన దృశ్యం చూస్తూన్న పూజారి దేవుణ్ణి కీర్తిస్తూ, "పుట్టించిన వారి బాధ్యత భగవంతుడే స్వీకరిస్తాడని చెప్పటానికి ఇంత కన్నా గొప్ప ఉదాహరణ ఉంటుందా" అన్నాడు తాదాత్మ్యంగా. పక్కనే ఉన్న ఒక బద్ధకస్తుడికి ఆ మాటలు మనసులో నాటుకుపోయాయి.

ఆ రోజు నుంచి ఏ పని చేయకుండా ఇంట్లోనే పడుకున్నాడు.

మూడో రోజుకి కడుపు మాడి నీరసం వచ్చింది. పూజారి దగ్గరకు వెళ్ళి నిష్టూరంగా "మీ మాటలు విని అనవసరంగా మోసపోయాను. నన్ను పుట్టించిన ఆ భగవంతుడు నా గురించి ఏ బాధ్యతా స్వీకరించ లేదు" అన్నాడు.

అప్పుడా పూజారి, "మనల్ని పుట్టించిన వాడు, ఎవరేం చెయ్యాలో కూడా ఆయనే చెపుతున్నాడు. ఆయన నీకు సహాయం చెయ్యలేదంటే, నువ్వు అంగ–వైకల్య–జాతిలో కాదు. అన్న–దాతల–జాతిలో ఉండవలసిన వాడివన్న మాట" అన్నాడు.

గొప్ప వ్యక్తిత్వ వికాస సూత్రం ఇది. సదా ఓటమితో నిరాశ చెందేవాడు, తనకి తాను నిర్మించుకున్న స్వీయ మానసిక అంగ వైకల్య జాతిలో ఉన్నట్టు లెక్క. 'ఇది నా నుదుటి వ్రాత. నా ఖర్మ ఇంతే. దీన్ని దేవుడే మార్చాలి' అని గుళ్ళు గోపురాలూ తిరుగుతూ బాధపడే ప్రతీ వ్యక్తీ తెలుసుకోవలసిన సత్యం ఒకటుంది.

నుదుటి వ్రాత వ్రాసేవాడు విధాత. దాన్ని మార్చుకో గలిగేవాడు గెలుపు ప్రధాత.

నువ్వు సదా ఇతరుల ఓదార్పు సాయం కోరే ఓటమిలో ఉంటావా? గెలుపు దాతల కూటమిలో ఉంటావా అన్నది నువ్వే నిర్ణయించు కోవాలి.

నీ గెలుపుకి నీవే స్వయం–భూ వి.

*(టీన్స్ పిల్లల పెంపకం ఒక కళ)*

# ప్రేమ – గారాబం

ఒక పెద్ద భవంతిలో కోటీశ్వరుడు ఉండేవాడు. ఆ రోడ్డుకి అవతలి వైపు చిన్న ఇంట్లో అతడికి చదువు చెప్పిన గురువు నివసించేవాడు. ఎంత డబ్బు సంపాదించినా కోటీశ్వరుడికి గురువు మీద భక్తి భావం అలాగే ఉంది.

భవంతి చుట్టు ఖాళీ స్థలంలో పెంచటం కోసం, అరుదైన మామిడి మొక్కల్ని అతడికి ఎవరో పంపిస్తే, అందులో కొన్నిచెట్లు గురువుకి ఇచ్చాడు. ఆయన తన ఇంటి చుట్టూ ఉన్న స్థలంలో ఆ చెట్లు పాతాడు.

మూడు సంవత్సరాలు గడిచాయి. ఎరువులు, నీళ్ళు సమృద్ధిగా వాడటం వల్ల ధనవంతుడి ఇంట్లో చెట్లు ఏపుగా పెరగసాగాయి. ఉపాధ్యాయుడి ఇంట్లో కూడా ఆరోగ్యంగానే పెరిగాయి కానీ లావుగా లేవు. ఒక రోజు రాత్రి పెద్ద తుఫాను వచ్చింది. ధనవంతుడి ఇంట్లో చెట్లన్నీ నేలకి ఒరిగిపోయాయి. ఎదురింట్లో చెట్లు మాత్రం ధృడంగా ఉన్నాయి. "ఇలా ఎందుకు జరిగింది" అని గురువుని అడిగాడు కోటీశ్వరుడు.

"నువ్వు వాపుని చూసి బలం అనుకున్నావ్. అవసరమైన దాని కన్నా ఎక్కువ నీళ్ళు, ఎరువులు వాడటంతో, అవి నీ మీదే ఆధారపడాయి తప్ప తమ సొంత వేర్ల మీద కాదు. నేను అవసరమైనంత నీటిని మాత్రమే ఇచ్చాను. దాంతో ఆ చెట్ల వేర్లు ధృఢంగా పాతుకున్నాయి. అంతే తేడా" అన్నాడు గురువు.

పిజ్జా, బర్గర్లతో అడ్డంగా పెరుగుతున్న తన పిల్లల్ని చూస్తూ దిగులుగా "మీరు చెప్పింది నూరు శాతం నిజం గురువు గారూ" అన్నాడు కోటీశ్వరుడు.

మీకు తెలుసా? ఇటీవల ఇంగ్లాండ్ మెడికల్ జర్నల్ విడుదల చేసిన సర్వే ప్రకారం భారతదేశంలో ఒక కోటి నలభై నాలుగు లక్షల మంది చిన్న పిల్లలు స్థూలకాయంతో ఉన్నారు. ఒక కోటి యాభై మూడు లక్షలతో చైనా మొదటి స్థానంలో ఉంటే మన దేశం రెండో స్థానంలో ఉంది. ఇందులో దాదాపు సగంమంది పిల్లలు ఊబకాయం వల్ల వచ్చే వ్యాధులతో బాధ పడుతున్నారు. నలభై లక్షల మంది పిల్లలు ఈ కారణం వల్లే నలభై ఏళ్ళు దాటకుండానే జీర్ణకోశ వ్యాధులు, కాన్సర్, హృద్రోగాలు మొదలైన వాటితో మరణం అంచులకి చేరుకుంటున్నారు. దురదృష్టకరమైన విషయం ఏమిటంటే, చిన్న పిల్లల్లో స్థూలకాయం గత ముప్పై సంవత్సరాల్లో దాదాపు రెట్టింపు అయింది. దీనికి కారణం అందరికి తెలిసిందే. బద్ధకం వల్ల ఇంట్లో వంట మానేసి బయటి తిండ్లు, ఒక నియమం లేని నికృష్టపు ఆహారపు అలవాట్లు. *(టీన్స్ పిల్లల పెంపకం ఒక కళ)*

# ఎంతమంది స్నేహితులు ఉండాలి?

మరీ 'నన్ను ముట్టుకోకు' అన్నట్టు ఉండనసరంలేదు కానీ, స్నేహితులు ఎంత తక్కువ ఉంటే అంత మంచిది. 'నువ్వు కష్టంలో ఉంటే ఆదుకునేవాడే నిజమైన స్నేహితుడు' అనే సూక్తి చాలా పాతది. 'ఎవరు కష్టంలో ఉన్నప్పుడు నువ్వు ఆదుకుంటావో వారికే నువ్వు నిజమైన స్నేహితుడివి' అనేది నిజమైన సూక్తి. ఆలోచించండి. అలా ఆదుకోవడానికి అవతలి వారు 'స్నేహితులే' అయ్యుండనవసరం లేదు. మానవత్వం చాలు.

ఒక అడవిలో అందమైన లేడి ఉండేది. చెంగు చెంగున గెంతుతూ హుషారుగా ఉండటంతో చాలా జంతువులు స్నేహ హస్తం సాచాయి. గుడ్లగూబ, ఖడ్గమృగం లాంటి ప్రాణులు కూడా తన స్నేహాన్ని కోరటంతో లేడి గర్వంతో పొంగిపోయింది.

ఒక రోజు అడవికుక్కలు లేడిని వెంబడించాయి. సాయం కోసం అడవిదున్న దగ్గరకు వెళ్ళింది. "నా శరీరం చాలా భారీ అయింది. వాటిని నేను ఎదుర్కోలేను" అంది దున్న. ఒంటె దగ్గరకు వెళ్ళింది. "నాకు సాయం చేయాలనే ఉన్నది మిత్రమా. కానీ నేను ఒక దానితో పోరాడే సమయంలో మిగతా కుక్కలు నన్ను చీల్చి చెండాడుతాయి" అంది ఒంటె. గుడ్లగూబ దగ్గరకు పరుగెత్తింది లేడి. "అందంగా ఉండనని నేనంటే నీకు ఎప్పుడూ చిన్న చూపే. నీ అహం తీరటానికి నాతో స్నేహం చేసావే తప్ప నీ మిగతా స్నేహితులతో పోలిస్తే మొదటి నుంచీ నన్ను తక్కువగానే చూసావు. ఇప్పుడు గుర్తొచ్చానా?" ఎన్నాళ్ళ నుంచో చెప్పాలనుకున్నది చెప్పింది గుడ్లగూబ. ఖడ్గమృగం దగ్గరకు పరుగెత్తింది లేడి. "నీకు చాలామంది స్నేహితులు ఉన్నారు కదా. నేనే ఎందుకు గుర్తొచ్చాను? అందరూ కాదంటే చివర్లో నా దగ్గరకు వచ్చావు కదూ" అన్నది ఖడ్గమృగం.

ఈ లోపు వేటకుక్కలు చుట్టుముట్టాయి. మీద పడి చంపబోతూంటే అటు వచ్చిన ఏనుగు వాటిని తరిమికొట్టింది. "మిత్రుణ్ణి కాకపోయినా రక్షించావు. కృతజ్ఞతలు" అన్నది లేడి. "సాటి జంతువుని రక్షించటానికి మిత్రత్వం అక్కర్లేదు. మానవత్వం, స్నేహతత్వం ఉంటే చాలు" అని అక్కడ నుంచి కదలబోయింది ఏనుగు. లేడి ఆశ్చర్యంగా "మనం జంతువులం కదా. మనకి మానవత్వం, స్నేహతత్వం ఏమిటీ?" అన్నది.

ఏనుగు గాఢంగా నిశ్వసించి, "ఆ రెండూ ఒకప్పుడు మానవుల్లో ఉండేవి. వాళ్ళలో తగ్గి మనకొచ్చాయి'' అంది. ఎక్కువమంది స్నేహితులు ఉండేవారికి ప్రాణస్నేహితులు తక్కువన్నది ఈ కథలో నీతి. *(ప్రేమ ఒక కళ)*

# స్నేహానికి నాలుగు సూత్రాలు

కుచేలుడు పిల్లలతో సంసారాన్ని నడపలేక దరిద్రం అనుభవిస్తున్నాడు. "మీ మిత్రుడు తప్పక సహాయం చేయగలడు వెళ్ళండి" అని అతడి భార్య ప్రోత్సాహించింది.

"ధనము లభించకపోయినా, ఈ నెపంతోనైనా స్నేహితుడిని చూసి ఆనందించే అవకాశం లభిస్తుంది కదా" అనుకున్న కుచేలుడు, రిక్తహస్తాలతో వెళ్ళడం బాగుండదని కాస్త అటుకులు మూట కట్టుకుని వెళ్లాడు. అంత వరకూ బాగానే ఉంది కానీ, కలుసుకో బోయేవాడు సామాన్యుడు కాదు. శ్రీకృష్ణుడు..!

*"ద్వారకా నగరంబు నేరీతి జొత్తును? భాసురాంతః ప్రవాసి నెబ్బంగి దర్శిపఁగలను?"* అని భయపడుతూ ద్వారకలో ప్రవేశించాడు. మూడు ప్రహరీ గోడలు దాటి, తన భార్యల కోసం కృష్ణుడు నిర్మించిన అద్భుతమైన భవంతుల్లో ఒకటైన రుక్మిణి భవనంలోకి ప్రవేశించాడు. కృష్ణుడక్కడ ఉన్నాడు. కృష్ణుడి ప్రసక్తి వస్తే పోతన అణువణువూ వర్ణించకుండా వదిలిపెడతాడా? మహిత లావణ్య మన్మథుడు... పుండరీకాయతాక్షుడు... పన్నగ శయనుడు... ఇందీవర శ్యాముడు...



దూరం నుంచి చూసి, కృష్ణుడు లేచి వెళ్లి చేతులు సాచి స్నేహితుని కౌగిలించుకున్నాడు. చిక్కిశల్యంలా మురికి గుడ్డలతో, చూడ బిచ్చగాడిలా ఉన్న కుచేలునికీ, కుబేరుడైన కృష్ణునికీ స్నేహం ఏమిటా అని చుట్టూ ఉన్న వారంతా ఆశ్చర్య పోయారు. వచ్చినవాడు బాపడు. ఆదరమున కూర్చుండఁ బెట్టి... కలశ సలిలంబుచే కాళ్ళు కడిగి... తత్-జలంబు తనదు మస్తమున దాల్చి...

కాళ్ళు కడిగి ఆ నీళ్ళు తల మీద జల్లుకున్నాడు యాదవుడు. కుశల ప్రశ్నలయ్యాక, "మిత్రమా, నాకోసం ఏమి తెచ్చేవేమిటి?" అని చొరవగా మూట విప్పి, అందులోంచి ఓ గుప్పెడు తీసుకుని తిన్నాడు. *పిడికెడటుకులు గరమొప్పగ నారగించి ... మరియును పిడికెడు గొన ఉద కరమప్పుడు పట్టె...* మరో గుప్పెడు తీసుకోబోతూంటే చప్పున రుక్మిణి "పిడికెడు చాలు పెనిమిటీ" అని వారించింది. కుచేలుడి సర్వస్వం ఆ అటుకులే. అతడి ఆస్తి సర్వస్వం తాము తీసుకుంటే, తమ సమస్త ఐశ్వర్యం అతడికి బదిలీ అయిపోతుందని అనుమానం కాబోలు. ఎంతైనా భార్య భార్యేగా.

భార్య భయం చూసి రుక్మిణీ వల్లభుడు నవ్వుకున్నాడు. ఆమె భయాల సంగతి అతడికి ముందే తెలుసు కదా. బాపడితో రాయబారం పంపి, "ఘనుడా భూసురు డేగెనో,

*నడుమ మార్గశ్రాంతుడై చిక్కెనో"* అన్న లక్ష అనుమానాలతో భయపడిన బాల రుక్మిణి.

ఇక కుచేలుడి సంగతికొస్తే, స్నేహితుడి ఆతిథ్యం స్వీకరించి శలవు తీసుకుని ఇంటికి బయల్దేరాడు. వెళ్తూంటే తోవలో గుర్తొచ్చింది. "అరెరే. మిత్రుని చూసిన సంతోషంలో మా ఆవిడ చెప్పినది మర్చిపోయానే" అని నాలుక్కరుచుకున్నాడు.

వచ్చిన పని కుచేలుడు ఎందుకు మర్చిపోయాడు? కాళింది మర్దనుని కనులార చూసిన భాగ్యమే చాలనుకున్నాడా? లేక "...మూడు లోకాలనూ ముంగిట నిలిపిన నా మిత్రుడి నోటికి అంటిన వెన్నను చూసి చిన్నప్పుడు నవ్వుకున్నాను, అష్ట-సతుల ఇష్ట-ముద్రలతో ఎరుపెక్కిన అధరాలను చూసి ఇప్పుడు నవ్వుకుంటున్నాను. ఈ జన్మకిది చాలు" అనుకున్నాడా? పోతన చెప్పలేదు.

మొత్తం మీద తృప్తిగా ఊరివైపు పయనించాడు కుచేలుడు. ఇంటి దరిదాపులకి చేరుకున్నాక, అక్కడంతా కొత్తగా కనిపించింది. స్వంత పల్లెలో అంత పెద్ద భవనం అతడు ఎన్నడూ చూడనేలేదు. ఆశ్చర్యంగా కళ్ళప్పగించి చూస్తూండగానే పట్టుచీర కట్టుకుని, నిలువెల్లా నగలు పెట్టుకున్న భార్య ఎదురై, మణిమాణిక్యాలతో విరాజిల్లుతూన్న ఆ భవనంలోనికి తీసుకుని వెళ్లింది.

కృష్ణపరమాత్ముని అనుగ్రహం కుచేలుడికీ, పోతన నాటకీయత మనకీ అర్థమయింది కదా. ఇందులోని నాటకీయతని పక్కన పెడితే, స్నేహం గురించిన నాలుగు గొప్ప పరమార్థాలు ఉన్నవి.

- అవసరమైనప్పుడు సాయం చెయ్యటమే స్నేహం.
- స్నేహంలో గౌరవం కూడా మిళితమై ఉండాలి. కృష్ణుడు యాదవుడు. 'ఎంత ఆత్మీయుడైనా సరే, స్నేహంలో అవతలివారి స్థాయినీ, జ్ఞానాన్నీ, గౌరవించాలి' అని శిరస్సుపై నీళ్ళు జల్లుకోవటం ద్వారా శ్రీకృష్ణుడు మరొక గొప్ప సందేశం చెప్పాడు.
- 'నీ వద్దనున్న ధనము నీకిచ్చే సంతోషంకన్నా, దానిలో కొంచెము ఇతరులకి ఇవ్వటం ద్వారా నీవు ఎక్కువ సంతోషం పొందుతావు' అంటూ ఈ కథ ఒక నీతిని అందిస్తోంది. అర్థం చేసుకోగలిగితే చాలా లోతైన ఫిలాసఫీ ఇది.
- కృష్ణుడు యాదవ తండాలో ఆడుకున్నవాడు. తరువాత రారాజయినా కుచేలుని మనసారా ఆదరించాడు. 'కొత్తగా అధికారము, ధనమూ వచ్చాయని పాత స్నేహితులని మర్చిపోవద్దు' అన్నది మరొక నీతి. *(ప్రేమ ఒక కళ)*

# పాజిటివ్ థింకింగ్



ఒక కుర్రవాడు ఒక కాగితం తండ్రికి ఇచ్చి "దీని గురించి వివరించు నాన్నా" అన్నాడు. పూర్తి తెల్ల కాగితం. మధ్యలో నల్లటి చుక్క. తండ్రి ఆ కాగితాన్ని చాలా సేపు పరిశీలించి "చుక్క సరిగ్గా కాగితం మధ్యలో లేదు. కొంచెం ఎడమ వైపుకి, క్రిందిగా ఉంది" అన్నాడు.

'అది కాదు సమాధానం' అన్నట్టు కుర్రవాడు అడ్డంగా తల ఊపాడు.

తండ్రి మరింత తీక్షణంగా ఆ కాగితాన్ని పరిశీలించి "నిజానికి ఇది ఒక చుక్క కాదు. రెండు చుక్కలు. మధ్యలో అతి సూక్ష్మమైన ఖాళీ ఉంది" అన్నాడు, తన పరిశీలన శక్తికి తానే అబ్బురపడుతూ.

అది కూడా సరైన సమాధానం కాదన్నట్టు పిల్లవాడు తిరిగి తల అడ్డంగా ఊపాడు.

చాలా సేపు పరిశీలించిన తరువాత తండ్రి సమాధానం దొరకక తల గోక్కుంటూ "దీని గురించి ఇంకేం ఉందిరా?" అని చిరాగ్గా ప్రశ్నించాడు.

పిల్లవాడు తండ్రి చేతిలో నుంచి ఆ కాగితం తీసుకుంటూ, "ఒక కాగితం ఇస్తే, దాని స్వచ్ఛమైన తెల్లదనాన్ని చూడకుండా, నల్లటి చుక్కనే ఎందుకు చూసావ్ నాన్నా. 'ఈ చుక్క తప్ప మిగతా తెల్లటి కాగితం అంతా బాగుంది' అనచ్చుగా" అన్నాడు.

ఒక ఇంగ్లిషు కథ ఇది. ఏదో సినిమాలో కూడా ఈ కథని వాడుకున్నారు. చాలామంది పెద్దలు ఆ విధంగానే ప్రవర్తిస్తారు. పిల్లల్లో ఉండే పాజిటివ్ గుణాలను, మంచి లక్షణాలను గుర్తించకుండా, ఏదో ఒక చిన్న పాయింట్ పట్టుకొని దాని గురించే బాధ పడటమో, లేక తిట్టటమో చేస్తూ ఉంటారు. తప్పులు సరిదిద్దటం తప్పు కాదు కానీ, దాని గురించే ఎక్కువ మందలించటం, విచారించటం, ఆలోచించటం, పిల్లల్ని విసిగించటం మంచి లక్షణం కాదు.

*(టీన్స్ పిల్లల పెంపకం ఒక కళ)*

# ఎవరు గొప్ప దేవుడు?

నీళ్ళు ఎక్కువైతే పాలు పల్చనవుతాయనీ, స్నేహితులు ఎక్కువయ్యే కొద్దీ సాంద్రత తక్కువ అవుతుందనీ చెప్పే కథ ముందు పేజీలోది. నిజమైన స్నేహం ఎలా ఉంటుందో చెప్పే కథ ఈ క్రిందిది:

రామ్, రహీమ్ ప్రాణ స్నేహితులు. ఒక రోజు ఇద్దరికీ "మా దేవుడు గొప్ప అంటే మా దేవుడు గొప్ప" అని మాట పై మాట పెరిగింది. తమ తమ దేవుళ్ళని కఠినమైన, అసాధ్యమైన వరాలు కోరి, ఎంత తొందరగా ఎవరి దేవుడు తీరుస్తాడో ఆ దేవుడు గొప్ప– అని పందెం వేసుకున్నారు.

ఇంటికి వచ్చి రామ్ భగవంతుణ్ణి ప్రార్థించాడు "ఓ దేవదేవా! నాకు కాస్త ఐశ్వర్యం ఇవ్వు. అపురూప సౌందర్యవతి అయిన స్త్రీని భార్యగా ప్రసాదించు. నగరంలో అందరూ గుర్తించేలా పేరు వచ్చేటట్టూ చెయ్యి. నీవు ఉన్నావన్న ఉనికి నిరూపించుకోవడానికి నెల రోజుల్లో ఈ మూడు కోరికలూ తీర్చు" అన్నాడు.

ఆ మరుసటి రోజు అతడు వీధిలో వెళుతూ ఉండగా, మేనాలోంచి ఆ నగరపు జమిందారుగారి కూతురు అతడిని చూసింది. స్వర్ణఛాయ దేహము వాఁడు, ధవళాబ్జ పత్ర నేత్రముల వాఁడు అయిన రామ్‌ని, ఆ వాలు కనుల వనజాక్షి ఓర కనుల ఒకసారి గని, గప్పున ప్రేమలో పడి, చప్పున ఇంటికి వెళ్ళి తండ్రికి చెప్పింది.

యోగ్యుడైన రాముడిని అల్లుడిని చేసుకోవటానికి ఆయనకేమీ అభ్యంతరం కనబడ లేదు. కూతురికి జీవిత భాగస్వామిని, వ్యాపారంలో తన భాగస్వామినీ చేసాడు. జమీందారు




గారికి కాబోయే అల్లుడిగా అతడి పేరు ఆ విధంగా ఊరంతా తెలిసింది.

వివాహానికి వచ్చిన స్నేహితుడితో "చూశావా? నా దేవుడెంత గొప్పవాడో! కోరు కోగానే కీర్తి, ఐశ్వర్యం ఇచ్చాడు. కోరుకున్న భార్యని ఇచ్చాడు. నువ్వేం కోరుకున్నావు?" అని అడిగాడు.

"నా స్నేహితుడేమి కోరుకుంటే దాన్ని తీర్చమని నా దేవుణ్ణి ప్రార్థించాను" అన్నాడు రహీమ్.

*(ప్రేమ ఒక కళ)*

# స్నేహం ఒక కళ




స్నేహం చెయ్యటం కన్నా, దాన్ని నిలుపుకోవటం ఇంకా పెద్ద కళ.

రాముా, సోముా స్నేహితులు. ఒక రోజు రాముకి జబ్బు చేసి, వైద్యానికి లక్ష రూపాయలు ఖర్చయితే, స్నేహితుడు సర్దాడు. తిరిగి పరామర్శించటానికి వచ్చినప్పుడు, రాముా పడగ్గది అద్దానికి "నా స్నేహితునికి నేను ఋణపడి ఉన్నాను" అని వ్రాసి ఉండటం చూసాడు.

"ప్రొద్దున్న లేవగానే బాకీ గుర్తుండేలా వ్రాసుకున్నాను" అని వివరించాడు రాముా.

కొంతకాలానికి అతడి అప్పు సోముా తీర్చేసాడు. ఈసారి వెళ్ళినప్పుడు ఇంకా అది అద్దానికి అలాగే ఉండటం చూసి, "ఇదేమిటి? దీన్ని తొలగించలేదేం?" అని అడిగాడు సోముా.

"పాతది బాకీ చెల్లించే వరకూ గుర్తుండటం కోసం..! ఇది జీవితాంతం గుర్తుండటం కోసం" అన్నాడు రాముా.

*(ప్రేమ ఒక కళ)*

# ఓ మంచి కథ



సోమిదేవమ్మ మహా ఇల్లాలు. వాళ్ళింటికి ఒక అతిథి పొరుగూరి నుండి అర్ధరాత్రి చాలా పొద్దుపోయాక వస్తాడు. భర్త స్నేహితుడు. అతడు భోజనం చేయలేదని తెలుసుకుని అప్పటికప్పుడు ఆమె వండి పెడుతుంది.

భర్తతో కబుర్లు చెపుతూ అతడు ఆ అర్ధరాత్రి ఆకలితో ఆవురావురుమని తింటుంటే గుమ్మానికి ఆవలివైపు కుర్చుని అతడినే ఆర్ద్రమైన తడికళ్ళతో చూస్తూ ఉంటుంది.

మధ్యలో ఎందుకో తలెత్తిన భర్త, "...అదేమిటి నీ కళ్ళల్లో నీళ్ళు?" అని అడుగుతాడు.

సోమిదేవమ్మ పైటకొంగుతో కళ్ళు తుడుచు కుంటూ "ఏమీలేదు" అని అంటుంది.

అంతే. ఆ తరువాత ఏమీ వివరణలు ఉండవు.

ఇందులో ఏ నాటకీయతా లేదు కానీ, మనుషుల మధ్య ఆప్యాయతకి ఇంత చిన్న (గొప్ప) ఉదాహరణని నేనెక్కడా చదవలేదు. "ఆ ఇల్లాలి కరయుగమ్ము – వేయి సంజీవనుల మేళవింపు సుమ్ము" అని విద్వాన్ విశ్వం వ్రాసింది ఇలాంటి సందర్భంలోనే అనుకుంటాను.

*(ప్రేమ ఒక కళ)*

# జ్ఞానం

జ్ఞానం అంటే 'తెలివి' అని కొందరూ, 'పాండిత్యం' అని కొందరూ నమ్ముతారు. కాని జ్ఞానం అంటే ఆ రెండిటి మిశ్రమం. అంతే కాదు. పరిశీలన, హేతువు, అనుభవమూ, అవగాహనా లేని జ్ఞానం వ్యర్థమన్న ఒక గమ్మత్తైన కథ చదవండి.

పర్వత శిఖరాగ్రాలపై ఆరామాల్లో ఉండే ఒక శిష్యుడు, గురువు దగ్గరకు వెళ్ళి, "స్వామీ, అడవి దున్నల్నే తప్ప నేనెప్పుడూ 'ఆవు'ను చూడలేదు. దాని పాలు చాలా మధురంగా ఉంటాయంటారు. దయచేసి ఆవు గురించి చెప్పండి" అని ప్రశ్నించాడు. గురువు ఆవు యొక్క శరీరాకృతినీ, పాల వర్ణాన్నీ, మధురిమనీ వివరించి చెప్పాడు.

శిష్యరికం పూర్తయిన కొంత కాలానికి శిష్యుడు కొండలు దిగి ఒక గ్రామంలో ప్రవేశించాడు. అక్కడ అతడికి ఒక ఆవు కనపడింది. అందరూ పొలం పనులకి వెళ్ళటంతో గ్రామం నిర్మానుష్యంగా ఉంది. అటుగా వెళ్తూన్న కుర్రవాడిని ఆపి, 'అది ఆవేనా?' అని అడిగాడు. అతడు శిష్యుడి వైపు ఎగాదిగా చూసి, "ఏం? గేదెలా కనబడుతుందా? పైన ఆవు అని వ్రాస్తే తప్ప అర్థం కాదా?" అని వెళ్ళిపోయాడు. అతడు ఆవు దగ్గరగా వెళ్ళాడు. దాని పక్కనే ఒక పెద్ద పాత్రలో పాలు ఉన్నాయి.

'ఇది దైవప్రసాదం. పాల రుచి ఎలా ఉంటుందో' అనుకుంటూ దోసిలితో తీసుకుని తాగాడు. అంతే. నోరు భగ్గుమని మంటెక్కి, కెవ్వున కేక వేసి స్పృహ తప్పాడు. రోగిని పరామర్శించటానికి మరుసటి రోజు గురువు వైద్యశాలకొచ్చాడు. పక్క మీద నిస్త్రాణగా పడుకున్న శిష్యుడు జరిగినదంతా చెప్పి, "మీరు చెప్పింది విని ఆచరించినందుకు నాకీ ఖర్మ పట్టింది" అని వాపోయాడు.

"ఆవు నుంచి నువ్వు స్వయంగా పాలు పితికావా?" అనడిగాడు గురువు.

"లేదు. పాత్రలో తెల్లగా స్వచ్ఛంగా కనబడ్డాయి" అన్నాడు శిష్యుడు.

"నీ అంతట నువ్వు కృషి చేయందే ఏ సత్యమూ బయట పడదు. అది ఆవు కాదు. గ్రామం మధ్యలో గోమాత శిలా విగ్రహాన్ని నిర్మిస్తున్నారు. దానికి రంగు వేసిన వ్యక్తి, సున్నాన్ని అక్కడ వదిలేసి భోజనానికి వెళ్ళాడు. దాన్ని పాలనుకొని నువ్వు తాగావు". శిష్యుడి మొహం వివర్ణమయింది. అప్పుడు గురువు నీతి బోధ చేశాడు. "...నువ్వెందుకు కష్టాల్లో పడ్డావో అర్థమయ్యిందా? ఎదుటివారు చెప్పేది దిశానిర్దేశం మాత్రమే. స్వయంగా శోధించవలసింది నువ్వే."

*(ప్రేమ ఒక కళ)*

# ప్రేమ-స్వార్థం

విదేశాల్లో ఉన్న సంతానం గురించి బాధపడే తల్లిదండ్రుల కోసం బుద్ధచరిత్రలో ఒక గొప్ప కథ ఉంది. "కర్తవ్య నిర్వహణ కోసం విదేశాలకి వెళ్తున్న పిల్లల్ని చూసి తల్లిదండ్రులు బాధ పడకూడదు. గర్వపడాలి" అని చెప్పే ఈ కథ ప్రతి తల్లీ, తండ్రీ చదవాల్సింది.

బుద్ధుడి శిష్యుల్లో 'సారిపుట్ట' ప్రథముడు. సారిపుట్ట తల్లి పేరు 'సారి'. నిజానికి సారిపుట్ట అసలు పేరు 'సారిపుత్ర' (సారి అనే స్త్రీ కొడుకు).

దాదాపు బుద్ధుడంత గొప్పవాడిగా పేర్కొన బడే అతడు, దేవతలకు కూడా నిర్వాణ యోగం బోధించేవాడని ప్రతీతి. చిన్న వయసులోనే అతడికి ప్రాణసంకటమైన వ్యాధి వచ్చింది. బుద్ధుడి దగ్గరకు వెళ్ళి "మరణించే ముందు నా తల్లికి క్షమాపణలు చెప్పుకోవాలి. ఆమె అంగీకారం లేకుండా చిన్న వయసులోనే నేను ఇక్కడకు వచ్చేసాను" అని అడిగాడు. బుద్ధుడు అంగీకారం తెలిపాడు.

వద్దంటున్నా వినకుండా కొడుకు బౌద్ధారామాల్లో చేరి పోయాడని తల్లికి కోపం. కొడుకు మరణం దగ్గర పడిన సంగతి ఆమెకు తెలీదు. మనసు మార్చుకుని అతడు వెనక్కి వస్తున్నాడనుకుని ఆశగా వెళ్ళి, అతడింకా సన్యాసి దుస్తుల్లోనే ఉండటం చూసి హతాశురాలయింది. మాట్లాడమని కొడుకు ఎంత బ్రతిమాలినా వినలేదు.

రోజులు గడుస్తున్నాయి. అతడికి క్రమక్రమంగా నిర్యాణ స్థితి వచ్చింది. మరణం ఆసన్నమవుతూండగా ఒక చిత్రం జరిగింది. అతడు పడుకొన్న గదంతా వెలుగుతో నిండిపోయింది. దేదీప్యమానమైన ఆ వెలుగు చూసి అతడి తల్లి విస్మయంతో అక్కడకు పరిగెత్తుకు వచ్చింది. ఆ వెలుగుకి కారణం దేవతలు. తమ గురువు తాలూకు ఆఖరి శుభ వచనం వినడానికి వారందరూ వరుసగా ఆ గదిలోకి ప్రవేశిస్తున్నారు. ఆమె చేష్టలుడుగి చూస్తోంది. అదొక అద్భుతమైన దృశ్యం. సాక్షాత్తు దేవతలు తన కొడుకు వచనాలు వినటానికి వస్తున్నారు..! అతడి ముందు చేతులు జోడించి వరుసలో నిలబడుతున్నారు..!

కొడుకు గొప్పతనం ఆమెను కట్రాటను చేసింది. అప్పుడే కొడుకు అవసానదశ గురించి కూడా అవగతమైంది. తన కోరిక ఎంత స్వార్థమైనదో అర్థమయింది. పెద్దగా రోదించబోతే, "బంధమే దుఃఖ కారణమమ్మా" అన్నాడు.

చేతులెత్తి నమస్కరిస్తూ అతని మంచం పక్కన నేల మీద వాలిపోబోయింది. వారించి తల్లిని పక్కన కూర్చోబెట్టుకున్నాడు. అతడి కోరిక తీరింది. దేవతలందరూ వింటూ ఉండగా నాలుగు సత్యాలు (వీటినే బౌద్ధంలో 4 నోబెల్ ట్రూత్స్ అంటారు) చెప్తూ భవ బంధ విముక్తుడయ్యాడు. ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. *(ప్రేమ ఒక కళ)*

# ఆశావాదం-నిరాశావాదం

ఒకే సంఘటనని ఒక్కో వ్యక్తి ఒక్కో రకంగా చూస్తాడు. సగం నీరున్న పాత్రని చూసి 'గ్లాస్ లో సగం వరకూ నీరుంది' అంటాడు ఆశావాది. 'గ్లాస్ సగం ఖాళీగా ఉంది' అంటాడు నిరాశావాది. గ్లాస్‌లో నీరు తీసుకు వెళ్ళి దాహంతో ఉన్నవాడికి ఇస్తాడు మానవతావాది. ఇలా విశ్వజనీయమైన ప్రేమ, ఆశావాదం మొదలైనవన్నీ మనిషి ఆలోచించే స్థాయి మీద అధారపడి ఉంటాయి. దానికి సంబంధించిన కథ ఇది.

ఈ కథలో ఆశావతి భర్త నిరాశుడు.

నిస్పృహ అనే స్త్రీ భర్త పాజిటివుడు.

ఒక నూతన సంవత్సరపు మొదటి రోజున భార్యలిద్దరు ఒక వైపున, భర్తలు దూరంగా మరో వైపునా మాట్లాడుకుంటున్నారు.

ఆశావతి: (స్నేహితురాలితో) నిన్న రాత్రి కొత్త సంవత్సరం ఎలా ప్రారంభమైంది?

నిస్పృహ: దరిద్రంగా జరిగింది. మా ఆయన ఇంటికొచ్చి మూణ్ణిముషాల్లో భోజనం ముగించి, రెండు నిమిషాల్లో అటు తిరిగి, నిముషంలో గుర్రుపెట్టి పడుకున్నాడు.

అదే ప్రశ్నకి ఆమె భర్త పాజిటివుడు: అద్భుతం. ఇంటికొచ్చేసరికి బ్రహ్మాండమైన భోజనం బల్ల మీద రెడీగా ఉంది. పాపం మా ఆవిడ అలసిపోయినట్టుంది. తనని డిస్టర్బ్ చేయకుండా వేడి చేసుకుని తిని రెండు నిమిషాల్లో గాఢంగా నిద్రపోయాను. నీది?

నిరాశుడు: హ్హారిబుల్..! ఇంటికెళ్ళేసరికి వంట లేదు. కారణం... కరెంటు లేదు. మా ఆవిడ కరెంటు బిల్లు కట్టటం మర్చిపోయిందనుకుని తల వాచేటట్టూ తిట్టాను. నేనే మర్చిపోయానని గుర్తొచ్చింది. చచ్చినట్టూ డిన్నర్‌కి తీసుకెళ్లాను. తిరిగొచ్చేటప్పుడు ఆటోకి కూడా డబ్బులు లేవు. అర్ధరాత్రి ఈసురోమంటూ నడిచి వచ్చాం. ఇల్లంతా చీకటి. కొవొత్తులు వెలిగించి పడుకున్నాం.

అదే ప్రశ్న అతడి భార్యని ఆమె స్నేహితురాలు అడిగింది.

ఆశావతి: అద్భుతంగా..! ఇంటికి రాగానే ఏమాత్రం ఆలస్యం చేయకుండా మా ఆయన నన్ను బయటకి తీసుకెళ్లాడు. రాత్రి పన్నెండింటికి రొమాంటిక్ డిన్నర్. ఆ తరువాత గంటసేపు వెన్నెల్లో తడుస్తూ నడుస్తూ ఇంటికొచ్చాం. మా ఆయన రెండు కొవ్వొత్తులు వెలిగించాడు. ఆ తరువాత ఇక అడక్కు...

*(ప్రేమ ఒక కళ)*

# మూర్ఖత్వానికి పరాకాష్ఠ

భక్తి మనిషికి సంతోషం ఇస్తుంది. కానీ మూఢ భక్తి ఇతరులకి నవ్వు తెప్పిస్తుంది. ఇటీవల పేపర్‌లో, చదువు బాగా రావాలని ఒక విద్యార్థి సరస్వతికి నాలుక అర్పితం చేసాడని పడింది. మూఢ భక్తికి ఇది పరాకాష్ఠ.

గట్టిగా అరుస్తూ శివుడిని ప్రార్థించేవాళ్ళు శివుడికి చెవుడు అనుకుంటారా? మూఢ భక్తికి ఇది మరో ఉదాహరణ.

టి.వి.లో ప్రవచనాలు చెప్పే స్వామీజీ ఒక రోజు "కుడిచేతిని తల చుట్టూ గుండ్రంగా తిప్పుకుంటూ 'హరి ఓం హరిహరా – హరి ఓం హరిహరా' అని రోజుకి వేయిసార్లు బిగ్గరగా ధ్యానిస్తే నీ దాంపత్యం చాలా బాగుంటుంది. ఈ విషయాన్ని సమ్రక్షిత్ మహారాజుకి ప్రచ్యోతనుడు చెప్పినట్టు వ్యాసుడు వ్రాశాడు" అని చెప్పుకు పోతున్నాడు.

ఈ ప్రచ్యోతనుడెవరో సమ్రక్షిత్ ఎవరో ఎవరికీ తెలీదు.

ప్రవచనాలు చెప్పేవారు ఉచ్ఛరించే పేర్లు అలాగే ఉంటాయి.

సుబ్బిరామమ్మకి మాత్రం ఈ విషయం మనసుకు బాగా హత్తుకు పోయి, తన దాంపత్యం బాగోటం కోసం, మరుసటి రోజు నుంచీ ఆచరించటం ప్రారంభించింది.

ఆమె భర్త సుబ్బారెడ్డికి ఆరింటికి కాఫీ అలవాటు. పొద్దున్నే అయిదింటికి శివ భజన మొదలు పెట్టి, ఏడింటి వరకూ అందరికీ నిద్రాభంగం చేస్తూ పూజగది లోంచి గట్టిగా అరుస్తున్న భార్యని ఎలా మార్చుకోవాలో అతడికి అర్థం కాలేదు. దానికి తోడు, కాఫీ కోసం కాలే కడుపు, కావుకావుమని అరవటం కాళింది పడగపై కృష్ణ పద ఘట్టనంలా తయారైంది.

బాధలన్నీ స్నేహితుడికి చెప్పుకున్నాడు. 'ఈ విషయం నేను చూస్తాలే' అని స్నేహితుడు హామీ ఇచ్చి, మరుసటి రోజు పొద్దున్న సుబ్బారెడ్డి ఇంటికి వచ్చాడు.

లోపలి నుంచి 'హరి ఓం హరిహరా... హరి ఓం హరిహరా' అని వినబడుతోంది.

గేటు బయట నిలబడి "సుబ్బిరామమ్మగారూ" అని బిగ్గరగా పిలిచాడు.

పేరు వినబడినా ఆమె స్తోత్రం ఆపలేదు. లోపల నుంచి గట్టిగా 'హరి ఓం హరిహరా' అని అరవసాగింది.

స్నేహితుడు కూడా స్వరం హెచ్చించి "సుబ్బిరామమ్మగారూ" అని వీధంతా వినబడేలా అరిచాడు.

లోపల మరింత గట్టిగా 'హరి ఓం హరిహరా... హరి ఓం హరిహరా' అని వినిపించసాగింది.

ఈసారి అతడు ప్రహారి గోడ గేటు మీద కాలు పెట్టి పైకెక్కి “సుబ్బమ్మగారూ... సుబ్బిరామమ్మగారూ” అని అరవసాగాడు.

ఇట్నుంచి ఇతడూ, అట్నుంచి ఆవిడా ఆ విధంగా అరుచుకుంటూంటే చుట్టు పక్కల వాళ్ళందరూ పోగయ్యారు.

అరగంట సేపు ఇలా అరుపుల ప్రహసనం అయ్యాక, ఆమె భరించలేక విసురుగా బయటకు వచ్చి “మీకేమైనా మతి పోయిందా? నేను పూజ చేసుకుంటున్నాను. కనబడటం లేదూ” అని కోపంగా అరిచింది.

అప్పుడా స్నేహితుడు వినమ్రంగా, “నేను కాసిన్ని సార్లు అరిస్తేనే మీకు ఇంత కోపం వచ్చిందే! దాదాపు రెండు నెలల నుండీ మీరు అరుస్తున్నారు. ఆ శివుడికి ఎంత కోపం రావాలి?” అన్నాడు.




*(ప్రేమ ఒక కళ)*

# అపార్థం

కొంతమంది చిన్న చిన్న విషయాలకే చాలా ఇరిటేట్ అవుతూ, అవతలి వారు చెప్పేది వినకుండా అపార్థం చేసుకుంటారు. ఈ రకమైన 'అపార్థం' గురించి కృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదలో ఒక కథ వ్రాశాడు.

ఒక ఆటవికుడు విందుకు వెళ్ళాడట. ఆ ఇంటి యజమాని పాల అన్నం పెట్టాడు. కానీ ఇంటి లోపల కుండలో ఏదో ఉడుకుతున్నట్టు శబ్దం వస్తోంది. వెదురు సందుల గుండా ఎర్రటి పొంగు కుండ పైకి కనబడుతోంది. తాము మోసగింప బడటాన్ని గిరిజనులు అసలు సహించలేరు. 'నాకు పెట్టకుండా, నేను వెళ్ళిపోయాక మాంసం కూర ఒక్కడూ తింటాడన్న మాట' అని, అతడిని చంపేద్దామనుకున్నాడు విందుకు వచ్చినవాడు. భోజనం అయ్యాక బయటకి ఇద్దరూ వచ్చారు.

ఇంటికొచ్చిన అతిథి, 'ఇక చాలు. వెనక్కి వెళ్ళు' అని అనే వరకూ సాగనంపడం ఆటవికుల ఆచారం. అలా ఇద్దరూ కలిసి అడవిలో నడుస్తున్నారు.




'కొంత దూరం తీసుకెళ్ళి చంపేద్దాం' అని అతిథి నిర్ణయించు కున్నాడు. ఆ కారణం వల్లనే, ఎంత దూరం నడిచినా '...సరే నువ్విక వెనక్కు వెళ్ళు' అనటం లేదు.

కొంచెం సేపయ్యాక ఆతిథ్యం ఇచ్చినవాడు "అన్నా... నన్ను వెనక్కు పంపు. పొయ్యి మీద నార చెడిపోతుంది" అన్నాడు. అతిథి స్థాణువయ్యాడు. వింటికి కట్టే తాడుని ముందు ఉడక పెడతారు. అప్పటివరకూ వచ్చిన శబ్దం అది. దాన్ని మాంసం కూరగా అపార్థం చేసుకున్న అతిథి తన తప్పు తెలుసుకున్నాడు.

అల్పులు అల్పముగానే ఆలోచిస్తారనీ, నిజానిజాలు తెలుసుకోకుండా ఉద్రేక పడతారని కవి ఉద్దేశ్యం.

ఈ పద్యంలో అత్యంత విశిష్టమైన విషయం ఏమిటంటే, ఇంత పెద్ద కథని కృష్ణదేవరాయలు "విల్లుందానును భిల్లుడొక్కడరుగున్..." అని కేవలం నాలుగు పాదాల్లో వ్రాశాడు.

*(ప్రేమ ఒక కళ)*

# దేవుడికే ఇంపాజిబుల్

ఒక హరికథలో విన్న కథ: ఒక భక్తుడికి బ్రహ్మ ప్రత్యక్షమై, "ఎంతోకాలంగా పూజ చేస్తున్నావు. మెచ్చాను. ఏదైనా కోరిక కోరుకో..." అన్నాడట.

భక్తుడు చేతులు జోడించి, "నాకు కొంతకాలం ఇంద్రసభలో కూర్చుని రంభా ఊర్వశుల నాట్యం, ఆపైన మరి కొంతకాలం కైలాస పర్వతంపై శివుడి నాట్యం చూసేలా ఏర్పాటు చెయ్యి. అంతేకాదు. విష్ణువుతో కొంచెం సేపు సంభాషించాలి. లక్ష్మీదేవితో నిరంతరం సేవ చేయించుకో గలిగే నేర్పరితనం ఎలా వచ్చిందో తెలుసుకోవాలి. అదే విధంగా కొంచెం అమృతం తాగే అవకాశం కూడా కలిగించు దేవా" అని వేడుకొన్నాడు.

భగవంతుడు కంగారు పడి "నీ కోరికలు మరీ అవధులు దాటి ఉన్నాయి. కైలాస పర్వతం, మనిషికి అమృతం, విష్ణువుతో సంభాషణ నా పరిధికి మించినవి. నేను కూడా మరొకరికి జవాబుదారీ కదా. ఇంకేదన్నా కోరుకో" అన్నాడు.

మనిషి దీర్ఘంగా ఆలోచించి "నీ దగ్గర దాచేదేముంది స్వామీ? నేను రోజంతా భగవత్ప్రార్థనలో నిమగ్నమైనది ఇంట్లో బాధ భరించలేకే. నా భార్య తన ప్రపంచంలో తానుంటుంది. తనకి ఏమి కావాలో, ఎందుకు నిరంతరం నాతో గొడవ పడుతూ ఉంటుందో, ఎందుకు తిడుతుందో, ఎందుకు ఏడుస్తుందో తెలుసుకునే శక్తిని ఇవ్వు" అని ప్రార్థించాడు.

బ్రహ్మ కొంచెం సేపు నిశ్శబ్దంగా ఉండి సాలోచనగా అన్నాడు: "మొదటి కోరిక ఏమని అడిగావు? స్వర్గం, అమృతం, కైలాసం... ..." *(ప్రేమ ఒక కళ)*



# బుద్ధుడు-సంసారం

కొత్త కాపురాన్ని చూడటానికి వచ్చిన తండ్రిని బీచ్ కి తీసుకెళ్ళాడు కొడుకు. అతడి భార్య కూడా వారితో వచ్చింది. ముగ్గురూ ఇసుకలో కూర్చుని మాట్లాడుకుంటున్నారు. దూరంగా పిల్లలు తడి ఇసుకతో ఇళ్ళు కట్టుకుంటున్నారు. బీచ్ అంతా రష్‌గా ఉంది.

"ఎలా ఉంది కొత్త సంసారం?" అని అడిగాడు తండ్రి. కొడుకు మాట్లాడలేదు. కోడలు మొహమాటంగా నవ్వింది.



ఇంతలో దూరంగా పిల్లల మధ్య గొడవ మొదలయింది. అందులో ఒక కుర్రవాడు పక్కవాడి ఇసుక గూటి మీద కాలు వేయటంతో ఆ ఇల్లు నేలమట్టం అయింది. పిల్లల మధ్య పెద్ద గొడవ జరిగింది. అందరూ కలిసి వాణ్ణి కొట్టబోయారు. పెద్దలు వచ్చి వాళ్ళను విడిపించి సర్ది చెప్పారు.

తండ్రి అటువైపే చూస్తూ "...నిన్న రాత్రి చాలాసేపు మీరు ఏదో విషయంలో గొడవ పడుతున్నారు. అర్ధరాత్రి వరకూ మీ మాటలు నాకు వినిపిస్తూనే ఉన్నాయి" అన్నాడు.

"అబ్బే అదేం లేదు మామయ్యగారూ" అంది కోడలు.

ఆయన నవ్వేడు. "మీకన్నా పాతికేళ్ళు పెద్దవాణ్ణి. నా దగ్గర దాచవద్దు. ఏ విషయంలో జరిగింది గొడవ?"

అప్పుడు ఇద్దరూ ఓపెన్ అయ్యారు. మొదటగా ప్రారంభిస్తూ కొడుకు నిష్టూరంగా "నా కంప్యూటర్ ముట్టుకోవద్దని చెబుతూనే ఉంటాను. తనకి లాప్-టాప్ ఉన్నది కదా.

అనవసరంగా నా దాన్ని కెలుకుతూ ఉంటుంది. కష్టపడి తయారు చేసుకున్న ఫైలు మొన్న డిలీట్ అయిపోయింది" అన్నాడు.

కోడలు వెంటనే "షెల్ఫ్ లో ఎంతో నీట్ గా సర్దుకున్న నా బట్టలన్నీ మొన్న మీరు చిందర వందర చేయలేదా? అయినా మీ వాచీ నా పట్టుచీరల మధ్యన ఎందుకుంటుంది?" అంది కోపంగా.


"పట్టుచీరలు చిందరవందర చేయటం, కంప్యూటర్లో ఫైలు డిలిట్ చేయటం ఒకటేనా?" మరింత కోపంగా అన్నాడు కొడుకు.

ముసలాయన నవ్వాడు. "నిన్న కూడా మీరు మొదట్లో చిన్న స్వరంతోనే మాట్లాడుకుని, ఆవేశం పెరిగాక పక్క గదిలో నేనున్నానని కూడా మర్చిపోయి నాకు వినిపించేంత గట్టిగా మాట్లాడుకున్నారు."

ఇద్దరూ సిగ్గుతో తలవంచుకున్నారు.

ఈలోపు అప్పటి వరకూ ఆడుకుంటూన్న పిల్లలు అక్కడ నుండి వెళ్ళిపోయారు. పెద్దాయన అటే చూస్తూ "ఆ పిల్లలు కొట్టుకోవడం చూశారు కదా. మీకేమైనా అర్థం అయిందా?" అని అడిగాడు.

అర్థం కానట్టు చూశారు ఇద్దరూ.



"ఎలాగూ కూలిపోయే ఇసుక గూళ్ళ కోసం, పిల్లలందరూ కొట్టుకున్నారు. చీకటి పడేసరికి, గూళ్ళని అలాగే వదిలేసి వెళ్ళి పోయారు. మన జీవితాలు కూడా అంతే. కొంతకాలం బ్రతుకుతాం. ఆ పై అన్నీ వదిలేసి వెళ్ళిపోతాం. బ్రతికిన ఈ కొద్దికాలం 'ఎంత సంతోషంగా ఉండాలి? ఎలా సంతోషంగా ఉండాలి? ఇతరుల్ని ఎలా సంతోషంగా ఉంచాలి?' అని ఆలోచించాలి. అంతే తప్ప, డిలీటయిపోయిన ఫైళ్ళ కోసం, నలిగిపోయిన చీరల కోసం మనసు పొరలు నలగ కొట్టుకో కూడదు. మనసులోంచి ఆనందాన్ని డిలీట్ చెయ్యకూడదు."

(గౌతమ బుద్ధుడి యోగకార భూమి సూత్ర – 4 నుండి మూలం స్వీకరించబడింది. కథ కల్పితం.)

*(ప్రేమ ఒక కళ)*

# కష్టం ఒక రిలెటివ్ టర్మ్

ఆదిమధ్యమ్మకి మూడు నెలల్నుంచీ కంటి మీద కునుకు లేదు. దానికి రెండు కారణాలు. మొదటిది: వాళ్ళ కొడుకు అమెరికాలో ఉద్యోగం వచ్చి వెళ్ళిపోవడం..! రెండోది సుబ్రహ్మణ్యం మరణం..!



సుబ్రహ్మణ్యం మరణం ఆమెను నిర్వీర్యం చేసేసింది. మొగుడి కన్నా అతడినే బాగా చూసుకొనేది. రోజుకి పదహారు గంటలు అతడితోనే గడిపేది. ముద్దాడేది. అతడితో ఆమె అటాచ్మెంట్ గురించి చెప్పాలంటే ఈ పుస్తకం సరిపోదు. అలాంటి సుబ్రహ్మణ్యం ఆమెనీ, ఈ ప్రపంచాన్నీ వదిలేసి వెళ్ళిపోవడం, మూలిగే నక్క మీద తాటికాయ పడినట్టు అయింది.



కన్నకొడుకూ, పెంచిన కుక్కా నెల వ్యవధిలో దూరమవ్వడం ఆమె తట్టుకోలేకపోయింది.

భర్త పరంధామయ్య కాస్త నిబ్బరంగానే ఉన్నాడు కానీ ఆమె దుఃఖంతో భోజనం మానేసింది.

నెలరోజులు గడిచినా ఆమెలో మార్పు లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే ఆమె కూడా సుబ్రహ్మణ్యాన్ని చేరుకోవడం ఖాయమని భర్తకి అర్థమయింది. ఏమి చేయాలో తోచక తన మిత్రుడైన వైద్యుణ్ణి సంప్రదించాడు.

ఇంటికొచ్చి ఆమెని పరీక్షించిన వైద్యుడు ఆమెతో, "మీరు రెండు పూటలా బాగా తినాలి. మరింత ఆనందంగా ఉండాలి" అని చెప్పాడు.

"నేను బ్రతికినా చచ్చినా ఒకటే. కొడుకు పరాయి దేశం వెళ్ళిపోయాడు. నా సుబ్రహ్మణ్యం ఈ లోకమే వదిలేసాడు. ఇక నేను బ్రతికి ఏం లాభం?" అని బావురుమంటూ ఏడ్చింది.

"నేను మీ మానసిక స్థితి గురించి చెప్పడం లేదు. మీకు బొల్లి రాబోతోంది. సంవత్సర కాలంలో శరీరం అంతా తెల్లబడి, వికృతంగా తయారవబోతున్నారు"

భార్యాభర్తలిద్దరూ షాకయ్యారు. ఆమె వివర్ణమైన మొహంతో "ఎలా? ఇపుడెలా?" అని అడిగింది. వైద్యుడు అనునయిస్తున్నట్టు, "ప్రారంభ దశలోనే ఉంది కాబట్టి దీన్ని

తగ్గించవచ్చు. వేళ్ళ మధ్యలోంచి బొల్లి మొదలవుతుంది. దాన్ని అక్కడే త్రుంచేస్తే ఇక శరీరం అంతా పాకదు. చేతివేళ్ళ మధ్యలో రోజూ తులసీరసం రాసుకోండి. మచ్చ మొదలవనంత కాలం మీకేం పర్లేదు. ఆర్నెల్ల పాటూ మిమ్మల్ని మీరు రక్షించుకోగలిగితే, ఇక ఆ వ్యాధి మిమ్మల్ని చేరదు. వేళ్ళ మధ్య శరీరం ఏమాత్రం తెల్లగా మారినా వెంటనే నా దగ్గరకు రండి" అని చెప్పి వెళ్ళిపోయాడు.

ఆ రోజు నుంచీ ఆమె అదే పనిలో ఉంది. రోజుకు పది పదిహేను సార్లు తులసి ఆకులు పిండి, రసం చేతుల మధ్య రాసుకోసాగింది. రెండు మూడు నెలలు గడిచాయి. బొల్లి రాలేదు. ఆమె చాలా ఆనందంగా ఫీలవసాగింది. గొప్ప విజయం సాధించిన సంతృప్తి ఆమె కళ్ళలో కనబడింది.

ఆర్నెల్ల తరువాత వైద్యుడు తన మిత్రుడిని "మీ కొడుకు గురించీ, కుక్క గురించీ నీ భార్య మర్చి పోయిందా?" అని అడిగాడు.

"మర్చిపోయింది. ప్రస్తుతం ఆమె ధ్యాసంతా చేతి వేళ్ళ మీదే ఉంది. అదృష్టవశాత్తూ బొల్లి రాలేదు "

"అసలామెకు ఆ వ్యాధి లేదు" అన్నాడు వైద్యుడు.

మానసిక ప్రశాంతత లభించటానికి ఏమి చేయాలో అది చెయ్యక, అల్పమైన విషయాల గురించి ఆలోచిస్తూ, మనం మనసు పాడు చేసుకుంటాం. ప్రతి చిన్న విషయానికీ ఏడవటం ఎలా తగ్గించుకోవచ్చో 'ది 3 వెహికిల్స్ ఆఫ్ బుద్ధిజం' అనే పుస్తకంలో ఒక సూత్రం ఉన్నది. అది పాటిస్తే, చాలా ఏడుపులు తగ్గిపోతాయి.



*(ప్రేమ ఒక కళ)*

# వ్యసనానికి దూరం అవడం ఎలా?

ఒక వ్యక్తి పాంక్రియాటైటిస్‌తో ఆస్పత్రిలో చేరాడు. తాగే రోజులూ, తాగకుండా ఉంటే బ్రతికే రోజులూ... విలోమ నిష్పత్తిలో ఉంటాయన్నారు డాక్టర్లు.

రీహాబిలిటేషన్ సెంటర్లో చేర్చినా ఫలితం కనపడలేదు. తాగుతూనే ఉన్నాడు.

కౌన్సిలర్సూ, సైకాలజిస్టులు చేతులు ఎత్తేసారు. ఆఖరి ప్రయత్నంగా భార్య ఒక పకీర్ దగ్గరకు తీసుకువెళ్ళింది.

“ఇంట్లో ప్రతిరోజూ నువ్వు డ్రింక్ తాగే టేబిల్ దగ్గిరే కూర్చుని, వంట చేస్తున్న మీ భార్యనీ, సంతోషంగా చదువుకుంటున్న పిల్లల్నీ గమనించు” అన్నాడు ఆ పకీరు.

దంపతులు ఇద్దరూ వింటున్నారు.

“నీవు లేకుండా, బట్టల షాపులో సేల్స్ గర్ల్స్ గానో, ‘స్పా’ సెంటర్ లో కాలి గోళ్ళు తీసే ఉద్యోగంలోనో నీ కూతుళ్ళని వూహించుకో. వారి పెళ్ళికి నానా యాతనా పడే నీ భార్యని తల్చుకో” అని సలహా ఇచ్చాడు.

నెల రోజుల తరువాత దంపతులు తిరిగి వచ్చారు. భార్య పకీరుకి నమస్కరిస్తూ “ఆయన పూర్తిగా డ్రింకు మానేసారు” అన్నది. *(లోయ నుంచి శిఖరానికి)*



# నిర్వాణ

చిన్నచిన్న కథలు మన ఆలోచనా విధానం మీద ఎలాంటి ముద్ర వేస్తాయో చెప్పే ఇంత మంచి కథ నేను ఇంతకు ముందు చదవలేదు.

అయిదేళ్ళ వయసులో ఒక కుర్రవాడు హిమాలయ పర్వత శిఖరాగ్రాల మీద ఉండే బౌద్ధారామాలకి జ్ఞాన పాఠశాలకి పంపబడ్డాడు. బయట ప్రపంచంతో సంబంధం లేకుండా సంవత్సరాల తరబడి సిద్ధాంత సార మూల జ్ఞానాన్ని సముపార్జించుకున్న తరువాత, ఆ జ్ఞానాన్ని ప్రజలకు పంచమన్న గురువు ఆదేశంతో, ఆ భిక్షువు పర్వతశ్రేణులు దిగి నాగరిక ప్రపంచంలో మొట్ట మొదటిసారి అడుగుపెట్టాడు.

అప్పటి వరకూ ఆశ్రమం దాటి బయటకురాని ఆ పద్దెనిమిదేళ్ళ యువకుడికి నాగరిక ప్రపంచమంతా కొత్తగా ఉంది. బౌద్ధ సాధువులకు సాంప్రదాయకమైన భిక్షాటన ఆశ్రయించి, ఒక ఇంటి ముందు నిలబడి మధుకరము అర్థించాడు.

ఇంటి యజమాని భిక్షువు కాళ్ళు కడిగి సగౌరవంగా లోనికి ఆహ్వానించి, బియ్యం వేయమని కూతుర్ని ఆదేశించాడు. ఒక పదహారేళ్ళమ్మాయి ఏడు రోజులకి సరిపడా బియ్యాన్ని తీసుకొచ్చి అతడి జోలెలో నింపింది. ఆమెని చూసి యువకుడు చకితుడయ్యాడు.

అప్పటి వరకూ పురుషులనే తప్ప 'స్త్రీ'ని చూడలేదతడు. ఆమె గుండెల కేసి చూపించి తామిద్దరి మధ్య ఉన్న తేడా గురించి గృహస్థుని ప్రశ్నించాడు. ఆ ప్రశ్నకి అమ్మాయి తండ్రికి కోపం రాలేదు. ఎదుట ఉన్నది మనుష్యుల మధ్యకి తొలిసారి వచ్చిన సన్యాసి అని తెలుసు.

స్త్రీ పురుషుల తేడా గురించి చెపుతూ, 'తల్లి అయిన తరువాత క్షీరమునిచ్చి పిల్లల్ని పోషించవలసిన బాధ్యత స్త్రీకి ఉన్నది కాబట్టి, ప్రకృతి ఆమెకు ఆ విధమైన అవయవాలను సమకూర్చింది' అని వివరణ ఇచ్చాడు. సుదీర్ఘమైన ఆలోచనలో పడిన యువకుడు, ఆ రోజుకు సరిపడా బియ్యం మాత్రం ఉంచుకొని, మిగతా దినుసులు వెనక్కి ఇచ్చి తిరిగి తన గురువు దగ్గరకు చేరుకున్నాడు. అలా ఎందుకు చేశావని అడిగాడు గురువు.

"తర్వాతెప్పుడో ప్రపంచంలోకి అడుగిడబోయే బిడ్డ కోసం తగు ఏర్పాట్లన్నీ ప్రకృతి పదేళ్ళ ముందే సమకూర్చినప్పుడు, రేపటి ఆహారం గురించి ఈ రోజు తాపత్రయపడటం ఎంత నిష్ప్రయోజనమో అర్థమయింది స్వామీ..!" అన్నాడా భిక్షువు.

శిష్యుణ్ణి కౌగిలించుకొని "నీకు బౌద్ధం గురించీ, బంధం గురించీ సంపూర్ణమయిన జ్ఞానం లభించింది నాయనా" అంటూ అభినందించాడు ఆచార్యుడు.

*(ప్రేమ ఒక కళ)*

# కోపం జ్వరానికి మందు టాబ్లెట్

అతడు ఒక తెలివైన యంగ్ ఎగ్జిక్యూటివ్. వయసు పాతిక. జీతం 75 వేలు. ఏ దురలవాట్లూ లేవు. అందంగా, అంతకన్నా మించి హుందాగా ఉంటాడు. అతడు పెళ్ళికి ప్రపోజ్ చేస్తే 'నో' చెప్పే అభ్యంతరాలు సాధారణంగా ఏ అమ్మాయికీ ఉండవు.!

అతడు తన వితంతు తల్లితో కలిసి జీవిస్తున్నాడు. వాళ్ళిద్దరూ తల్లీ కొడుకుల్లా ఉండరు. స్నేహితుల్లా ఉంటారు. అటువంటిది అతడు క్రమంగా మారిపోయాడు. వారం రోజుల్లో విపరీతమయిన మార్పు వచ్చింది. తిండి తగ్గిపోయింది. చిరాకు ఎక్కువైంది. ప్లేటు తోసేస్తున్నాడు. తల్లిపై విసుక్కుంటున్నాడు. 'అతడిని అంతగా కలవరపరిచే విషయం ఏమై ఉంటుందా' అని తల్లి అతడి స్నేహితుల దగ్గర ఎంక్వయిరీ చేసింది. అప్పుడొక సంగతి బయటపడింది. వాళ్ల ఆఫీసులో త్వరలో జరగబోయే రిట్రెంచ్మెంట్ గురించి తోటి ఉద్యోగస్తుడు చెప్పాడు. నష్టాల దృష్ట్యా ఆఫీసులో స్టాఫ్ తగ్గించి వేస్తున్నారు. అందులో రాకేష్ కూడా ఉండొచ్చు.

విషయం ఇలా నాన్చితే లాభంలేదని ఆమె ఒకరోజు అతడిని మందలించింది. మాట మీద మాట పెరిగింది. వారి వాదనలు తారాస్థాయికి చేరుకున్నాయి. "...ఉంటుందో లేదో తెలియని ఉద్యోగం కోసం నిద్రా, భోజనం మానేయటం మంచిది కాదు బాబూ. ఉద్యోగం పోయినా పర్వాలేదులే..." అంటూ ఓదార్చడానికి ప్రయత్నించింది.

కొడుకు నిర్ఘాంత పోయాడు. అంత కోపంలోనూ నవ్వొచ్చింది. ఎందుకంటే, ఈ మాత్రం ఉద్యోగం తనకి ఎక్కడైనా దొరుకుతుందని అతడికి తెలుసు.

"నా దిగులుకి కారణం నా ఉద్యోగం అని నీకెవరు చెప్పారు?" అని అడిగాడు. ఈసారి విస్మయం చెందటం తల్లి వంతయింది. అసలు కారణం అతడు చెప్పటం ప్రారంభించాడు. అతని చిరాకుకి కారణం అదికాదు.

అతడు పనిచేసే ఆఫీసు ఎదురు బిల్డింగ్‌లో స్వప్న అనే మందగమన స్టెనోగ్రాఫర్‌గా పనిచేస్తోంది. ఆమె తనకి అన్ని విధాలా సరిపోతుందనుకొన్నాడు. పెళ్ళికి ముందు సినిమాలూ, పార్కులూ లాంటి డేటింగ్ విధానాన్ని అతను నమ్మడు. ఆ విషయం ఆమెతో మాట్లాడటం కోసం, మర్యాదపూర్వకంగా లంచ్‌కి ఆహ్వానించి అక్కడ తన ఇష్టం గురించి చెప్పాలనుకున్నాడు.

ఆమెకు ఫోన్ చేసి "మీరు నాతో లంచ్ కి వస్తారా?" అని అతడు అడుగుతుండగానే ఆమె కఠినమైన స్వరంతో "తరువాత మాట్లాడతాను" అంటూ ఫోన్ 'టప్'మని పెట్టేసింది. ఆ తరువాత మళ్ళీ ఫోన్ చేయలేదు.

అదీ సంగతి.

అంతా విన్న అతడి తల్లి నమ్మలేనట్లు 'ఇంత బలహీనమయిన మనసా నీది' అన్నట్టుగా అతడి వైపు చూసి, "ప్రేమించిన అమ్మాయి  కాదంటే భోజనం మానేసి ఏడుస్తావా?" అని అడిగింది.

"నేనామెను ప్రేమించలేదు. పెళ్ళి జరుగుతుందో లేదో తెలియకుండా ప్రేమించేసేటంత బలహీనత నాలో లేదు. ఆమె కూడా ఇష్టపడితే, నా ఇష్టాన్ని ప్రేమగా మార్చుకుందామనుకున్నానంతే."

"మరెందుకు బాధ?"

"నా అహం బాగా దెబ్బతిన్నదమ్మా! ఆమెని మర్యాదగా మధ్యాహ్నం లంచ్‌కి పిల్చానే తప్ప రాత్రి 'పబ్'కి కాదు! కనీసం డిన్నర్‌కి కూడా కాదు. ఇష్టం లేకపోతే చెప్పొచ్చు కదా. మొహం మీద కొట్టినట్టు అంత విసురుగా ఫోన్ పెట్టెయ్యటం ఎందుకు?" సున్నితమైన చోట దెబ్బ తగిలినట్టు అన్నాడు. అదీ కథ.

మనసుకి దెబ్బ తగిలింది. నిజమే. కానీ దాన్ని తల్లి మీద కోపంగా చూపించటం ఎందుకు? దీన్నే ఫీవర్ అంటారు. ఫీవర్ అంటే జ్వరం. అందరూ అనుకొనే జ్వరం కాదు. F అంటే ఫ్యాక్ట్ (నిజం), E–ఎమోషన్ (భావోద్రేకం), V–వెంటిలేషన్ (బహిర్గతం), E – ఎఫెక్ట్, R– రిజల్ట్ (ఫలితం).

'మూలం' అమ్మాయి తిరస్కారం. వాస్తవం (F) ఒకటే. ఎమోషన్ (E) వేరు. వాస్తవపు ప్రభావాన్ని ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా బహిర్గత పరుస్తారు. కొందరు కోపంతో అరుస్తారు. కొందరు ఏడుస్తారు. మరికొందరు తమ చీకటి గుహల్లోకి నిశ్శబ్దంగా వెళ్ళిపోతారు. దాన్నే వెంటిలేషన్ (V) అంటారు. రాకేష్‌కి ఆ విధంగానే జరిగింది. దాని ఎఫెక్ట్ (E) తల్లితో గొడవ. భావోద్వేగాలు కంట్రోలులో పెట్టుకోకపోతే రిలేషన్స్ దెబ్బ తింటాయి (R).

మరి దీనికి పరిష్కారం? 'టాబ్లెట్'. ఫీవర్ని తగ్గించే టాబ్లెట్ కాదు. దీని అర్థం వేరే. T అంటే టేబిలింగ్ (అమర్చు), A– ఆక్సెస్ (విశ్లేషించు), B– బ్రౌజ్ (వెతుకు), L– లొకేట్ (పట్టుకో ), E– ఎన్కౌంటర్ (ఎదుర్కో), T– టెర్మినేట్ (శాశ్వతంగా నాశనం చెయ్యి).

బుద్ధుడు చెప్పే యోగము కూడా ఇదే..! రోగము–కారణము–ఔషధము–నాశనము..! మన భావోద్రేకాలకీ, దుఃఖానికీ, కోపానికీ, అసహనానికీ, మూడ్ బావోలేక పోవటానికీ, కారణం వేరే ఎక్కడో ఉండవచ్చు. ముందు దాని మూలాన్ని వెతికి పట్టుకోవాలి.

దాని కోసం తన సమస్యలన్నిటినీ టేబిల్ పై పరచి చూడాలి. రాకేష్ బాధకి కారణం అతడి తల్లి అనుకొన్నట్టు ఉద్యోగ భయం కాదు. ప్రేమ విఫలం. కారణం అమ్మాయే! సందేహం లేదు. కానీ ఆమె చేసిన తప్పు అతని ప్రేమ తిరస్కరించటం కాదు. అమర్యాదగా ఫోన్ పెట్టెయ్యటం! అతడి అహం అక్కడ దెబ్బతిన్నది. అతడెంతో కుమిలి పోయాడు. అయితే విషయం తెలియకుండా నిద్రలేని రాత్రులు ఎన్ని గడిపినా ఏం లాభం? సమస్య అలాగే ఉంటుంది. బాధ మిగిలిపోతుంది. దానికన్నా అటో ఇటో తేల్చేసుకోవటమే మంచిది కదా!

అతడికి అంత కోపం రావటానికిగల పరిస్థితులన్నిటినీ సమీకరించి చూడాలి (Table). చాలామంది సమస్యని తేల్చరు. పరిష్కారం అంటే భయం! సమస్యకి దూరంగా నిలబడి బాధ పడుతూనే ఉంటారు. దీన్నే 'ఫియర్ ఆఫ్ ఫెయిల్యూర్ ' అంటారు. అంతంత పెద్ద మాటలు తల్లికి తెలిసి ఉండకపోవచ్చు, కానీ విషయం ఏమిటో కనుక్కోమని కొడుకుని వత్తిడి చేసింది (Access).

అతడా అమ్మాయి ఆఫీసుకి వెళ్ళాడు. "నాతో లంచ్ కి రావటం ఇష్టం లేకపోయినా, ఇప్పటికే వివాహం నిశ్చయమైపోయినా, ఆ విషయం మామూలుగానే చెప్పొచ్చుకదా ! నేనొక విలన్ని అయినట్టు అలా మొహంమీద విసురుగా ఫోన్ పెట్టెయ్యటం దేనికి?" అని అడగాలని అతడి ఉద్దేశం. అయితే ఆ అమ్మాయి ఆఫీసులో లేదు. పది రోజులు సెలవు పెట్టింది. బహుశా పెళ్ళి కోసం అయిఉంటుంది అనుకున్నాడు. ఇంటి దగ్గర వివరాలు కనుక్కుంటే (Browse) ఆమె హాస్పిటల్లో ఉందని తెలిసింది.

ఆలస్యం చేసే కొద్దీ దిగులే మిగుల్తుందనీ, నిరంతరం దుఃఖంకన్నా, ఆ దుఃఖ కారణాన్ని నిర్మూలించటం మంచిదనీ, "వెంటనే వెళ్ళి ఆ అమ్మాయితో మాట్లాడదాం" అనీ అతని తల్లి ప్రోత్సహించింది (Locate). వాళ్ళు హాస్పిటల్ కి వెళ్ళారు (Encounter).

అతడిని చూడగానే ఆమె మొహం విప్పారింది. అతను ఫోన్ చేసినప్పుడే, అతని మనసులో ఆలోచన ఆమెకి తెలిసి ఆనందానికి అవధులు లేవు. ఈలోపు బాస్ ఇంటర్‌కమ్ లో పిలవడం వల్ల కంగారు పడి "తర్వాత మాట్లాడతాను" అని ఫోన్ పెట్టేసింది. ఆమె గొంతులో ఆ రోజు కనపడిన తొందరని అతడు కోపం (తిరస్కారం)గా అపార్థం చేసుకున్నాడు. ఫోన్ పెట్టేసిన అమ్మాయి పక్షిలా ఆకాశంలో ఎగురుతూ క్రిందమెట్లు చూసుకోలేదు. జారి పడడంతో కాలు విరిగి ఆస్పత్రిలో జాయిన్ అయింది. తల్లీకొడుకులు వెతుక్కుంటూ వెళ్ళినందుకు సినిమా లెవెల్లో కథ సుఖాంతమయింది (Terminate).

*(లోయ నుంచి శిఖరానికి)*

# నల్ల కళ్ళద్దాలు

అవతలి వారినందరినీ మన దృక్పథంలోనే చూస్తూ పోతే మనకి ఎవరూ నచ్చరు. నల్లకళ్ళద్దాలు తీసేయక పోతే చుట్టూ జరుగుతూన్న సంఘటనలు మనని చాలా అసంతృప్తి కి గురి చేస్తాయి. దానికి నిదర్శనంగా ఈ ఉదాహరణ చదవండి.

కేవలం ఇద్దరు ప్రయాణికులు మాత్రమే విశ్రమించటానికి విశాలంగా ఉన్న ఆ మొదటి తరగతి కూపేలోకి అడుగుపెట్టే సరికి కడుపులో తిప్పినట్టయింది. లోపలంతా నాటు సారాయి వాసన.

కిటికీ దగ్గర కూర్చుని ఒక వ్యక్తి కాగితం పొట్లంలో ఇడ్లీ తింటున్నాడు. తైల సంస్కారం లేని జుట్టు, మాసిన గెడ్డం. చిరిగి పోవటానికి సిద్ధంగా ఉన్న బట్టలు. అతన్ని చూడగానే నాకు కలిగిన మొట్టమొదటి అభిప్రాయం– ఇతను 'ఇక్కడ' ఎలా ఉన్నాడు? అని.

రైలు కదలటానికి సిద్ధంగా ఉన్నది. అతడు పెట్టెలోనే తాగుతూ ఉండి ఉండాలి. లేకపోతే ఇంత వాసన రాదు.

అతని పక్కన కోర్చోవటం ఇష్టంలేక, పై బెర్తు మీదకు చేరుకున్నాను. అక్కడ లైటు వేసుకుని, మరుసటి రోజు ఇవ్వవలసిన ఉపన్యాసాన్ని చూసుకుంటూ క్రమంగా నిద్రలోకి జారుకున్నాను.

అర్ధరాత్రి ఎవరో బయట నుంచి టకటకా కొడుతూండటంతో మెలకువ వచ్చింది. తలుపు తీస్తే బయట అటెండరు! అతడు చెప్పిన విషయం విని విసుగు మరింత ఎక్కువైంది. కాలింగ్ బెల్ కీ, దీపం స్విచ్ కీ తేడా తెలియని నా తోటి ప్రయాణికుడు చేసిన నిర్వాకం వలన బెల్లు మోగి అటెండరు వచ్చాడు. క్షమాపణ చెప్పి అతడిని పంపించి వేశాను.

నీటి కోసం లైటు వేయబోయి తాను మరో స్విచ్ నొక్కానని అతడు అనుకోవటం లేదు. అసలు అలాంటి కాలింగ్ బెల్ స్విచ్ అనేది ఒకటుంటుందని కూడా బహుశ అతడికి తెలిసి ఉండదు. అందుకే ఏ అపరాధభావనా లేకుండా, తిరిగి నేను నా బెర్తు ఎక్కే లోపులోనే మంచినీళ్ళు తాగి, కనీసం 'సారీ' కూడా చెప్పకుండా గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు.

మరో రెండు గంటలు గడిచాయి.

ఎవరో తడుతున్నట్టయి గాఢ నిద్రలోంచి మెలకువ వచ్చింది. తలుపు ఎలా తెరవాలో తెలియక నన్ను తట్టి లేపుతున్నాడు. నేను కళ్ళు విప్పగానే 'టాయిలెట్ కి వెళ్ళాల'న్నట్టు అభ్యర్థించాడు. తలుపు హుక్కు ఎలా తీయాలో, పక్కమీద నుంచి లేవకుండానే చెప్పాను.

నా కంఠంలో విసుగు నాకే స్పష్టంగా వినపడింది.

అమితమైన తాగుడు వలన చేతులు పైకెత్తటానికి భుజాలు సహకరించక అతడు కష్టపడసాగాడు. రైలు వేగంగా కదుల్తూ ఉండటంతో కనీసం స్థిరంగా నిలబడ లేక పోతున్నాడు.

నాకిక తప్పలేదు. కిందికి దిగి తలుపు తీసి, అతడు టాయిలెట్‌కి వెళ్ళి వచ్చే వరకూ ఉండి తలుపు మళ్ళీ వేసి పక్క చేరాను.

అంతలో అతడి ఫోను మ్రోగింది. నా సహనానికి పరీక్ష పెడుతున్నట్టు అతడి కంఠం రాజకీయ ఉపన్యాసకుడి స్వరం కన్నా హెచ్చు స్థాయిలో ఉన్నది.

ఇంతకీ, అతడు మాట్లాడుతున్నది కొన్ని గంటల క్రితం తనకి వీడ్కోలు ఇవ్వటానికి వచ్చిన మనవడితో అని, ఆ సంభాషణ బట్టి అర్థమైంది.

'నిరాటంకంగా నిద్రపోవటం కోసం కొందరు ఖరీదయిన టికెట్లు కొనుక్కుంటారు. వారిని బాధించటం కోసం అర్ధరాత్రి వరకూ కబుర్లు చెప్పుకునేవారు పక్కన చేరుతారు. నా దురదృష్టం కొద్దీ ఈ రాత్రి ఈ ఉచిత పాసువాడి బారిన పడ్డాను' అని తిట్టుకుంటూంటే నిద్రపట్టలేదు. ఇక ఆలోచించ బుద్ధిగాక నా ఉపన్యాసం చదవసాగాను.

ఆ రోజు నా సబ్జెక్టు భావోద్వేగాల సానుకూల నియంత్రణ గురించి. అది చదువుతూంటే మనసులో చిరాకు కాస్త తగ్గినట్టు అనిపించింది. మరోవైపు తెల్లవారసాగింది.

మొహం కడుక్కుని వచ్చేసరికి మరింత ఫ్రెష్ గా అనిపించింది. లోపలికొస్తూంటే అతడు కొద్దిగా జరిగి వినమ్రంగా నమస్కరించాడు. నా మనసు కూడా ప్రశాంతంగా ఉండటంతో అతడితో సంభాషణ ప్రారంభించాను.

మేమిద్దరం గమ్యం చేరటానికి మరో గంట సమయం ఉంది.

మాటల సందర్భంలో అతడు మరణానికి చాలా దగ్గరలో వున్నాడని తెలిసి నిశ్చేష్టుడనయ్యాను. మహా అయితే మరో కొన్ని నెలలు మాత్రమే బ్రతుకుతానని అతడు చెపుతూంటే, వెన్ను మీద పాము పాకిన భావనతో ఒళ్ళు వణికింది.

అతడి ప్రవర్తన వెనుక ఒక్కొక్క కారణమే విశదమైంది.

నేను అనుకున్నట్టు అతడు రైల్వే ఉద్యోగి కాదు.

అతడికి ఇద్దరు కొడుకులు. పెద్దవాడు సిటీ హొటల్‌లో రిసెప్షనిస్ట్. చిన్నవాడు సౌదీలో కూలీ. సౌకర్యంగా ఉంటుందని తండ్రికి ఖరీదైన టికెట్టు పంపింది అతడే. పెద్ద కొడుకునీ, మనవడినీ చూసి తిరిగి గ్రామానికి వెళ్ళిపోతున్నాడు. తన మనవడిని కలవటం ఇదే ఆఖరిసారి అనీ, బహుశ ఇక చూడలేనేమోనని చెబుతున్నప్పుడు అతడి కంఠం గాద్గదికమైంది.

మనసు బోనులో నేరస్తుడిలా నిలబడ్డాను. పేగుల్లో కేన్సర్ వలన అతడికి శస్త్రచికిత్స జరిగింది. నేను అనుకున్న స్పిరిట్ వాసన ఆల్కహాల్ కాదు. మందుల వలన వచ్చింది.

కండరాల బలహీనత వలన అతను తలుపు గొళ్ళెం తీయటానికి భుజాలు పైకెత్త లేక పోయాడే తప్ప తాగుడు వలన కాదు.

రెండు మూడు గంటలకు ఒకసారి ఏదైనా మెత్తటి పదార్థం తినటం తప్పనిసరి అని డాక్టర్లు చెప్పటం వలన ఇడ్లీలు తెచ్చుకున్నాడు.

అప్పుడే నాకొక విషయం అర్థమైంది.

రాత్రి నా చిరాకుకి కారణం అతడి ప్రవర్తన కాదు. అతడిని తోటి ప్రయాణికుడిగా అంగీకరించలేని నా అహంభావం.

అదే స్థానంలో ఒక 'ఖరీదైన' వ్యక్తి ఉంటే, అతడి విస్కీ వాసనని నవ్వుతూ భరించేవాడిని.

తలుపు కొక్కెం అంత బలంగా పెట్టినందుకు రైల్వేవారిని తిడుతూ అతనికి సాయం చేసేవాడిని.

ఆ సమయంలో నాకొక పాత ఆఫ్రికన్ కథ గుర్తొచ్చింది.


అందరూ వేటకి వెళ్ళిపోయాక గుడిసె ముందు కూర్చుని మనవడితో తీరిగ్గా కబుర్లు చెపుతున్నాడు ముసలి నాయకుడు.

"నా మనసులో రెండు జంతువులు ఎప్పుడూ పోరాడుకుంటూ ఉంటాయిరా చిన్నా..! ఒకటి రక్కసి. దుర్మార్గురాలు. మరొకటి మంచిది. సాధుస్వభావురాలు. నిరంతరం వాటి మధ్య యుద్ధం జరుగుతూనే ఉంటుంది. భయంకరమైన యుద్ధం..."

మనవడు కుతూహలంగా "ఏది గెలుస్తుంది?" అని అడిగాడు.

దూరపు కొండల మీద నిశ్చలంగా ఉన్న చెట్లపై తన నిస్తేజమయిన చూపు నిలిపి అభావంగా చెప్పాడా వృద్ధుడు "నేను దేనికి తిండి పెడితే అది..!"

*(లోయ నుంచి శిఖరానికి)*



# బర్నింగ్ ది షిప్

తాము తప్పించుకొనే మార్గాలు మరింకేమీ లేవనీ, కేవలం విజయం ఒక్కటే తమ ప్రాణాలు రక్షిస్తుందనీ గుర్తించినప్పుడు, సైనికులు ప్రాణాలకి తెగించి పోరాడతారు. ఆ సూత్రం ఆధారంగా, ఒక తెలివైన సైనికాధికారి తాము వచ్చిన ఓడల్ని కాల్చేసి, తన సైనికుల మార్గాల్ని మూసేస్తాడు. శత్రుసైనికులు పారిపోయేందుకు వీలుగా మార్గాలు సృష్టించి, కృత్రిమమైన పిరికితనాన్ని వాళ్ళలో చొప్పిస్తాడు. బర్నింగ్ ద షిప్ అంటే అదే.

అప్పటివరకూ స్నేహంగా ఉన్న అబ్బాయిగానీ అమ్మాయిగానీ అకస్మాత్తుగా మాట్లాడటం మానేస్తే, ఫోన్లో ఆ నెంబర్ చూసినప్పుడల్లా దుఃఖం కలుగుతుంది. మరేం చెయ్యాలి? ఒక భగ్న ప్రేమికుడి స్నేహితురాలికి నిశ్చితార్థం జరిగిపోయింది. "ఆ అమ్మాయిని మర్చిపోవటం ఎలా?" అని కౌన్సిలింగ్‌కి వచ్చాడు. "ఆ అమ్మాయీ నువ్వూ ఎక్కడ కలుసుకుంటూ ఉంటారు?" అని అడిగాడు కౌన్సిలర్.

"కాలేజీలో ఉన్నన్నాళ్ళూ అక్కడ కలుసుకొనే వాళ్ళం. ఆమె చదువు పూర్తయింది. ఇప్పుడు ఆ అమ్మాయిని చూడ్డానికి కూడా వీలు పడటం లేదు. ఫోన్ చేస్తే సరిగ్గా మాట్లాడటంలేదు. నన్ను మర్చిపో అంటుంది."

"ఈ మధ్య ఆ అమ్మాయిని కలవలేదా?" అని అడిగాడు కౌన్సిలరు. "ఇల్లెక్కడో తెలియదు. కేవలం ఫోన్ నంబరు మాత్రమే తెలుసు. ఆ అమ్మాయిని మర్చిపోలేక పోతున్నాను. ఫోన్ చేసినప్పుడల్లా మరింత చిరాగ్గా మాట్లాడుతోంది. బ్లాక్‌మెయిల్ చేస్తున్నానేమో అనుకుంటోంది. నా సమస్యల్లా ఆమెను మర్చిపోలేక పోవటమే."

కౌన్సిలర్ కొద్దిసేపు ఆలోచించి "ఆమె ఫోన్ నంబరు నీ సెల్లోంచి తీసెయ్" అన్నాడు. ఆ అబ్బాయికి ఆయన చెపుతున్నది అర్థం కాలేదు. అప్పుడు కౌన్సిలర్ "ఆమె నంబరు చూసే కొద్దీ నీకామెతో మాట్లాడాలనిపిస్తుంది. ఆమె ఇల్లెక్కడో నీకు తెలియదు. కలుసుకొనే అవకాశాలు కూడా లేవు. ఫోన్ నంబరు కూడా తీసేసిన పక్షంలో నీ మనసు ఎంత వేధించినా ఆమెతో నువ్వు మాట్లాడలేవు. నీవు మాట్లాడే కొద్దీ ఆమెకు నీ మీద ద్వేషం ఎక్కువవుతోంది. మీ ఇద్దరికీ వివాహం ఎలాగూ జరగదని తెలిసినప్పుడు కనీసం ఆమెనైనా సంతోషంగా ఉంచడం నీ బాధ్యత. ఆఖరి ఈ ఒక్క లింకూ తెంపేస్తే, నీ మనసు క్రమేణా కుదుట పడుతుంది. వాస్తవాన్ని అర్థం చేసుకుంటుంది." అన్నాడు.

బర్నింగ్ ది షిప్ కి ఇది మరొక మంచి ఉదాహరణ.


*(లోయ నుంచి శిఖరానికి)*

# స్టాక్ ఎక్స్ఛేంజి

ఒక ఊర్లో ధనవంతుడికి చిత్రమైన వ్యాధి వచ్చింది. 'నెల రోజులపాటు మనిషి వెంట్రుకల మీద శయనిస్తే ఈ రోగం తగ్గుతుందని' హిమాలయ పర్వతాలలో ఉండే ఒక ఋషి చెప్పాడు. మనిషి జుట్టు కేజీకి ఐదు వేల రూపాయలు ఇస్తానని ఆయన చాటింపు వేయించగానే ఊర్లో అందరూ జుట్లు పెంచి, గుళ్ళు కొట్టించుకొని అతడికి అమ్మసాగారు. కొంతమంది పక్క ఊళ్ళవాళ్ళు కూడా వచ్చి జుట్టు ఇవ్వసాగారు.

పది రోజుల తరువాత జమీందారు గారి రోగం తగ్గు ముఖం పట్ట సాగింది. అయితే హిమాలయ పర్వతాల ఋషి చెప్పిన మరో షరతు ఏమిటంటే, వెంట్రుకలు పది రోజులకోసారి మార్చాలని..! అన్ని వెంట్రుకలు దొరకలేదు. దాంతో ఆయన ఐదు వేల నుంచి పది వేలకు ధర పెంచాడు. ఉత్సాహపడిన మనుషులు ఇంట్లో ఉన్న స్త్రీల జుట్టు కూడా కత్తిరించి ఆయనకు అమ్మారు. అయినా సరిపోలేదు. కేజీ ఇరవై వేలన్నా, ఒక్క శష్పం దొరకలేదు. దిక్కు తోచని ఆ జమీందారు మళ్ళీ హిమాలయ పర్వతాలకు బయలుదేరాడు.

ఈలోపులో ఆయన దగ్గర నమ్మకంగా పనిచేసే మేనేజరు తన దగ్గర ఉన్న పాత జుట్టుని ఊర్లో వాళ్ళకు లోపాయికారీగా (ఇది 'సెకండ్ హ్యాండ్ జుట్టు' అన్న విషయం జమీందారుకి తెలియకుండా ఉంచమని గ్రామస్తులకు సూచిస్తూ) కిలో పదిహేను వేలకి అమ్మేశాడు. జనం వేలంవెర్రిగా ఆ వెంట్రుకలను కొనుక్కుని కొనుగోలుదారు కోసం



ఎదురు చూడ సాగారు. జుట్టంతా అమ్ముడు పోయిందని మేనేజర్ నుంచి కబురొచ్చాక, జమీందారు హిమాలయ పర్వతాల నుంచి సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగొచ్చి, మేనేజరుకి తగిన బహుమతి ఇచ్చి సత్కరించాడు. వెంట్రుకల అవసరం మరి లేదని తెలిసాక, ఊర్లో జనాలందరూ తమ ఖరీదైన జుట్టుని (షేరు సర్టిఫికెట్లని) ఇళ్ళలో దాచుకొని బోడిగుండ్లతో తిరిగారు. ఈ విధంగా అమాయకులకు గుళ్ళు కొట్టించే జమీందారు సామ్రాజ్యమే "స్టాక్ ఎక్స్ఛేంజి". కొందరికి లాభాలు రావొచ్చు గాక. కానీ, తమ తెలివి మీద అంతులేని నమ్మకంతో భార్య మంగళ సూత్రాలు తాకట్టు పెట్టి వ్యాపారం చేసేవారిని ఉద్దేశించి వ్రాసిన కథ. *(సమస్యలు – సందేహాలు)*

# వృత్తి - ప్రవృత్తి



మూడేళ్ళ పాపకి ఆరు గంటల పాటు అత్యంత క్లిష్టమైన మెదడు ఆపరేషన్ చేసి ఒక న్యూరో సర్జన్ థియేటర్ నుంచి వస్తూంటే, బయట నిలబడ్డ తల్లిదండ్రులు ఎలా ఉందని ఆత్రంగా అడిగారు.

అలసటతో పాటు మొహంలో విజయగర్వం తొంగి చూస్తుండగా, "చాలా కాంప్లికేటెడ్ సర్జరీ... ఆపరేషన్ సక్సెస్... మీ అబ్బాయి తొందరలోనే కోలుకుంటాడు" అన్నాడు సర్జన్.

"అబ్బాయి కాదు... అమ్మాయి... అమ్మాయి" షాక్ తగిలినట్టు తల్లిదండ్రులు భయంగా అరిచారు.

మరో క్లిష్టమైన ఆపరేషన్ కి వెళ్ళే ముందు కాఫీ తాగటం కోసం హడావిడిగా కేంటీన్ వైపు నడుస్తూ "ఓహ్! అమ్మాయి కదూ, అవును అమ్మాయి... రేర్ కేస్. మొత్తం అంతా వీడియో తీశాము. మా స్టూడెంట్స్‌కి బాగా ఉపయోగ పడుతుంది. మీ అమ్మాయిని పది రోజుల్లో డిశ్చార్జి చేస్తారు" అన్నాడు.

❀ ❀ ❀

ఆ డాక్టరు అద్భుతమైన సర్జన్. అందులో ఏమాత్రం సందేహం లేదు. కానీ అతడు వృత్తికి సంబంధించిన వాడు. అంతే తప్ప పేషెంట్స్ కి కాదు. అతడికి వృత్తి పట్ల ఉన్న పాషన్, ఇతరుల భావోద్వేగాల పట్ల లేదు.

*(లోయ నుంచి శిఖరానికి)*

# డయేరియా ఆఫ్ టాకింగ్

ట్రైన్లో ఒక ప్రయాణికురాలు "మీవారేం చేస్తూంటారు?" అని ఎదురుగా కూర్చున్నామెని అడిగింది.

"ప్రొద్దున్నే లేచి బ్రష్ చేసుకుంటారు. స్నానం చేసి డ్రస్ వేసుకొని బ్రేక్‌ఫాస్ట్ చేసి ఆఫీసుకి వెళ్తారు. ఆఫీసు నుంచి వచ్చాక కొంచెం సేపు టీ.వీ చూసి భోజనం చేస్తాము. తరువాత బెడ్రూంలోకి వెళ్తాము" అందామె.

ఎదురుగా ఉన్న ఆవిడ బిత్తరపోయి, "ఇదంతా నాకెందుకు చెప్తున్నారు" అంది.

"మీరేగా మావారేం చేస్తూంటారని అడిగారు" అన్నది ప్రయాణికురాలు.

"అవన్నీ నాకెందుకు? ఆయన వృత్తి తెలుసుకుందామని అడిగానంతే" నిష్టూరంగా అన్నది ఎదురామె.

"అది మాత్రం ఎందుకు?" ఎదురు ప్రశ్న వేసింది ఆ ప్రయాణికురాలు.

తోటి ప్రయాణీకులతో మాట్లాడకుండా ముంగిలా కూర్చోమని చెప్పటం కాదు ఇక్కడ ఉద్దేశ్యం. నిరర్థక సంభాషణలకన్నా, ప్రయాణాల్లో పుస్తకాలు, ప్రకృతి లాంటి మంచి పనులు కొన్ని ఉంటాయని చెప్పటం..!

"వచ్చే ఎన్నికల్లో ప్రజారాజ్యం గెలుస్తుందా?" అడిగాడొక ప్రయాణీకుడు.

చదువుతూన్న పుస్తకం నుంచి తలెత్తి "వంద రూపాయిలిస్తే చెప్తాను" అన్నాడు ఎదురుగా కూర్చున్న రచయిత. అడిగిన వ్యక్తి మొహం మాడిపోయింది. దెబ్బ తిన్నట్టు మౌనం వహించాడు.

"పోనీ పదిరూపాయిలివ్వండి. చెప్తాను."

"అవసరం లేదు."

"పోనీ రూపాయి?"

"ఊహూ."

"రూపాయి కూడా విలువ చెయ్యని నా అభిప్రాయం కోసం నేనెందుకు నా సమయం వృధా చేసుకోవాలి?" పుస్తకంలో తిరిగి తల దూరుస్తూ అన్నాడా రచయిత.

*(లోయ నుంచి శిఖరానికి)*

# జ్ఞానం అంటే...

ఒక అమ్మాయి ఒకర్ని ప్రేమించింది. ఏడాది ప్రేమాయణం సాగించి, అతడు ఇంకెవరినో పెళ్ళి చేసుకున్నాడు. అమ్మాయి భోజనం మానేసి ఆర్నెల్లు ఏడ్చింది. అస్థిపంజరంలా తయారైంది. ఆత్మహత్యా ప్రయత్నం కూడా చేసింది. 'కాలం' మనసు గాయాలకి 'మరుపు' అనే ఆయింట్మెంటు రాస్తుందంటారు. క్రమక్రమంగా కుదుటపడి, ఏడాదికి ఇంకెవరినో పెళ్ళి చేసుకుంది. ఇప్పుడు ఇద్దరు పిల్లలు. మంచి భర్త. గతం గుర్తు తెచ్చుకుని, "అది నేనేనా?... తల్చుకుంటే నవ్వొస్తుంది. ఎంత ఇమ్మెచ్యూర్‌గా ఏడ్చేదాన్ని" అనుకుంది.

ఆమె చెల్లెలు కూడా ఒక కుర్రవాడ్ని ప్రేమించి, ఆ విషయం అక్కకి చెప్పింది. ఇంతలో ఇంట్లో సంబంధాలు చూస్తే, ఒక్కరోజులో ఆ కుర్రవాడితో తెగదెంపులు చేసుకొని, నవ్వుతూ పెళ్ళి పీటల మీద కూర్చొని తాళి కట్టించుకుంది. "అదేమిటే... కనీసం కొద్దిగా కూడా బాధలేకుండా దుస్తులు మార్చినట్టు అలా ఒప్పేసుకున్నావేంటి?" అని ఆశ్చర్యపోతూ అడిగింది అక్క.

"నువ్వు ఆర్నెల్లు ఏడ్చి ఏడ్చి కుదుటపడి పెళ్ళి చేసుకున్నావు. 'మెచ్యూరిటీ లేకుండా ఆర్నెల్లు ఏడ్చానేంటి?' అని ఆ తరవాత నాతో అన్నావు కూడా. ఇప్పుడు నేను క్షణం కూడా బాధపడకుండా పెళ్ళి చేసుకున్నాను, నీదా మెచ్యూరిటీ? లేక నాదా?" అని అడిగింది చెల్లి.

ఇది జరిగిన కొన్ని సంవత్సరాలకి ఆ చెల్లెలి భర్త షేర్లలో లక్షలు నష్టపోయాడు. భార్యా భర్తలిద్దరికీ నెలరోజుల పాటు నిద్రలేదు. అదృష్టవశాత్తు మళ్ళీ షేరు ధరలు పెరిగాయి. దాని గురించి తల్చుకుంటూ "ఆ రోజుల్లో అంత చిన్న విషయానికి ఎంత బాధపడ్డాము" అని నవ్వుకున్నారు.

మరికొంత కాలానికి వాళ్ళ కొడుకు కులంగోత్రం లేని విదేశీ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. భార్యాభర్తలు మనసులోనే కుమిలిపోయారు. వచ్చిన కోడలు అద్భుతమైన అమ్మాయి. పది రోజుల్లో అందరి మనసులు చూరగొన్నది. "మనం మూర్ఖపు పట్టుదలతో ఉండి ఉంటే ఇంత మంచి అమ్మాయిని కోల్పోయేవాళ్ళం కదా" అని అనుకున్నారు.

దీన్నిబట్టి అర్థమయిందేమిటి? మెచ్యూరిటీ అనేది ఒక నిరంతర ప్రక్రియ. భావోద్వేగాలు లేకపోవటం, దుఃఖానికి అతీతంగా ఉండటం మెచ్యూరిటి కాదు. ఆనందం విషాదం మిళితమైతేనే జీవితం. *(లోయ నుంచి శిఖరానికి)*

# హేతువు సంబంధిత 5 కథలు

## 1. అదృష్టాన్ని నమ్ముకుంటే

ఒక రాజుకి ఇద్దరు కొడుకులు. రాజుగారికి నయం కాని జబ్బు చేసింది. ఒకటే మందు ఉన్నది. సంజీవనీ మూలిక. ఇద్దర్లో ఎవరు ఆ మూలిక తెస్తే వారికే పట్టాభిషేకం అన్నారు రాజుగారు.

ఇద్దరు కొడుకులూ పావురాలు ఎగరేసి చెరో దిక్కుకీ బయలుదేరారు. పెద్ద కొడుకు పావురం ఒక కొండ మీద ఆగింది. 'ఇంత పెద్ద కొండ ఎలా ఎక్కగలను? దురదృష్టం నన్ను వెంటాడుతోంది' అని పెద్ద కొడుకు విచారంతో క్రిందే ఆగిపోయాడు.

రెండో కొడుకు పావురం పుట్ట మీద వాలింది. 'నా అదృష్టం..! పుట్టలో సంజీవినీ మూలిక ఉన్నదని పావురం చెప్పింది' అని రెండో కొడుకు సంతోషంతో పుట్ట తవ్వుతుంటే లోపల్నుంచి పామొచ్చి కాటేసింది. ఈ కథ రెండు నీతులు చెపుతుంది.

'నేను చాలా దురదృష్టవంతుడిని. నాకున్నన్ని సమస్యలు ఈ ప్రపంచంలో ఎవరికీ ఉండవు' అనుకుంటూ అవకాశం అనే కొండ క్రింద ఆగిపోతారు కొంతమంది. 'నేను చాలా అదృష్టవంతుడిని. అందుకే దేవుడు నన్ను చల్లగా చూస్తాడు. మిగతా వాళ్ళలో లేని స్పెషాలిటీ ఏదో నాలో ఉంది. నేను పని చేయనక్కర లేదు. పావురం (అనే ఉంగరం, వాస్తు, తాయెత్తు, జ్యోతిష్యలు) నన్ను రక్షిస్తాయ' అనుకుంటూ ఉంటారు మరి కొంతమంది. ఇద్దరివీ ఎందుకూ ఉపయోగపడని అభిప్రాయాలే. *(అగ్ని ప్రవేశం)*

## 2. నాయినమ్మ చిట్కా

'మంచం క్రింద దెయ్యాలున్నాయన్న భయంతో ముదేళ్ళపాటు నిద్ర లేకుండా సైకాలజిస్టుల చుట్టూ తిరిగాను. మూడు నిమిషాల్లో మా నాయనమ్మ నా భయాన్ని పోగొట్టింది. ఇప్పుడు హ్యాపీగా నిద్రపోతున్నాను' అన్నాడు ఒక పెద్ద మనిషి.

'ఏమి చేసిందబ్బా?' ఆసక్తిగా అడిగాడు మిత్రుడు.

'మంచం కోళ్ళు కత్తిరించేసింది'.

## 3. ప్రవక్తలు - ఎస్కేపిస్టు మార్గబోధనలు

మన అభిప్రాయాల మీద, నమ్మకాల మీదా నిలబడాలంటే దానికి చాలా ధైర్యము, దాని కన్నా ముఖ్యంగా బలమైన వ్యక్తిత్వమూ ఉండాలి. మనం బలహీనమైనప్పుడు, స్వయంకృత బిరుదాంకిత విజ్ఞులు, మనపై తమ అభిప్రాయాల్ని 'రుద్దటం' మొదలు పెడతారు. "నీ హేతువుకు సరిపోక పోతే, ఏ ప్రవక్త చెప్పిందీ వప్పుకోకు. నాతో సహా..." అన్నాడు బుద్ధుడు.

విజ్ఞులకి, సామాన్యులకి తేడా ఏమిటంటే, ఏ చెట్టు ఫలము ఆరోగ్యకరమో దానిని ఆస్వాదిస్తారు విజ్ఞులు. ఏది రుచికరమో దానిని ఎన్నుకుంటారు సామాన్యులు. భక్తులకి సులభమైనవి, రుచికరమైనవి ఒక్కొకరూ ఒకొక్క రకంగా చెప్తారు ఆధునిక ప్రవక్తలు. అందుకే ప్రొద్దున్నే భక్తి చానల్స్‌కీ, సాయంత్రమవగానే సభలకి అంటిపెట్టుకుని ఉంటారు కొందరు. దానివల్ల ఎవరికీ నష్టం లేదుగానీ, ఒక్క విషయం గుర్తు పెట్టుకోవాలి. రకరకాల ప్రవక్తలు పాపపరిహారార్థం (ఉదాహరణకి ఒకరు భార్యతో ఏడాది ఉపవాసం, ఇంకొకరు పుష్కర నదీ స్నానం, మరొకరు మంగళవారం నూనెలో నాలుక నిమజ్జనం) ఇలా వంద మంది చెప్పే ప్రవచనాలు వింటే అయోమయం తప్ప ఏమీ మిగలదు. దానికి సంబంధించిన (కేవలం నాలుగు వాక్యాల) అద్భుతమైన కథ.

"ఒకే గురువు దగ్గర అభ్యసిస్తే నేను విజ్ఞుడవటానికి ఎంతకాలం పడుతుంది?" అని అడిగాడు శిష్యుడు.

"పది సంవత్సరాలు"

"పోనీ పది మంది గురువుల దగ్గర ఏకకాలంలో అభ్యసిస్తే?"

"వంద సంవత్సరాలు".

## 4. అలాంటిదే మరో కథ

ఒక యోగా గురువు దగ్గర చేరాడు శిష్యుడు. మూడు రోజులు గడిచాయి. 'నాకు కాళ్ళు నొప్పిగా ఉన్నాయి. నిద్ర వస్తోంది. ఈ మెడిటేషనూ, యోగా వృధా అనిపిస్తోంది' అన్నాడట శిష్యుడు.

'నీ అభిప్రాయం త్వరలోనే మారుతుంది' అన్నాడు గురువు.

సంవత్సరం అయింది. 'యోగా అద్భుతంగా ఉంది. నేను సంపూర్ణ జ్ఞానవంతుణ్ణి అయ్యాను' అన్నాడట శిష్యుడు.

'నీ అభిప్రాయం త్వరలోనే మారుతుంది' అన్నాడు గురువు.

## 5. పాజిటివ్ థింకింగ్

ఒక రైతు గుర్రం అడవిలోకి పారిపోయింది. అందరూ సానుభూతి తెలిపారు. 'ప్రాప్తం కదా' నిర్లిప్తంగా అన్నాడు రైతు. మూడు రోజులుపోయాక అది తిరిగివస్తూ అడవిలోంచి మూడు గుర్రాల్ని తోడుగా తెచ్చింది. అందరూ అభినందించారు. 'ప్రాప్తం కదా' అన్నాడు రైతు. ట్రైనింగ్ అవని గుర్రాన్ని స్వారీ చెయ్యబోయి కొడుకు కాలు విరగ్గొట్టుకున్నాడు. 'ప్రాణం పోలేదు కదా' అన్నాడు రైతు. మరుసటి రోజు సైన్యంలోకి యువకుల్ని అందర్నీ బలవంతంగా పట్టుకెళ్ళిన అధికారులు, కాలు విరిగిన కొడుకుని వదిలేసారు. 'ప్రాప్తం కదా' అన్నాడు రైతు. చిన్న జెన్ కథలో గొప్ప నీతి.

*(సమస్యలు – సందేహాలు)*

# వినదగ'దు' నెవ్వరు చెప్పిన

ప్రతివాడు చెప్పిందీ నమ్మితే ఏమి జరుగుతుందో వివరించే "సూఫీ" కథ ఇది. మనకి తెలిసిన కథే. కానీ పిల్లలకి చెప్పటానికి బావుంటుంది.

తండ్రీ కొడుకులిద్దరు ఒక గాడిదని అమ్మటానికి దాన్ని నడిపించుకుంటూ పట్నం తీసుకు వెళుతున్నారట. దారిన పోయే పెద్దమనిషి అది చూసి పక్కవారితో, "గాడిద ఉన్నది స్వారీ చెయ్యటానికి" అన్నాడట.

ఆ మాటలు విని తండ్రి, కొడుకుని దానిపై ఎక్కించి నడవ సాగాడు. ఎదురుగా వస్తున్న మరో పెద్దాయన, "వయసులో పెద్దవాడు నడుస్తుంటే కుర్రాడు హాయిగా గాడిద మీద కూర్చున్నాడు. కలికాలం" అన్నాడట.

అది విని కుర్రాణ్ణి దింపి తాను ఎక్కాడు తండ్రి. మరి కొంత దూరం నడిచాక వెనుక నుంచి వచ్చే అమ్మలక్కలు "చూసావటే, తాను దర్జాగా కూర్చుని పాపం కుర్రాణ్ణి నడిపిస్తున్నాడు పెద్దమనిషి" అని గుసగుసలాడుకున్నారట. అది చెవిన బడి, వాడిని కూడా ముందు కూర్చో బెట్టుకున్నాడట తండ్రి.

అంతలో ఒక పండితుడు ఎదురుపడి, "అమాయక జంతువుపై ఇద్దరు ఎక్కుతార్రా? వచ్చే జన్మలో గాడిదలై పుడతారు" అని శాపం పెట్టినట్టూ తిట్టాడట. దాంతో భయపడిన ఇద్దరూ, పాప పరిహారార్థం ఆ గాడిదని ఓ కర్రకి వేలాడదీసి, భుజాల మీద పెట్టుకుని నడవసాగారు.

వంతెన మీది కొచ్చేసరికి క్రింద నీటిని చూసి బెదిరిన గాడిద కాస్త కొట్టుకునేసరికి, ముడులు లూజై క్రిందపడి, వెనక నడుస్తూన్న తండ్రి మొహాన్ని ఎడమ కాలితో ఫెడీల్మని కొట్టి పారిపోయిందట.

*(సమస్యలు – సందేహాలు)*



# సంతోషానికి మూలం విషాద విస్మరణం

జైన మతానికి  పునాది 'అహింస'. చీమలకు కూడా హాని కలగించటానికి ఇష్టపడని జైనులు, కాలి క్రింద నలిగిపోతాయేమో అన్న సంశయంతో, నడిచే బాటను కూడా శుభ్ర పరుస్తూ ముందుకు సాగే నిష్టాగరిష్టులు.

అటువంటి జైన యువకులిద్దరిని భ్రష్టు పట్టించటానికి ఒక సాడిస్టు, వారిని విందుకు పిలిచి మాంసాహారం వడ్డించి, వెళ్ళిపోయే ముందు వారికి ఆ విషయం చెప్పాడు. ఆ మతానికి కోపం నిషిద్ధం కనుక, వారు అతడిని ఆశీర్వదించి అక్కడి నుండి కదిలారు.

మరుసటి రోజు కలిసినప్పుడు, మొదటి యువకుడు రెండో వ్యక్తితో, 'రాత్రంతా ఈ విషయమై నిద్ర లేదు' అన్నాడు అమితమైన వేదనతో.

'తెలియక చేసిన దానికి మనమేమి చేస్తాం? బాధ పడకు. మర్చిపో' అన్నాడు జైనుడు.

రెండు రోజుల తరువాత దేవాలయం దగ్గర కలిసినప్పుడు మొదటి వ్యక్తి తిరిగి 'మనం తప్పు చేశామంటావా?' అన్నాడు సందేహంగా.

"తెలియక చేసింది తప్పు కాదు. దిగులు చెందకు" అన్నాడు మిత్రుడు.

మరొక వారం గడిచాక నది వడ్డున కలిసారు ఇద్దరూ. "మాంస భక్షణ పాపం కాదా?" అని మళ్ళీ ప్రశ్నించాడు మొదటి వాడు.

'మిత్రమా. నేను ఆ మరుసటి రోజే ఆ విషయాన్ని విసర్జించాను. నువ్వెందుకు దాన్ని ఇంకా కడుపులో పెట్టుకుని తిరుగుతున్నావు?' అని ప్రశ్నించాడు స్నేహితుడు.



*(సమస్యలు – సందేహాలు)*

# ఒకే అద్దం - రెండు బింబాలు

భర్త విదేశంలో ఉండటంతో తొందరగా నిద్రకుపక్రమించింది కరుణ. కొంచెం సేపటికి ఫోన్ మ్రోగింది.

"......రేప్పొద్దున్న పదింటికి మీ ఆస్తి జప్తు చేయటానికి కోర్టువారు వస్తున్నారు" అని రాత్రి పదింటికి లాయర్ దగ్గర్నుంచి వచ్చిన ఫోన్, కరుణని దిగ్భ్రాంతిలో ముంచేసింది. "ఆ..... ఆయనకి తెలుసా ఈ విషయం? అసలీ కోర్టు ఏమిటి? జప్తులేమిటి?" అంది.

"ఆయన దుబాయ్ వెళ్ళటానికి ముందు చేసిన అప్పు మాడమ్. మీకు తెలిస్తే కంగారు పడతారని చెప్పొద్దన్నారు. ఆయన బొంబాయిలో ఇరుక్కుపోయారు. అందుకే మీకు చెప్తున్నాను" అని ఫోన్ పెట్టేశాడు.

ఆమెకి ఏం చెయ్యాలో తోచలేదు. భర్త తాలూకు వ్యాపార లావాదేవీలు ఆమెకి తెలియవు. ఆస్తుల్ని కోర్టు వేలం వేసే పరిస్థితి వస్తుందని ఆమె ఊహించలేదు.

ఆమె ఆ ఆలోచనల్లో వుండగానే ఫోన్ మ్రోగింది. ఈసారి భర్త!! అంతే. ఆమె కోపంగా ఏదో అనబోయింది. కానీ అంతలోనే భర్త "ఏమీ కంగారుపడకు. మనమీద అసూయతో ప్రత్యర్థులు నేను లేని టైమ్ చూసి ఇలా చేశారు. ఇక్కడ బోంబేలో పొగమంచు దట్టంగా వుండటంవల్ల రాలేక పోతున్నాను. అయినా ఫర్వాలేదు. ప్రొద్దున్న ఎనిమిదింటికల్లా జయరాం రెండు లక్షల్తో వరంగల్ నుంచి బయల్దేరి వస్తున్నాడు. కోర్టు వారికి ఆ డబ్బు చెల్లించేస్తే చాలు. మధ్యాహ్నానికి నేను వచ్చేస్తున్నాను." అన్నాడు.

ఆమె మనసు కుదుటపడింది. దానికి తోడు, తెల్లవారుఝామున నాలుగింటికే జయరాం ".....నేనూ, లక్ష్మి ఇప్పుడే బయల్దేరుతున్నాం. ఎనిమిదింటికల్లా హైద్రాబాద్‌లో వుంటాం" అని ఫోన్ చేసాడు. ఆమెకి సంతోషం వేసింది. లక్ష్మి ఆమె ప్రాణ స్నేహితురాలు.

......ఎనిమిదయింది. తొమ్మిదయింది. భార్యాభర్తలు రాలేదు. ఆమెకి టెన్షన్ మొదలైంది. పదింటికి కోర్టు అమీనా వచ్చాడు. సామాన్లు బయట వేశారు. వీధిలో వాళ్ళంతా వీధి నాటకం చూసినంత ఉత్సాహంతో చూస్తున్నారు. ఆమెకి స్పృహ తప్పటమొక్కటే తరువాయి. ఏదో సినిమాల్లో చూడటమే తప్ప, నిజంగా ఇలా జరుగుతుందని తెలీదు. జప్తు పూర్తయింది. ప్రేక్షకుల్లా చూసిన వాళ్ళందరూ వెళ్ళిపోయారు. శ్మశాన నిశ్శబ్దం మిగిలింది.

జయరాం, లక్ష్మి పదకొండు అవుతూండగా వచ్చారు. ".....ఏమైంది? వాళ్ళు వచ్చారా?" లక్ష్మి ఆతృతగా అడిగింది. కరుణకి ఒక్కసారిగా ఆనకట్ట తెగినట్టు కోపం కట్టలు తెంచుకుంది. హిస్టీరియా వచ్చిన దాన్లా తిట్టసాగింది. తనకి జరిగిన అవమానం

అంతా ఆవేశం రూపంలో వాళ్ళ మీద చూపించింది. చేతిలో రివాల్వర్ వుంటే షూట్ చేసేదే. ఆమె దృష్టిలో వారు చేసిన నమ్మక ద్రోహానికి అదే శిక్ష!

❀ ❀ ❀

ఇదే సంఘటన మరోలా జరిగినట్టు వూహిద్దాం..! సరైన టైమ్‌కి విమానం బయల్దేరటంతో కోర్టు అమీనా ఇంటికి రాకముందే భర్త బొంబాయి నుంచి వచ్చేశాడు. "కోర్టు గొడవలు అన్నీ చెప్పి టెన్షన్ పెట్టటమెందుక"న్న అభిప్రాయంతో ఇదంతా చెప్పలేదని క్షమాపణ వేడుకున్నాడు. దుబాయ్‌లో కాంట్రాక్ట్ పూర్తయి పాతిక లక్షలు లాభం వచ్చింది. రెండు లక్షలు పెట్టి రవ్వల నెక్లెస్ తెచ్చాడు. కోర్టువారికి డబ్బు చెల్లించగానే అమీనా బయట్నుంచి బయటే వెళ్ళిపోయాడు. అంతా సుఖాంతమయింది. ఆ టైమ్‌కి లక్ష్మి తాపీగా వచ్చింది. ''సారీనే. ఇంట్లో బ్రేక్‌ఫాస్ట్ ఆలస్యమయింది. అదీగాక మధ్యలో టైరు పంచరయింది. రెండు లక్షలు దొరకలేదు. లక్ష వుంటే తీసుకొచ్చాం" అంది.

"పర్లేదు లేవే....." ఆమె మాటలు మధ్యలో ఆపు చేస్తూ అంది కరుణ. "...మా ఆయన వచ్చేశారు. అన్నట్టు... ఈ రవ్వల నెక్లెస్ ఎలా ఉంది?"

❀ ❀ ❀

ఇప్పుడు చెప్పండి. రెండు సంఘటనల్లోనూ లక్ష్మి, ఆమె భర్త చర్య ఒక్కటే. కరుణ ప్రతిస్పందనలు మాత్రం వేరు. ఈ రియాక్షన్స్ అన్నీ మనకి చాలా సహజంగా కనపడవచ్చు. "కష్టంలో ఉన్నప్పుడు కోపం, దుఃఖం సహజం. అది తీరాక సంతోషం కూడా అంతే సహజం కదా" అని మనం అనుకోవచ్చు. కానీ మొదటి సంఘటనలో కరుణకి ఒక 'తీరని, సరిదిద్దుకోలేని నష్టం' జరిగింది.

ఒక మంచి స్నేహితురాల్ని ఆమె కోల్పోయింది.

నిజానికి జరిగిందేమిటంటే– నక్సలైట్ల కోసం వెతుకుతున్న పోలీసులకి దురదృష్టవశాత్తు లక్ష్మి దంపతులు పట్టుబడ్డారు. అది బ్లాక్ మనీ! పోలీస్ స్టేషన్‌లో మూడు గంటలు పట్టింది. ఈ విషయం వినిపించుకోకుండా కరుణ నెపం వేసింది. వాళ్ళని ఛెడామడా తిట్టింది. రాత్రికి రాత్రి కష్టపడి రెండు లక్షలు అప్పు సంపాదించి, తెల్లవారుఝామునే లేచి బయల్దేరిన స్నేహితులపై ఆవేశంలో విరుచుకుపడి నిందించింది. స్నేహితుల్ని పోగొట్టుకుంది.

స్థితప్రజ్ఞుడయిన వ్యక్తి తన ఎమోషన్స్ తన ఆధీనంలో ఉంచుకుంటాడు. అనవసరమైన ఆందోళనల వల్ల ఫలితం లేదని తెలుసుకుంటాడు. దీన్నే 'కండిషండ్ రిఫ్లెక్స్" అంటారు. *(మైండ్ పవర్)*

# ప్రేమలో బ్రేకప్

మంచి స్నేహితుడు మిమ్మల్ని ఎప్పుడూ వదిలెయ్యడు. మిమ్మల్ని వదిలేసిన వాడు మంచి స్నేహితుడు కాదు. అలా వదిలెయ్యటానికి కారణాలు ఆలోచిస్తే మనశ్శాంతి కలుగుతుంది.

ఒక కుర్రవాడు కౌన్సిలర్ దగ్గరకు వెళ్లి, "ఒక అమ్మాయి నాతో కొంతకాలం స్నేహం చేసి ఇప్పుడు మొహం తిప్పుకుంటోంది. ఫోన్ చేస్తే సరిగ్గా మాట్లాడదు. నేను చదువు మీద ఏకాగ్రత నిలపలేకపోతున్నాను" అంటూ బాధ చెప్పుకున్నాడు.

"స్నేహం వరకే ఆగిందా? ప్రేమ వరకు వచ్చిందా?" ప్రశ్నించాడు కౌన్సిలర్.

"లేదు. ఇంకా నేను ప్రపోజ్ చెయ్యలేదు" అన్నాడు ఆ కుర్రవాడు.

"నీలో ఏదో ఆ అమ్మాయికి నచ్చి ఉండకపోవచ్చు. నీ ఆర్థికస్థితి గానీ, భావోద్వేగం గానీ, ప్రవర్తన గానీ నచ్చనందు వలన ఆ అమ్మాయి 'స్నేహం స్థాయి' లోనే నీతో మాటలు తగ్గించింది. ఇందులో బాధేముంది?" అంటూ ఆ కౌన్సిలరు గతంలో తన దగ్గిర కౌన్సిలింగ్‌కి వచ్చిన మరో కుర్రవాడి టేప్ ఆ అబ్బాయికి వినిపించాడు. "...నేనూ, ఒకమ్మాయీ గాఢంగా ప్రేమించుకున్నాం. పెళ్ళి నిశ్చయమై, ఆ అమ్మాయి సడన్‌గా నాతో స్నేహం మానేసింది. ఫోన్ నెంబరు కూడా మార్చేసింది. ఎక్కడుందో, ఏమైందో కూడా తెలియటం లేదు" అని వినిపించింది.

సైకాలజిస్టు టేప్ ఆపు చేస్తూ కుర్రవాడితో "...చూసావా. నిన్ను నీ ఫ్రెండ్ 'స్నేహం స్టేజి'లో వదిలేసింది. ఈ అమ్మాయి ఆ అబ్బాయిని ప్రేమ వరకూ వచ్చాక వదిలేసింది. నీ బాధ కన్నా ఆ అబ్బాయి బాధ ఇంకా పెద్దది కదా" అన్నాడు.

"ఆ అబ్బాయికి మీరేం సలహా ఇచ్చారు?" అడిగాడు ఆ కుర్రవాడు.

సైకాలజిస్ట్ దానికి డైరెక్టుగా సమాధానం చెప్పకుండా, 'ఆ అమ్మాయి ఆ అబ్బాయితో, 'నాకు పెళ్ళి నిశ్చయం అయ్యింది. ఇక్కడితో నీతో స్నేహం ఆపు చెయ్యదల్చుకున్నాను' అని చెప్పుంటే ఏమనుండేవాడు?"

"ఏమనుండేవాడు?"

"నీ పెళ్ళైన తరువాత కూడా మనం మంచి స్నేహితుల్లాగా ఉండొచ్చు. తప్పేముంది?' అని వాదిస్తాడు. అవునా?" అన్నాడు.

"అవును. అందులో తప్పేముంది?"

సైకాలజిస్ట్ నవ్వాడు. "కొన్నాళ్ళ తరువాత 'సంసారం ఎలా ఉంది? ఏదైనా అసంతృప్తి ఉందా?' అని ప్రశ్నిస్తాడు. తమ పూర్వ పరిచయాన్ని, అందులో మధుర ఘట్టాల్ని గుర్తుచేస్తూ

దగ్గర అవ్వడానికి ప్రయత్నిస్తాడు. ఇన్ని గొడవలెందుకని ఆ అమ్మాయి చెప్పకుండా స్నేహాన్ని కట్ చేసింది".

"కనీసం స్నేహ పురస్సరంగానే 'బై' చెప్పి విడిపోవచ్చుగా."

"'బై' చెప్పినప్పుడు, మీలాంటి మొగవాళ్ళ రియాక్షన్ ఎలా ఉంటుందో వారికి తెలియదు కదా. ఇటువంటి విషయాల్లో ఎవరూ సంతృప్తి పడరు. కొందరు లైట్‌గా తీసుకుని 'సర్లే' అనొచ్చు. లేదా మరికొందరు వివాహ సమయంలో వెళ్ళి గొడవ చెయ్యవచ్చు. పాత మెసేజీలు చూపించి బ్లాక్ మెయిల్ చెయ్యవచ్చు. ఇంకా దుర్మార్గులైతే యాసిడ్ పోయొచ్చు" ఆగి కొనసాగించాడు.

"ఆ విధంగా పాత స్నేహాల వల్ల తమ భవిష్యత్–సంసార జీవితంలో కష్టాలు రాకుండా ఉండటం కోసం అడ్రస్సు, ఫోను నెంబరూ ఇవ్వకుండా అమ్మాయిలు స్నేహానికి ఫుల్–స్టాప్ పెడతారేమో. అందులో తప్పేముంది?" అని, అబ్బాయి ఏదో అడగబోయేటంతలో "...వారి సంగతి వదిలిపెట్టు. నీ విషయం ఆలోచించు. నువ్వు ప్రేమించిన అమ్మాయి నిన్ను ఎందుకు వదిలేసింది? నీ కన్నా తల్లిదండ్రులు ముఖ్యమనో, నీతో కన్నా నిన్ను వదిలేస్తే భవిష్యత్తు బావుంటుందనో అనుకోవటం వల్లనే కదా మరెవరినో వివాహమాడింది. నీ ప్రేమ నిజమైనదయితే, నీ ప్రియురాలు తృప్తిగా ఉండటం కన్నా నీకేమి కావాలి? బాధ దేనికి?"

"నేను అమ్మాయినై నా బాయ్–ఫ్రెండ్ నన్ను వాడుకుని వదిలేసినా ఇలాగే తృప్తిగా ఉండమని సలహా చెప్తారా?" ఉక్రోషంగా అడిగాడు కుర్రాడు.

"చెప్పను. అమ్మాయిలకైతే మరోలా చెప్తాను. ఇష్టం తగ్గిపోయో, ఎక్కువ కట్నం వస్తుందనో, చెల్లికి మంచి సంబంధం వస్తుందనో, తల్లి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించటం వల్లనో నిన్ను వదిలేసేడనుకుందాం. అలా ప్రేమలో లాభనష్టాలు బేరీజు వేసుకునేవాడు దూరమైనందుకు సంతోషించాలి గానీ, బాధ ఎందుకు? అని చెప్తాను" అని నవ్వి "మరీ వితండ వాదనలా ఉన్నదా?" అని అడిగాడు.

"లేదు. లేదు. మీరు చెప్పేది అర్థమైంది" అన్నాడు కుర్రవాడు.

*(ప్రేమ ఒక కళ)*

# రెండు అద్దాలు - ఒకటే బింబం

కల్మశం అంటే దుఃఖం అని ఒక అర్థమూ, మోహం అని మరొక అర్థమూ ఉన్నాయి. దుఃఖం, మోహం, పైకి రెండు వేర్వేరు పదాలుగా కనపడతాయి కానీ, రెండూ ఒకటే. డబ్బు / కీర్తి / బంధం... వీటి పట్ల మోహం వలనే దుఃఖం కలుగుతుంది.

రాత్రి పది అయింది. భర్త ఇంటికి రాలేదు. ఇంతవరకూ ఎప్పుడూ అలా జరగలేదు. ఆలస్యమయినప్పుడు తప్పకుండా ఫోన్ చేసి చెప్పేవాడు. ఇప్పుడు ఏం జరిగిందో అన్న ఆందోళనతో ఆమె కంగారు పడుతోంది. అదేమీ పట్టనట్టు పెద్ద కొడుకు పక్కగదిలో హెచ్చుస్థాయిలో టీ.వీ. పెట్టుకున్నాడు. ఆమె ఆందోళన విసుగ్గా మారింది. వాడి గదిలోకి వెళ్ళి సౌండ్ తగ్గించమంది. 'క్రికెట్ మ్యాచ్ ఇంటరెస్టింగ్‌గా ఉంది. కావాలంటే మధ్య తలుపు వేసుకో' అన్నాడు.

విసుగు ఎవరి మీదో తెలియని కసిగా మారింది. ఈలోపు కూతురు వంటింట్లో చప్పుడు చేసింది. ఏమైందని అడిగితే, చేతిలోంచి జారి గ్లాసు బద్దలైందంది. అంతలో మూడోవాడు 'అమ్మా! ఆకలేస్తోందే' అంటూ మొదలు పెట్టాడు. ఎవరిమీదో అప్పటివరకూ తెలియని కసి, వాడి మీద కోపంగా మారింది. 'కడుపునిండా మెక్కి గంట కాలేదు. మళ్ళీ ఆకలా' అంటూ చెంపమీద బలంగా ఒకటిచ్చింది. వాడు ఏడుపు ప్రారంభించాడు.

మామూలు పరిస్థితుల్లో అయితే అంత చిన్న విషయానికి వాడిని కొట్టేది కాదు. దీన్నే 'ట్రాన్స్-ఫర్ ఆఫ్ ఎమోషన్' అంటారు. పెద్దకొడుకు మీద నుంచి కూతురి మీదుగా అది చిన్నవాడి మీదకు ప్రవహించింది. "అత్తమీద కోపం..." అన్న సామెత అలాగే వచ్చింది. 'ఒంటె నడుము మీద ఆఖరి గడ్డిపరక' అన్న ఇంగ్లీషు సామెతని కూడా ఇక్కడ చెప్పుకోవచ్చు. చిన్నవాడిని కొట్టటం ద్వారా ఆమె కోపం ఉపశమించింది. కానీ 'ఆందోళన' అలాగే ఉండిపోయింది. మరో అరగంట గడిచింది. ఆమెకు భయం ప్రారంభమయింది. కొడుకు గదిలోకి వెళ్ళి 'నాన్న ఇంకా రాలేదురా' అంది. అప్పుడే ఏవరో సెంచరీ కొట్టారు. వాడు ఆనందంతో "ఫోర్" అని అరిచాడు. ఆమె మళ్ళీ అదే మాట గట్టిగా అన్నది.

"అయితే ఏం చెయ్యమంటావు?" అని అడిగాడు. పక్కనున్న కూతురు, "ఎవరో స్నేహితులింటికి వెళ్ళి ఉంటార్లే అమ్మా" అంది తేలిగ్గా. ఈసారి సిక్సర్. గదంతా ఒక్కసారిగా గోల...!

ఇంటికి ఒక ముఖ్యమైన వ్యక్తి రాకపోతే ఎవరికీ ఏమీ పట్టటం లేదన్న ఆలోచనతో ఆమె ఆందోళన... ఇరిటేషన్‌గా మారింది. ఒక్క ఉదుటన వెళ్ళి టీ.వీ. ప్లగ్ పీకేసింది. "నాన్న ఇంటికి రాకపోతే మీకేమీ పట్టలేదా?" అని హిస్టీరిక్‌గా అరిచింది.

కొడుకు కూడా అంతే చిరాగ్గా, “అయితే ఏం చెయ్యమంటావ్? అన్ని ఆస్పత్రులకీ వెళ్ళి వెతకమంటావా?” అన్నాడు.

ఆమెకి షాక్ తగిలినట్టు అయింది. ఇది కొత్త కోణం. నిజంగా అలా జరిగి ఉండొచ్చా అన్న ‘అనుమానం’ ప్రారంభమయింది. గదిలోకి వచ్చేసింది. ఆ చీకటి నిశ్శబ్దంలో ఆమె భయమూ, కోపమూ, విసుగూ, చిరాకూ కలిసి దుఃఖంగా మారాయి. మనసు పరిపరివిధాల వెళ్ళింది. చాలాసేపు దిండులో మొహం పెట్టి దుఃఖిస్తూ ఉండిపోయింది.

అంతలో కాలింగ్ బెల్ మోగింది. భర్త వచ్చాడు. ఆవేశంతో కూడిన ఉక్రోషంతో, “ఆలస్యంగా వస్తున్నానని ఒక ఫోన్ చేసి చావచ్చుగా. బయటికి వెళ్తే ఇల్లు గుర్తుండదు కామోసు” అంటూ భర్తమీద విరుచుకు పడింది.

“...చేస్తూనే ఉన్నాను. ఫోన్ అప్పట్నుంచీ ఎంగేజ్డ్” అన్నాడు.

ఫోన్ వైపు చూస్తే, రిసీవర్ సరిగ్గా పెట్టి లేదు. ఎనిమిదింటికి తనే స్నేహితురాలికి ఫోన్ చేసింది. అప్పుడు సరిగా డిస్కనెక్ట్ చేయలేదనుకుంటా.

ఒక్కసారిగా ఆమెకు అప్పటివరకూ ఉన్న ‘దిగులు’ పోయింది. నవ్వొచ్చింది. ‘సర్లె. వడ్డిస్తున్నా రండి ‘ అంది. బ్యాటర్ మళ్ళీ బౌండరీ కొట్టాడు.

సాంఖ్యయోగపు 62, 63 శ్లోకాల్లో ఈ స్థితుల గురించి చెప్పాడు కృష్ణుడు. “క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతి విభ్రమ” అన్నాడు. అంటే కోరిక (తీరక పోవటం) వలన కోపము, కోపము వల్ల (తన స్థితి తనకే తెలియని) అవివేకము, దానివల్ల బుద్ధి నాశము కలుగుతున్నది అని ఆ శ్లోకం అర్థం. తరచి చూస్తే భగవద్గీతలో ప్రతిశ్లోకమూ నిజజీవితానికి అన్వయించుకోతగినదే. విషాద యోగమూ, విజ్ఞాన యోగమూ, కర్మ యోగమూ, గుణత్రయ విభాగ యోగమూ అన్నీ ఏం చెపుతున్నాయి? మోహం వలన దిగులు, దిగులు వల్ల భయం, భయం వల్ల అపజయం, చివరికి దుఃఖం అని చెపుతున్నాయి.



*(విజయానికి ఆరో మెట్టు)*

# దృక్పథం

భార్యాభర్తల మధ్య ప్రేమ తగ్గిపోవటానికి కారణం దృక్పథాల్లో తేడా ఎక్కువ అవటమే. "నువ్వు కరెక్ట్అని ప్రూవ్ చేసుకోవటం కంటే, అవతలవారిది తప్పు అని నిరూపించటం చాలా సులభం" అని ఒక సామెత ఉంది. ఈ ఉదాహరణ చదవండి.

భార్య: మందులకీ, టెస్టులకీ పదివేలు పంపమని నాన్న ఉత్తరం వ్రాసారు.

భర్త:  ఇప్పుడు డబ్బులు ఎక్కడున్నాయి?

భార్య: నా అకౌంట్లో ఉన్నాయి. అందులోంచి పంపిస్తాను.

భర్త: (వెటకారంగా) నువ్వు కూడా సంపాదిస్తున్నావని, వాళ్ళకున్న ఏకైక బిడ్డవు నువ్వేననీ తెలుసు. కానీ మనకూ చాలా ఖర్చులున్నాయి.

భార్య: అది కాదు...

భర్త: ఏమి కాదు? నువ్వు పంపే కొద్దీ మరింత ఖర్చు చేస్తారు. అయినా పదివేల ఖరీదు చేసే టెస్టులేమిటి? ఇప్పుడు కుదరదని మీ నాన్నకి చెప్పు.

భార్య: మా నాన్న కాదు. మీ నాన్న..!

భర్త: వ్వా...ట్?

భార్య: అవును. ఉత్తరం వ్రాసింది మా నాన్న కాదు. మీ నాన్న.

భర్త: అవునా! చాలా కాలం క్రితమే చెప్పారు. పాపం ఇంకెవరిని అడుగుతారు? మనమే ఏదో ఒకటి చేసి పంపాలి.



*(ప్రేమ ఒక కళ)*

# నాకు తెలుస్తుంది

తాము చేస్తున్న పని పట్ల పిల్లలకి ప్రేమ, ఆప్యాయత నేర్పాలి. దాన్నే 'బిలాంగిగ్‌నెస్' అంటారు. స్ట్రెస్ తగ్గటానికి అదొకటే మార్గం. చేస్తున్న పనిని ప్రేమించిన వారికి అలసట ఉండదు. ఎన్నికల సమయంలో ఎన్.టి.ఆర్. అంత తిరిగినా అలసిపోకుండా ఉండటానికి రహస్యం అదే. ఒలంపిక్ పతకం కోసం క్రీడాకారుడు గంటల తరబడి ప్రాక్టీస్ చేసినా, అతడు దాన్ని హార్డ్‌వర్క్ అనుకోడు. స్వేదాన్నే తన ఆయుధంగా భావిస్తాడు.

"వ్రాయటం ఆపి ఎందుకలా సుదీర్ఘంగా ఆలోచిస్తున్నారు?" అని అడిగింది భార్య. రచయిత అసంతృప్తిగా తలూపుతూ "ఎంత ఆలోచించినా ఏది బెటరో, ఎలా వ్రాస్తే బావుంటుందో అర్థం కావటం లేదు" అన్నాడు దిగులుగా.

"ఏమిటది?"

"ఆమె దగ్గరకు వెళ్లి అతడు ముంగురులు సర్దుతూ, 'ఈ రోజు చాలా అలసి పోయినట్టున్నావ్ కదూ' అని ఆప్యాయంగా అన్నాడు..." అని వ్రాయటానికీ; "అతడు ఆమె ముంగురులను ఆప్యాయంగా పైకి సర్దుతూ, 'ఈ రోజు చాలా అలసిపోయినట్టున్నావ్ కదూ' అన్నాడు" అనటానికీ మధ్య ఏది బెటరా అని ఆలోచిస్తున్నాను.

భార్య గట్టిగా నవ్వేసి, "దానికి అంత ఆలోచించటానికి ఏముందండి? రెండిటికి తేడా ఏముంది? ఎవరికి తెలుస్తుంది?" అంది.

రచయిత క్లుప్తంగా, "నాకు తెలుస్తుంది" అన్నాడు.

'ఈ కథ టీన్స్ పిల్లల పెంపకం ఒక కళ అన్న పుస్తకం లోది. అయితే దీనికి ప్రేరణ (ఒరిజినల్ కథ) పక్క పేజీలో చదవండి.)

# పని – నీ తృప్తి కోసం...!



గమనం వేరు. చలనం వేరు. గమనం ఆనందం. అది గమ్యం వైపు సాగుతుంది. చలనం తప్పనిసరి అయిన బాధ్యత. అది విసుగుతో సాగుతుంది. చాలామందికి చదువు పట్ల ఉత్సాహం తగ్గిపోవడానికి కారణం వారు తల్లిదండ్రుల కోసం, బ్రతుకు తెరువు కోసం, కేవలం ఉద్యోగం గమ్యంగా పెట్టుకొని నిస్త్రాణగా చదువుతారు. పని తృప్తినివ్వాలి. తృప్తినిచ్చే పని ఎప్పుడూ అలసటని ఇవ్వదు. దానికి ఉదాహరణగా ఈ ఉత్తమమైన కథ.

మైకెలాంజిలో ప్రపంచపు అత్యుత్తమ చిత్రకారుల్లో ఒకరు. లండన్‌లో ఒక పెద్ద చర్చి కప్పు లోపల వైపున అందమైన పెయింటింగ్‌లు వెయ్యమని అతడిని బ్రిటిష్ ప్రభుత్వం కోరింది. రెండు సంవత్సరాల పాటు కష్టపడి దాన్ని పూర్తి చేసాడు.

స్ట్రెచర్ మీద వెల్లకిలా పడుకుని వేస్తూ వుండటం వల్ల అతడికి లుంబాగో అన్న వ్యాధి వచ్చింది. నడుముకి సంబంధించిన ఈ వ్యాధి వల్ల అతడు చాలాకాలం లేవలేక పోయాడు. ఆ సమయంలో బ్రిటిష్ రాణి చర్చిని చూడటానికి వస్తున్నట్టు కబురు చేసింది. స్ట్రెచర్‌పై పడుకునే మైకెల్ ఫైనల్ ఇన్‌స్పెక్షన్ కోసం వెళ్ళాడు. కప్పుపైన ఒక మూలగా దేవత రెక్కలకి వేసిన కలర్ కాంబినేషన్ అతడికి నచ్చలేదు. మళ్ళీ మంచె కట్టమని అసిస్టెంట్‌ని కోరాడు.

అసిస్టెంట్ ఆశ్చర్యపోయి, "ఈ స్థితిలో మళ్ళీ మీరు పైకి ఎక్కుతారా? అదేమీ తప్పు కాదే. కలర్ కాంబినేషన్ గురించి శ్రమ ఎందుకు? దాని గురించి ఎవరు పట్టించుకుంటారు? ఎవరికి తెలుస్తుంది?" అన్నాడు. మైకెల్ ఆంజిలో ఒక క్షణం నిశ్శబ్దంగా వుండి, చిరునవ్వు మిళితమైన చిన్నదైన స్వరంతో అన్నాడు "...నాకు".

*(చదువు – ఏకాగ్రత)*

# మారని సమాజంలో ఏం చేయాలి?

చాలామంది వ్యక్తులు తాము అలా కష్టాల్లో ఉండిపోవడానికి కారణం తమ నిజాయితీ, చుట్టూ ఉన్న మనుష్యులు, సమాజం అని నెపం వేస్తూ ఉంటారు. మొదటి నుంచీ సమాజం అలాగే ఉంది. బలహీనుడిని బలవంతులు, తెలివితక్కువ వాడిని తెలివైన వాళ్ళు అధిగమిస్తూనే ఉంటారు. సమాజం మారుతుందని ఎదురు చూడకుండా, ప్రస్తుత పరిస్థితుల్లోనే తాను ఎలా మారాలి? అని చెప్పే ఒక ఫాంటసీ కథ ఇది.

**గోవులు కట్రాటలు చేరేవేళ !**

అప్పటివరకూ ఎర్రగా వున్న ఆకాశం, విప్లవ పోరాటంలో ఓడిపోయి తలదించుకున్న యువకుడి వదనంలా నెమ్మది నెమ్మదిగా నల్లబడుతూన్న సమయాన, ఒక ఎత్తైన కొండ శిఖరం ఎక్కి, అక్కడ నుంచి ఒక వ్యక్తి క్రిందికి దూకబోయాడు. గుండెల్నిండా ఆఖరి శ్వాస పీల్చి, అతడు ఆ విధంగా దూకబోతూండగా "... సుబ్బారావూ" అన్న పిలుపు వినిపించింది.

సుబ్బారావు అదిరిపడి వెనుదిరిగి చూసాడు. ఒక వృద్ధుడు దూరంగా నిలబడి ఉన్నాడు. నిర్మలమయిన స్వరంతో "... ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్నావు నాయినా" అని అడిగాడు.

"ఈ ప్రశ్నని – సాహితీ చరిత్రలో కథలు పుట్టినప్పటి నుంచీ, ఆత్మహత్య చేసుకో బోతున్న ఎంతోమందిని, ఆపుచేసిన ఎంతోమంది అడిగి ఉన్నారు స్వామీ! నేను సమాధానం చెప్పగానే 'ఇంత చిన్న విషయానికి ఆత్మహత్య చేసుకుంటావా? భగవంతుడు మనకి జన్మనిచ్చింది ఈ విధంగా సగంలో ముగించుకోవటానికి కాదు...' బాపతు మాటలేవో సిద్ధంగా ఉంటాయి" అన్నాడు సుబ్బారావు.

"నేను ఆపు చెయ్యన్లే. కారణం చెప్పు చాలు! కేవలం ఉత్సుకతతో అడుగు తున్నానంతే."

"నేను మరణించాలనుకుంటున్న కారణం చాలా పెద్దది."

"బాధల్లో వున్న ప్రతివాడూ అలాగే అనుకుంటాడు."

"కానీ నా బాధ వ్యక్తిగతం కాదు" అన్నాడు సుబ్బారావు.

అప్పటివరకూ వృద్ధుడి మొహంలో వున్న నవ్వు మాయమైంది. ఆశ్చర్యంగా "...మరేమిటి?" అని అడిగాడు. "సామాజికం" అన్నాడు సుబ్బారావు. వృద్ధుడి మొహంలో ఆశ్చర్యం ద్విగుణీకృతమైంది. "నాకు సరీగ్గా అర్థం కావడం లేదు. కాస్త వివరించి చెప్పు".

"... నేను చాలా సామాన్యుణ్ణి!" అన్నాడు సుబ్బారావు. "పెద్దగా కోర్కెలు లేని వాడిని. ఎవరినీ నొప్పించకుండా, ఎవరికీ హాని తలపెట్టకుండా, నా బ్రతుకు నేను బ్రతుకుతున్న వాడిని. కానీ రోజు రోజుకీ నా జీవితం దుర్భరమైపోతోంది".

"ఎందుకని?"

"ప్రపంచం అంతా దగా! మోసం!! ఎక్కడ చూసినా మోసమే!! అవతలివాడి అమాయకత్వం మీదా, అజ్ఞానం మీదా ఆడుకుంటూ కోట్లకి పడగెత్తుతున్నారు రాజకీయ నాయకులు. చట్టానికి దొరక్కుండా స్కాముల్లో మిలియనీర్లవుతున్నారు వ్యాపారస్తులు. మా శ్రమని దోచుకుంటున్నారు అధికారులు...! మధ్య తరగతి మనుష్యులకే ఇలా ఉంటే, ఇక బడుగువర్గాల సంగతేమిటి? ఈ వ్యవస్థలో మధ్యతరగతి మనిషిగా బ్రతకటం కన్నా మరో నరకం లేదు" ఆవేశంగా అన్నాడు సుబ్బారావు.

వృద్ధుడు ఒక క్షణం ఆలోచించి, "నువ్వు చాలా సామాన్యుడివనీ, అందుకే ఎవరినీ నొప్పించకుండా నీ బ్రతుకు బ్రతుకుతున్నావనీ అన్నావు కదా! నాకు సరీగ్గా అర్థం కాలేదు. ఒక ఉదాహరణ చెప్పగలవా?" అని అడిగాడు.

సుబ్బారావు విషాదంగా నవ్వేడు. "ఒకటేమిటి? చాలా ఉన్నాయి. మా బావగారు ఇంటికొస్తారు. నేను టి.వి.లో మంచి సినిమా చూస్తూ వుంటాను. ఆయన రాగానే టి.వి. కట్టేసి కబుర్లు చెప్పాలి. అది బోరు."

"పెద్దగా కోర్కెలు లేనివాడిని – అన్నావు కదా! టి.వి. చూడటం మానటానికి అంత బాధెందుకు? అంత బాధపడ్డావూ అంటే, అది పెద్ద కోరికేగా."

"టి.వి. చూడటం పెద్ద కోరికా? మీకేమయినా మతిపోయిందా?"

"ఈ ప్రపంచంలో పెద్ద కోరికలూ, చిన్న కోరికలూ అంటూ ఏముంటాయి? తీరనివి అన్నీ పెద్ద కోరికలే కదా!" అన్నాడు వృద్ధుడు. "... ఎవరికీ హాని తలపెట్టకుండా అందరితో మంచి అనిపించుకుంటూ నీ బ్రతుకు నువ్వు బ్రతుకుతానన్నావు. బహుశ... మీ బావగార్ని బాధపెట్టకుండా ఉండటానికే, నువ్వు ఆయనతో మాట్లాడి వుంటావు."

"అవును. మీరు దాన్ని మొహమాటం అనండి. మంచి లక్షణం అనండి. అది నా స్వభావం."

వృద్ధుడు నవ్వాడు. "... అంతవరకూ కరెక్టే కానీ, నీ బ్రతుకు నువ్వు బ్రతుకుతా నన్నావు. మరి అదెలా సాధ్యం? నీ బావగారు మీ ఇంటికి వచ్చినప్పుడు టి.వి. చూడటం నీ బ్రతుకు. కానీ ఆయన వచ్చి దాన్ని చెడగొట్టాడే! అంటే నీ బ్రతకు నిన్ను బ్రతుక నివ్వలేదన్నమాట. ఆయనతో మంచి అనిపించుకోవటం కోసం మనసులో ఏడుస్తూ టి.వీ. కట్టేసావు."

సుబ్బారావు అయోమయంగా చూసాడు. వృద్ధుడు సాలోచనగా తలపంకించాడు. "నువ్వు ఆత్మహత్య చేసుకునే స్థాయికి వచ్చావూ అంటే, ఎంతో మనోక్లేశం అనుభవించి వుండాలి! పోనీ అవతలి వారిపట్ల కాస్త కటువుగా వుండి, మధ్య తరగతి మనస్తత్వం వదిలి పెట్టవచ్చుగా! అదే విధంగా, ఆర్థికపరమైన విషయాల్లో కొద్దిగా విలువలు కోల్పోతే నష్టం ఏమిటి? దానివల్ల పై రాబడి వుంటుంది కూడానూ."

"ప్రభుత్వాన్నీ, సమాజాన్నీ మోసం చెయ్యలేను. దోపిడీదారి విధానం నాకు నచ్చదు."

"మరి మొన్న, ఎవరికో దక్కాల్సిన రైల్వే బెర్తు, ఆ టి.సి.కి యాభై రూపాయలు లంచం ఇచ్చి ఎందుకు కొనుక్కున్నావు? ఇది దోపిడీ కాదా?"

సుబ్బారావు ఆశ్చర్యంగా "ఇది మీకెలా తెలిసింది?" అని అడిగాడు.

"ఆ టి.సి.ని నేనే"

సుబ్బారావు అతని మొహంలోకి పరకాయించి చూసి, "... కరెక్టే. గుర్తొచ్చింది" అన్నాడు.

"నా ప్రశ్నకి సమాధానం చెప్పలేదు."

"కొన్ని తప్పవు కద్సార్."

"నా కర్థం కాలేదు. ఎవర్నీ మోసం చెయ్యనన్నావు. రైల్వే డిపార్ట్‌మెంట్‌ని మోసం చేసావు..! పెద్దగా కోర్కెలు లేవంటావు. రైల్లో పడుకోవటానికి అనధికారంగా బెర్త్ కావాలంటావు...! నీ బ్రతుకు హాయిగా బ్రతికితే చాలంటావు. బావగారి కోసం టి.వీ. మానేసానంటావు...! తప్పులన్నీ నీలోనే ఉన్నట్టు కనపడుతున్నాయి."

"కాదు. తప్పంతా ఈ సమాజానిదే."

"ఎలాగో చెప్పు."

"అంతస్థుల మీద అంతస్థులు కట్టే వ్యాపారస్తులూ, ఊరి బయట ఫామ్ హౌస్‌లు కట్టే లంచగొండి అధికారులూ, స్వార్థంతో జనాల్ని మోసం చేసే రాజకీయ నాయకులు, వారిని ఆశ్రయించే దొంగ పారిశ్రామిక వేత్తలు, బ్యూరో క్రాట్ వ్యవస్థలో మన్ను తిన్న పాముల్లా పనిచేయని బద్ధకస్తులూ, దొంగలూ, బందిపోట్లూ, క్రమశిక్షణని అసలు పాటించని పౌరులూ... వీరందర్నీ సంస్కరిస్తే దేశం బాగుపడుతుంది. గోడవున్ల లోంచి బ్లాక్ మార్కెట్ సరుకు బయటకి తీయాలి. రేషన్లు పెంచాలి. సగటు మధ్యతరగతి మనిషి ఇంత కష్టపడుతూంటే, అతడి శ్రమని దోచుకునే మోసగాళ్ళ ప్రపంచం పోవాలి. నాకే గానీ ఆ శక్తి ఉంటే, ఇదంతా చేసి చూపిస్తాను." ఆవేశంతో వణికిపోయాడు సుబ్బారావు. ఆత్మహత్యా ప్రయత్నం గురించి తాత్కాలికంగా మర్చిపోయాడు. అతడికి ఎందుకో అప్రయత్నంగా దుఃఖం వచ్చింది! చాలా నిజాయితీతో కూడిన దుఃఖం అది!

ఆవేదనతోనూ, ఆవేశంతోనూ కొనసాగించాడు "... ఈ భూమ్మీద మనిషిగా పుట్టినందుకు, ఆనందంగా జీవించే హక్కు ప్రతి వ్యక్తికీ వుందని నిరూపిస్తాను. కష్టానికి తగ్గ ప్రతిఫలం దొరికేలా చేస్తాను. ప్రొద్దున్నించీ సాయంత్రం వరకూ వ్యాపారం పేరిట సరదాగా గంటల తరబడి ఫోన్‌లలో మాట్లాడి, సాయంత్రాలు ప్రైవేటు మీటింగ్‌ల పేరిట డ్రింక్ చేసే వ్యాపారస్తులకీ, ప్రొద్దున్నించీ సాయంత్రం వరకూ ఆఫీసులో రెక్కలు ముక్కలు చేసుకునే గుమస్తాకీ మధ్య ఆర్థిక వ్యత్యాసం తగ్గిస్తాను. దేవుడే గానీ నాకా శక్తి ఇస్తే, సామాన్యుడి జీవితాన్ని సుఖప్రదం చేస్తాను."

"నేను దేవుణ్ణి. ఆ శక్తి నీకిస్తున్నాను. చెయ్యి." అన్నాడా వృద్ధుడు కామ్‌గా.

సూర్యుడు పూర్తిగా దిగిపోవడంతో బాగా చీకటిపడింది. ఎత్తయిన కొండ అవటం వలన, అక్కడ మాత్రం కాస్త వెలుగుంది. ఆ వెలుగులో వృద్ధుడి మొహం అదో రకమయిన కాంతితో ప్రకాశిస్తూంది. దూరంగా వీస్తూన్న గాలి శబ్దం తప్ప మరేమీ వినబడటం లేదు. "నేనే దేవుణ్ణి" అనగానే, సుబ్బారావు వాక్ప్రవాహం ఆగిపోవటం వలన వచ్చిన నిశ్శబ్దం అది.

వృద్ధుడి మాటలకు సుబ్బారావు విస్తుబోయి, దిగ్భ్రమతో చూసాడు. అయితే అది క్షణకాలం మాత్రమే. వెంటనే తేరుకుని "... నేనింత బాధగా, ఆవేశంగా మాట్లాడుతూంటే జోకులేస్తారా? మనసెంత బాధపడకపోతే నేనీ ఆత్మహత్యా ప్రయత్నం చేసి ఉంటానో ఊహించలేరా? ఈ టైమ్‌లో ఇలా అనటానికి సిగ్గుగా లేదూ?" అన్నాడు.

"సిగ్గెందుకు? నేను దేవుణ్ణి. ఆ మాటే చెప్పాను" అన్నాడా వృద్ధుడు అమాయకంగా.

"పొండీ"

"పొమ్మంటే వెళ్ళిపోతాను. కానీ నువ్వు నా సృష్టి గురించి ఇంకెక్కడా అవాకులూ చెవాకులూ పేలకు. నేను సృష్టించింది కరక్టేనని ఒప్పుకో."

"ఏమిటి కరెక్టు?"

"సింహానికి జింకని ఆహారంగా సృష్టించాను. దానికి జింక ఏడిస్తే ఎలా? జింకకి గడ్డిని ఆహారంగా సృష్టించాను. దానికి గడ్డి ఏడుస్తే ఎలా?" అన్నాడు.

"కానీ మనిషికి ఆహారంగా మనిషిని సృష్టించలేదుగా" సూటిగా అడిగాడు సుబ్బారావు. వృద్ధుడు కాస్త ఖంగుతిన్నట్టు కనపడ్డాడు.

"అవును" అన్నాడు సుబ్బారావు. "... మా ప్రపంచంలో అదే జరుగుతోంది. మనిషి డబ్బుకోసం, అధికారం కోసం, సరదా కోసం సాటి మనుష్యుల్ని తింటున్నాడు."

"నువ్వు చాలా తెలివైన వాడివిలా ఉన్నావే" మెచ్చుకున్నాడు వృద్ధుడు.

"అందుకే ఇలా బ్రతుకుతున్నాను" గొణిగాడు సుబ్బారావు.

**"తెలివైన వాడు నీలా సామాన్యంగా బ్రతకడు. ఎక్కడో లోపం వుంది"** సాలోచనగా అన్నాడు వృద్ధుడు.

"నేను నిజాయితీగా బ్రతుకుతాను. అందుకే ఇలా సామాన్యుడిగా బ్రతుకుతున్నాను."

"ఇంకా ఏదో లోపం ఉంది."

"నేనెవర్నీ మోసం చెయ్యను. కష్టపడతాను. ఆ మాటకొస్తే, చాలామంది కన్నా ఎక్కువ కష్టపడతాను."

ఏదో అర్థమైనట్టు వృద్ధుడు తలపంకించి, "నువ్వు ఊహించే ప్రపంచంలో మోసానికి ఆస్కారం ఉండదు. కష్టానికీ, తెలివికీ ప్రతిఫలం ఉంటుంది. అంతేగా" అన్నాడు.

"నిశ్చయంగా అంతే."

"అయితే అలాగే కానీ! ఈ క్షణం నుంచీ యావత్ ప్రపంచపు మానవాళి మీదా నీకు అధికారాన్ని ఇస్తున్నాను. వారి మంచి కోసం నువ్వు ఏం చేసినా చెల్లుతుంది. తప్పుచేసినవారిపై నువ్వు వేసే శిక్ష, కేవలం నీ మనసులో అనుకుంటే చాలు, నెరవేరుతుంది!! నువ్వు ఎవరికీ జవాబుదారి కాదు. ప్రకృతి మీదా, జంతువుల మీద మాత్రం నీకు అధికారం ఉండదు. నువ్వు అనుకున్న విధంగా మోసాల్ని రూపుమాపు. తెలివికీ, శ్రమకీ గుర్తింపు కలిగించు. వెళ్ళు" అన్నాడు.

సుబ్బారావు ఇటూ అటూ చూసాడు.

"ఏమిటి చూస్తున్నావు?"

"పూవులెక్కడయినా ఉన్నాయోమోనని."

"ఎందుకు?"

"చెవిలో పెట్టుకోవడం కోసం."

"ఎందుకు? నా మీద అంత భక్తి కలిగిందా?"

"మీరు చెప్పేది, దేవుడి దగ్గిర గుళ్లో చెవిలో పెట్టుకునే పూల సంగతి. నేను చెప్పేది వేరే..."

"నేనే దేవుడిని! బ్రహ్మను!! సరస్వతీ దేవి భర్తను!!!" అంటూ చెయ్యి గాలిలో తిప్పి "... ఇదిగో బూడిద" అన్నాడు.

సుబ్బారావు నవ్వాడు. "ఇది మా బాబాలు చాలా సులభంగా చేస్తారు."

"అయితే నీ ఖర్మ..." అన్నాడు వృద్ధుడు. "నువ్విలా సామాన్యుడిగా ఎందుకుండి పోయావో అర్థమైంది. నీకు నమ్మకం లేదు. ధైర్యం లేదు. ఆత్మవిశ్వాసం లేదు. నెం.1కి కావల్సిన ముఖ్య లక్షణమైన ఛాలెంజి లేదు" అని వెనుదిరిగి, నెమ్మదిగా చీకట్లోకి అదృశ్యమైపోయాడు.

పత్రికా విలేకర్ల సమావేశం జరుగుతుంది.

“మిమ్మల్నందర్నీ ఇక్కడికి ఎందుకు పిలిచానో వివరంగా చెప్పాను. మీకేమయినా అనుమానాలుంటే అడగవచ్చు” ఎదురుగా కూర్చున్న వారిని సంబోధిస్తూ అన్నాడు సుబ్బారావు. అందరూ ముసిముసి నవ్వుల్తో మొహాలు చూసుకున్నారు. ఒక పత్రికా విలేఖరి లేచి, “మిమ్మల్ని ‘... ఈ శతాబ్దపు జోకరు’ అని హెడ్డింగ్ పెట్టి సంబోధిస్తే ఏమైనా అభ్యంతరమా?” అని అడిగాడు. అందరూ ఘొల్లున నవ్వారు.

సుబ్బారావు నవ్వలేదు. “నాకభ్యంతరం లేదు” అన్నాడు. “... నేను చెప్పినదంతా మీరు ప్రచురిస్తే.”

“అప్పుడు గానీ మమ్మల్ని మా పత్రికాధిపతులు ఉద్యోగాల్లోంచి తీసెయ్యరు” అన్నాడా విలేఖరి. మరో రిపోర్టర్ నవ్వుతూ “... మీరు ప్రపంచాన్ని మారుస్తారా? అలా అని మమ్మల్ని వ్రాయమంటారా? దానికి నిరూపణగా రేపు టాంక్‌బండ్ దగ్గిర నీటిపై నడుస్తారా? దాన్ని జనం వచ్చి చూడాలా? ఇది వ్రాశాక, జనం అక్కడికొచ్చి చూసి, ఏమీ జరక్క మా పత్రికా కార్యాలయాన్ని తగలబెడితే, అప్పుడుంటుంది ఈ కథకి క్లైమాక్స్” అన్నాడు.

సుబ్బారావు అందరివైపూ చూసాడు. దాదాపు పాతికమంది దాకా వుంటారు. గొంతు సవరించుకుని అతనన్నాడు. “... చూడండి! నేనొక సెన్సేషనల్ న్యూస్ చెప్తా అనగానే ఉద్వేగంగా మీరందరూ వచ్చారు. పిలిచింది ఓ అనామకుడు అని కూడా ఆలోచించలేదు. నేనా సెన్సేషనల్ న్యూస్ చెప్పగానే, నన్నో జోకర్ అన్నారు. అయినా పర్లేదు. ఆ వార్త ప్రచురించండి అని బ్రతిమాలుకున్నాను. నా టీ తాగి, నా బిస్కట్లు తిని, ఇప్పుడు మాట తప్పుతారా?”

విలేఖర్లు కుర్చీల్లోంచి లేస్తోంటే సుబ్బారావు కామ్‌గా అన్నాడు. “మీరీ రోజు ఇంటికెళ్ళేసరికి మీకు కడుపు నొప్పి వస్తుంది. మీరు దేవుడి ముందు నిలబడి – ‘ఈ వార్త ప్రచురిస్తాము’ అనే వరకూ అది తగ్గదు. మీ స్టుపిడిటీతో మిమ్మల్ని మీరు బాధపెట్టుకోకుండా, తొందరగా దేవుణ్ణి ప్రార్థించండి.”

టాంక్‌బండ్ దగ్గర అంత రష్ వుంటుందని అతడు ఊహించలేదు. ఏదో ఒక చిన్న వార్తగా వేస్తారనుకున్నాడు. కానీ ప్రతి పత్రికా ప్రముఖంగా ప్రకటించింది. పైగా మొదటి పేజీలో వేసింది! అయితే, కడుపు నొప్పి బెదిరింపు గురించి ఎవరూ వ్రాయలేదు.

అక్కడ దృశ్యం చూడగానే ‘...ఇంతమంది పనిలేని జనం వుంటారా?’ అని మాత్రం అనిపించింది సుబ్బారావుకి! ఎవరో ఒక వ్యక్తి నీటిమీద నడుస్తాడనగానే, ప్రొద్దున్న

ఎనిమిదింటికి పనులు మానుకుని ఇంతమంది వచ్చారంటే... "థాంక్స్ టు ది అవేర్‌నెస్ ఆఫ్ ప్రొడక్టివ్ టైమ్ ఆఫ్ దిస్ జనం" అనుకున్నాడు. సుబ్బారావుని చూడగానే పెద్ద కలకలం రేగింది. కొంతమంది వెక్కిరిస్తున్నట్టు గోల చేసారు. కొందరు చేతులూపారు. అందరూ చూస్తూ ఉండగా సుబ్బారావు మెట్లు దిగి, నీటిపైన పాదం పెట్టి, రెండు అడుగులు వేసాడు. పాదం నీటిలో మునగలేదు.

అంతే! అక్కడంతా ఒక్కసారిగా నిశ్శబ్దమైపోయింది!

మరో నాలుగు అడుగులు వేసాడు. ప్రవాహం ఆనకట్ట తెంచుకున్నట్టు జనం చప్పట్లు!! హర్షాతిరేకంతో ఒక్కసారిగా గోల మొదలైంది. అలా నీటి మీద నడుచుకుంటూ బుద్ధ విగ్రహం దగ్గరగా వెళ్ళి, పాదాలు స్పృశించి వెనక్కి వచ్చాడు. లైవ్ టి.వి. కవరేజి, విలేఖరులు... అంతా గోలగా వుంది అక్కడ. సుబ్బారావు కాళ్ళ మీద పడటానికి జనం తోసుకొస్తున్నారు.

ఒక విలేఖరి ప్రశ్నించాడు. "మీ తరువాతి కార్యక్రమం ఏమిటి? ఆధ్యాత్మిక బోధనలు చేపడతారా? రోగాలు నయం చేస్తారా? కొత్త మతం స్థాపిస్తారా?"

"ఏమీ చెయ్యను."

"మరి?"

"రేపొద్దున్నే భారత ప్రధానీ, పాకిస్తాన్ ప్రెసిడెంటూ నా దగ్గరకి వస్తున్నారు. కాశ్మీరు సమస్య గురించి వారితో మాట్లాడతాను".

"మీకెందుకు ఇంత హడావుడిగా ఇస్లామాబాద్ నుంచి హైదరాబాద్ రావాలని పించింది?" సుబ్బారావు ఇంట్లోకి ప్రవేశిస్తూన్న పాకిస్తాన్ ప్రెసిడెంట్‌ని టి.వి. ఏంకర్ అడిగింది.

'సిక్స్ సెన్స్" అన్నాడు షవాజ్‌ఖాన్ "...ఒక మంచి పనికోసం మేమెప్పుడూ సిద్ధమే".

అసలు కారణం అది కాదు. సుబ్బారావు నుంచి అతడికి ఫోన్ వెళ్ళింది. ఇండియా దక్షిణ ప్రాంతం నుంచి తనకి ఫోన్ రావటం ఎలా సంభవించిందో, తన పి.య్యేలూ, సెక్రటరీలూ ఏం చేస్తున్నారో, ఈ ఫోన్ కాల్ తనకి డైరెక్టుగా ఎలా వచ్చిందో అతడికి అర్థం కాలేదు.

"నాలుగు రకాల శిక్షలుంటాయి" ఫోన్‌లో సుబ్బారావు అతి క్లుప్తంగా అన్నాడు "... ముందు మీకు కడుపునొప్పి వస్తుంది. అరగంట తరువాత మీ ఆత్మీయుడైన కొడుకో, కూతురో మాయమవుతారు. అంటే, మీకు దూరమై ఇక కనపడరన్నమాట. గంట తరువాత మీకు పక్షవాతం వొచ్చి, శాశ్వతంగా పక్కన పడతారు. ఈ లోపులోనే నన్ను చంపించే ప్రయత్నం చేసారనుకోండి – ఆ ఆలోచన అమలు జరిపే లోపులోనే మీరు నిస్తేజమైపోతారు. ఎంత తొందరగా బయల్దేరితే అంత మంచిది..."

ఈ ఫోన్ కాల్ పూర్తయిన గంటన్నర తరువాత, అంటే... ముందు కడుపునొప్పి, ఆ తరువాత మనవరాలి అదృశ్యం, ఆపైన పక్షవాత లక్షణాలు కనపడిన తరువాత పాకిస్తాన్ ప్రెసిడెంట్‌కి భయం వేసింది. హైద్రాబాద్ బయల్దేరే ఏర్పాట్లు వెంటనే చెయ్యమని ఆజ్ఞలు జారీ చేయగానే, మనవరాలు తోటలోంచి పరుగెత్తుకు వచ్చింది.

ప్రొద్దున్నకల్లా ఇద్దరు ప్రధానులూ సుబ్బారావు ఇంట్లో సమావేశమయ్యారు.

ఇద్దరికీ 'టీ' ఇచ్చాక, భారత ప్రధానితో సుబ్బారావు అన్నాడు "... మొదటి తప్పు మన దేశానిదనీ, కాశ్మీర్‌పై U.N. మధ్యవర్తిత్వానికి 1947లోనే మనం వప్పుకున్నామనీ మీకు తెలుసు..." అని పాక్ ప్రెసిడెంట్ వైపు తిరిగి, "... మత ప్రతిపాదికగా కాశ్మీర్ కోసం పోరాడకపోతే మీ దేశంలో మిమ్మల్ని ప్రెసిడెంట్‌గా ఉంచరు కాబట్టే, మీరీ యుద్ధం చేస్తున్నారని మీకు తెలుసు" అన్నాడు.

ఇద్దరూ మాట్లాడలేదు. సుబ్బారావు కొనసాగించాడు.

"లక్షా పాతికవేల మంది సైనికులు ఇరు పక్షాలా మరణించారు. డెబ్భైవేల మంది కాశ్మీరీలు కాల్చి చంపబడ్డారు. క్షతగాత్రుల సంగతి లెఖ్ఖేలేదు. ఎందుకిదంతా జరుగుతోంది?"

గదిలో నిశ్శబ్దం.

"...మీకు అయిదు నిమిషాలు టైమ్ ఇస్తున్నాను. లోపలి గదిలోకి వెళ్ళి, పరిష్కారంతో బయటికి రండి" అన్నాడు సుబ్బారావు. ఇద్దరూ మొహాలు చూసుకున్నారు.

అప్పుడొక అనూహ్యమయిన సంఘటన జరిగింది. పాకిస్తాన్ సెక్యూరిటీ గార్డుల్లో ఒకరు, ఇంత ఉద్రేకం పట్టలేక, "... ఎవడ్రా నువ్వు? చంపి పారేస్తాను" అంటూ తుపాకీ గురిపెట్టి పేల్చబోయాడు. అంతే. రెప్పపాటు కాలంలో నిస్తేజమై కూలిపోయాడు.

అక్కడ వెంట్రుక పడితే వినపడేటంత నిశ్శబ్దం అలుముకుంది. ప్రేక్షకులు తమ కళ్ళని తామే నమ్మలేకపోయారు. ఆ నిశ్శబ్దంలోంచి సుబ్బారావు స్వరం వినపడింది. "ఈ రోజు నుంచీ ప్రపంచంలో ఎక్కడా టెర్రరిజంగానీ, మనుషుల్ని మనుష్యులు చంపుకోవడంగానీ ఉండవు. అందువల్ల మంత్రులూ, ముఖ్యమంత్రులూ, రాజకీయ నాయకులూ – అందరి వద్ద నుంచీ సెక్యూరిటి ఉపసంహరింపబడుతోంది. వారు కూడా మామూలుగా అసెంబ్లీలకీ, పార్లమెంట్‌లకీ తమ స్వంత కార్లలో వస్తారు."

"వారికి ప్రమాదం జరిగితే...?" ఒక విలేఖరి ప్రశ్నించాడు.

"జరగదు" కఠినంగా అన్నాడు సుబ్బారావు. "... అలా కనీసం ఒక్క సంఘటన జరిగితే, నేను నా ఆజ్ఞల్ని ఉపసంహరించుకుంటాను."

ప్రధానులిద్దరూ లోపలికి వెళ్ళారు. సుబ్బారావు అన్నాడు "... ఈ రోజు నుంచి ప్రతిపక్ష పార్టీల రాస్తారోకోలూ, రోడ్డు మధ్య మృతవీరుల సంస్మరణలూ ఉండవు. ప్రజలకి

బాధ కలిగించే ఏ పనీ, ఏ పార్టీ చేపట్టదు. ఏ మతపు దేవుడి ఆలయమైనా ట్రాఫిక్‌కి అడ్డువస్తే కూల్చి వేయబడుతుంది.”

“జనం వూరుకోరు.”

సుబ్బారావు నవ్వేడు. “... ఊరుకుంటారు! నిజానికి జనం శాంతి కాముకులు. People are in general not bad, but some individuals are! కానీ వారిలో కొందరుంటారు. మిగతా అందర్నీ వారు ఉద్రేకపరుస్తారు. అలా ఉద్యమం ప్రారంభం అవుతుంది. ఇప్పుడిక అలా కాదు. ఎవరయినా ఎదురు తిరగాలనుకున్న మరుక్షణం, నాలుగు శిక్షలూ క్రమ వరుసలో అనుభవించాల్సి వస్తుంది. మొదటి దానితోనే బెదిరిపోతారు.”

లోపల్నుంచి ఇద్దరు ప్రధానులూ వచ్చారు. “...కాశ్మీర్ సమస్యకి పరిష్కారం దొరకలేదు. అందుకే ఒక నిర్ణయానికి వచ్చాం” అన్నారు.

“ఏమిటి?”

“భారత్ – పాకిస్తాన్ క్రికెట్ టీమ్‌కి ఇక నుంచీ ఒక్కరే కెప్టెన్.”

సుబ్బారావు అర్థంకాక, “... ఏమిటి?” అన్నాడు.

“భారత పాకిస్తాన్‌లని కలిపి ఒకే దేశం చేస్తున్నాం.”

“గుడ్...” అన్నాడు సుబ్బారావు. “కానీ పాకిస్తాన్ ప్రజల్ని దీనికి మనస్ఫూర్తిగా వప్పించాలి! ప్రతిసారీ అందర్నీ చంపేస్తామని బెదిరించి తల వంచలేం కదా!” అన్నాడు.

“దీనికో దారి ఆలోచించాం. పాకిస్తాన్ ఇండియా మీద దండెత్తి, మొత్తం దేశాన్ని... అంటే, కన్యాకుమారి వరకూ ఆక్రమించుకుంటుంది” అన్నారు భారత ప్రధాని. సుబ్బారావు అదిరిపడి “ఏమిటి మీరనేది?” అని అడిగాడు. ప్రధాని నవ్వి, “అవును. అప్పుడు ఎలక్షన్స్ జరుగుతాయి. కాంగ్రెస్, బి.జె.పిలకి కలిపి అవామీలీగ్ (పాకిస్తాన్ పార్టీ) కన్నా ఎలాగో మూడింట రెండొంతులు మెజారిటీ వస్తుంది. ఇస్లామాబాద్ నుంచి రాజధానిని ఢిల్లీకో, అమృత్‌సర్‌కో మారుస్తాం” అన్నారు.

“మీరు రాజకీయ నాయకులు ఎలా అయ్యారో ఇప్పుడు అర్థమైంది” అంటూ, విలేఖర్ల వైపు తిరిగి ఏదో చెప్పబోయాడు. అప్పటికే వారు లేరు. కాశ్మీర్ సమస్య పరిష్కారం అయిందన్న సంచలన వార్త ప్రచురించటానికి ఆఘమేఘాల మీద వెళ్ళిపోయారు.

ఆ రాత్రి సుబ్బారావుకి బ్రహ్మ కలలో కనిపించి “... నీలో ఒక విషయం నాకు బాగా నచ్చింది” అన్నాడు.

“ఏమిటి స్వామీ?”

"నేను ఇన్ని అధికారాలు నీకిచ్చినా, వాటిని స్వార్థం కోసం వాడుకోలేదు. ప్రపంచానికి ఏకఛత్రాధిపత్యం వహించేటన్ని గొప్ప శక్తులు నీకున్నా, వాటిని అన్యాయంగా ఎవరి మీదా ప్రయోగించలేదు. నువ్వు గొప్పవాడివి. కానీ..." అని ఏదో చెప్పబోతూండగా సుబ్బారావు అడ్డతగిలి "... నిజానికి కాశ్మీరు సమస్య చాలా చిన్నది స్వామీ. పరిష్కరించవలసినవి చాలా ఉన్నాయి" అన్నాడు. దేవుడు ఇంకా ఏదో అనాలనుకుని, మనసు మార్చుకుని, "నేను గమనిస్తూ వుంటాను" అంటూ మాయమైపోయాడు.

ప్రొద్దున్నే సుబ్బారావు ప్రకటించాడు.

"ఈ రోజు నుంచీ ఎవరయినా లంచం తీసుకుంటే, మరుక్షణమే వారికి కడుపు నొప్పి వచ్చి, వరుసగా మిగతా శిక్షలు అమలు జరుగుతాయి" అని.

క్షణాల్లో ఆ వార్త ప్రపంచం అంతా పాకిపోయింది. నిజానికి సుబ్బారావు ఇల్లు పెళ్ళి పందిరిలా విలేఖర్లతో కళకళలాడుతోంది. అన్నీ సంచలన వార్తలే.

"... ఇన్‌కంటాక్స్‌లో తప్పుడు లెక్కలు చూపించినా, కమర్షియల్ టాక్స్‌లు ఎగ్గొట్టినా, దొంగ కరెంట్ కనెక్షన్ తీసుకున్నా, రిజిస్ట్రార్ ఆఫీసుల్లో బ్లాక్‌మనీతో ఆస్థులు కొన్నా – వెంటనే, దానంతటదే క్షణాల్లో శిక్ష విధింపబడుతుంది. భగవంతుడే సాక్షి కాబట్టి అప్పీలు లేదు. దేశంలో జనమంతా గత పది సంవత్సరాల్లో ఎంత టాక్సులు ఎగ్గొట్టారో, ఆ మొత్తం పది రోజుల్లోగా సగం చెల్లించెయ్యాలి. లంచాల్తో భవంతులు నిర్మించిన ఐ.ఏ.యస్. ఆఫీసర్లు, ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు మొదలైనవారూ, రాజకీయాల్ని అడ్డం పెట్టుకుని కోట్లు సంపాదించినవారూ అందులో సగం ప్రభుత్వానికి పదిరోజుల్లో అందజెయ్యాలి..."

పదిరోజుల తరువాత ప్రధానమంత్రి సుబ్బారావుకి ఫోన్ చేసారు. "కంగ్రాచ్యులేషన్స్. భారతదేశపు విదేశీ ఋణాలన్నీ తీరిపోయాయి. మొత్తం ఎంత డబ్బు వసూలు అయిందో తెలుసా? పదివేల వేల కోట్లు..."

సుబ్బారావు గొంతు తడారిపోయింది. "...అంత దుర్మార్గపు సొమ్ము వుందా" అన్నాడు.

"ఈ వ్యవహారంలో, దేశం మొత్తం మీద వందమంది దాకా మరణించారు. చివరి వరకూ తమ అక్రమార్జితాన్ని వదులుకోవటానికి ఇష్టపడని వారన్నమాట..." అని ఫోన్ పెట్టేసారు ప్రధాని.

సాయంత్రం అయిదయింది.

సుబ్బారావు రోడ్డు మీదకి వచ్చి చూసాడు. ఎక్కడా ట్రాఫిక్ జాముల్లేవు. No Parking అని వ్రాసివున్న దగ్గర కనీసం సైకిలు కూడా చట్ట విరుద్ధంగా ఆపిలేదు. అడ్డదిడ్డంగా కుడి వైపుకి తిరగటాలూ, సందుల్లోంచి దూసుకు రావటాలూ లేవు. ఎర్రలైటు

వెలిగిన తరువాత ముందుకొచ్చిన వాహనదారులు, కడుపునొప్పి వచ్చి, చప్పున వెనక్కి వెళ్ళిపోతున్నారు.

అసెంబ్లీ, పార్లమెంటుల్లో ఏ గొడవలూ లేవు. విసిరికొట్టటానికి మైకు పట్టుకోబోయే లోపులోనే, కడుపునొప్పి లోపల్నుంచి తన్నుకుంటూ వచ్చేస్తోంది. ఆఫీసుల్లో ఉద్యోగస్థులు కేవలం లంచ్ టైమ్‌లోనే బయటకు వస్తున్నారు. అధికార్లు కుటుంబాల్తో పిక్నిక్‌లకీ, యాత్రలకీ ఆఫీసు వాహనాల్లో తిరగటం మానేసారు.

కోర్టుల్లో కేసులు తొంభైశాతం తగ్గిపోయాయి. అడగ్గానే నేరస్థులు, నేరం వప్పేసు కుంటున్నారు. ఆ మాట కొస్తే, అసలు నేరాలే లేవు. నేర స్వభావంతో కూడిన ఆలోచన రాగానే వార్నింగ్‌లాగా కడుపు నొప్పి వస్తోంది. అక్కడితో ఆగక, నేరం ప్రారంభించబోతే, రెండో శిక్ష రెడీగా వుంటోంది.

ఈ లోపులో సుబ్బారావు మీద పది, పదిహేనుసార్లు హత్యాప్రయత్నాలు జరిగాయి. అయితే, ఆ దుండగులు అతడి మీదికి హత్యాయుధం విసిరే లోపులోనే కుప్పకూలిపోయారు.

కాశ్మీర్ నుంచీ, ఇజ్రాయేల్ వరకూ టెర్రరిజం అనేదే లేదు. ఆడవాళ్ళు అర్ధరాత్రి నడిరోడ్డు మీద తిరుగుతున్నారు. ఇంటర్వ్యూల్లో రికమెండేషన్లు లేవు. ప్రమోషన్లు సక్రమంగా వస్తున్నాయి. రేషను, గ్యాసూ, కరెంటూ, నీళ్ళూ – అన్నీ పుష్కలంగా లభిస్తున్నాయి. ఇదంతా సాంఘిక పరిణామం!

ఆర్థిక పరిణామం ఇంత ఆశాజనకంగా లేదు. లంచగొండులందరూ తమ ఆస్థుల్లో సగాన్ని పది రోజుల్లోగా ప్రభుత్వానికి అందజేయాలని సుబ్బారావు ప్రకటించగానే రియల్ ఎస్టేట్ ధరలూ, బంగారం నగల ధరలూ, వాహనాల ధరలూ మొత్తం అన్ని పడిపోయాయి. పదిరోజుల్లో ఆస్థి అమ్మి కట్టాలనేసరికి, వాటిని కొనేవాడు ఎవరూ దొరకలేదు. చాలా మంది లంచగొండ్లు '...ఆఁ! మన గురించి ఎవరికి తెలుస్తుందిలే' అనుకుని 'పదోరోజు' వరకూ వూరుకున్నా, పదకొండో రోజు కడుపు నొప్పితో పరుగెత్తి, అయినకాడికి ఆస్థులు అమ్మేసేరు. ఆమాటకొస్తే, సుబ్బారావుకి కూడా నొప్పి వచ్చింది. కారణం ఆలోచించగా, ఆరేళ్ళ క్రితం, ఆఫీసులో ఎవరికో ఏదో పనిచేసి పెట్టినందుకు వారు కృతజ్ఞతా పూర్వకంగా అందించిన అర్ధవెయ్యి నూట పదహార్ల విషయం గుర్తొచ్చింది. ఆ తరువాత, లంచాలు దొరికే ఆ డిపార్ట్‌మెంట్ నుంచి బదిలీ అయిన కారణంగా, ఆ విషయం మర్చిపోయాడు.

అతడు బాధపడలేదు. తప్పులు చేయటం మానవ సహజం అని అతడికి తెలుసు. అపరాధ రుసుము 'పూర్తిగా' వెనక్కు చెల్లించేసాడు.

ఇక దేశంలో మిగతా ఆర్థిక పరిణామాల విషయం తీసుకుంటే, ధరలు విపరీతంగా పడిపోవటమే కాకుండా, మరో వూహించని సంఘటన జరిగింది. అయితే, అది చర్చించటానికి ముందు సుబ్బారావు గురించి చెప్పాలి.

అతనేం మారలేదు. ఆ సందులోనే, అదే చిన్న ఇంట్లోనే ఉంటున్నాడు. అక్కడ రద్దీ మాత్రం పెరిగిందంతే. అతడు చేస్తున్న సంస్కరణలని, ప్రపంచమంతా దిగ్భ్రమతో, ఉత్సుకంగా చూస్తోంది.

ఆ సాయంత్రం ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా స్వయంగా సుబ్బారావు ఇంటికి వచ్చారు. "... ఏం చెయ్యాలో పాలుపోవటం లేదు" అన్నారు.

"ఏ విషయం?"

"నిరుద్యోగం..." అన్నారు రాష్ట్రపతి. "...మిలట్రీ అవసరం పోయింది. ఉగ్రవాదులు లేరు కాబట్టి B.S.F. ని తీసేసాం. ట్రాఫిక్ పోలీసుల్తో సహా, ఎవరికీ పనిలేదు. ఇన్‌కంటాక్స్, కమర్షియల్ టాక్స్, రిజిష్టార్ ఆఫీసుల్లో ఉద్యోగస్తులే కాకుండా లాయర్లు, జడ్జీలు, సి.బి.ఐ. ఆఫీసర్లూ – అందరూ ఖాళీ అయిపోయారు."

"మరి రాజకీయ నాయకులు? వారి కార్యకర్తలు" సుబ్బారావు ప్రశ్నించాడు.

"సామాన్యంగా, ఇంత రాజకీయ స్థబ్దతని వారు భరించలేరు. మామూలు పరిస్థితుల్లో అయితే ఏదో ఒక గొడవ తెచ్చి ప్రజల్ని బాధపెట్టేవారు. కానీ ఇప్పుడు, అలాంటి ఆలోచన రాగానే కడుపునొప్పితో బాధపడుతున్నారు" ప్రెసిడెంట్ నవ్వేరు. "... ప్రస్తుతం సమస్య అది కాదు. ఈ సంస్కరణల వల్ల ఈ రోజు కరెక్టుగా మనదేశంలో ఎంతమంది పనిలేకుండా ఉన్నారో తెలుసా?"

"ఎంతమంది?"

"లాయర్లూ, పోలీసులూ, మిలటరీ, ఉద్యోగస్తులూ... అంతా కలుపుకుంటే... దాదాపు పాతికకోట్లు!!!"

❦ ❦ ❦

సుబ్బారావు గుండె ఓ క్షణం కొట్టుకోవటం ఆగిపోయింది. తడారిన గొంతుతో "... పాతిక కోట్లా?" అన్నాడు. "... అంటే, మొత్తం దేశ జనాభాలో నాలుగోవంతు!! యువతలో నూటికి యాభైమంది!!!" అన్నాడు.

"అవును. ట్రాఫిక్ కానిస్టేబుల్స్ అవసరం పోయింది. గవర్నమెంట్ ఆఫీసుల్లో సగం మందికి పనిలేదు. వారు ఇంతకాలం ప్రొద్దున పదినించీ సాయంత్రం అయిదు వరకూ చేసే పని – ఒక గంటలో అయిపోతోంది. అంతవరకూ ఎందుకు? కాంట్రాక్టర్లు రోడ్లు సరీగ్గా వేస్తున్నారు. అందుకని సూపర్‌వైజర్ల అవసరం పోయింది. టిక్కెట్‌లు లేకుండా ఎవరూ ప్రయాణం చేయటం లేదు. అందుకని రైల్వే టి.సి.ల అవసరం లేకుండా పోయింది. ఇలా ఇన్ని కోట్ల మంది ఖాళీగా ఉన్నారు. ఏం చెయ్యాలో తోచటం లేదు."

"కాలువలు తవ్వించండి" గంభీరంగా అన్నాడు సుబ్బారావు.

ప్రెసిడెంట్ ఉలిక్కిపడి, "....ఏమిటీ" అన్నారు.

"అవును. బీహార్లో వరదలకీ, ఆదిలాబాద్‌లో ఆకలికీ కారణం, నదుల మధ్య సంధానం లేకపోవటమే! గోదావరికీ, కృష్ణకూ మధ్య పది కాలువలు తవ్వమనండి! అలాగే బ్రహ్మపుత్ర – గంగా – కావేరీల మధ్య కూడా!! ఇంతమంది లేబర్ ఖాళీగా ఉండటం నిర్హేతుకం!!!"

"ఈ ఆలోచన బావుంది" అని ప్రెసిడెంట్ వెళ్ళిపోయారు.

ఆయన వెళ్ళాక సుబ్బారావు ఆలోచనలో పడ్డాడు. "దేశ సౌభాగ్యానికి Land, Labour, Capital, Organisation కావాలి. నిజమే! మరి... ఇంతమంది ఇంత కష్టపడుతున్నప్పుడు, తాతముత్తాతల ఆస్థులు అనుభవిస్తున్న వారి మాట ఏమిటి? గ్రామాల్లో పొలాలు కౌళ్ళకి ఇచ్చి, పట్నాల్లో పేకాడే వారి సంగతి ఏమిటి? ఫాన్‌ల క్రింద, ఎ.సి. రూముల్లో పనిచేసేవారు ఎండలోకి రావాలి. తప్పదు." అనుకున్నాడు.

దాని ఫలితంగా, ఆ మరుసటి రోజు అతడు, "దున్నేవాడిదే భూమి" అని ప్రకటించాడు. "అద్దెకున్న వాడిదే ఇల్లు" అందామనుకున్నాడు గానీ, తానొక పోర్షను అద్దెకిచ్చిన విషయం గుర్తొచ్చి ఆ ఆలోచన మానుకున్నాడు. ఈ లోపులో ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా కాలువలు తవ్వించటం, ఆనకట్టలు కట్టించటం లాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. రైతులూ, శ్రామికులూ ఉత్సాహంతో పనిచేస్తున్నారు. మధ్యతరగతి ఉద్యోగస్థులు మాత్రం ఎండా, వానా, శ్రమా, స్వేదం అలవాటు లేక ఇబ్బంది పడుతున్నారు. అయినా ఎవరూ నోరు విప్పటం లేదు. అన్నిటికన్నా గొప్ప పరిణామం ఏమిటంటే, టి.వి. ఛానెళ్ళలో చర్చలూ, పత్రికల్లో సంచలన వార్తలు, ప్రజల్ని రెచ్చగొట్టే న్యూస్‌లూ పోయాయి.

కాలువల నిండా నీళ్ళు, పొలాల నిండా పైర్లు.

మహబూబ్‌నగర్ నుంచీ థార్ ఎడారి వరకూ సస్యశ్యామలమయింది.

పదిరెట్లు ఎక్కువ దిగుబడి వచ్చింది.

కొనేవాళ్ళు తక్కువ. అమ్మేవాళ్ళు ఎక్కువ. ఫలితంగా బియ్యం ధర వంద నుంచీ, పది రూపాయలకి పడిపోయింది.

"దీన్ని నేను ఊహించలేదు" అన్నాడు సుబ్బారావు. "అయినా ఇదీ ఒకందుకు మంచిదేగా."

"ఎలా?" అన్నారు ప్రధాని. "... బస్తా బియ్యం పండించటానికి పదిహేను రూపాయల ఎరువులూ, పది రూపాయల పురుగుల మందూ, ఇరవై రూపాయల మిగతా ఖర్చులూ అవుతాయి. దాన్ని పదికి అమ్మితే నష్టం వొచ్చి, ఆత్మహత్య చేసుకోవటం తప్ప – రైతులకి గత్యంతరం లేదు."

సుబ్బారావు ఓ క్షణం ఆలోచించి "... ప్రభుత్వాన్నే రైతుల దగ్గర్నుంచి మొత్తం బియ్యం కొనెయ్యమనండి" అన్నాడు. వెంటనే ఆ పథకం అమలులోకి వచ్చింది. భారతదేశపు Food Corporation of India గోడవున్లల్లో 2000 మిలియన్ టన్నుల ఆహారధాన్యాలు స్టోర్ చేయబడ్డాయి.

కానీ ఆకలి చావులు అలాగే ఉన్నాయి. రైతులు బాగానే ఉన్నారు. కూలీలూ, మిగతా B.P.L. (బిలో పావర్టీ లైన్) జనాలూ ఆకలి చావుల వైపు పయనించసాగారు.

భారత రాజ్యాంగం, మనిషికి "... జీవించే హక్కు" ఇచ్చింది కాబట్టి, ప్రభుత్వమే BPL జనాన్ని బ్రతికించాలని మానవహక్కుల సంఘం వేసిన కేసుకి ప్రతిస్పందిస్తూ, సుప్రీంకోర్టు ఒక చరిత్రాత్మకమైన తీర్పు ఇచ్చింది. గోడవున్లలో దాచిన బియ్యాన్ని ప్రభుత్వమే బీదలకి ఉచితంగా పంచాలని ఆ తీర్పు సారాంశం.

ఎలా? ఎలా ఆ బీద జనాల్ని గుర్తించటం? ఒకవేళ కష్టపడి గుర్తించినా, కొంతకాలం పాటూ పంచవచ్చు. ఆ తరువాత...? తమకి ఉచిత బియ్యం కావాలని అందరూ ఎగబడితే...?

"ఏమిటిది? ఎందుకిలా జరిగింది?" అరిచాడు సుబ్బారావు. ఎవరూ మాట్లాడలేదు. దేశానికి సంబంధించిన అత్యున్నత అధికారులూ, మేధావులూ అక్కడ ఉన్నారు. వారిలో కొందరికి ఎందుకిలా జరిగిందో సమాధానం తెలుసు. పరిష్కారమే తెలీదు.

సుబ్బారావు అన్నాడు. "బ్లాక్ మార్కెటీర్లూ, లంచగొండులూ మనకి అర్పించిన కోట్లు కోట్లు ధనం ఉండాలి కదా".

"కొన్ని కోట్ల మంది నిరుద్యోగులతో కాలువలు తవ్వించి, జీతాల రూపేణా పంచేము కదా!" అన్నాడు ఒక అధికారి.

సుబ్బారావు మరింత ఇరిటేట్ అయి, "... అందరూ నిజాయితీగా పన్నులు చెల్లిస్తున్నారుగా, ఆ డబ్బంతా ఏమవుతోంది?" అని అడిగాడు.

"రాబడి ప్రకారం కరెక్టుగానే చెల్లిస్తున్నారు. కానీ రాబడే తగ్గిపోయింది."

"ఎందుకు?"

దానికి సమాధానం చెప్పటానికన్నట్టు, ఒక సన్నటి సూటు వ్యక్తి ఆ హాల్లోకి ప్రవేశించాడు. "...ప్రైవేటు కంపెనీల తరపున ప్రతినిధిగా నన్ను పంపించారు. మీతో ఒక ముఖ్య విషయం చెప్పటానికి వచ్చాను."

"ఏమిటిది?" అడిగారు ప్రధాని.

"రేపటి నుంచీ వారు తమ పరిశ్రమలన్నీ మూసేస్తున్నారు."

అక్కడున్న వాళ్ళందరికీ ఒక పెద్ద ఉప్పెన కెరటం వచ్చి కొట్టినట్టు అనిపించింది.

"అంతేకాదు. దేశంలోని మిగతా పెద్ద పెద్ద కంపెనీలన్నీ ఇదే నిర్ణయాన్ని తీసుకోబోతున్నాయి" అంటూ పూర్తి చేసాడు.

"ఏం... ఎందుకు?" అడిగాడు సుబ్బారావు.

"మీ మొదటి ప్రశ్నకి సమాధానం చెప్తాను" అన్నాడు ఆ సన్నటి వ్యక్తి. అతడి కోటు సామాన్యంగా వుంది. కళ్ళలో మేధావితనం తొంగిచూస్తోంది. నిర్లక్ష్యపు చూపులో అపారమైన జ్ఞానం ప్రతిబింబిస్తోంది. అతనీ విధంగా అన్నాడు. "ప్రభుత్వానికి రాబడి ఎందుకు తగ్గిందని మీ మొదటి ప్రశ్న! దానికి సమాధానం చాలా చిన్నది. మీ సంస్కరణలకి ముందు, ఏడాదికి యాభై లక్షలు సంపాదించే వ్యక్తి, నలభై లక్షలు బ్లాక్‌మనీ దాచేసి, పదిలక్షల మీదా నాలుగు లక్షలు ఇన్‌కంటాక్స్ కట్టేవాడు. ఇప్పుడు నిజాయితీగా ముప్పైఆరు లక్షలు కట్టాల్సి వస్తోంది. అంటే పద్నాలుగు లక్షలే మిగుల్తోంది. అంత తక్కువ మిగిలేటప్పుడు, ఎందుకింత ఎక్కువ కష్టపడటం? అని వ్యాపారాన్ని తగ్గించేసేడు. అందుకని ప్రభుత్వానికి రాబడి తగ్గిపోయింది."

కరెక్టే అన్నట్టు అందరూ తలలూపారు.

"... ఇక రెండో విషయానికి వద్దాం. టాటా, బిర్లా లాంటి సంస్థల్లో ఎందరో మేధావులూ, సెక్రటరీలూ, కమర్షియల్ టెక్నీషియన్లు పని చేస్తున్నారు. మనదేశంలో అలాంటి వ్యాపార సంస్థలు దాదాపు అయిదువేల దాకా ఉన్నాయి. వీటి చీఫ్‌లు విమానాల్లో, అయిదు నక్షత్రాల హోటల్స్‌లో, విలాసవంతమైన జీవితానికి అలవాటు పడ్డారు. రోజువారీ ఆఫీస్ మేనేజ్‌మెంట్‌లో అంతే కష్టపడతారు కూడా!" ఆగాడు. అందరూ నిశ్శబ్దంగా వింటున్నారు. అతడు కొనసాగించాడు. "ఈ మేధావులందరికీ PERKS పోయాయి. పూర్వంలాగా, వీరికిచ్చే సౌకర్యాలన్నీ ఇప్పుడు ఇవ్వటానికి కుదరటం లేదు. అందుకే వారి పని నైపుణ్యం తగ్గి జడత్వం వచ్చింది. అంతేకాదు, మనం చేసిన అనూహ్యమైన సంస్కరణల వల్ల, అన్ని ఆస్థుల ధరలూ పడిపోయాయి. యాభై లక్షల విలువ చేసే భవంతి ధర రెండు లక్షలయింది. ఎందుకంటే... ప్రస్తుతం యాభై లక్షలు ఎవరి దగ్గరా లేవు. నిజాయితీగా టాక్సులు కడుతూ, అంత డబ్బు సంపాదించటం ఈ పరిస్థితుల్లో ఏ మనిషికయినా దాదాపు అసాధ్యం!! అదేవిధంగా ఇంతకుముందు RTO లూ, బ్రేక్ ఇన్‌స్పెక్టర్లూ, పోలీస్ అధికార్లూ – అందరూ స్టార్ హోటల్స్‌కి వెళ్ళేవారు. ప్రస్తుతం వారి వద్ద డబ్బు లేదు. అందుకని కస్టమర్లు లేక హోటల్స్ అన్నీ దాదాపు మూతబడిపోయాయి."

"మరి ఈ డబ్బంతా ఎక్కడికి వెళ్లింది."

"సామాన్యులకి" జవాబు ఇచ్చాడు ఎకానమిస్టు. "... ధరలు పడిపోవటంతో మధ్యతరగతి వారు బాగుపడ్డారు. ఏ పనీ చెయ్యకపోయినా క్రింది తరగతి వారికి మాత్రం పుష్కలంగా తిండి లభిస్తోంది."

"నేను కోరింది అదే–" సంతోషంగా అన్నాడు సుబ్బారావు.

"కానీ ఇదంతా తాత్కాలికం." అన్నాడు సూటు వ్యక్తి. "తొందర్లోనే ఈ వ్యవస్థ అంతా అల్లకల్లోలం కాబోతూంది. తెలివికి సరిపడా సౌఖ్యం లేదు కాబట్టి మేధావులు ఆలోచించరు. పారిశ్రామికవేత్తలు పనిచేయరు. ధర రావటం లేదు కాబట్టి, రైతులు కేవలం తమకి కావలసినంత ధాన్యమే, ఎరువులు మందులూ లేకుండా పండించుకుని తింటారు. కేవలం Land, Labour మాత్రమే వుంటుంది. Capital, Organisation ఉండవు. అంటే... మళ్ళీ మన ప్రపంచం ఇరవైవేల సంవత్సరాల వెనక్కి వెళ్ళిపోతుంది అన్నమాట. ఇన్ని కోట్ల మందిని పోషించటానికి ప్రభుత్వం దగ్గర డబ్బు ఉండదు. విప్లవం వస్తుంది."

"విప్లవం రాదు" కఠినంగా అన్నాడు సుబ్బారావు.

"పోనీ కడుపునొప్పి వస్తుంది."

అందరూ నవ్వేరు.

"ఏదైనా అంతిమ పరిణామం అదే! మనిషికి కావల్సింది కేవలం తిండీ, నీరూ గుడ్డా అయితే, వాటిని దేశం మొత్తానికి సరిపడా తయారుచేయటానికి, దేశంలో పదోవంతు మంది జనం చాలు. మిగతావారు వాటిని ఎలా కొనుక్కోగలరు? వారికి రాబడి ఎక్కణ్ణుంచి వస్తుంది? మామూలు పరిస్థితిలో అయితే విప్లవం వచ్చేది. ఇప్పుడు నీకు భగవంతుడు అండగా ఉన్నాడు కాబట్టి, ఎవరూ అలాంటి సాహసం చెయ్యరు. క్రమంగా క్షీణించిపోతారు! సమసమాజం అంటే, పై వాళ్ళని క్రిందికి దింపటం కాదు. క్రిందివాళ్ళలో ప్రొడక్టివిటి పెంచటం."

"మీరెవరు?" అడిగాడు సుబ్బారావు.

"ఎకనామిక్స్‌లో UTILITY THEORY కనుక్కున్న మార్షల్‌ని."

సుబ్బారావుకి కసితో కూడిన దుఃఖం వచ్చింది. "ఇదంతా, నేను నా కోసం చెయ్యలేదు. జనావళి కోసం చేసాను" అన్నాడు.

"అందులో మాకేం అనుమానం లేదు."

"ప్రజలందరినీ సుఖంగా ఉంచమని భగవంతుడిని అడుగుతాను."

"ప్రకృతి మీద నీకేం అధికారం లేదనీ, కేవలం మనుషుల్ని మాత్రమే శాసించగల అధికారం నీకిస్తున్నాననీ భగవంతుడు ఆ రోజే నీకు చెప్పాడుగా!"

"అవును"

"కాబట్టి, మనం ఏ చేస్తే బావుంటుందో నువ్వే చెప్పాలి. మధ్యతరగతి వారికి మరిన్ని సుఖాలు ఇస్తే సమసమాజం రాదు. అదేవిధంగా, క్రింది తరగతిని అణగద్రొక్క కూడదు. కానీ ఉచితంగా అన్నీ ఇవ్వకూడదు. అదేవిధంగా పై వర్గాల్లో లంచగొండితనం, మనలో పని పట్ల అలసత్వం, రూల్సు పట్ల అగౌరవం – అన్నీ పోవల్సిందే!! కానీ అదొక్కటే కాదు. ఇంకేదో కావాలి. ఏమిటది? తెలుసుకుని మాకు చెప్పు సుబ్బారావ్. ఆచరించటానికి మేము సిద్ధంగా ఉన్నాం" అన్నాడు ప్రధాని.

సుబ్బారావు చేతివేళ్ళు జుట్టులోకి జొప్పించి కళ్ళు మూసుకుని మనసులో, "భగవంతుడా! నేనేం చెయ్యాలో చెప్పవయ్యా" అని ప్రార్థించాడు.

ఏం చెయ్యాలో అతడికి ఆ సాయంత్రం తెలిసింది.

❀ ❀ ❀

గోవులు కట్రాటలు చేరేవేళ!

విప్లవ పోరాటంలో వోడిపోయి తలదించుకున్న యువకుడి వదనంలా, అప్పటివరకూ ఎర్రగా వున్న ఆకాశం, నెమ్మది నెమ్మదిగా నల్లబడుతున్న సమయాన, ఎత్తైన కొండ శిఖరం పైన నిలబడి, "భగవంతుడా" అని అరిచాడు అతడు.

బ్రహ్మ ప్రత్యక్షమయ్యాడు. కానీ అతడంత సంతోషంగా లేడు. "...నువ్వెందుకు పిలిచావో, ఎలా ఓడిపోయావో అర్థమయింది. కానీ ప్రస్తుతం నా పరిస్థితి కూడా అలాగే ఉంది. నీకు ఆ వరం ఇవ్వటం ద్వారా నేను చాలా దెబ్బ తిన్నాను" అన్నాడు.

"ఏమైంది స్వామీ?"

"వెంకటేశ్, జగన్నాథ్, స్వామి నాపై దండెత్తారు."

సుబ్బారావ్‌కి అర్థంకాక, "...వారెవరూ?" అని అడిగాడు. ఈసారి ఆశ్చర్యపోవటం బ్రహ్మవంతయింది. "వెంకటేశ్వరస్వామీ, పూరీ జగన్నాథ్, స్వామీ అయ్యప్ప తెలీదా?" అన్నాడు ఆశ్చర్యంగా.

సుబ్బారావు దిగ్భ్రాంతితో, "వారు మీ స్వరూపాలేగా! మీ మీద ఎందుకు దండెత్తటం?" అని అడిగాడు.

"డబ్బు కోసం" అన్నాడు బ్రహ్మ. "... డబ్బు రుచి తెలిసాక అవతారాలూ స్వరూపాలూ ఉండవు. ఏడుకొండలవాడు సౌఖ్యాల్ని అస్సలు వదులుకోడు. అందుకే నాపై దండెత్తాడు. అసలు దీనంతటి వెనక వున్నది కృష్ణుడని నా అనుమానం."

"మీరు చెపుతున్నది ఒక్క ముక్క నాకు అర్థం కావటం లేదు."

"చెప్తా విను. ఎక్కడ పాపం వుందో అక్కడ భయం వుంటుంది. ఎక్కడ భయం వుందో, అక్కడ భక్తి వుంటుంది. ఎక్కడ భక్తి వుందో, అక్కడ గుడి వుంటుంది" ఆగాడు.

సుబ్బారావుకి ఏదో కొద్దిగా అర్థమవుతున్నట్టు అనిపించసాగింది.

బ్రహ్మ చెప్పాడు "... నువ్వు అమలు జరిపిన సంస్కరణల వల్ల జనంలో పాపభీతి నశించింది! పాపం చెయ్యటానికి ఆస్కారం లేదు! అందువల్ల భయం లేదు!!! దానికన్నా ముఖ్యంగా..." ఆగి నెమ్మదిగా అన్నాడు. "...కోర్కె తగ్గిపోయింది. సంపద లేదు. గొప్ప గొప్ప సౌఖ్యాలు లేవు. అందుకే పెద్దగా కోరికలూ లేవు."

"అవును. అది నేను గమనించాను."

"ఎక్కడయితే కోరికా, భయమూ లేదో, అక్కడ దేవుడి అవసరం ఏముంటుంది? అందుకే ఈ గుళ్ళకి భక్తుల తాకిడి తగ్గిపోయింది. అందరికన్నా ముఖ్యంగా ఏడుకొండల వాడికి! ఇటీవలి కాలంలో అతడు చాలా దర్జాలకి అలవాటు పడ్డాడు."

"అవును. కాపిటలిస్టు" కసిగా అన్నాడు సుబ్బారావు. బ్రహ్మ అతడివైపు దయగా చూసాడు. కరుణాపూరితమైన ఒక అలౌకిక అర్థరహిత భావాన్ని నింపుకున్నట్టు గాలి తిమ్మెర వారిద్దరినీ జాలిగా స్పృశిస్తూ వెళ్ళిపోయింది.

"...వాళ్ళందరూ నామీద చాలా వత్తిడి తీసుకొచ్చారు సుబ్బారావ్! కేవలం శివుడూ, శిబి మాత్రమే నావైపు నిలబడ్డారు. నేను తలవంచక తప్పలేదు. సమసమాజ నిర్మాణానికీ, సకలజన సౌభ్రాతృత్వానికీ నీకిచ్చిన వరం ఉపసంహరించుకుంటున్నాను. నన్ను క్షమించు!"

సుబ్బారావు చాలాసేపు మాట్లాడలేదు. తరువాత నెమ్మదిగా తలెత్తి, "ప్రజలు మిమ్మల్ని క్షమించరు" అన్నాడు.

"క్షమిస్తారు" అన్నాడు బ్రహ్మ. "ఆ మాటకొస్తే ఈ సంస్కరణలేవీ ప్రజలకే ఇష్టం లేదు."

మిన్ను విరిగి మీద పడ్డట్టు "...ఏం మాట్లాడుతున్నారు స్వామీ మీరు?" అన్నాడు కీచుగొంతుతో.

"అవును. అక్కడనుంచి కూడా నాకు తాకిడివచ్చింది."

"అసంభవం" అరిచాడు సుబ్బారావు.

"నీ పట్ల భయంతో ఊరుకున్నారే తప్ప, లేకపోతే, ఎవరు సుఖంగా ఉన్నారు?" ప్రశ్నించాడు దేవుడు. "...లాయర్లు, డాక్టర్లు, సైన్యం, పారిశ్రామికవేత్తలు, చివరికి రైతులూ శ్రామికులూ కూడా నీ సంస్కరణల వల్ల సుఖంగా లేరు. కాస్త సుఖపడిన వారెవరయినా ఉంటే, '...చేతకాని వాళ్ళు' మాత్రమే. ఎందుకంటే, వారికి కష్టపడకుండా బ్రతకటం తప్ప మరేమీ చేతకాదు కనుక! సౌఖ్యాలపట్ల కోరిక లేదు కనుక!! కీర్తి గుర్తింపు అవసరం లేదు కనుక!!!"

"కానీ లంచగొండులూ, మోసగాళ్ళూ..."

"అదే నువ్వు చేసిన తప్పు. ఈ ప్రపంచంలో లంచగొండులూ, మోసగాళ్ళూ అని వేరే జాతి ఉండదు. ప్రతి మనిషిలోనూ కొద్ది కొద్ది శాతం అది వుంటుంది. చరిత్ర తాలూకు పరిణామ క్రమంలో అది పెరగొచ్చు. తరగొచ్చు. మనుష్య జాతి పుట్టినప్పటి నుంచీ ఇప్పటి వరకూ అది అలా సాగిపోతూనే వుంది కదా!" బ్రహ్మ ఆగి, ఆఖరిదైన, ముఖ్యమైన వాక్యం పూర్తి చేసాడు. "...అలా కాకుండా, ఇంకా కొంచెం సుఖవంతంగా బ్రతికేమార్గం ఏదైనా ఉంటే, దాన్ని మనిషి ఈ పాటికే కనుక్కునేవాడు కదా!"

గాలీ, చెట్లూ, జలపాతాలూ అవునన్నట్టు తలలూపాయి.

"మరి నేనేం చెయ్యాలి?" ప్రశ్నించాడు సుబ్బారావు.

విశ్వ రహస్యాన్ని విప్పుతున్నట్టుగా బ్రహ్మ చెప్పాడు.

"వ్యవస్థని మార్చాలన్న అభిప్రాయం ప్రక్కన పెట్టు. పోటీతత్వం నేర్చుకో. మధ్యతరగతి మనస్తత్వం వదిలిపెట్టు. నీక్కావల్సింది అడుక్కోకు. ధీమాగా సంపాదించుకో. ప్రస్తుతం వున్న పరిస్థితుల్లో, మిగతా వారిని అధిగమించి, నువ్వెలా నెం.1 అవ్వాలో ఆలోచించు. అంతేగానీ నీ **చేతగానితనానికి మంచితనమని, నీకు లౌక్యం తెలియక పోవటమే నీ గొప్పతనమనీ, నీవిలాగే అట్టడుగున వుండిపోవటానికి కారణం సమాజమనీ – తప్పుడు అభిప్రాయంతో మగ్గిపోకు. అన్నిటికన్నా ముఖ్యంగా, జీవితంలో పైకి రావాలంటే, ఇతరుల్ని మోసం చెయ్యాలనో, తప్పులు చెయ్యాలనో అనుకోకు!** నువ్వే చూసావుగా, ఈ ప్రపంచాన్ని ఇంతకన్నా గొప్పగా మార్చటం మనిద్దరి తరమూ కాలేదు. మానవుల్లో వ్యత్యాసం తప్పదు!! దేవుళ్ళలోనే వ్యత్యాసాలున్నాయి!! వేదకాలంలో గుడులు లేవు. ఆదిలో మానవులు కేవలం పంచభూతాల్ని, ముఖ్యంగా అగ్నిని పూజించేవారు. అసలు 'గుడి' అన్నదే పెట్టుబడిదారీ వ్యవస్థకి చిహ్నం!! ఆ వ్యవస్థలో పైకి రావాలీ అంటే నీ శక్తియుక్తుల్ని వుపయోగించాలి. శ్రమించాలి. ఆటంకాలు కొన్ని వస్తాయి. ఎదుర్కోక తప్పదు. ఒక ఆటంకం వచ్చిందీ అంటే, నీలో ఒక బలహీనతని అది బయట పెడుతోందన్నమాట. ఆ బలహీనతని గుర్తించు. '...ఈ రోగమున్నదే' అని బాధపడకు. దాన్ని ఎలా అధిగమించాలో ఆలోచించు. నేను మనిషికి అపారమైన మనోశక్తిని ఇచ్చాను. వాడుకుంటే నెం.1 అవుతాడు. లేకపోతే, సామాన్యుడిగా మిగిలి, చచ్చేవరకూ సమాజం ఎప్పుడు మారుతుందా అని ఎదురు చూస్తూనే ఉంటాడు. ఆలోచించు సుబ్బారావ్. ఆలోచించు. నేను చెప్పినదాన్లో ఎక్కడయినా తప్పుందేమో ఆలోచించు. ఆ ఆలోచనే **"మైండ్ పవర్"**. శుభం భూయాత్..."

*(మైండ్ పవర్ – నెం.1 అవటం ఎలా ?)*

# మీద పడే రాళ్ళతో దుర్గం





ఒక ముస్సలి గాడిద కాలు జారి ఇంటిపక్క ఎండిపోయిన నూతిలో పడిందట. దాన్ని అందులోంచి బయటకు తీయటానికి యజమాని తాళ్ళూ కర్రలూ జార్చాడట. కానీ అది ఎక్కలేదు కదా! లోపలే ఉండి పోయింది. ఇద్దరు కూలీలని పిల్చుకొస్తే పని జరుగును. కానీ ఆ యజమాని పిసినారి. అందుకని దాన్ని అలా వదిలేసి ఇంటిలోకి వెళ్ళిపోయాడట.

అర్ధరాత్రి అయింది. గాడిద ఆత్మహత్య చేసుకుందామనుకుంది. తన ఫెయిల్యూర్‌ని తల్చుకుని ఏడుస్తూ ఓండ్ర పెట్టసాగింది. ఆ అరుపులు విని యజమాని బేజారయ్యాడు. అందరూ వింటే తనని తిడతారని ఒకవైపు కంగారూ, కామ్‌గా చావకుండా గాడిద గోల చేస్తోందని మరోవైపు కోపమూ అన్నమాట!

అప్పుడతనికి ఒక ఆలోచన వచ్చింది. నుయ్యి ఎలాగూ ఎండిపోయింది. గాడిద ఎలాగూ ముసల్దయింది. బయటకు తీస్తే చచ్చే వరకూ పోషించాలి. అందుకని 'నూతిని పూడ్చేస్తే సరిపోతుంది కదా' అనుకున్నాడు. పలుగూ పారా పట్టుకుని, రాత్రికి రాత్రి చీకట్లో ఆ బావిని మట్టితో నింపే ప్రయత్నం చేసాడు. తెల్లవారే సరికి నుయ్యి దాదాపు పూర్తిగా పూడ్చాడు.

అప్పుడు అతడి మూతి మీద ఫెడేల్మని దెబ్బతగిలింది. ఎవరు కొట్టారో ఆ చీకట్లో తెలియలేదు. ఇంతకీ ఏం జరిగిందో తెలుసా?




మీద మట్టి పడేసరికి గాడిదకి మొదట్లో అర్థం కాకపోయినా, యజమాని ఉద్దేశ్యం క్రమంగా తెలిసింది. మట్టిని విదిలించుకుంది. **మీద పడే ప్రతి తట్ట మట్టినీ మెట్టుగా ఉపయో గించుకుని** బావి నుండి బయటకొచ్చింది. మట్టిపోస్తోన్న యజమాని మొహంమీద ఎడమకాలితో తన్ని స్వేచ్ఛగా వెళ్ళిపోయింది.

ఓటమి కూడా అంతే. ఎడమకాల్తో తంతే ఆమడ దూరం పారిపోతుంది.

*(చదువు – ఏకాగ్రత)*

# ఆయుధాన్ని దాచిన దేవుడు

భగవంతుడు సకల చరాచర సృష్టి జరుపుకుంటూ వచ్చి, ఆఖరి జీవికి రూపం ఇవ్వడానికి సంసిద్ధుడయి, పక్కనున్న భార్యతో "... ఇప్పుడు నేనొక అద్భుతమైన సృష్టి చేయబోతున్నాను" అన్నాడట.

"ఏమిటా సృష్టి స్వామీ?" అంది అతని భార్య.

"ఇప్పటివరకూ నేను ఎన్నో రకాల ప్రాణుల్ని సృష్టించాను. అయితే అవేవీ నాతో పోటీకి రాలేవు. ఇంత సృష్టి జరిగాక నాలో నేను... 'ఇదేవిటీ... గొప్ప సృష్టికర్తనయి వుండి ఒక అద్భుతమైన ప్రాణిని సృష్టించలేకపోయాను?' అనుకున్నాను. అందుకని ఇప్పుడు సృష్టించబోతూన్న ప్రాణి తాలూకు ఆకారంలో చిన్న మార్పుని తీసుకువచ్చాను. ఆకారం పొడవుగా వెన్నెముక నిలువుగా వుండేటట్టు, నాలుగు కాకుండా రెండు కాళ్ళమీద నిలబడేట్టు, అన్నిటికన్నా ముఖ్యంగా ఎదుటి వస్తువుని పట్టుకోవడానికి వీలుగా చేతి వేళ్ళు అతుక్కోకుండా వుండేటట్టు, ఒక ప్రాణిని సృష్టిస్తున్నాను. ఇది నా యొక్క మేధాశక్తికి పరిపూర్ణత!! ఈ చేతులూ, వేళ్ళూ ఇంకే ప్రాణికీ ఉండవు. ఇటువంటి అపురూపమయిన జీవికి 'మనిషి' అని పేరు పెట్టదలచుకున్నాను" అన్నాడు.

ఆమె మెచ్చుకోలుగా, "... ఇన్ని ప్రాణుల్ని సృష్టించిన తర్వాత మీకింత మంచి ఆలోచన కలిగినందుకు మిమ్మల్ని అభినందించాలి స్వామీ" అంది.

"అయితే నాకొక చిన్న చిక్కు కనిపిస్తున్నది దేవీ! నేను ఇప్పుడు సృష్టిస్తున్న ప్రాణికి నేనొక ఆయుధాన్ని యివ్వబోతున్నాను. దాంతో అతడు ప్రపంచాన్నే గెలవగలడు. అలా గెలిచిన తర్వాత నా మీదకి కూడా యుద్ధానికి వచ్చి, నన్ను గెలిచినా ఆశ్చర్యపోను. ఇంతకు ముందు ఇలాగే రాక్షసులకు వరాలిచ్చి చేతులు కాల్చుకున్నాను. నాకేం చెయ్యాలో అర్థం కావటం లేదు" అన్నాడు.

"అలాంటిది జరుగుతుందనుకున్నప్పుడు ఆ ఆయుధాన్ని అతనికి ప్రసాదించకండి స్వామీ! ఇందులో అంత పెద్ద సమస్య ఏముంది?" అంది ఆమె తేలిగ్గా.

నాలుగు తలలూ అడ్డంగా వూపుతూ – "నా సృష్టికే పరాకాష్టగా సృష్టించిన జీవికి నేను భయపడి, ఆ ఆయుధాన్ని అందజేయకుండా ఉండటమా? అది నా ఓటమికి నిదర్శనం" అన్నాడు ఉక్రోషంగా.

ఆమె నవ్వి "అయితే ఒక పని చేయండి. ఆ ఆయుధాన్ని భూలోకంలోనే ఎక్కడో ఒకచోట దాచేయండి. మీరు సృష్టిస్తున్న ప్రాణి ఎంతో వివేకమున్నవాడు అంటున్నారు కాబట్టి దాన్ని తప్పకుండా అతడు కనుక్కోగలడు. అలా కనుక్కోవటమే మీకు విజయం" అంది.

"ఎక్కడ దాచమంటావు దేవీ?"

"కొండల్లోనో, కోనల్లోనో, నదుల్లోనో, లోయల్లోనో, అరణ్యాల్లోనో, పర్వతాంతర్భాగాల్లోనో, ఝరుల్లోనో, తరుల్లోనో, హిమవన్నగాల్లోనో... అగ్ని పర్వతాంతర్భాగాల్లోనో... మీరు తలచుకుంటే ఎక్కడైనా దాచవచ్చు."

దేవుడు ఒక్కక్షణం ఆలోచించాడు "... లేదు. ఈ ఆయుధాన్ని నేను ఎక్కడ దాచినా అతడు వెంటనే పట్టుకోగలడు. తనకున్న విచక్షణాజ్ఞానం ఉపయోగిస్తే తప్ప – ఎక్కడ దొరుకుతుందో కష్టపడి తెలుసుకునే సూక్ష్మజ్ఞానం లేకుండా, ఎంత వెతికినా అతడు పట్టుకోలేని స్థానంలో దాస్తాను..."

ఆమె ఆత్రంగా "ఏమిటా ఆయుధం? దాన్ని ఎక్కడ దాస్తారు?" అని ఉత్సుకతతో అడిగింది.

"అతడి మెదడులో..." సమాధానం యిచ్చాడు దేవుడు "...ఆ ఆయుధమే తెలివి."

*(మైండ్ పవర్ నెం. 1 అవటం ఎలా ?)*

# విను

అవతలి వారు చెప్పేది మనం పూర్తిగా వినకపోతే వచ్చే దుష్పరిణామాలకి ఇంతకన్నా మంచి ఉదాహరణ నేను ఎక్కడా చదవలేదు.

"ఏమనుకుంటున్నావ్ నా గురించి? అప్పు తీసుకుని అయిదు సంవత్సరాలైంది. రేపు అయిదింటిలోగా కనీసం సగం చెల్లిస్తే సరి! లేకపోతే నీవాళ్ళతో సహా నీవూ మిగలవు..." ఫోన్ పెట్టేశాడు అతడు.


మరుసటి రోజు అప్పు తీసుకున్న వ్యక్తి భయంభయంగా లోపలికి ప్రవేశించాడు.

"డబ్బు తెచ్చావా?" కర్కశంగా అడిగాడు అతడు.

"డబ్బు తేలేదు.... కానీ" అని అంటూ ఉండగా ఆమాటలకి కోపంతో రగిలిపోతూ పిస్టల్ తీసి టపాటపా కాల్చేసాడు.

అవతలి వ్యక్తి నేలకూలుతూ మిగతా వాక్యం పూర్తి చేసాడు ".... బ్యాంక్ డ్రాఫ్ట్ తెచ్చాను."

*(ప్రేమ ఒక కళ)*



# నవ్వాలా - ఏడ్వాలా? ఛాయిస్ మనదే

అతని పేరేమిటో మాకెవరికీ తెలీదు. మేమతనికి పెట్టిన ముద్దు పేరు ఆనందరావు. అవును. నిరంతరం ఆనందంగా ఉండటం అతడి లక్షణం. విషాదాన్ని దగ్గరకి రానివ్వకుండా ఉండడం అతని హాబీ. "ఎలా ఉన్నావు నువ్వు?" అన్న ప్రశ్నకి అతడిచ్చే సింపుల్ సమాధానం "ఇంతకంటే ఆనందంగా వుండాలంటే, వెళ్ళి స్వర్గంలో వుండాలి".

అద్భుతమైన సమాధానం కదూ!

హెూటల్‌కి వెళ్తే మొత్తం సర్వర్లందరూ అతడి దగ్గరకి వచ్చి విష్ చేస్తారు. దానికి కారణం అతడిచ్చే టిప్స్ కాదు. అక్కడున్న ప్రతి వ్యక్తి పేరూ అతడికి తెలుసు. అంతేకాదు. వాళ్ళ కుటుంబాల గురించి కూడా.

ఒకసారి అతణ్ణి నేను ప్రశ్నించాను "ఇంత పాజిటివ్‌గా, ఇంత ఆనందంగా ఎప్పుడూ ఎలా ఉండగలుగుతున్నావు నువ్వు" అని.

అతడు చెప్పాడు. "ప్రతి ఉదయాన నిద్ర లేవగానే నేనిలా అనుకుంటాను: నాకీ రోజు రెండు మార్గాలున్నాయి. ఒకటి : మంచి మూడ్‌లో ఉండటం. రెండోది : దినమంతా విసుక్కుంటూ ఉండటం. ఏది మంచిదని ప్రశ్నించుకుంటే, ఎవరికైనా 'మంచి మూడ్‌లో ఉండటం' అనే సమాధానమే వస్తుంది కదా. కాబట్టి నేనూ అలాగే అనుకుంటాను. దానికి వ్యతిరేకంగా ఏదన్నా చెడు జరిగిందనుకో! ఓహెూ. నేను కొంచెం నేర్చుకోటానికి ఈ సంఘటన జరిగిందను కుంటాను. ఆ విధంగా నానుంచి నా మూడ్‌ని ఎవరూ వేరు చేయలేరు. దేవుడు కూడా."

"అదంత సులభం అంటావా?" ప్రశ్నించాను.

"అవును" దృఢంగా అన్నాడు ఆనందరావు. ఆ తరువాత అతడు ఒక గొప్ప జీవిత సత్యం చెప్పాడు. "మన జీవితం అంతా 'అవును, కాదు' అన్న నిర్ణయం మీదే ఆధారపడి వుంటుంది. ఎన్ని ఇబ్బందులు వచ్చినా సరే 'అవును, కాదు' దగ్గరకి వచ్చి అవి ఆగిపోతాయి. ఒక సమస్య చుట్టూ ఎన్నో విశేషణాలూ, విశ్లేషణలూ ఉండవచ్చు. వాటినన్నిటినీ తొలగిస్తూపోతే చివరికి మిగిలేది అదే... అవును/కాదు."

నాకర్థం కాలేదు. ఆ విషయమే అతడికి చెప్పాను. అతడు సమాధానం ఇచ్చాడు. "ఒక వ్యక్తి ఉన్నాడనుకుందాం. అతడికి పదిహేను రోజుల్లో డిపార్ట్‌మెంటల్ పరీక్షలు ఉన్నాయి. అవి పాసయితే తప్ప అతడికి ప్రమోషన్ రాదు. కాని అతడికి ఏకాగ్రత కుదరటం లేదు. కారణాలు చాలా ఉన్నాయి! అతడికీ, అతడి భార్యకీ గత కొన్నేళ్ళుగా మంచి సంబంధం లేదు. అతనికి పిల్లలు లేరు. అదొక దిగులు! అతడికి ఈ మధ్య

ఆరోగ్యం కూడా బాగోటం లేదు. డాక్టరు ప్రాథమిక పరీక్ష జరిపి ఇంకా పెద్ద పరీక్షలు జరపాలనీ, దానికి ఐదువేలు ఖర్చు అవుతుందనీ చెప్పాడు. అతని దగ్గర ఐదువేలున్నాయి. కానీ, అందులో మూడు వేలు తమ్ముడికి ఫీజు కట్టాలి. రెండు వేల రూపాయలు దూర ప్రాంతంలో వున్న బంధువులకి పంపిస్తే, వాళ్ళు వచ్చి తన చెల్లెలికి తమ కొడుకుని చూసుకుంటామని కబురు చేశారు. పెళ్ళిచూపులకి 'కూడా' డబ్బు పంపించాలా అని ఒకవైపు అనిశ్చిత స్థితి! ఇన్ని రకాల కారణాల వల్ల అతడికి పుస్తకాల మీద ఏకాగ్రత నిలవడం లేదు. ఇది మరొక వైపు దిగులు. ఇన్ని దిగుళ్ళు వున్న అతను ఏం చేయాలో అర్థం కాక నిద్రమాత్రలకి అలవాటు పడ్డాడు." ఆగి కొనసాగించాడు ఆనందరావు. "...నేను ముందే చెప్పినట్టు సమస్య చుట్టూ వున్న విశేషణాలూ, విశ్లేషణాలూ తీసేస్తే, చివరకు మిగిలేవి రెండే పాయింట్లు... అవును, కాదు! ఇప్పుడు ఈ దృష్టితో ఆలోచిస్తే అతడు నిర్ణయించుకోవలసింది : తనకు తాను ముఖ్యమా? తనకి ఇతరులు ముఖ్యమా? అన్నది. తన జీవితం మొత్తం ఇతరుల కోసమే, అనుకుంటే వాళ్ళ బాధ్యతలన్నీ సక్రమంగా, సంతోషంగా నిర్వర్తించవచ్చు. లేదూ తనకి తాను ముఖ్యం అనుకుంటే మిగతా వాటిని వదిలి పెట్టవచ్చు. తనకి ఏది ఎక్కువ సంతోషాన్నిస్తుంది అనేది ప్రతి మనిషీ తనకు తాను నిర్ణయించుకోవలసి ఉంటుంది. అలా కాకుండా అన్ని వైపుల నుంచీ ఆలోచిస్తూ పోతే చివరికి **ఆలోచనా, దిగులూ** రెండే మిగులుతాయి. నేను చెప్పిన ఈ ఉదాహరణే కాకుండా, సమస్యలతో కొట్టుమిట్లాడే ఏ వ్యక్తి తాలూకూ చరిత్ర విన్నా చివరికి ఆ సమస్య తాలూకూ పరిష్కారం "అవును – కాదు" అన్న రెండిటి దగ్గరకే వచ్చి ఆగిపోతుంది. ఆ రెండిట్లో ఒకదాన్ని ఎన్నుకోలేకపోవటమే సమస్యకి మూలకారణం. పరిష్కారం ఆలోచించకుండా, కేవలం దిగులు పడటం వల్ల ఏమీ లాభం లేదని తెలుసుకోగలిగిన మనిషి నిరంతరం ఆనందంగా ఉంటాడు" అన్నాడు ఆనందరావు.

ఆ తర్వాత కొంతకాలం పాటు అతడు నాకు కనబడలేదు. అతడు పనిచేస్తున్న బ్యాంక్‌లోనే సబ్ మేనేజరుగా ప్రమోషన్ వచ్చి దూరప్రాంతాలకు వెళ్ళాడని తెలిసింది. నాకేదన్నా సమస్య వచ్చినప్పుడు అతడే గుర్తొచ్చేవాడు. అతడి పంథాలో ఆలోచించి చాలా దిగుళ్ళని నేను ఆ విధంగానే పరిష్కరించుకున్నాను కూడా. ముందు సరిగా అర్థం కాలేదు గానీ ఆచరణలో పెట్టిన తరువాత ఆనందరావు చెప్పిన మాటలు ఎంత నగ్నసత్యాలో నాకు తెలియసాగింది. జీవితమంతా మన ఎంపిక మీదే ఆధారపడి వుంటుంది. మంచి మూడ్‌లో వుండాలా, విసుగ్గా వుండాలా అనేది కేవలం మన ఎంపిక మాత్రమే.

ఇట్స్ అవర్ ఛాయిస్.

ఒక పరిస్థితికి మనం ఎలా స్పందించాలా అనేది మన ఛాయిస్.

మన మనసుని పాడు చేసే వ్యక్తుల్ని దూరంగా వుంచాలా వద్దా అనేది మన ఛాయిస్.

అనవసరమైన బంధుత్వాల పేరిట భయపడాలా వద్దా అనేది మన ఛాయిస్.

ఇవన్నీ క్రోడీకరిస్తే వచ్చేది ఒకే ఒక్క పరిష్కారం... ఎంపిక!

మనలో చాలా మందిమి, ఈ విధమైన ఎంపిక చేసుకోలేక, మధ్యంతర లేదా ఎస్కేపిస్టు పరిష్కారాల కోసం వెతుకుతాం. **అందర్నీ సంతృప్తి పరిచే** విధానాలు అన్వేషిస్తున్నాం అని అనుకుంటాం. నిజానికి అలాటి పరిష్కారాలేమీ రెడీమేడ్‌గా ఉండవు. అందుకే చాలామందికి సమస్యలే స్నేహితులవుతాయి.

ఆనందరావు సిద్ధాంతం అలవాటైన తర్వాత నా జీవితంలో గొప్ప మార్పు వచ్చింది.

అయితే దురదృష్టవశాత్తు అదే సమయంలో ఒక విషాదవార్త తెలిసింది, ఒక అర్ధరాత్రి బ్యాంక్‌లో కూర్చుని పనిచేసుకుంటుండగా ముగ్గురు ఆగంతకులు వచ్చి గార్డుని గాయపరచి ఆనందరావుని లాకర్ తాళాలు అడిగారట. అవి తన దగ్గర లేవని చెప్పేసరికి అతడిని తుపాకితో నిర్దాక్షిణ్యంగా కాల్చారట. ఆ విషయం తెలిసి మేమందరం హుటాహుటీన అక్కడికి వెళ్ళాం.

దాదాపు పద్దెనిమిది గంటల సుదీర్ఘమైన ఆపరేషన్ తర్వాత అతణ్ణి చూడటానికి మాకు అనుమతి ఇచ్చారు. ఒళ్ళంతా బుల్లెట్ గాయాలతో బ్యాండేజ్‌లతో పక్కమీద పడుకున్న అతడు యథాతథంగా నవ్వుతూ ఆహ్వానించాడు.

"ఎలా వుంది?" అని అడిగాను.

"ఇంతకన్నా బావుండాలంటే నేను స్వర్గంలో వుండాలి" నవ్వాడు.

కొంచెంసేపు యథాలాపంగా సంభాషణ జరిగిన తర్వాత అందరూ అడిగినట్టే ఆ ప్రశ్న నేనూ అడిగాను "అంత భయంకరమైన పరిస్థితిలో నువ్వెలా ఫీలయ్యావు" అని.

"దొంగలు లోపలికి ప్రవేశించినప్పుడు నాకు కొంచెం భయం అనిపించింది. అంత అర్ధరాత్రిపూట బ్యాంక్‌లో నేనొక్కణ్ణే పని చేసుకుంటున్నప్పుడు మరికొన్ని జాగ్రత్తలు తీసుకుని వుండాల్సింది" ఆనందరావు చెప్పాడు. "వాళ్ళు నా మీద బుల్లెట్స్ పేల్చి నేను నేలమీద కూలబడగానే నా శరీరం నుంచి రక్తం స్రవించసాగింది. నా శరీరంలో అంత రక్తం వుందని నాకు తెలీదు. నాకు రెండే ఛాయిస్‌లు ఉన్నాయి. బ్రతకటం, చావటం... నేను బ్రతకాలనుకున్నాను. నాకు పూర్తిగా స్పృహ తప్పి పోలేదు. లీలగా అంతా తెలుస్తోంది. హాస్పిటల్‌లో ఎమర్జెన్సీ వార్డులోకి తీసుకెళ్తున్న డాక్టర్లూ, నర్సుల మొహాలు నాకింకా గుర్తున్నాయి. వారందరి మొహాల్లోనూ ఒకే ఒక భావం. "వీడు ఒక జీవచ్ఛవం! ఇతడికి ఆపరేషన్ చేయటం కూడా అనవసరం' అని వాళ్ళలో వాళ్ళు అనుకోవటం స్పష్టంగా విన్నాను" నవ్వాడు ఆనందరావు.

నేను అతడివైపే దిగ్భ్రాంతితో చూస్తూ వుండిపోయాను. అతడు కొనసాగించాడు. “నేను వారిని మంచి మూడ్‌లోకి తీసుకురావాలనుకున్నాను.”

“ఎలా?” అప్రయత్నంగా అడిగాను.

అతను నవ్వుతూ కొనసాగించాడు. “ఒక లావుపాటి నర్సు నా మీదికి వంగి ఇంజక్షన్ ఇవ్వబోతూ, రియాక్షన్స్ తెలుసుకోవటం కోసం – అప్పటికే స్పృహ తప్పుతూన్న నా మత్తు వదిలిపోయేలా నీ ఒంటికి పడనివేమైనా ఉన్నాయా?' అని గట్టిగా అరిచింది.”

‘అవును’ అన్నాను. ఇంజక్షను ఇవ్వడానికి మీదకి వంగిన నర్సుతో సహా డాక్టర్లందరూ నేను చెప్పబోయే సమాధానం కోసం ఆత్రంగా చూశారు.

“బుల్లెట్స్” అన్నాను.

ఒక్కసారిగా అందరి మోహాల్లోనూ చిర్నవ్వు కనపడింది.

అప్పుడు వాళ్ళకి చెప్పాను “నేనెలాగూ మరణిస్తానన్న దృక్పథంతో ఆపరేషన్ చేయొద్దు! నా ఛాయిస్ బ్రతకటం” అని...

❀ ❀ ❀

మరణం అంచుల వరకూ వెళ్ళినా సరే మన ఛాయిస్‌ని పాజిటివ్‌గా ఎలా వుంచుకోవాలో ఆ సంఘటన నాకు నేర్పింది. అదే స్థితప్రజ్ఞత.

ఆనందరావు దగ్గర్నుంచి నేను మరొక పాఠం నేర్చుకున్నాను.

*(మైండ్ పవర్ నెం.1 అవటం ఎలా ?)*

# ఏడు వింతలు

“ప్రపంచపు ఏడు అద్భుత వింతలను వ్రాయుము...” అని ఒక మాస్టారు పిల్లల్ని అడిగాడు. చాలామంది చకచకా వ్రాసేసారు. ఒక పాప మాత్రం తెలియక ఆగిపోయింది.

ఆమె భయాన్ని పోగొట్టటానికి మాస్టారు మిగతా వాటి గురించి సూచనలు ఇవ్వటం ప్రారంభించాడు. చైనా గోడల గురించి ఇన్‌డైరెక్ట్‌గా చెప్తూ “శత్రువుల్నించి రక్షించేది. కవచంలా దృఢంగా వుండేది... వ్రాసావా?” అన్నాడు.

వ్రాసానంది.

“... నిరంతరం ప్రవహించేది” అన్నాడు పెనామా కాలువ గురించి హింట్ ఇస్తూ.

పాప ఒక క్షణం ఆలోచించి “వ్రాసాను మాస్టారూ” అంది.

“... వంగినా కూలదు” అన్నాడు పిసా టవర్‌ని దృష్టిలో పెట్టుకుని. అలాగే ఈజిప్టు పిరమిడ్‌ల గురించి ఇన్‌డైరెక్టుగా సూచిస్తూ, “... మనిషి అద్భుతమైన జ్ఞానానికి ఉదాహరణ ఒంటరిగా, ఎత్తుగా వుంటుంది... తన నీడ కూడా పొరపాటున నేలమీద పడనివ్వదు. అంత పెర్‌ఫెక్టుగా వుంటుంది” అన్నాడు.

వ్రాసానంది.

ఆ తరువాత తాజ్‌మహల్ గురించి చెప్తూ, “వెన్నెల్లో దీన్ని చూడాలంటారు. కానీ మనసుకి కళ్ళుంటే దానితోనే ఆ సౌందర్యాన్ని చూడొచ్చు” అన్నాడు. అలా అన్నీ చెప్పాక, తీసుకొచ్చి చూపించమన్నాడు.

తప్పు వ్రాసానేమోనని సిగ్గుపడుతూ ఆ పాప మాస్టారి దగ్గరకొచ్చి ఆ కాగితం అందించింది. అందులో ఈ విధంగా వుంది :

**“మహాత్మాగాంధీ, మదర్ థెరిస్సా, మార్టిన్ లూథర్ కింగ్, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, హెలెన్ కెల్లెర్...”**

ఆ పాప వ్రాసింది చదివి వినిపించేసరికి క్లాసులో క్షణంపాటు సూదిపడితే వినపడేటంత నిశ్శబ్దం వ్యాపించింది. ఆ పైన ఆ గది చప్పట్లతో మార్మోగింది.



*(విజయరహస్యాలు)*

# విజయానికి కావలసింది

రామారావు పాతిక సంవత్సరాల క్రితం, పదిహేనేళ్ళ కుర్రవాడు. ఆ రోజుల్లో కొరియర్ సిస్టమ్ దేశంలో కొత్తగా ప్రవేశపెట్టబడింది. పోస్టాఫీసు ద్వారా కన్నా, కొరియర్ ద్వారా పార్శిళ్ళు పంపితే వేగంగా చేరతాయి అన్న ఉద్దేశ్యం ప్రజలకి అప్పుడప్పుడే కలుగుతోంది.

అటువంటి సమయంలో ఉద్భవించిన సంస్థ పేరు "X కొరియర్స్" అనుకుందాం. తొందర్లోనే అది చాలా విస్తృతమైంది. అటువంటి పెద్ద సంస్థలో చాలా చిన్న ఉద్యోగస్తుడు అతడు. పేరు రామారావు అనుకుందాం. రామారావు పని ఏమిటంటే రోజూ మధ్యాహ్నం రెండింటికి వస్తువులన్నీ తీసుకుని, మోపెడ్ మీద అడ్రస్‌లను వెతుక్కుంటూ ప్రతిచోటకూ వెళ్ళి, ఆ సరుకుల్ని అందజేయటం! ఆ రోజుల్లో అతడి జీతం అయిదువందలు.

రామారావు దీనితోపాటు ప్రైవేటుగా ఇంటర్మీడియట్ చదువుకునేవాడు. పొద్దున్న తొమ్మిదింటికి ఆఫీసుకి వచ్చి చిన్న చిన్న పనులు చూసుకుని, రెండు గంటలకి వస్తువులు సరఫరా చేయటం ప్రారంభిస్తే, పని పూర్తయ్యేసరికి రాత్రి పదయ్యేది. ఒకచోటు నుంచి మరొక చోటుకు ప్రయాణించడానికి, సాయంత్రపు రద్దీ రోడ్ల మీద, ఎంతో శ్రమ పడాల్సి వచ్చేది. అదీగాక, ఇళ్ళు వెతికి పట్టుకోవటం ఆలస్యం అయ్యేది. దీంతో అతడి చదువు సాగేది కాదు.

ఇదే సమయంలో అతడికి ఒక అద్భుతమైన ఆలోచన వచ్చింది. నిజానికి అతడి ఎదుగుదల అక్కడినుంచే ప్రారంభమైందని కూడా చెప్పవచ్చు.

అతడు మధ్యాహ్నం రెండింటికి సరుకులు సరఫరా చేయకుండా గోడౌన్‌లోనే ఉంచేసేవాడు. అడ్రస్ మాత్రం తీసుకుని, ఆ ఊరి మ్యాప్‌లో అవి ఎక్కడెక్కడ ఉన్నాయో రాత్రిపూట ఇంట్లో కూర్చుని వివరంగా వ్రాసి పెట్టుకునేవాడు. మరుసటి రోజు తెల్లవారు ఝామునే నాలుగింటికి లేచి, పొద్దున్నే సరుకుల్ని ఆయా యజమానులకి అందజేసేవాడు.

అందువల్ల అతడికి రెండు విధాలా లాభం జరిగింది. ఒకటి : రోడ్లు రద్దీగా లేకపోవటం వల్ల పూర్తి కావల్సిన పని రెండు గంటల్లో పూర్తయ్యేది. రెండు : అడ్రసులు ముందే తెలిసి ఉండటం వల్ల అక్కడికి సులభంగా చేరుకోగలిగేవాడు. ఏ అడ్రసు తరువాత ఎక్కడికి వెళ్ళాలో, మ్యాప్‌లో ముందే వరుస క్రమంలో గుర్తించి ఉంచుకోబట్టి, వీధులు వెతుక్కుంటూ తిరిగే సమయం తగ్గింది. అలా తను ఆదా చేసుకున్న సమయాన్నంతా చదువు మీద వినియోగించి, ఇంటర్మీడియట్ పాసయ్యాడు.

అయితే, X కొరియర్ కంపెనీకి రామారావు చేస్తున్న పని తెలిసి, అతణ్ణి ఉద్యోగంలో నుంచి తీసేశారు.

Nothing fails like success.

తాము నిర్దేశించిన సూత్రాలు, పాటించవలసిన నియమాలూ సరిగ్గా అమలు చేయనందుకు ఆ కంపెనీ, రామారావుని తీసేసింది. కానీ, ఆ కుర్రవాడు అనుచరుడు కాడు! యజమాని!! నిర్ణయాలు స్వయంగా తీసుకోగలిగినవాడిని యజమాని అంటారు!!!

తనకున్న అనుభవంతో అతడు ఒక చిన్న కొరియర్ సర్వీసు పెట్టి మూడు సంవత్సరాల్లో X కొరియర్స్‌ని వ్యాపార రంగం నుంచి వైదొలగేలా చేశాడు.

Nothing succeeds like a failure.

ఓటమి నుంచి ఆ విధంగా మొలకెత్తిన ఆ కుర్రవాడు, అక్కడితో ఆగలేదు. మరొక అద్భుతమైన ప్రణాళికని సిద్ధం చేసుకున్నాడు.


రెండువందల మంది అనాథ బాలికల్ని, యువతుల్ని, వితంతువుల్ని ఉద్యోగంలోకి తీసుకుని ట్రైనింగ్ ఇచ్చాడు. వాళ్ళకి బి.పి. చెక్ చేయడం దగ్గర్నుంచి, అంబులెన్స్‌కి ఫోన్ చేయడం వరకు రకరకాల సేవలు సంవత్సరం పాటు నేర్పాడు. ఆ తరువాత పేపర్లో ఈ విధంగా ప్రకటన ఇచ్చాడు. "మీ ఇంట్లో మీకు అత్యంత ఆప్తులైన వృద్ధులెవరైనా ఉన్నారా? వారిని అనాథ శరణాలయంలో చేర్చడం మీకు ఇష్టం లేదా? మీ దగ్గరే ఉంచుకోవాలనుకుంటున్నారా? కంటికి రెప్పలా చూసుకోవాలనుకుంటున్నారా? కానీ, మీకు అంత సమయం లేదా? మమ్మల్ని సంప్రదించండి. ఇరవై నాలుగు గంటలపాటు మీ ఆప్తుల్ని చూసుకోవడానికి ఇద్దరు వ్యక్తుల్ని మేం మీ ఇంటికి పంపుతాం. షిఫ్టుల ప్రకారం వారికి మీ ఇంట్లోనే సేవలు చేస్తారు."

ఈ ప్రకటన వచ్చిన మొట్టమొదటి రోజే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ లాంటి ప్రాంతాల నుంచి ఎన్నో ఫోన్‌కాల్స్ వెళ్ళాయి. ఒకవైపు ఎంతోమందికి ఉపాధి కల్పించటం, మరొకవైపు ఎంతోమందికి ఇష్టమైన పని చేయటం రామారావు మేథస్సుకి తార్కాణం. Win/Win Move అంటే ఇదే.

Nothing fails like success కీ, nothing succeeds like failure కి ఇంతకంటే మంచి వాస్తవ ఉదాహరణ వుంటుందా?

*(మైండ్ పవర్ నెం.1 అవటం ఎలా ?)*

# పాజిటివ్ థింకింగ్



'లేనిదాన్ని మర్చిపో. ఉన్నదాన్ని అభివృద్ధి చేసుకో' అని ఆలోచించడమే పాజిటివ్ థింకింగ్. చాలామంది విద్యార్థులు 'తాము బీదవారిమనీ, తమకి ఎవరూ లేరు' అనీ, మరికొంత మంది అమ్మాయిలు 'నేనెందుకూ పనికిరానూ, అందంగా లేనూ, పొట్టిగా ఉన్నాను' అనీ బాధపడుతూ ఉంటారు. దానివల్ల లక్ష్యసాధన పట్ల కుతూహలం కూడా తగ్గిపోతుంది. 'ఏమి చేసినా నువ్వు ఐశ్వర్యారాయ్‌వి కాలేవు. ఐశ్వర్య కావాలంటే అదృష్టం ఉండాలి. మదర్ థెరిసా కావాలంటే మనసు ఉంటే చాలు' అని ఏదో సభలో నేనే చెప్పాను. దానికి సంబంధించిన కథ ఇది.

ప్రముఖ ఆంగ్ల నవలా రచయిత ఛార్లెస్ డికెన్స్ చిన్నప్పుడు చాలా బీదవాడు. మనకి సంక్రాంతి ఎలాగో, అక్కడ KITES FESTIVAL అలాంటి పండుగ. డికెన్స్ తన పాత, చిరిగిపోయిన గాలిపటాన్ని తీసుకుని ఆట స్థలానికి వెళ్లాడట. అక్కడికి ఒక ధనవంతుడి కొడుకు కార్లో వచ్చాడట.

డికెన్స్‌ని చూసి గర్వంగా, "...ఆకాశంలో ఎగరెయ్యటానికి నా దగ్గర బోలెడన్ని గాలిపటాలున్నాయి" అన్నాడట.

డికెన్స్ కూడా నవ్వుతూ, "...నా దగ్గర ఒకే గాలిపటం వుంది. కానీ బోలెడంత ఆకాశం వుంది" అన్నాడట.

*(చదువు – ఏకాగ్రత)*

# తప్పు తనదైనప్పుడు



మన కోప కారణాలు చాలా వరకూ మన అసంతృప్తుల వల్ల, తప్పుల వల్ల వస్తాయి. అవతలివాళ్ళు చెప్పింది అర్థం కాక, లేదా అవతలివాళ్ళు చేసిన పని నచ్చకా, వారి చెప్పుల్లో మన కాళ్ళు పెట్టి ఆలోచించలేకా విసుక్కుంటూ ఉంటాం. కోపంతో అరవబోయే ముందు ఒక్కక్షణం కామ్‌గా ఆలోచిస్తే సగం కోపం తగ్గిపోతుంది.

ఒక డాక్టరు దగ్గరకి ఒక వ్యక్తి తన భార్యకి చెవుడు వచ్చిందని, దూరం నుంచి మాట్లాడితే వినపడటం లేదనీ, కంప్లయింట్ చేసాడట. ఆ డాక్టరు "ఎంత దూరం నుంచి మాట్లాడితే నీ భార్యకి సరిగ్గా వినపడటం లేదో సరిగ్గా తెల్సుకుని అప్పుడు చెప్పు. ఎంత హెవీ డోస్ ఇవ్వాలా అన్నది అప్పుడు నిర్ణయిస్తాను" అన్నాట్ట.

ఆ వ్యక్తి ఇంటికి వెళ్ళేసరికి భార్య వంటింట్లో కూర చేస్తోందట.

పదిహేను అడుగుల దూరంలో నిలబడి "ఏం కూర వండుతున్నావ్?" అని అడిగాడట. ఆమె సమాధానం చెప్పలేదు.

మరో అయిదడుగులు ముందుకెళ్ళి "ఏం కూర వండుతున్నావు?" అన్నప్పుడు కూడా మౌనమే సమాధానమైంది. మరింత దగ్గరకి వెళ్ళి, నాలుగోసారి మరింత బిగ్గరగా "ఇప్పటికి నాలుగు సార్లు అడిగాను. ఏం కూర వండుతున్నావ్?" అని అడిగాడట.

భార్య విసుగ్గా అతడి వైపు చూస్తూ "ఇప్పటికి నాలుగుసార్లు చెప్పాను. వంకాయ కూర వండుతున్నానని..." అందిట.

*(మైండ్ పవర్ నెం. 1 అవటం ఎలా ?)*

# పాజిటివ్ థింకింగ్

ఆనంద్ ఒక సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగి. ఒకరోజు సాయంత్రం పార్టీకి వెళ్ళి, తాగి, అర్ధరాత్రి ఇంటికి వస్తూండగా స్కూటర్ కడ్డంగా ఒక వ్యక్తి నిలబడి, ఏం జరిగిందో తెలుసుకునేలోగా ఆనంద్ మీద పడి, చేతిలోని కర్రతో అతడిని కొట్టి, మెడలోని చైన్ లాక్కున్నాడు.

ఆనంద్ కరాటే ప్లేయర్. ఆగంతకుడి చేతిలో వున్న కర్ర లాక్కుని మందు మత్తులో ఇష్టం వచ్చినట్టు అతడిని కొట్టాడు.

తలకి తగిలిన దెబ్బతో ఆ దొంగ మరణించాడు.

పోలీసులు ఆనంద్‌ని జైలులో పెట్టారు. తాగిన మత్తులో విచక్షణా రహితంగా కొట్టి చంపాడని నిర్ణయించి అతడికి ఎనిమిదేళ్ళ జైలు శిక్ష విధించారు.

ఇలాంటి పరిస్థితిలో అతడు ముందు ఆలోచించింది తన కుటుంబం గురించి...! అంతవరకూ తనతో హాయిగా బతుకుతున్న భార్యాబిడ్డల పరిస్థితి ఇకపై ఏమిటి? అని యోచించాడు.

కేవలం ఆలోచించి బాధపడుతూ కూర్చోలేదు.

ఆఫీసు నుంచి వచ్చిన తన సేవింగ్స్ మొత్తాన్నీ డిపాజిట్ రూపంలో వేసి నెలనెలా వడ్డీ వచ్చేలాగా ఏర్పాటు చేశాడు. అంత తక్కువ డబ్బుతో భార్య ఇంటి ఖర్చులు, పిల్లల చదువులు, తల్లి అనారోగ్యం చూసుకోలేదని అతడికి తెలుసు. జైలులో నుంచే పత్రికలకి వ్యాసాలు, కథలు వ్రాయసాగాడు.

ఇతర ఖైదీల జీవితచరిత్రలు అతడికి కథా వస్తువులు అయ్యేవి. ప్రతీ కథనీ ఒక కొత్తకోణంలో చూపించటం వల్ల అతడి రచనలకి మంచి ఆదరణ లభించింది. అలా సంపాదించిన మొత్తాన్ని అతడు ఇంటికి పంపించసాగాడు.

ఎనిమిదేళ్ళు పూర్తయ్యాక అతడు బయటి ప్రపంచంలోకి వచ్చాడు. అప్పటికే తాగుబోతుగా, హంతకుడిగా ముద్ర వేసిన జనం, అతడిని చూసి దూరంగా వెళ్ళిపోసాగారు. కరకు ఖైదీల మధ్య ఎనిమిదేళ్ళు గడిపివచ్చిన అతడికి, సమాజంలోని గౌరవనీయుల ప్రవర్తన ఆశ్చర్యాన్ని కలుగజేసింది.

మనుషుల ప్రవర్తనలో వున్న ఈ నెగెటివ్ దృక్పథాన్ని అతడు తన రచనలలో ప్రతిబింబించ సాగాడు. చాలా ఆశ్చర్యంగా జనానికి అది నచ్చింది. అదంతా తమ గురించి కాకుండా, 'ఎదుటివాడి గురించి' అని ప్రతి పాఠకుడూ అనుకోవటం వల్ల అతడి రచనలకి డిమాండ్ పెరిగింది.

ఇప్పుడెవరైనా అతడిని ప్రశ్నిస్తే “అవును, ఆ ఎనిమిది సంవత్సరాల జైలూ ఒక చెడ్డ పరిణామమే. కానీ దాన్ని నేను వినియోగించుకున్న తీరు మాత్రం నాకెంతో సత్ఫలితాన్నిచ్చింది. ఆ సంఘటనే జరుగక పోయి వుంటే నేను మామూలుగా ఉద్యోగం చేసుకుంటూ బ్రతికేవాడిని. ఆ సంఘటనవల్ల నేను ఒక రచయితగా మారాను. నా గత చరిత్రవల్ల, నా చుట్టూ వున్న వాళ్ళకి నామీద మంచి అభిప్రాయం లేకపోవచ్చు. కానీ నా జీవితం నాది. నా చుట్టుపక్కల వాళ్ళది కాదు. నా జీవితంలో జరిగే మంచి, చెడు ఫలితాలన్నీ నేనే, నేనొక్కడినే అనుభవించాలి. చుట్టుపక్కల వాళ్ళ గురించి ఆలోచించే కొద్దీ నామీద నేను హక్కు పోగొట్టుకుంటాను. ఆ విషయం తెలుసుకోబట్టే నేను ప్రస్తుతం చాలా ఆనందంగా వున్నాను. అయితే ఈ ఆనందం కలకాలం నిలుపుకోవటం కోసం నేను నిరంతరం కష్టపడుతున్నాను” అని జవాబిస్తాడు.


సంపూర్ణ విజయం అంటే అది.



*(విజయానికి 5 మెట్లు)*

# అర్జునుడి కన్నా మరో మెట్టు ముందుకి

మనసా, వాచా, కర్మణా చదువు మీద లగ్నం చేస్తూ బాగా చదివితే ఒకప్పుడు విద్యార్థికి విజయం లభించేది. కానీ ఇప్పుడు పోటీ ఎక్కువైంది. ఇంకా చాలా కావాలి. ఇంకా ఏం కావాలో చెప్పే కథ ఇది.



ద్రోణాచార్యులవారు అర్జునుడ్నీ, దుర్యోధనుడ్నీ వాళ్ళ విలువిద్యను పరీక్షించడానికి తీసుకువెళ్ళాడట. ఒక చెట్టు మీద పక్షి బొమ్మని చూపించి, దుర్యోధనుడితో దాన్ని గురి చూడమన్నాడట. అతడు బాణం సంధించబోయే సమయంలో "నీకేం కనపడుతోంది" అని అడిగాడట.

"చెట్టు, చెట్టుమీద కొమ్మ, కొమ్మ మీద పక్షి" అన్నాట్ట దుర్యోధనుడు

ఆ తర్వాత అదే ప్రశ్నని అర్జునుడిని అడిగాడట.

"కన్ను మాత్రం" అన్నాడట అర్జునుడు.

"నువ్వు నిజమైన విద్యార్థివి" అన్నాడట ద్రోణుడు.

ఇది ఒకప్పటి కథ.

ఆధునిక అర్జునుడు ఏమీ మాట్లాడడు.

ద్రోణాచార్యుడు ఎన్నోసార్లు రెట్టించి విఫలమయ్యి అర్జునుడిని చాలాసార్లు తట్టి "ఏమిటి? నేనడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పవేం?" అని అడిగితే అర్జునుడు "మీరు ప్రశ్నలు అడుగుతున్నారా? నా చెవులు, కళ్ళు, చర్మం, మనసు అన్నీ ఆ పక్షి మీదే లగ్నమయి ఉన్నాయే" అనాలి.

*(మైండ్ పవర్ నెం. 1 అవటం ఎలా ?)*

# థ్రిల్

మనిషి జీవితం రొటీన్ అవకుండా చూసుకోవాల్సిన బాధ్యత అతడిదే. మనిషికి కావాల్సిన షడ్గుణ ఐశ్వర్యాలలో కుతూహలం ఒకటి. జీవితం పట్ల కుతూహలం కోల్పోయిన మనిషి తొందరగా ముసలివాడు అయిపోతాడు. దీన్నే రిటైర్మెంట్ సిండ్రోమ్ అని అంటారు. ఓపిక ఉన్నంతవరకూ ఏదో ఒకపని చేస్తూ ఉండడమే కుతూహలం.

“రామనాథం రిటైర్ అయ్యాడు. కానీ జీవితం నుంచి కాదు. వంట అద్భుతంగా చేస్తాడు. చెట్ల పెంపకం అంటే చాలా ఇష్టం. భార్య మరణించింది. కొడుకు అమెరికాలోనూ, కూతురు ఆస్ట్రేలియాలోనూ ఉంటున్నారు. స్వంతంగా వంట చేసుకుంటూ, మొక్కలు పెంచుతూ రిటైర్డ్ లైఫ్ ప్రారంభిస్తాడు. కానీ క్రమ క్రమంగా జీవితం బోరు కొడుతున్నట్లు ఫీలవుతాడు.

ఒంటరితనం నుంచి బయట పడటం కోసం ప్రక్క పోర్షను అద్దె కిస్తాడు. కంప్యూటర్స్‌లో పనిచేసే రమణి అనే ఒకమ్మాయి ఆ పోర్షన్‌లో దిగుతుంది. చాలా చలాకీగా, కలివిడిగా, హుషారుగా, అన్ని విషయాలూ అతడితో చెపుతూ ఉంటుంది. తన జీవితంలో ఒకరి తరువాత ఒకరుగా పరిచయమయిన తన ఇద్దరి బాయ్ ఫ్రెండ్స్ విషయంకూడా...!

ఆమె అమాయకంగా ఉండే రోజుల్లో స్నేహంతో ప్రారంభించి, ప్రేమగా మార్చి, పెళ్ళి వాగ్దానంతో ఆ ప్రేమని శారీరకంగా పరిపూర్ణం చేసిన స్నేహితుడు, క్రమ క్రమంగా దూరం అయ్యాక గానీ ఆ అమ్మాయికి అమాయకత్వానికీ, అజ్ఞానానికీ తేడా తెలియలేదు.

అప్పుడు రెండో స్నేహితుడు పరిచయం అవుతాడు.

ఎక్కడయితే ఒక లాభాన్ని ఆశిస్తామో అక్కడ నష్టానికీ, మోసపోవటానికీ ఆస్కారం ఉంటుందని రెండో స్నేహితుడు చెప్తాడు. ఏమీ ఆశించకుండా జీవితాన్ని ఆనందించడమే బెస్ట్ అని ఆమె కూడా ఒక అభిప్రాయానికి వస్తుంది. వివాహం ప్రసక్తి లేకుండా, మంగళసూత్రంపై ఆసక్తి లేకుండా, మోసానికి ఆస్కారం లేకుండా ఇద్దరూ కలిసి ఉందామని అనుకుంటారు.

రామనాథానికి ఇదంతా థ్రిల్లింగ్‌గా ఉంటుంది. ఆమె గదికి ఆమె రెండో ఫ్రెండ్ సామాన్లతో సహా వచ్చేస్తాడు. పెళ్ళి కాని ఆ దంపతుల్తో రామనాథం స్నేహంగా ఉంటాడు.

పరిచయస్థుల్ని ఇంటికి పిలిచి స్వయంగా వంటచేసి విందు ఇవ్వటం రామనాథానికి సరదా! రామనాథానికి బ్రహ్మం అని చిన్ననాటి స్నేహితుడు ఉంటాడు. అతడిని ఒకరోజు

భోజనానికి పిలుస్తాడు. గ్యాస్ అయిపోతుంది. కంపెనీ వాడు పది రోజుల వరకూ ఇవ్వలేనంటాడు. అతడితో ఘర్షణపడి వచ్చేస్తాడు. కరెంట్ స్టౌ కొంటాడు. కానీ ప్రతిరోజూ సరీగ్గా వంట సమయానికి పవర్ కట్!

అన్నిటికన్నా ముఖ్యంగా ఎండిపోతున్న మొక్కల గురించి అతడి విచారం. నీళ్ళు లేవు. మున్సిపాలిటీ నీళ్ళు రెండు రోజులకొకసారి మాత్రమే వస్తున్నాయి. వెళ్ళి నీటి విభాగపు సూపర్నింటెండెంట్‌తో గొడవ పడతాడు.

రోజు రోజుకీ తనలో పెరుగుతున్న చిరాకుకీ, అందరితో గొడవకీ కారణం తన పట్ల తనకి ఇష్టం తగ్గిపోవటమే అని అతడు గుర్తిస్తాడు.

ఒకరోజు రాత్రి, పక్క పోర్షన్‌లోంచి గొడవ వినిపిస్తుంది. పరస్పర అపనమ్మకంతో ఇద్దరి మధ్యా 'స్నేహం' తగ్గిపోతున్న ఛాయలు కనపడతాయి.

మనుష్యుల మధ్య బంధం నిలబడాలంటే మంగళసూత్రమో, ప్రేమ బంధమో ఉండాలా? అని ప్రశ్నించుకుంటూ నిద్రకుపక్రమిస్తాడు.

నిద్రలోనే మరణిస్తాడు.

స్నేహితుడు బ్రహ్మం అతడి దహన ఏర్పాట్లు చేస్తాడు.

పని ఒత్తిడి వల్ల అమెరికా నుంచి కొడుకు రాడు.

ఆస్ట్రేలియా నుంచి ఫోన్లో కూతురు "వచ్చి చేసేదేముంది? ఎవరున్నారక్కడ? డబ్బు ఖర్చు. ఆ పెదకర్మ ఏదో ఇక్కడే చేయిస్తాంలెండి" అంటుంది.

దహనం జరుగుతున్నప్పుడు కేవలం స్నేహితుడు ఒక్కడే శ్మశానంలో ఉంటాడు. దహన కార్యక్రమాన్నంతా వీడియో తీసి ఆస్ట్రేలియా, అమెరికా పంపటానికి అతడు ఏర్పాటు చేస్తాడు.

రామనాథానికి నిద్ర నుంచి మెలకువ వస్తుంది. మంగళ సూత్రానికే కాదు, పిల్లల్తో తల్లిదండ్రుల రక్త సంబంధానికి కూడా విలువ తగ్గిపోతోందని అనుకుంటాడు.

ఈ లోపులో ప్రక్క గదిలో అర్ధరాత్రి జరుగుతున్న ఆ గొడవ ఇంకా పెద్దదవుతుంది. వెళ్ళి సర్దటానికి ప్రయత్నం చేస్తాడు. 'మా విషయంలో మీరు కల్పించుకోనవసరం లేద'ంటాడు కుర్రాడు.

ఇద్దరికీ మాట మీద మాట పెరుగుతుంది.

వెనక్కి తిరిగి తన పోర్షన్‌కి వచ్చేస్తాడు రామనాథం.

ఆ మరుసటి రోజు రమణి ఆఫీసు నుంచి వెనక్కి వచ్చేసరికి, ఇంట్లో కుర్రాడి శవం ఉంటుంది.

ఆమె స్నేహితుడిని తనే హత్య చేసానని రామనాథం ఒప్పుకుంటాడు. పోలీసులు అతడిని అరెస్ట్ చేస్తారు.

టి.వి. కెమేరాలూ, పత్రికల్లో ఇంటర్వ్యూలూ... ఒకసారిగా హడావిడి మొదలవుతుంది. రామనాథానికి ఇదంతా చాలా థ్రిల్లింగ్‌గా ఉంటుంది. మానవ సంబంధాల మీద అతడిచ్చిన స్టేట్‌మెంట్స్ చాలా సంచలనం కలిగిస్తాయి.

జైల్లో రామనాథం కూరగాయలు పండిస్తాడు. వంట చేస్తాడు. మొక్కలకి నీళ్ళు పోస్తాడు. తోటి ఖైదీల్తో ప్రేమగా ఉంటాడు.

ఈ హత్య రామనాథం చెయ్యలేదేమో అన్న అనుమానం ప్రథమంగా రమణికి కలుగుతుంది. తన పరిధిలో పరిశోధన ప్రారంభిస్తుంది. తన మొదటి బాయ్ ఫ్రెండ్ హంతకుడని తెలుసుకుంటుంది. కోర్టులో నిరూపిస్తుంది. అందరూ షాక్ అవుతారు.

"... ఎందుకు ఈ నేరం నీ మీద వేసుకున్నావ్?" అని జడ్జి అడిగినప్పుడు "థ్రిల్ కోసం" అంటాడు రామనాథం. "అది మొదటి కారణం! నిస్సారమయిన నా జీవితంలో ఇన్ని కెమేరాలూ, ఇంత అలజడీ నాకు ఉద్వేగాన్ని ఇచ్చాయి. నాకు వంట చెయ్యటం, కూరగాయలు పండించడం ఇష్టం. జైల్లో నీటి సమస్య, కరెంట్ సమస్యా లేవు. బయటి ప్రపంచం – మనిషికి రోజురోజుకి తన పట్ల తనకి ఇష్టం తగ్గిపోయేలా చేస్తోంది. అందుకే జైలుకి వెళ్ళాను' అంటాడు...

అదీ కథ.



*(వీళ్ళనేం చేద్దాం?)*

# మనిషి – కోతి

మనిషికీ కోతికీ ఉన్న మూడు ముఖ్యమైన తేడాలు జ్ఞానం, నైపుణ్యం, కోరిక. జ్ఞానం మూర్ఖత్వానికి వ్యతిరేక పదం. తాము చేసే పనిపట్ల ఇష్టం లేనివాళ్ళు, తాము చేసే విధానం పట్ల నమ్మకం లేనివాళ్ళు, గమ్యం తెలీకుండా పనిచేసే వాళ్ళు జ్ఞాన రహితులు. అలాంటి ఐదు కోతుల కథ ఇది.

ఒక పెద్ద బోనులో అయిదు కోతుల్ని పెట్టండి. పైన ఒక అరటిపండు వేలాడదీయండి. దాన్ని అందుకోవడానికి వీలుగా లోపల చిన్న నిచ్చెన ఏర్పాటు చేయండి.

చాలా కొద్ది సేపట్లోనే ఆ అరటిపండు ఒక కోతి కంట పడుతుంది. అది దాన్ని అందుకోవడం కోసం నిచ్చెన మెట్లు ఎక్కటం ప్రారంభించగానే బలమైన ఫోర్సుతో ఒక్కసారిగా చల్లటి నీళ్ళతో అన్ని కోతుల్నీ తడపండి. అన్నీ చెల్లా చెదురవుతాయి. హడావుడి సద్దుమణిగాక పండునందుకోవడానికి మళ్ళీ మరో కోతి ప్రయత్నిస్తుంది. వెంటనే నీళ్ళు బలంగా కొట్టి మళ్ళీ అన్నింటినీ తడిపెయ్యండి. ఇలా నాల్గయిదుసార్లు చేసాక ఇక కోతులు అరటిపండు వైపు వెళ్ళవు. ఇప్పుడు ఒక పాత కోతిని తీసేసి, కొత్త దాన్ని ప్రవేశపెట్టండి. ఇక చూడండి.

కొత్త కోతి దృష్టి అరటిపండు మీద పడి, దాన్ని అందుకోవటానికి నిచ్చెన మెట్లు ఎక్కటం మొదలు పెట్టగానే, మిగతా నాలుగు కోతులూ భయంకరంగా దాని మీద పడి క్రిందికి లాగేస్తాయి. నీళ్ళు పడకపోయినా సరే! ఇలా రెండు మూడుసార్లు అయ్యాక, తాను నిచ్చెన ఎక్కితే మిగతా కోతుల వలన ప్రమాదమని అయిదో కొత్త కోతి తెలుసుకుంటుంది.

ఇప్పుడు నాలుగు పాత కోతుల్లో ఒకదాన్ని తొలగించి రెండో కొత్త కోతిని చేర్చండి. అది అరటిపండు వైపు వెళ్తుండగా, దాన్ని క్రిందికి లాగే కార్యక్రమంలో **మొదటి కొత్త కోతి కూడా** మిగతావాటితో పాటు (ఉత్సాహంగా) పాల్గొంటుంది. ఇప్పుడు మరో పాతదాన్ని తీసి మూడో కొత్త కోతిని ప్రవేశపెట్టండి. దాన్ని క్రిందికిలాగే నాలుగు కోతుల్లో రెండింటికి "తామెందుకు ఆ పని చేస్తున్నాయో" తెలీదు. ఇలాగే అయిదో కోతిని కూడా కొత్తదాన్ని ప్రవేశపెట్టాక, దాన్ని భయంకరంగా క్రిందికి లాగే నాలుగు కోతులకి కూడా, అసలు తామెందుకు ఆ పని చేస్తున్నాయో తెలీదు. ఆ తరువాత ఆ అయిదూ అరటిపండు వైపు వెళ్ళే సాహసమే చెయ్యవు.

*(తప్పు చేద్దాం రండి..!)*

# కడుపులో కొండచిలువ

తనలో ఏదో లోపం ఉన్నదని నమ్ముతున్న మనిషి తన లోపాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఎన్ని అనుమానాలైనా వెలిబుచ్చుతాడు. మూర్ఖత్వపు విత్తనం హృదయక్షేత్రం మీద ఒక్కసారి పడితే అది మర్రిచెట్టు లాగా విస్తరించుకుంటుంది. కొమ్మలు కత్తిరిస్తే లాభం లేదు. వేళ్ళతో సహా పెరికిస్తే తప్ప మనిషి అజ్ఞానం నించి బయటపడడు.

ఒక మానసిక రోగికి అతడి భార్య విడాకులిచ్చి, పిల్లల్తో సహా వెళ్ళిపోయింది. అతడు ఆ తరువాత స్కిజోఫ్రెనిక్ పేషెంటు అయ్యాడు. తన కడుపులో పెద్ద పాముందని అతడి నమ్మకం. హిప్నటిస్ట్ అయిన డాక్టర్ దగ్గరకి వెళ్ళాడు. డాక్టరు అతడిని నిద్రలోకి పంపి, పాముని తోలేసానని చెప్పాడు.

"...ఎలా వెళ్ళిపోయింది?" రోగి అమితమైన ఆశ్చర్యంతో అడిగాడు.

వెంటనే ఏం చెప్పాలో తోచక, "...నాదస్వరం ఊదాను" అన్నాడు డాక్టరు.

పేషెంటు సంతృప్తిగా వెళ్ళిపోయాడు. కానీ నాల్రోజుల తరువాత మరింత పెద్ద అనుమానంతో వచ్చాడు. "... పెద్దపాము వెళ్ళిపోయింది డాక్టర్, పిల్లలు లోపలుండిపోయాయి" అన్నాడు.

డాక్టర్‌కి మతిపోయింది.

కానీ, అంతకన్నా పెద్ద కేసులు చూసినవాడు కాబట్టి, తేరుకుని, "... అది మొగపాము, దానికి పిల్లలుండే అవకాశం లేదు" అన్నాడు ధైర్యంగా.

పేషెంట్ కన్విన్స్ అయినట్టూ తలూపి, అంతలోనే అనుమానం వచ్చి, "... ఆడపాముకి మొగపాముకీ తేడా మీకు ఎలా తెలిసింది డాక్టర్?" అని అడిగాడు.

డాక్టర్‌కి క్షణంలో వెయ్యవవంతు భూమి ఆగిపోయినట్టు అనిపించింది. అంతలో అదృష్టవశాత్తు ఆ పేషెంట్ కేసు హిస్టరీ కాగితం బల్లమీద కనిపించింది. "అది ఆడపామయితే, పిల్లల్ని తనతోపాటూ తీసుకెళ్ళేది. ఆ మాత్రం తెలీదూ?" అని ధీమాగా అన్నాడు.

పేషెంట్ ప్రపంచాన్ని జయించినంత సంతోషంతో "... కరెక్ట్ – కరెక్ట్" అని డాక్టర్‌ని మెచ్చుకుని అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

కడుపులో కొండచిలువ పోవటం కోసం పేరులో అక్షరాలు మార్చుకునేవారు చదవవలసిన కథ ఇది.

*(మైండ్ పవర్ నెం. 1 అవటం ఎలా ?)*

# సమయస్ఫూర్తి

ఇద్దరు సైనికాధిపతులు తమ సైన్యపు గొప్పల గురించి చెప్పుకుంటున్నారట. మొదటి అధికారి తన సైనికుణ్ని పిలిచి, ఒక ఎత్తయిన భవంతిని చూపించి 'అక్కణ్ణుంచి దూకు' అన్నాట్ట.

సైనికుడు మారు మాట్లాడకుండా దూకి కాలు విరగ్గొట్టుకున్నాడు. "చూసావా అలా దూకటానికి నా సైనికులకు ఎంత ధైర్యం ఉందో" అన్నాడట సైన్యాధికారి.

రెండో సైనికాధికారి తన సైనికుణ్ణి పిలిచి "ఆ కొండ మీదకెళ్ళి అక్కణ్ణుంచి దూకు" అన్నాట్ట.

ఆ సైనికుడు "మీకేమైనా మతి పోయిందా? అక్కణ్ణుంచి దూకితే ఛస్తాను" అన్నాట్ట.

అప్పుడా సైనికాధికారి మొదటాయన వైపు తిరిగి, "చూసావా అలా మాట్లాడటానికి నా సైనికుడికి ఎంత ధైర్యం ఉందో" అన్నాడట. *(విజయానికి ఆరో మెట్టు)*

# భగవంతుడి విజిల్

ఒకరోజు పురాణ కాలక్షేపానికి ఒకామె తన పదేళ్ళ చిన్న కొడుకుని తీసుకుని వెళ్ళింది. శ్రోతలందరూ నిశ్శబ్దంగా, శ్రద్ధగా వింటూ ఉండగా ఆయన ఇలా చెప్పాడు. "మీరు తలచుకుంటే కానిది ఏమీ లేదు. కేవలం భగవంతుడిని నమ్మండి. ఏమి కావాలంటే అది మీకు దొరుకుతుంది. మీరేమి అడిగితే దేవుడు అది ఇస్తాడు".

ఆ మాటలకి హాల్లో పెద్ద విజిల్ వినపడింది.

తల్లి ఉలిక్కిపడి ప్రక్కనే వున్న కొడుకు తొడగిల్లి "ష్ అల్లరి చేయకు" అంది.

గుడి నుండి ఇంటికి వస్తూండగా ఆమె కొడుకుతో "ఎందుకురా ఆయన అంత నమ్మకంగా చెబుతూంటే అలా ఎగతాళిగా విజిల్ వేశావు?" అని అడిగింది.

ఆ కుర్రాడు అమాయకంగా "నేను వేయలేదమ్మా" అన్నాడు.

"మరి?"

"మనకు నమ్మకం వుండి భగవంతుడిని ఏమి అడిగితే అది ఇస్తాడని ఆయన చెప్పాడుగా."

తల్లి అనుమానంగా "అవును. ఏమి అడిగావు" అంది.

"విజిల్ ఎలా వేయాలో చూపించమని అడిగాను." *(విజయానికి ఆరో మెట్టు)*

# ఏకాగ్రత

చేస్తున్న పనిమీద గౌరవం ఉన్న వ్యక్తి, ఇతరుల అర్థంలేని విమర్శల్ని పట్టించుకోడు. అతి వినయం ధూర్త లక్షణం అన్నారు పెద్దలు. మర్యాద వేరు, అణిగి ఉండటం వేరు.

తను చేస్తున్న పని పట్లా, తన నమ్మకాల పట్లా ఎంతో విశ్వాసం ఉంటే తప్ప, మనిషికి ఆత్మగౌరవం అలవడదు అని చెప్పే కథ ఇది.

ఒక రాజుగారు వీధిన ప్రయాణిస్తూంటే, అందరూ వంగి వంగి నమస్కారాలు చేస్తున్నారట. అలా చెయ్యని మోచోడిని రాజుగారు నిలదీసారట. రాజువైపు చూడకుండా, కనీసం తన స్థానం లోంచి లేవకుండా ఆ చెప్పులు కుట్టేవాడు, "... ఈ వృత్తిలో ఈ రాజ్యంలోకెల్లా ప్రథముణ్ణి కావటం నా కోరిక. నా చేతులు పనిచేయటానికే తప్ప, నమస్కరించటానికి కాదు. నిన్ను చూసినప్పుడు నా సూది తప్పు రంధ్రంలో పడితే ఈ దేశంలో ఒక తప్పుడు చెప్పు తయారవుతుంది. కాబట్టి ఓ రాజా! నీ పని నువ్వు చెయ్యి. నా పని నన్ను సక్రమంగా చేసుకోనివ్వు" అన్నాడట. రాజుగారు సిగ్గుతో తలవంచుకుని వెళ్ళిపోయార్ట.



*(మైండ్ పవర్ నెం. 1 అవటం ఎలా ?)*

# దిండు కింద వెండి స్పూను

అవతలివాళ్ళు అమాయకులనుకుని మనం చెప్పే అబద్ధాలు ఏ విధంగా బూమరాంగ్ అవుతాయో హాస్యంగా చెప్పే ఇంటర్నెట్ కథ.

అమెరికా ఎగిరిపోయిన ఆనందరావుని చూడాలని వెళ్ళింది తల్లి. అక్కడ ఒక రెండు గదుల ఫ్లాట్‌లో వుంటున్నాడు కొడుకు. పక్కగదిలో మార్గరేట్ ఉంటోంది.

ఇలా ఇల్లు షేర్ చేసుకోవటం అమెరికాలో మామూలే అన్నాడు కొడుకు.

ఇద్దరికీ సంబంధం వున్నదేమో అని తల్లి అనుమానం.

అటువంటిదేమీ లేదని తండ్రి మీద ఒట్టేసి మరీ చెప్పాడు కొడుకు.

నెలరోజుల తరువాత తల్లి ఇండియా వచ్చేసింది. ఆపై నాల్రోజుల తరువాత మార్గరేట్, తన వంటింట్లో చాలా ఖరీదు చేసే వెండి స్పూన్ కనపడటం లేదనీ, నిశ్చయంగా దాన్ని "ఆవిడ" ఇండియా పట్టుకుపోయి వుంటుందనీ కంప్లెయింట్ చేసింది.

ఇద్దరూ ఎంత వెతికినా దొరకలేదు. మూడో మనిషి ఆ నెల రోజులలో ఇంట్లో అడుగుపెట్టలేదు.

చివరికి ఆనందరావు తల్లికి ఉత్తరం వ్రాశాడు.

"అమ్మా!

నువ్వీ పని చేస్తావంటే నేను నమ్మలేను. కానీ సత్యం సత్యమే కదా! మార్గరేట్ సిల్వర్ స్పూన్ కనపడటం లేదట. వారం నుంచి వెతుకుతున్నా దొరకలేదు. ఇంతకన్నా ఏం అడగను?"

పదిరోజుల్లో అతడికి జవాబు వచ్చింది. "బాబూ... నువ్వు ఒట్టేసి అబద్ధం చెప్తావంటే నేను నమ్మలేను. కానీ సత్యం సత్యమే కదా. మార్గరేట్ సిల్వర్ స్పూన్, ఆమె మంచం మీద దుప్పటి క్రింద వుంది. వారంలో ఒక్కసారయినా ఆమె దానిమీద పడుకుని ఉంటే దొరికేది. ఇంతకన్నా ఏం చెప్పను? నువ్వు నాతో అబద్ధం చెప్పినందుకూ, ఆ అమ్మాయితో కాపురం చేస్తున్నందుకూ కాదు నా బాధ. నాన్న మీద ఒట్టేసినందుకు– మీ అమ్మ."

*(మైండ్ పవర్ నెం. 1 అవటం ఎలా ?)*

# రిచ్ డాడ్ – పూర్ డాడ్

*"రా మానవుడా, రా. గుహాంతర్భాగంలోంచి బయటకి...రా*

*సాటి మానవుల కష్టాల్ని చూడటానికి.*

*వారి జీవితాల్లో వెలుగు నింపటానికి..రా"*

తాను వ్రాసిన పుస్తకంలోని గేయాల్ని మా తండ్రి చదవటం పూర్తి చేయగానే ఆడిటోరియం అంతా చప్పట్లతో నిండిపోయింది. ఆ తరువాత ఆ పుస్తకాన్ని సుదర్శనంగారు ఆవిష్కరించి, అటువంటి పుస్తకాల అవసరం ప్రస్తుత వ్యవస్థకి ఎంత అవసరమో చెప్పారు.

నా తండ్రి కళ్ళలో తడి స్పష్టంగా కనిపించింది. ఆ తరువాత సభ నుంచి సుదర్శనం గారిని మా తండ్రితోసహా, ఆయన పనిచేసే ఫ్యాక్టరీ కార్మికులూ, సాటి ఉద్యోగులూ కారు వరకూ సాగనంపారు.

ఆయన ఏం చేస్తూ వుంటారని మధుని అడిగాను. వాడు నా స్నేహితుడు. నాలాగే వాడికీ పన్నెండేళ్ళ వయసుంటుంది. ఫ్యాక్టరీలో పనిచేసేవారి సంక్షేమం కోసం ఆయన నిర్విరామంగా పని చేస్తూ వుంటారని వాడు చెప్పాడు. ఇలాంటి సభలకి హాజరయి, అందరికీ ప్రేరణ ఇస్తూ వుంటాడు అని అన్నాడు. నేను సరీగ్గా వినలేదు.

నా దృష్టి ఆయన ఖరీదైన కారు మీదే వుంది.

❀ ❀ ❀

ఆ సాయంత్రం నేను కుబేరం మావయ్యని కలుసుకున్నాను. ఆయన మా అమ్మ అన్నయ్య. అయినా రెండు కుటుంబాలకీ పెద్దగా రాకపోకలు లేవు. నాన్నకి ఆయనంటే పడదు. "... వాడికి డబ్బు తప్ప మరేమీ కనపడదు. పేరు కూడా కరెక్టుగానే పెట్టారు. '...కు' అంటే చెడు అని అర్థం. కుబేరం అంటే చెడు బేరం" అంటాడు నాన్న.

కుబేరం మామయ్యకి దాదాపు పదికోట్ల ఆస్థి వుంటుందని అంచనా. రెండు మూడు పెద్ద ఫ్యాక్టరీలు కూడా ఉన్నాయి. మేమిద్దరం ఆయన దగ్గరకి వెళ్ళాం. అరగంట తరువాత ఆయన లోపలికి పిల్చాడు. చాలా చిన్నగది. చెక్కల తాపడం. క్రింద తివాచీ అక్కడక్కడా చిరిగి వుంది. కుబేరం మామయ్యకి బట్టతల, చిన్నపొట్ట ఉన్నాయి. అయినా మనిషి హుందాగా ఉన్నాడు. మమ్మల్ని చూసి "...ఏరా! ఇలా వచ్చారు. ఏమిటి సంగతి" అని అడిగాడు. తలవంచుకుని నెమ్మదిగా చెప్పాను.

"... డబ్బు సంపాదించటం ఎలాగో నేర్చుకుందామని."

❀ ❀ ❀

మామయ్య బిగ్గరగా నవ్వుతాడనుకున్నాను. నవ్వలేదు. "...మీ నాన్నని అడిగే వచ్చావా?" అన్నాడు. అడిగానని చెప్పాను. నిజానికి నాన్న తిడతాడేమో అని భయపడ్డాను.

కాని పుస్తకావిష్కరణ సభ గొప్పగా జరిగిన ఆనందంలో ఆయన నా మాటలకి అంత ప్రాముఖ్యత ఇచ్చినట్టు కనపడలేదు. అదీగాక ఆయన, ఫ్యాక్టరీలో సుదర్శనంగారు సపోర్ట్ చేసే కమ్యూనిస్టు వర్గానికి ఎన్నికల స్లోగన్లు వ్రాసే కార్యక్రమంలో బిజీగా ఉన్నాడు కూడా!

మా కోరిక విని మామయ్య అందర్లా ఆశ్చర్యపోలేదు. "సరే... మీకు డబ్బు సంపాదించటం ఎలాగో నేర్పుతాను. ఈ రోజు నుంచీ ప్రతి సాయంత్రం వచ్చి రెండు గంటలు పని చేయండి. క్లాసులోలా ఇద్దర్నీ కూర్చోపెట్టి చెప్పను. పనిచేస్తూ నేర్చుకోండి. రోజుకి చెరో రూపాయి ఇస్తాను" అన్నాడు. ఇద్దరం మొహాలు చూసుకున్నాం. దీన్ని మేము వూహించలేదు. నెలకు ముప్పై రూపాయలు అంత ఎక్కువ కాకపోయినా, డబ్బు ఇస్తూ చదువు నేర్పే వారెవరు? అందుకని ఆనందంగా ఒప్పుకున్నాం.

"... రేపటి నుంచీ వస్తాం. ఈ రోజు క్రికెట్ మ్యాచ్ వుంది" అన్నాను అగ్రిమెంటు సంతకం చేస్తున్న స్టయిల్లో.

మామయ్య కరుగ్గా "...చేరితే ఈ రోజు చేరండి. లేకపోతే వెళ్ళిపోండి" అన్నాడు. మధు బిక్కమొహం పెట్టాడు. మా వీధి జట్టుకి వాడే కెప్టెన్. కానీ నాకెందుకో క్రికెట్ కన్నా ఇదే ఉత్సాహంగా అనిపించింది. వాడి తరపున కూడా నేనే సమాధానం ఇచ్చాను. "...చేరుతున్నాము! ఈ రోజు నుంచే."

మా పని ప్రతిరోజూ సాయంత్రం వెళ్ళి ఆఫీసు రూము నీట్‌గా సర్దటం. దుమ్ము దులపటం, కాగితాలు వరుసక్రమంలో పెట్టటం వగైరా. పదిరోజులు చేసిన తరువాత అది బోరు కొట్టటం మొదలైంది. మామయ్య ముసలి సెక్రటరీ రోజూ రూపాయి ఇచ్చేది. ఆయన మాత్రం కనపడలేదు. మరో అయిదు రోజులు గడిచేసరికి నేనొక నిర్ణయానికి వచ్చి "...నేను పని మానేద్దామనుకుంటున్నాను" అని మధుకి చెప్పాను.

మధు కూడా "... ఇదే విషయాన్ని ఈ రోజు నేనూ నీకు చెప్దామను కున్నాను" అన్నాడు.

ఇద్దరం వెళ్ళి ముసలి సెక్రటరీకి ఆ విషయం చెప్పాం. ఆవిడ నవ్వి "... మీరు తొందర్లోనే ఇలా అంటారనీ, అప్పుడు తన దగ్గరకి పంపించమనీ మీ మామయ్య చెప్పారు" అంది.

మేము ఆశ్చర్యపోయాం. కుబేరం మామయ్య ఇది ఊహిస్తాడని మేము అనుకోలేదు. నిజానికి నాన్న కూడా "... ఏమిట్రా, సాయంకాలాలు సరదాగా ఆడుకోకుండా, రూపాయి

కోసం ఆ పన్లేమిటి? మానెయ్యండి" అన్నాడు. పిల్లల్తో చాకిరీ చేయించుకుంటున్నందుకు అమ్మ తన అన్నయ్యని తిట్టింది కూడా.

ఏది ఏమైతేనేం, మేము ఆ సాయంత్రం మామయ్యని కలుసుకుని జీతం పెంచకపోతే, ఉద్యోగం మానేస్తున్నామని చెప్పాం. ఎందుకని అడిగాడు. అంతే. ఆవేశంగా "చిన్న పిల్లల్ని చేసి మాతో పని చేయించుకున్నావ్. సాయంత్రాలు ఆటలు మానేసి నీ కోసం కష్టపడి పని చేసేం. నీకు కృతజ్ఞత లేదు. ఈ ఊళ్ళో అందరూ నీ గురించి ఏమనుకుంటున్నారో అది కరెక్టే. నువ్వు కసాయివాడివి. నీ కోసం పని చేసే వారి మీద నీకు అభిమానం లేదు. ఒక రూపాయిచ్చి, పది రూపాయల పని చేయించుకుంటున్నావ్" అన్నాను. కసితో, కోపంతో నాకు ఆపైన మాటలు రాలేదు.

మామయ్య మా ఇద్దరి వైపూ కన్నార్పకుండా ఒక్క క్షణం చూసాడు. ఆ తరువాత, సన్నగా నవ్వుతూ అన్నాడు "ఫర్వాలేదు. పది రోజుల్లోనే నా క్రింద పనిచేసే ఉద్యోగస్థుల 'భాష' నేర్చుకున్నావ్".

ఆ మాటలకి నాకు తల తిరిగింది. లోపల్నుంచి ఉక్రోషం తన్నుకొచ్చింది. "...నేను నీ క్రింద పనిచేసే ఉద్యోగిని కాను. అయినా, ఇలా చిన్న కుర్రాళ్ళతో పని చేయించు కోవటం నేరం. మా నాన్న కూడా చెప్పాడు. నిన్ను అరెస్టు చేయించవచ్చు" అన్నాను.

ఈసారి మామయ్య కొంచెం బిగ్గరగా నవ్వేడు. "... ఉద్యోగంలోంచి తీసేస్తున్నానని తెలిసినప్పుడు మా వర్కర్లు, లేదా వాళ్ళ తరపున యూనియన్ లీడర్లు ఇలాగే మాట్లాడతారు."

"... నువ్వు తీసెయ్యటమేమిటి? మేమే మానేస్తున్నాము. అయినా నీకు మాట మీద నిలకడలేదు. మాకు సంపాదించటం నేర్పుతానని ఆశ పెట్టి పనిచేయించుకున్నావు. ఒక్క ముక్క నేర్పలేదు."

మామయ్య కుర్చీ వెనక్కివాలి, "...నేర్పుతూనే ఉన్నాగా" అన్నాడు తాపీగా. నేనూ, మధు ఉలిక్కిపడి ఒకర్నొకరు చూసుకున్నాం.

ఈ లోపులో మామయ్య అన్నాడు "... నేర్పటం అంటే, క్లాసురూమ్ లెక్చర్ అనుకున్నారా?"

మేము మాట్లాడలేదు. మామయ్య కొనసాగించాడు. "క్లాసుల్లో చెప్పేది చదువు. జీవితం చెప్పేది పాఠం. ఒక్కొక్క అనుభవం ఒక్కో లెక్చరర్. '...నేర్చుకో నేర్చుకో' అని అది చెప్తూ వుంటుంది. కొందరు దాన్ని మామూలుగా జీవితంలో ఒక భాగంగా తీసుకుంటారు. ఒకరిద్దరు మాత్రమే '...నేర్చుకుంటారు'. చాలామంది చిరాకు పడతారు. కోపగించు కుంటారు. జీవితం మీద కాదు. ఎదుటివారిమీద! భార్యమీదో, భర్తమీదో, పిల్లలమీదో – లేదా – ఇప్పుడు మీరు ఎగిరిపడినట్టు, తమ యజమాని మీదో..."

నాక్కొద్దిగా అర్థమయినట్టు అనిపించింది. నిజానికి మేము ఉద్యోగం మానేసి వెళ్ళిపోదల్చుకుంటే, మామయ్యని ఇంత తిట్టనవసరం లేదు. ఈ లోపులో మామయ్య అన్నాడు. "జీవితపాఠాల నుంచి ఏమీ నేర్చుకోలేనివాడు అన్నీ కరెక్టుగానే చేస్తున్నాననుకుంటాడు. సమాజం నిర్దేశించిన సూత్రాల్లోనే బ్రతుకుతాడు. రిస్కు తీసుకోడు. జీవితంలో ఇం...కా... ఎ...ప్పు...డో... ఏ...దో జరుగుతుందని ఊహిస్తూ ఆశగా బ్రతుకుతూ, చివరికి మరణిస్తాడు. మొత్తం మీద జీవితాంతం శ్రమిస్తూనే ఉంటాడు. అణకువగా, మర్యాదగా వుంటాడు. స్నేహితులు అతడిని "...పాపం చాలా కష్టపడతాడు. నిజాయితీపరుడు" అని పొగుడుతూ వుంటారు. కానీ అతడి అధైర్యమూ, రిస్కు తీసుకోలేని స్వభావమూ అతడిని అలా మార్చాయని అతడితో సహా ఎవరూ గ్రహించరు. గ్రహించలేరు. ఎందుకంటే, అతడి చుట్టూ వున్న ప్రపంచమంతా అలాంటిదే కాబట్టి...! **ఎవరో ట్యూన్ చేసిన పాటకి అతడి జీవితం నాట్యం చేస్తూ వుంటుంది**. అకస్మాత్తుగా డబ్బు అవసరం వస్తుంది. కానీ వయసు పైబడి వుంటుంది. డబ్బు కోసం ఆ వయసులో మరింత కష్టపడవలసి వస్తుంది. పునాదే బలహీనమైనప్పుడు భవంతి ఎలా కడతాడు? డబ్బు కోసం 'అంత' కష్టపడనవసరం లేదని చిన్నప్పుడే తెలుసుకుని ఉంటే మరింత బావుండేది. అయినా మారడు."

మామయ్య ఆగి, కొనసాగించాడు. "నా దగ్గర పనిచేసే 1500 మంది కార్మికుల్లో, ఉద్యోగస్థుల్లో ఎవరూ కూడా మీలా ఇలా వచ్చి '...డబ్బు సంపాదించటం ఎలాగో నేర్పు'మని అడగలేదు. మీరే ఫస్టు. ఈ వయసులోనే ఇంత ఆర్థిక స్పృహ ఉండటం ఆనందకరం. చాలామంది తండ్రులు, వాళ్ళ పిల్లలకి ఈ విషయం నేర్పరు. తమలాగే **బాగా** చదువుకుని, **బాగా** కష్టపడి, **బాగా** పనిచేసి, **బాగా** సె...టి...ల్ అవుతే చాలనుకుంటారు. కష్టాన్ని చిన్నప్పుడే నేర్పరు. వయసొచ్చాక అదెలాగూ తప్పదని అనుకుంటూ, పిల్లల బాల్యాన్ని రక్షిస్తూ ఉంటారు. అలా కాకుండా మీరు మీ సాయంత్రాన్ని ఈ విధంగా పెట్టుబడి పెట్టటం నచ్చి, మీకు ఉద్యోగం ఇచ్చాను."

"కానీ రోజుకి రూపాయి చాలా తక్కువ." కసిగా అన్నాను.

"ఆ సమస్య నాది కాదు. మీది" తాపీగా అన్నాడు మామయ్య. "సమస్య పట్ల మీ దృక్పథం మార్చుకోవటం మంచిది. **మీ సమస్యకి కారణం '...నేను', అని మీరు అనుకుంటే, నన్ను మార్చాలి. నువ్వే నీ సమస్య అనుకుంటే, నువ్వు మారాలి. ఏది సులభమో ఆలోచించు.** 'నేను మారలేను' అన్నవాడు గొంగళిలా పడి ఉంటాడు. ఇప్పుడు నా దగ్గర పనిచేయకపోతే, ఆడుకోవటం తప్ప నీకేం పని వుంది?"

"వేదాంతం మానేసి, నా జీతం పెంచు. కరెక్టుగా పాఠం చెప్పు. రెండింటిలో ఏది చెయ్యకపోయినా ఉద్యోగం మానేస్తాం."

"చాలామంది చేసేది అదే. ఏడాది చివర ఇచ్చే ఇంక్రిమెంటు కోసం పనిచెయ్యటం, లేదా జీతం పెంచమనటం, లేదా ఒకచోట మానేసి మరొక చోట మ...రో... మం...చి ఉద్యోగం సంపాదించి, అదే గెలుపు అనుకోవటం...! దానివల్ల సమస్య తీరిపోయింది అనుకుంటారే తప్ప, అది పక్కనే పొంచి వుంది అనుకోరు."

"మరేం చెయ్యమంటావ్? నువ్వు జీతం ఎప్పుడు పెంచుతావా అని ఎదురుచూస్తూ పని చెయ్యమంటావా?

"అది సమస్యకి పరిష్కారం చెప్పదు."

"మరేది చెపుతుంది?" గట్టిగా అన్నాను.

కుబేరం మామయ్య నా దగ్గరగా వచ్చి, రెండు చెవుల పైనా వున్న కణతల మీద రెండు చూపుడు వేళ్ళు పెట్టి "... వీటి మధ్య వున్నది చెపుతుంది" అన్నాడు.

❀ ❀ ❀

నాకెందుకో అప్రయత్నంగా వళ్ళు జలదరించినట్టు అయింది. ఈ జలదరింపు, ఆ తరువాత జీవితంలో గెలిచినప్పుడల్లా ఫీలయ్యాను. **గెలుపులో వచ్చే సంతోషంకన్నా, ఓడిపోతామేమోనన్న భయం ఎక్కువైన వారందరూ సామాన్యులుగా ఉండిపోతారని** ఆ తరువాత నా జీవితం ఎన్నోసార్లు నిరూపించింది. సామాన్యులు గొప్పని అంత సులభంగా ఒప్పుకోరు. ఆ విషయం అప్పుడే తెలిసింది. స్కూల్లో ఆటలు మానేసి, రూపాయి ఉద్యోగం (ఆ పేరు నా పాత స్నేహితులే పెట్టారు) చేయటం, వారికి పిచ్చితనంగా కనపడింది. మాకు మాత్రం, 'మేము వేరే... మిగతా పిల్లలు వేరే..'. అన్నట్టుగా అనిపించేది. బహుశ విశ్వనాథన్ ఆనంద్, మైకెల్ జాక్సన్‌లకు కూడా అలాగే అనిపించి ఉండవచ్చు. కుబేరం మామయ్య చెప్పే థియరీలు చాలామందికి అర్థం కావు. మా నాన్నలాంటి వాళ్ళకి అసలు కావు.

"...అన్ని అనర్థాలకీ డబ్బే మూలకారణం..." అంటాడు నాన్న. "...అన్ని అనర్థాలకీ డబ్బు లేకపోవటమే మూల కారణం" అంటాడు కుబేరం మామయ్య. జీతం కోసం నిజాయితీగా కష్టపడి పనిచెయ్యాలని నాన్న అంటాడు. ఆనందం కోసం, థ్రిల్ కోసం పని చేస్తే, కాంప్లిమెంటరీగా డబ్బు దానంతట అదే వస్తుందని మామయ్య అంటాడు. "...విజయవంతంగా చదువు పూర్తి చేస్తే, మంచి కంపెనీ కళ్ళకద్దుకుని ఉద్యోగం ఇస్తుంది. కాస్త కష్టపడి చదివి మంచి రాంకులు తెచ్చుకుంటే, ఇక జీవితాంతం కాలు మీద కాలేసుకుని బ్రతకవచ్చు" అంటాడు నాన్న. "...చదువనేది స్కూల్‌తో పూర్తవదు. ఆ మాటకొస్తే,

అప్పటినుంచే అది ప్రారంభమవుతుంది! యవ్వనంలో కాలుమీద కాలు వేసుకుని కదలకుండా ఉండటం **పక్షవాత లక్షణం.** విజయవంతంగా పనిచేస్తే మంచి కంపెనీ, నీ స్వంతమై కాళ్ళ దగ్గర వుంటుంది. పదిమందిని నువ్వే ఇంటర్వ్యూలకి పిలిచి, మంచి రాంకర్ని సెలక్ట్ చేసుకోవచ్చు" అంటాడు మామయ్య.

అద్భుతమైన రెస్యూమ్ తయారుచేస్తాడు నాన్న. వచ్చిన రెస్యూమ్‌లో అద్భుతమైనది సెలెక్ట్ చేసుకుంటాడు మామయ్య. అదీ తేడా ఇద్దరికీ.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్? నాకాట్టే టైమ్ లేదు. నేను చెప్పింది నచ్చిందా లేదా?" అన్న మామయ్య మాటలకి ఈ లోకంలోకి వచ్చాను. అప్పటికే మధు, తాను ఉద్యోగం చేస్తానన్నట్టు తలూపాడు. '...చేస్తానుగానీ, రోజుకి రూపాయి మరీ తక్కువ' అందామను కున్నాను. కానీ, రామాయణమంతా విని రాముడికి సీత ఏమవుతుంది? అని అడిగినట్టు ఉంటుందని, అంగీకరిస్తున్నట్టు తలూపాను. అప్పుడన్నాడు మామయ్య "సరే అయితే వెళ్ళి పని మొదలు పెట్టండి. ఈ రోజు నుంచీ మీకు జీతం ఇవ్వటం లేదు."

❀ ❀ ❀

ఆకాశం విరిగి మీద పడ్డట్టు అయింది. ఆయన చెప్పిందీ, మేము విన్నది ఒకటేనా అన్న అనుమానం కూడా కలిగింది. "...ఇది అన్యాయం" మధు అరిచాడు.

మామయ్య మొహంలో ఏ భావమూ లేదు. "... మీరు మొదట నేర్చుకుంటామన్నారు. ఇప్పుడు జీతం పెంచమంటున్నారు. మీకు '...జీతం' అలవాటయితే, అదిగో, ఆ పక్కగదిలో నా ముసలి సెక్రటరీలాగా ఎప్పుడు నేను తీసేస్తానో అన్న భయంతో, ఎప్పుడు నేను జీతం పెంచుతానా అన్న ఆశతో పనిచేస్తారు. చేస్తూనే వుంటారు. నాకెక్కువ టైమ్ లేదు. మీరు వెళ్ళిపోవటానికి నిశ్చయించుకున్న పక్షంలో ఇప్పటికే ఎక్కువ సమయం మీతో గడిపాను" అన్నాడు కరుగ్గా.

నా దృష్టి మామయ్య ఆఫీసు రూమ్ కిటికీలోంచి వరండా బయట కనపడుతూన్న వాషింగ్ మిషన్ మీద పడింది. మనసుని ఉతికి ఆరేస్తున్నట్టుంది అది.

❀ ❀ ❀

"వాడు దుర్మార్గుడు... మిమ్మల్ని మాటల్తో హిప్నటైజ్ చేసి ఆడిస్తున్నాడు" అన్నాడు నాన్న. నాకెందుకో సుదర్శనంగారు (!) గుర్తొచ్చారు. అవతలివారిని మాటల్తో హిప్నటైజ్ చేసి ఆడించటం మోసమయితే, ఆయనా దుర్మార్గుడే. ఆయన ఉపయోగించే కారు, అవతలివారిని మాటలతో మోసం చేసి, ఆ డబ్బుతో కొన్నదే అనిపించింది.

అమ్మ డైనింగ్ టేబిల్ సర్దుతూ, తన అన్నయ్యని తిట్టింది. "...అందుకే వాడికి అందరూ దూరమయ్యారు" అంది. నిజానికి కుబేరం మామయ్యకి ఎవరూ దూరం అవలేదు.

ఆయన పిలిస్తే చాలామంది పరుగెత్తుకుంటూ దగ్గరకు వెళ్తారు. ఆయన పిలవడు. అనవసరంగా తాను '...దగ్గిరవటం' ఆయనకి ఇష్టం లేదు.

మారిన నా భావాల గురించి మామయ్యతో చెప్పినప్పుడు, నవ్వి "...నువ్వు అమెరికన్‌లా తయారవుతున్నావు. గుడ్" అన్నాడు. నాకు అర్థం కాలేదు. వివరించి చెప్పమన్నాను. "...అమెరికన్స్‌ని చాలా మంది ఇష్టపడరు. కారణం, వాళ్ళు దుర్మార్గులవటం కాదు. వాళ్ళంటే మిగతావారికి వున్న ఈర్ష్య. కానీ, అలా అన్చెప్పి, వారి మాట ఎవరూ కాదనలేరు కూడా! వారికున్న పవర్ అలాంటిది. ఆఫ్ఘన్ యుద్ధమే దానికి మంచి ఉదాహరణ..." అంటూ, ఆయన కొనసాగించాడు. "...యజమానుల పట్ల వర్కర్లకి కూడా అదే భావం వుంటుంది. వాళ్ళని తిడుతూనే ఉంటారు. మళ్ళీ వాళ్ళ క్రిందే పనిచేస్తూ ఉంటారు. వాళ్ళలా మారటానికి ప్రయత్నించరు. లేదా, తమలో లేనిది, ఆ యజమానుల్లో వున్నదని ఒప్పుకోరు. తాము ఎక్స్‌ప్లాయిట్ కాబడుతున్నామన్న భావన వర్కర్లకి సంతృప్తినిస్తుంది. తమని తాము తిట్టుకుంటూ, లోలోపల సణుక్కుంటూ జీవితాన్ని గడిపేస్తారే తప్ప, వేరు మార్గాల్ని అన్వేషించరు. మరీ కోపం వస్తే స్ట్రయిక్ చేసి, జీతం పెరగ్గానే అదే గెలుపు అని సంతృప్తి పడతారు. వారి దృష్టిలో యజమాని రాక్షసుడు. అతడి క్రింద పని చేయవలసి రావటం ఖర్మ! ఎంత చిత్రమో చూడు!! దీన్నే Value Judgement అంటారు. అవతలివారిని ఎప్పుడయితే '...నీ' Values తో చూసావో, అప్పుడు వారు నీకు అదే విధంగా కనపడతారు. ఉదాహరణకి, ఒక అద్భుతమైన మేధావి ఉన్నాడనుకో! అన్ని రంగాల్లోనూ అతడు నెం.1. కానీ అతనికి వున్న ఒకే వ్యసనం తాగుడనుకో!! నీకు తాగుడంటే అస్సలు ఇష్టం లేదు. అప్పుడు అతడి గురించి ఇంకెవరికయినా చెప్పవలసి వస్తే నీ దృక్పథంతో 'అతడో తాగుబోతు' అని చెప్తావు. అంతే తప్ప అతడి '...అర్హత' బట్టి కాదు. నీ జడ్జిమెంటు అది! అందులో కాస్త అసూయ కూడా వుంటుంది అనుకో...! సాధారణంగా జనం అంతా అలాగే చేస్తూ వుంటారు. అందుకని నిజంగా value ఉన్నవాడు, అవతలివారి జడ్జిమెంట్లకి విలువ ఇవ్వడు. నేనంటే మీ అమ్మకీ నాన్నకీ పడకపోవటానికి కారణం అదే. కానీ నా విషయం అలా కాదు. వాళ్ళిద్దరినీ నేను అభిమానిస్తాను. వాళ్ళ సంపాదనా పద్ధతి, నెలసరి జీతం కోసం పనిచేయటం నాకు నచ్చదంతే..."

"వాళ్ళకీ నీ పట్ల అదే అభిప్రాయం ఉంది. నీ సంపాదనా పద్ధతి వాళ్ళకి నచ్చదు. ఇరవై నాలుగ్గంటలూ డబ్బు సంపాదనే తప్ప, నీకు జీవితాన్ని అనుభవించటం చేతకాదనీ, నలుగుర్నీ మంచి చేసుకోవటం తెలీదనీ వారి అభిప్రాయం" అన్నాను.

"నలుగుర్నీ మంచి చేసుకోవలసిన అవసరం నాకు లేదు. ఆ విషయం పక్కనపెట్టు. ఇక మొదటి విషయం గురించి నీకు కాస్త వివరించాలి. నేను ఇరవై నాలుగ్గంటలూ డబ్బు సంపాదనలో మునిగి ఉంటానని ఎందుకనుకున్నావు? మొన్నే మీ అత్తమ్మా పిల్లల్తో స్విట్జర్లాండ్ వెళ్ళాను. మనిషికి డబ్బు పిచ్చి ఉండకూడదని నమ్మేవాళ్ళలో నేను ప్రథముడిని. అయితే, డబ్బు లేకపోవటం వల్ల వచ్చే సమస్యలేవీ నాకు రాకూడదని నా కోరిక. అందుకే సంపాదిస్తున్నాను. అయినా సంపాదించకుండా ప్రొద్దున్నించీ సాయంత్రం వరకూ ఏం చెయ్యను? అన్నట్టు మీ నాన్న రోజూ ఆఫీసుకి ఎన్నింటికి వెళ్ళి, ఎన్నింటికి వస్తాడు?"

"ప్రొద్దున్న తొమ్మిదింటికి వెళ్లి, సాయంత్రం ఏడింటికి..."

"ఎప్పుడయినా మూడ్రోజులు వరుసగా సెలవు కావల్సివస్తే?"

"ఒక ఆదివారానికి మరో రెండు రోజులు కలిసొచ్చేలా పెడతాడు" అన్నాను.

"మరి నేను...?"

సమాధానం చెప్పబోతూ చప్పున ఆగిపోయాను. మామయ్య ఏం చెప్పదల్చుకున్నాడో నాకు అర్థమయింది. తనకి '...పని' ఒక హాబీ, పాషన్, వ్యాపకం. అంతే తప్ప 'అవసరం' కాదు. ఆఫీసుకి ఇష్టమొచ్చినప్పుడు రావొచ్చు. లేదా మానెయ్యొచ్చు. నాన్న అలాకాదు. తప్పనిసరిగా వెళ్ళాల్సిందే. కానీ... మామయ్యకి ఈ స్థితి ఎలా వచ్చింది? కొత్తరకంగా ఆలోచించటం వల్లనా?...నాకు సమాధానం దొరికినట్టయింది. ఆయన మొహంలోకి సూటిగా చూస్తూ, "...నీలాగా అందరూ చిన్నప్పుడే వ్యాపారం ప్రారంభించ లేరు. ఒకవేళ అలా చేసినా, లాభాలు రావాలన్న రూలేమీ లేదు. ఒకసారి స్థిరపడ్డాక ఎదుటివారికి ఎన్నయినా చెప్పొచ్చు. ఎదుటివారి పద్ధతుల్ని ఎద్దేవా చెయ్యొచ్చు" అన్నాను.

మామయ్య నవ్వేడు. బహుశ, నేనేం ఆలోచించానో ఊహించి వుంటాడు. "...డబ్బు సంపాదించాలంటే కేవలం వ్యాపారమే పెట్టనవసరం లేదు. సరైన ఆర్థికావగాహన వుండాలంతే. రిస్క్ లేకుండా డబ్బు సంపాదించే వ్యాపకాలు ఎన్నో ఉన్నాయి. నేను నా ఆఫీసుకీ ఫ్యాక్టరీకీ ఎందుకు వస్తానో తెలుసా? ఇక్కడికి రాకపోతే ఏ పేకాట క్లబ్‌కో, రేసులకో వెళ్ళాలి. దానికన్నా నాకీ ఆఫీసే ఇంటరెస్టు. మీ నాన్నకి అలా కాదు. ఆఫీసు ఆయనకి ఒక తలనొప్పి వ్యవహారం..." ఆగి ప్రారంభించాడు. "...చాలామందికి అదే దృక్పథం. అందుకే ఇంటిని ఒక 'విశ్రాంతి సాధనం'గా భావిస్తారు. ...కనీసం యవ్వన కాలంలోనైనా, అంటే... జవసత్వాలు నూరుశాతం స్థాయిలో వున్నప్పుడు కూడా, ఆ ఖాళీ టైమ్‌ని భవిష్యత్తు కోసం పెట్టుబడిగా పెట్టరు. మనిషికి అసంతృప్తి ఎందుకు కలుగుతుంది? డబ్బు లేకపోవటం వల్ల, ఆరోగ్యం బాగులేకపోవటం వల్ల, తననెవరూ గుర్తించటం లేదన్న ఒంటరితనంవల్ల! అవునా...! ఆరోగ్యం మన చేతిలో లేదు. మిగతా రెండూ మన చేతిలోనే

ఉన్నాయి. కనీసం ఆ రెండు సమస్యల్నీ కాసింత కష్టంతో ఒక్కసారి అధిగమిస్తే, డబ్బూ, గుర్తింపూ అవే వస్తాయి. ఒకసారి అవి రావటం ప్రారంభిస్తే ఇక వాటికి అంతుండదు. ఇక వాటి గురించి ఆలోచించ నవసరం లేదు. జీవితం గురించి అప్పుడు మనకిష్టమైన రీతిలో హాయిగా ఆలోచించవచ్చు. వాల్యూ జడ్జిమెంట్ అనేది ప్రతీ వ్యక్తీ తప్పనిసరిగా తెలుసుకోవలసిన విషయం. ఒక కుర్రవాడికి వెనీలా ఐస్‌క్రీం అంటే చాలా ఇష్టమనుకుందాం. ఊహ తెలిసినప్పటి నుంచి, మరణించే వరకూ అదే తింటూ ఉంటే, ఆ తరువాత మార్కెట్‌లోకి ప్రవేశపెట్టపడిన స్ట్రాబెర్రీ, కాసెట్టా ఐస్‌క్రీంల రుచి తెలుసుకునే అవకాశం జీవితంలో రాదు. ఎప్పుడూ మామూలు "...టీ" తాగే వ్యక్తికి, లెమన్ టీ, ఇలాచీ టీ, బ్లాక్ టీ, పౌనా, చైనీస్ టీ, మసాలా టీ మొదలైన వాటిలో మరింత రుచి వుందేమో తెలుసుకోవాలనే ఇంటరెస్ట్ ఉండదు. మార్పుకి ఇష్టపడని వ్యక్తి, ఒక వస్తువుకి ఒక '...వాల్యు (విలువ)' ఆపాదించుకుంటాడు. మిగతా వాటి విలువలు గ్రహించటానికి ఇష్టపడడు. **వాల్యూ జడ్జిమెంట్ లేకపోవటం అంటే అదే!**" టేబిల్ మీద కాగితాలు సర్దుతూ ముగించాడు.

మా ఇద్దరికీ ఒక రహస్యం బోధపడినట్టు అనిపించింది. "...ఇవన్నీ అందరూ అందరికీ ఎందుకు చెప్పరు?" అని ప్రశ్నించాను.

"చాలామందికి తెలీదు. తెలిసినవాళ్ళు చెప్పరు. వినేవాళ్ళు నిర్దేశింపబడిన పరిధిలోంచి బయటకు రావటానికి ఇష్టపడరు. మీ స్కూల్లో నీ క్లాస్‌మేట్స్ అందరూ మిమ్మల్ని చూసి జాలి పడుతున్నారు. అవునా. వాళ్ళలా సాయంత్రంపూట టీ.వీ. చూడటం కన్నా, మీరెక్కువ సంతోషంగా ఉన్నారన్న విషయాన్ని వారు చచ్చినా నమ్మరు. నమ్మలేరు. మీ పెద్దలకి కూడా ఈ సంగతి అర్థం కాదు. ఈ పెద్దలూ, మేథావులూ, గవర్నమెంటూ అందరూ ఈ వ్యవస్థనే ప్రోత్సహిస్తారు. కొద్దిమందికే అసలు విషయం తెలుసు. వారి చేతిలో క్యారెట్ వుంటుంది. ఎద్దుని బండికి కడతారు. క్యారెట్ ముక్క చూపిస్తారు. ముక్క ఎటు తిప్పితే బండి అటువెళ్తుంది. దాంట్లో వారు పయనిస్తారు. ప్రభుత్వాన్ని, చదువుకున్న మేధావుల్ని వారి చేతిలోకి తీసుకుని, తమకి కావల్సిన విధంగా వ్యవస్థని నిర్మించుకుంటారు. గమనించి చూడు. ఒక వర్కరు తన జీతంలో కంపల్సరీగా కొంత శాతం టాక్సు కట్టాలి. ఆటోమేటిక్‌గా అది జీతంలో cut అయిపోతుంది. వ్యాపారస్థుడి విషయం అలా కాదు. అతడి కారుకీ, విలాసవంతమైన అతిథి గృహాలకీ కూడా టాక్సులో రాయితీ లభిస్తుంది. ప్రభుత్వం కూడా వారినే ప్రోత్సహిస్తుంది. ఎందుకంటే ప్రభుత్వానికి తెలుసు. పని చేసేవారు తండోపతండాలు. పని చేయించుకునేవారే తక్కువ..." చెప్తూ మామయ్య ఆగాడు. ఫైలు సర్దుతూంటే దాని క్రింద కనపడిన డబ్బు చూసి "ఇదెవరు పెట్టారు?" అని అడిగాడు.

మేము మాట్లాడలేదు. సెక్రటరీని పిలవబోతూంటే నేను అన్నాను "...మేమే."

మామయ్యకి అర్థంకాలేదు. అయోమయంగా చూస్తూ, "ఎందుకు?" అన్నాడు.

కొంచెం తటపటాయించి నేను చెప్పాను "...నీ వాషింగ్ మిషన్ చాలా రోజుల్నుంచి మేము ఉపయోగించుకున్నాం మామయ్యా. ఈ ఇంట్లో రోజుకి గంటసేపు తప్ప దానికి పనిలేదు. మిగతా టైమ్‌లో తెలిసినవారందరి బట్టలూ ఉతికించి, ఇస్త్రీ చేసి ఇచ్చాము. కరెంటు ఛార్జీలు చెల్లించటం మా బాధ్యతగా భావించాము."

ఆయన చేతిలో డబ్బు వైపు చూసి "ఇంత కరెంటు ఛార్జీలు అయ్యాయా" అని అడిగాడు. నేను తలదించుకుని "నిన్ను మోసం చెయ్యటం గానీ, నీ ఋణం ఉంచుకోవటం గానీ మాకిష్టం లేదు మామయ్యా. మిషన్ అరుగుదల – డిప్రిసియేషన్ క్కూడా లెఖ్ఖ కట్టాము" అన్నాను.

అప్పుడు కనపడింది మామయ్య మొహంలో ఆశ్చర్యం.

డబ్బు తిరిగి వెనక్కి ఇస్తాడనుకున్నాను. ఇవ్వకుండా డ్రాయర్‌లో దాన్ని పడేసి, "మీలాంటి వాళ్ళే నాక్కావాలి. ఈ రోజు నుంచీ మీ జీతం రోజుకి రెండు రూపాయలు చేస్తున్నాను" అన్నాడు.

నేను నెమ్మదిగా అన్నాను "...సారీ మామయ్యా, చాలా తక్కువ."

"అయిదు రూపాయలు."

నేను మధూ వైపు చూసాను. వాడు తల అడ్డంగా వూపాడు.

"రోజుకి వంద..."

"ఊహూ"

"రోజుకి వెయ్యి ఇస్తాను."

నా గుండె క్షణంపాటు కొట్టుకోవటం ఆగిపోయింది. నెలకు ముప్పై వేలు. అంటే, మా నాన్న జీతానికి రెట్టింపు. అయినా అది అంత థ్రిల్లింగ్‌గా అనిపించలేదు. **మామయ్య ఇంట్లో వాషింగ్ మిషన్ లాంటివి ఈ ప్రపంచంలో ఇంకా చాలా ఉన్నాయి.** అదే చెప్పాను "...నీ ఆఫీసు బూజు దులపటం నాకు ఇక ఉత్సాహం కలిగించదు మామయ్యా. దానికన్నా ముఖ్యంగా..." ఆగి పూర్తి చేసాను "...ఒకరి క్రింద పనిచేయటం."

నా మాటలు పూర్తి కాలేదు. మామయ్య మా ఇద్దరి దగ్గరకీ వచ్చి, చేతులు విశాలంగా సాచి మమ్మల్ని దగ్గరకి తీసుకున్నాడు.

*(మైండ్ పవర్ నెం.1 అవటం ఎలా ?)*

# సంతృప్తి

'కిట్టూ' అంటే నాకు చిరాకు. మా పక్కింటి పిన్నిగారి కొడుకు వాడు. ఎనిమిదేళ్ళు. నన్ను 'అత్తా' అని పిలుస్తాడు. వాడంటే నాకస్సలు నచ్చేది కాదు. నా కొడుకుని నేను పెంచిన క్రమశిక్షణలో నూరోవంతయినా మా పక్కింటి పిన్ని వాడికి నేర్పలేదు.

ఆ వయసులో పిల్లలకి వుండాల్సిన శ్రద్ధ, చదువుమీద ఆసక్తీ వాడికి లేవు. మార్కులు బాగానే వచ్చేవి కానీ, నా కొడుకులా ఫస్ట్ రాంక్ వచ్చేది కాదు. ఆటల్లో మాత్రం ఫస్ట్. అంతేకాదు మిగతా అన్ని పనికిమాలిన విషయాల్లోనూ వాడు ముందుండేవాడు.

నా కొడుకుని వాడితో పోల్చి గర్వపడుతూండేదాన్ని.

అంతలో స్కూల్‌డే దగ్గరపడింది. కృష్ణుడి వేషం వాడిదని మాస్టారు చెప్పారట. అప్పటి నుంచి ఒకటే సంబరం. నెత్తికో పింఛం తగిలించుకుని డైలాగులు చెప్పటం మొదలుపెట్టాడు. నాకు వళ్ళు మండిపోయింది. వాడి హుషారుని ఎందుకో జీర్ణం చేసుకోలేక పోయాను. అల్లరి చేసే వాళ్ళంటే నాకు చిరాకు. అప్పుడే నాకో ఆలోచనవచ్చి, మా వారితో దాన్ని చెప్పాను. వారికి ఆ క్లాస్ టీచరు బాగా తెలుసు. ఏదో టాక్స్ సమస్యలో ఆయన సాయపడ్డారు కూడా. ఆవిడ మా మాట కాదనదని నాకు తెలుసు. నేను చెప్పినట్టు కాకుండా, మా అబ్బాయి ఉత్సాహపడుతున్నాడని చెప్పాను.

ఫలితంగా – మరో నాల్రోజుల్లో స్కూల్‌డే వుందనగా కృష్ణుడి వేషం మా అబ్బాయికిస్తున్నారని క్లాస్‌లో టీచర్ ప్రకటించింది.

కిట్టూ ఏం చేస్తున్నాడో చూద్దామని వాడింటికి వెళ్ళాను. మా అబ్బాయి నుదుటికి కోడి ఈక కట్టి పక్కనే కూర్చుని పద్యాలు చదివిస్తున్నాడు. "నీకేం వేషం ఇచ్చార్రా?" అని అడిగాను.

నుదుటిమీద జుట్టు తమాషాగా పైకి ఎగరేసుకుంటూ వాడు చెప్పాడు. "చప్పట్లు కొట్టే వేషం."

కిట్టూ అంటే ఇప్పుడు నాకెంతో ఇష్టం.

నాకింత గొప్ప పాఠం ఇంతవరకూ ఎవరూ చెప్పలేదు.

*(విజయంలో భాగస్వామ్యం)*

# దేవుడి పక్కన కూర్చున్న మనిషి

మనం ఒక సిద్ధాంతాన్ని మనసా, వాచా, కర్మణా నమ్మితే అది మనకి అత్యంత సంతృప్తిని ఇస్తుంది. అలా కాకుండా, చెప్పేది ఒకటి – చేసేది ఒకటి అయితే మనిషి ద్వంద్వ ప్రవృత్తిని పెంచుకుంటాడు. భగవంతుడికి దండం పెట్టి లంచాలు సంపాదించడం లాంటి మనస్తత్వం మనిషికి సంపూర్ణ తాత్కాలిక సంతృప్తిని ఇస్తే ఇవ్వొచ్చు గాక, 'చేసిన పనిని పూర్తిగా నమ్మడం, నమ్మిన దాన్ని ఆచరించడం' తృప్తికి పరాకాష్ట.

మేము హాస్టల్‌లో వుండే రోజుల్లో విక్టర్ అనే ఒక కుర్రవాడు వుండేవాడు. ప్రతి రాత్రీ భోజనం ముందు కూర్చున్నాక, రెండు నిమిషాలు కళ్ళు మూసుకుని దేవుడిని ప్రార్థించేవాడు. ఆహారాన్ని భగవంతుడికి ముందు అర్పించి, ఆ తరువాత తాను భుజిస్తున్నాననేవాడు. పక్క అల్లరి కుర్రవాళ్ళు, అతడు కళ్ళు మూసుకోగానే కంచంలో కోడిగుడ్డు చట్టుక్కున మాయం చేసేవారు. పైగా, దేవుడు తినేసి వెళ్ళాడని ఆటపట్టించేవారు. అతడు దాన్ని మనస్ఫూర్తిగా నమ్మినట్టు కనపడటంతో, మరింత జోకులేసి ఏడిపించేవారు.

ఇదంతా గమనించిన ఒక స్నేహితుడికి బాగా కోపం వచ్చి, విక్టర్‌ని చచ్చేటట్టూ చివాట్లు పెట్టాడు. "...ఎందుకింత స్టుపిడ్‌లా ఆలోచిస్తావ్? నిన్నో ఫూల్‌ని చేసి, ఇచ్చిన ఒక గుడ్డునీ పక్కవాడు తినేస్తున్నాడు. అది కూడా నీకు తెలీదా?" అని తిట్టాడు.

విక్టర్ ప్రశాంతమైన చిరునవ్వుతో అన్నాడు.

"తెలుసు."

"మరి దేవుడు వచ్చి తినటం ఏమిటి?"

"అతడే దేవుడు."

*(మైండ్ పవర్ నెం. 1 అవటం ఎలా ?)*

# ఏది మంచి - ఏది గొప్ప

ఒక భర్త పెళ్ళయిన సంవత్సరం పాటు ప్రతిరోజూ సాయంత్రం ఒక గులాబి పువ్వు భార్యకి ఇచ్చేవాడు. ఆషాఢమాసం ఆమె పుట్టింటికి వెళ్తే బోటిక్స్ ద్వారా కొరియర్ చేసేవాడు.

ఆమెకదొక అద్భుతమైన అనుభవం.

ఎందరు భర్తలు 365 రోజులపాటు క్రమం తప్పకుండా ఆ విధంగా చెయ్యగలరు?

అయితే, ఆ సంవత్సరం పుట్టింటి నుంచి వచ్చాక, ఆమె కాస్త నిర్లిప్తంగా వుండటం గమనించాడు. కారణం అడిగితే ఆమె తన బాధకి కారణం ఏమిటో తనకీ తెలియటం లేదని చెప్పింది. నిజానికి ఆమె పుట్టింటి నుంచి తిరిగి వచ్చేముందే అతడు మనుష్యులని పెట్టి ఇల్లు సర్దించాడు. రంగుల్ని వేయించాడు. కర్టెన్లు మార్పించాడు. పాడయిన వస్తువులు బాగు చేయించాడు. ఆమె సంతోషించింది. కానీ ఎందుకో అసంతృప్తికి కారణం తెలియలేదు. యథాతథంగా అతడు పువ్వులు ఇవ్వటం కొనసాగించాడు.

ఆర్నెల్లు గడిచాయి.

ఒక రాత్రి సంభాషణలో ఆమె తండ్రి ప్రసక్తి వచ్చింది. అకస్మాత్తుగా బెంగగా అనిపించింది. **అప్పుడే తన అసంతృప్తికి కారణం కూడా ఆమెకి తెలిసింది.**

ఆమె తండ్రి ఆదివారం పూట పిల్లలందర్నీ కూర్చోబెట్టి రేడియో, ఫాన్లు రిపేరు చేసేవాడు. కుట్టుమిషన్ తాలూకు ఆయిల్ సర్వీసు నుంచీ, మంచం నవార్లు బిగించటం వరకూ అన్నీ, అందరూ కలసి ఒక ఉత్సాహభరితమైన ఆటలా చేసేవారు. ఆయన వంటింట్లో తల్లికి సాయపడి అప్పుడప్పుడు కూరగాయలు కోయటం ఆమెకి గుర్తుంది. పిల్లలకి స్నానాలు చేయించటం లాంటి పనులన్నిటిలోనూ భార్యకి సాయపడేవాడు.

తన భర్త రోజూ పూవు ఇస్తున్నాడు.

తన తండ్రి తల్లి మనసులో ఒక పూల చెట్టునే నాటాడు.

ఆమె భర్త మంచివాడు.

ఆమె తండ్రి గొప్పవాడు.

*(విజయంలో భాగస్వామ్యం)*

# గుప్త దానం

తమకి పద్మశ్రీ రావాలని ప్రభుత్వానికి అప్లికేషన్లు పెట్టుకునేవాళ్ళు, బిరుదుల కోసం లంచాలు ముట్టజెప్పేవారూ చదవ వలసిన కథ ఇది.

ఒక రాజు, చరిత్రలో తన పేరు శాశ్వతంగా నిలచి పోవాలని, నభూతో నభవిష్యతి లాంటి భవనం ఒకటి నిర్మిస్తాడు. తాజ్‌మహల్‌ని తలదన్నే ఆ భవన నిర్మాణానికి, రాజ్యపు నలుమూలల్నుంచీ ఇటుకల్నీ, బంగారుమట్టినీ, కూలీల్నీ రప్పిస్తాడు.

పదేళ్ళకి ఆ అద్భుతమైన భవనం పూర్తి అవుతుంది. దానిమీద తన పేరు పెద్దగా, అందంగా చెక్కిస్తాడు.

మరుసటి రోజు చుట్టుపక్కల రాజులందర్నీ ఆహ్వానించి, తన ప్రాభవాన్ని చాటాలనుకుంటాడు.

ప్రొద్దున్నే చూసేసరికి, అతడి పేరు బదులు **'లిడోమియా'** అన్న పేరు వుంటుంది. అదెలా జరిగిందో అర్థంకాక మళ్లీ తన పేరు వ్రాయిస్తాడు. మరుసటి రోజుకి అది చెరిగిపోయి, లిడోమియా పేరే ఉంటుంది.

రాజు మండిపడి, ఈ దుశ్చర్యకి కారణమైన లిడోమియా అనే వ్యక్తిని పట్టి బంధించి తీసుకురమ్మని సైనికుల్ని పంపుతాడు.

రాజ్యమంతా వెతగ్గా, ఆ పేరు గల ముసలమ్మ ఒక్కతే ఒక్కత్తి దొరుకుతుంది. సైనికులు ఆ నిండు ముసల్ని బంధించి తీసుకువస్తారు. అంత వృద్ధురాలు ఈ పని చేసిందంటే ఎవరికీ నమ్మశక్యం కాదు. అదీగాక, ఆమె ఆ నూతన భవంతికి కొన్ని వందల మైళ్ళ దూరంలో ఉంటోంది!!!

ఏమి చెయ్యాలో తోచని సమయంలో దేవదూత సభలో ప్రత్యక్షమై, తనే ఆ వృద్ధురాలి పేరు భవంతిపై చెక్కానని చెప్పి అదృశ్యమైపోతుంది.

ఇదెలా జరిగిందని ఆ వృద్ధురాలిని రాజు ప్రశ్నిస్తే '...నాకేమీ తెలియదు మహారాజా! ఎన్నో బళ్ళు, ఎంతో దూరం నుంచి ప్రయాణిస్తూ వచ్చేవి. ఇటుకల్నీ, ఇసుకనీ బరువుగా లాక్కెళ్ళే ఆ పశువులు దాహంతో రొప్పుతూ జాలిగా చూసేవి. పదేళ్ళపాటు, ప్రతిరోజూ వాటికి  నీళ్ళు అందించేదాన్ని. అంతే' అంటుంది.

రాజు సింహాసనం దిగివచ్చి ఆమెని కౌగిలించుకుంటాడు.

*(మైండ్ పవర్ నెం. 1 అవటం ఎలా ?)*

# అనుమానం - నమ్మకం

ఒక కుర్రవాడు అమ్మాయిని ప్రేమిస్తే అతడికి ఆమెపట్ల ఎన్నో అనుమానాలు ఉంటాయి. చేసిన ప్రతీ పనినీ ప్రశ్నిస్తూనే ఉంటాడు. చివరికి ఆమె తాలూకు ఆడ స్నేహితులని కూడా ఒప్పుకోలేదు. దానికి అతడు ఇచ్చే సమాధానం: "ఇదంతా ప్రేమ. ఎక్కడైతే ప్రేమ ఎక్కువగా ఉంటుందో అక్కడ 'ఈ మనిషి నాది' అన్న భావం కూడా ఉంటుంది. అందుకే అనుమానం, జెలసీ ఎక్కువ అవుతుంది. దీనిని తప్పు పట్టవలసిన పని లేదు".

కాని ఈ క్రింది కథ దానికి వ్యతిరేక సత్యాన్ని చెప్తుంది. 'ఎక్కడైతే ప్రేమ ఉంటుందో అక్కడ నమ్మకం ఉండాలి' అంటుంది.

"నా పేరు కమల. నా తండ్రి చాలా స్ట్రిక్టు. కాలేజీ నుంచి రావటం అయిదు నిమిషాలు ఆలస్యం అయినా ఊరుకునే వాడుకాదు. 'మిమ్మల్ని కంటికి రెప్పలా చూసుకోవలసిన బాధ్యత నాది' అనేవారు నాతో, అన్నయ్యతో. ఆ అలవాట్లే మా బావకి కూడా వచ్చాయి. నేనొక రోజు ఎవరితోనో సినిమాహాల్లో కనపడినందుకు నానా యాగీ చేసాడు. వాడిని చంపేస్తానన్న లెవల్ వరకూ వెళ్ళాడు. నామీద ఈగ వాలినా సహించలేననే వాడు.

ఈ లోపులో నాన్న బాధ భరించలేక అన్నయ్య ఇంట్లోంచి వెళ్ళిపోయాడు. నాకెందుకో నా బావని వివాహం చేసుకోవాలనిపించలేదు. క్రమంగా విశ్వం పట్ల ఆకర్షితురాలినయ్యాను. నాన్న కూడా పెద్దగా అభ్యంతరం పెట్టలేదు. అప్పటికే విశ్వం పెద్ద ఆఫీసరు.

మా వివాహం జరిగింది. బావ గెడ్డం పెంచేసి, తాగుడికి బానిస అయ్యాడు. ఆ తరువాత పెళ్ళి చేసుకుని ఇద్దరు పిల్లల్ని కన్నాడు. అఫ్‌కోర్స్. తాగుడు అలానే కొనసాగిందనుకోండి.

ఒకరోజు అర్ధరాత్రి మా ఇంటి తలుపు ఎవరో తట్టారు. ఆయన ఇంట్లోలేరు. తీసి లోపలికి ఆహ్వానించాను. తెల్లవారుఝామునే తను వెళ్ళిపోయాడు. ఆ సాయంత్రం నా భర్త వచ్చారు. రాత్రి మామూలుగానే పడుకున్నాం.

రెండ్రోజుల తరువాత మేము పడుకున్న మంచం పక్కన టేబిల్‌లైట్ దగ్గిర సిగరెట్ పీక కనపడింది. నా గుండె గుభిల్లుమన్నది. ఆయన సిగరెట్ తాగరు. టేబుల్ లైట్ వేసినప్పుడు ఆయనకు అది కనపడే వుంటుంది.

అప్పుడు చెప్పాను ఆయనకి అన్నయ్య సంగతి. తాను అండర్ గ్రౌండ్‌లో వున్న కారణంగా, తన రాక సంగతి ఎవరికీ చెప్పవద్దని అన్నయ్య అన్నాడు. అది వేరే సంగతి.

"మీరు లేనప్పుడు బెడ్‌రూమ్‌లో రాత్రంతా నేను ఎవరితోనో కబుర్లు చెప్పానని తెలిసీ మీరెందుకు నన్ను ప్రశ్నించలేదు?" అడిగాను.

"ప్రేమంటే అనుమానం కాదు. నమ్మకం" అన్నారాయన.

*(విజయానికి ఆరో మెట్టు)*

# భగవంతుడి పాదముద్రలు

భగవంతుడు ఒక మనిషిని సృష్టించి, భూమ్మీదకు పంపుతూ, "...నాయినా! నన్ను నువ్వు నమ్ము. సర్వకాల సర్వావస్థలయందు నేను నీకు తోడుగా వుంటాను. నీ పక్కనే నీడలా నడుస్తూ వుంటాను" అన్నాడట.

ఆ విధంగా అతడు జన్మించి, వంద సంవత్సరాల తరువాత ఆ వ్యక్తి మరణించాడు. దేవుడితో కలసి తిరిగి వెళ్ళిపోతూ ఉండగా, నాలుగు పాదముద్రలు కనిపించాయి.

"...అవేమిటి?" అని అడిగాడు మనిషి.

"...జీవన యాత్రలో నీవి రెండు కాలిముద్రలు. పక్కవి నావి. చెప్పానుగా నాయినా! మరణించే వరకూ నీకు తోడుగా నడుస్తానని..." అన్నాడు భగవంతుడు.

కొంతదూరం సాగాక ఒక జత ముద్రలు మాయమయ్యాయి.

"...ఇదేమిటి?" అన్నాడు మనిషి ఆశ్చర్యంగా.

"... అక్కడే నీ కష్టకాలం ప్రారంభమయింది. నీ భార్య మరణించింది. నీకు వ్యాపారంలో నష్టం వచ్చింది. నవనాడులూ కృంగి, నువ్వు వంటరి వాడివి అయ్యావు" అన్నాడు భగవంతుడు.

మనిషికి అపరిమితమైన కోపం వచ్చింది. "ఇది అన్యాయం. దారుణం. నా సర్వశక్తులూ నశించిన సమయంలో నన్ను వదిలి వెళ్ళిపోతావా? నాకిచ్చిన వాగ్దానం మర్చిపోయావా? జీవితకాలమంతా నిన్నే నమ్మేనే! ఎందుకు నన్ను ఒంటరి వాడిని చేసి వెళ్ళిపోయావు?" అంటూ ఆవేశంగా ప్రశ్నించాడట.

భగవంతుడి ప్రశాంతమైన స్వరం చిరునవ్వుతో ఈ విధంగా పలికిందట "... నేను నిన్ను వదిలి వెళ్ళలేదు నాయినా! నడవలేక, బ్రతుకుబాటలో కృంగిపోయిన నిన్ను, నా భుజాలపై ఎత్తుకుని తీసుకువెళ్ళాను. ఆ కాలి ముద్రలు నీవి కావు. నావి..."

*(మైండ్ పవర్ నెం. 1 అవటం ఎలా ?)*

# దున్నపోతులు

తాత్కాలిక నమ్మకం శాశ్వతం అయినప్పుడు అది విశ్వాసం అవుతుంది. విశ్వాసానికి హేతువు లేనప్పుడు అది మూఢనమ్మకం అవుతుంది. 'తన విశ్వాసాలు హేతువు మీద ఆధారపడ్డాయా, లేక ఎవరో చెప్పింది తాను మూర్ఖంగా ఆచరిస్తున్నానా' అనేది ప్రతి మనిషి నిర్ణయించుకోవాలి. అప్పుడు సగం కష్టాలు తొలగిపోతాయి. మనిషికి తనమీద తనకి నమ్మకం పోయేలా చేసేదే మూఢ నమ్మకం.

ఒకడు చెట్టు మీద కూర్చుని, కూర్చున్న కొమ్మనే నరుకుతూ ఉంటాడు. ఒక స్వామీజీ అటు వెళ్తూ, "కొమ్మ కూలి మరణిస్తావు నాయనా! జాగ్రత్త" అని హెచ్చరించి వెళ్ళిపోతాడు. కొంచెం సేపటికి వాడు నేల మీద కూలి పడతాడు. వాడి మీద కొమ్మ పడుతుంది.

కొమ్మ కూలుతుందని ముందుగానే దివ్యదృష్టితో చెప్పిన స్వామి మహత్తుకి వాడు ఆశ్చర్యపోతాడు. ఆయన వాక్శుద్ధివల్ల తాను మరణించానని తెలుసుకుని అచేతనంగా కదలకుండా ఉండిపోతాడు. ఎంత గొప్పవాడయితే తప్ప, కొమ్మ ఆ విధంగా కూలుతుందనీ, తను మరణిస్తాననీ ముందే ఊహించగలడు?

ఈ విధమైన ఆలోచనలతో అతను మరణించి ఉండగా, మిగతా కట్టెలు కొట్టేవారు వస్తారు. కొమ్మలేపి క్రింద వున్న సహచరుడిని చూస్తారు. వారు ఎంత కదిపినా అతడు కదలడు. కానీ ఊపిరి ఆడుతూనే వుంది. అతడు మరణించాడో, బ్రతికే ఉన్నాడో వారికి అర్థం కాదు. ఏం చెయ్యాలో తోచదు. అప్పుడు వాళ్ళ నాయకుడు గంభీరంగా, "అతడిని లేపి నిలబెట్టండి. అతడు క్రిందకు పడిపోతే మరణించినట్టు లెక్క" అంటాడు. వాళ్ళందరూ కలిసి అతడిని లేపి నిలబెడతారు.

మరణించిన మనిషిని నిలబెడితే తిరిగి క్రింద పడిపోతాడన్న సత్యం తెలుసుకున్న కట్టెలు కొట్టేవాడు ఆ విధంగానే పడిపోతాడు. అతడిని మోసుకుంటూ గ్రామానికి తీసుకెళ్ళటానికి వారు భుజాల మీద ఎత్తుకుంటారు.

"నా గొడ్డలి మర్చిపోయారు" అని గుర్తుచేస్తాడు వాడు.

వారు దానిని కూడా తీసుకుంటారు. మరణించి కూడా అంత జాగ్రత్తగా తన వస్తువుల్ని గుర్తు పెట్టుకున్నందుకు అందరూ వాడిని అభినందిస్తారు.

తీసుకొచ్చి ఇంటి ముందు పడుకోబెడ్తారు. ఇంటికి గొళ్ళెం పెట్టి ఉంటుంది. తాళం ఉండదు. అతడి భార్య ఎక్కడ ఉన్నదని వారు చర్చించుకుంటూ వుండగా, "గొళ్ళానికి

తాళం వేసి ఉంటే పక్కవీధిలో అమ్మగారింటికి వెళ్ళి ఉంటుంది.గొళ్ళానికి తాళం లేకపోతే పక్కింటికి కబుర్లు చెప్పటానికి వెళ్ళి ఉంటుంది చూడండి" అని మరణించిన వాడు పడుకునే సలహా ఇస్తాడు.

వెళ్ళి ఆమెని తీసుకొస్తారు. "మీ ఆయన చెట్టుకొమ్మ మీద పడి మరణించాడు" అని చెప్తారు.

కట్టెలు కొట్టేవాడు కోపంగా, "...అది నిజం కాదు. నేను కూర్చున్న కొమ్మ విరిగి పడి మరణించాను" అంటాడు.

ఈ లోపులో గ్రామ పెద్ద వచ్చి, చీకటి పడే లోపు దహనం చెయ్యకపోతే వంద వరహాలు ఫైను అంటాడు. మరోపక్క తన రక్ష రేకు కట్టుకోకపోవటం వల్లనే వాడు మరణించాడని జ్యోతిష్కుడు, పాక ద్వారం దక్షిణాన వుండటం వల్లనే ఇది జరిగిందని వాస్తువాడు, ఇద్దరూ ఒక మూల చేరి దెబ్బలాడుకుంటూ ఉంటారు.

ఇంతలో పక్కింటావిడ వచ్చి "పాపం వాళ్ళాయన కిష్టమని రాత్రికి చేపల కూర వండానని ఇప్పుడే చెప్పింది. తినకుండానే పోయాడు" అంటుంది.

కట్టెలు కొట్టేవాడు చప్పున లేచి కూర్చుని, "అవును. లోపల్నుంచి కమ్మటి వాసన కూడా వస్తోంది" అంటూ పాకలోకి పరుగెడ్తాడు.


గ్రామస్తులందరూ, "పాపం. చేపలకూర పేరు చెప్పగానే వాడికి తిరిగి ప్రాణం లేచొచ్చింది" అనుకుని సంతోషిస్తూ ఎవరింటికి వాళ్ళు వెళ్ళిపోతారు. వారిలో గ్రామపెద్ద, వాస్తువాడు, జ్యోతిష్కుడు– ముగ్గురు మాత్రమే విచారంగా వున్నారు.

ఒకప్పుడు 'దున్నపోతులు' అని ఒక నవల వ్రాద్దామనుకున్నాను. దానికోసం అనుకున్న కథ ఇది. ఆ నవల ఆలస్యం అవటంతో ఇందులో చేర్చటం జరిగింది.

ఈ కథ మళ్ళీ ఒకసారి చదవండి. మనందరం ఏదో ఒక సందర్భంలో ఇలాగే కదుల్తున్న శవాల్లాగా ప్రవర్తించి ఉంటాం. వాతావరణ కాలుష్యం నుంచీ సౌండ్ పొల్యూషన్ వరకూ, కుల రాజకీయాల నుంచీ సామాజిక దివాళా కోరుతనం వరకూ, దేన్నీ పట్టించు కోకుండా మూఢవిశ్వాసాలతోనూ, హేతు రహిత ఆలోచనలతోనూ బ్రతికేస్తూ ఉంటాం.

*(తప్పు చేద్దాం రండి..!)*

# అవకాశం



అవకాశం ఒకసారే తలుపు తడుతుందంటారు. కాకపోవచ్చు. కానీ ఫేస్‌బుక్, ట్విట్టర్, చాటింగ్ లాంటి వాటిలో నిమగ్నమయి, అదృష్టం ఎన్నిసార్లు తలుపు తట్టినా మనం వినిపించుకోము. పట్టించుకోము. జీవిత పుస్తకంలోనే జ్ఞానధనం ఉన్నదని గ్రహించము.

కోటీశ్వరుడయిన తండ్రికి ఒక కొడుకున్నాడు. ప్రతిరోజూ కాలేజీకి వెళ్ళేటప్పుడు షోరూమ్‌లో వున్న ఒక ఖరీదయిన స్పోర్ట్స్ కారుని చూస్తూ వుండేవాడు. అతడు ఫస్ట్‌క్లాస్‌లో పాసయిన రోజు అతడి తండ్రి అతడిని ఏం బహుమతి కావాలని అడిగాడు. తనకి ఆ కారు కావాలని కోరాడు కొడుకు. ఆ సాయంత్రం బర్త్‌డే పార్టీ జరిగాక తన గదిలోకి పిల్చి గిఫ్ట్ బాక్స్ అందించాడు తండ్రి. కొంచెం నిరాశతో, కొంచెం కుతూహలంతో పై తగరపు కాగితాన్ని కాస్త చింపాడు కుర్రవాడు.

లోపల భగవద్గీత వున్నది. అతనికి అంతులేని కోపం వచ్చింది. గిఫ్టు పూర్తిగా కూడా విప్పకుండా అలాగే వదిలేసి వెళ్ళిపోయాడు. ఆ తరువాత పై చదువులకు విదేశాలకు వెళ్ళాడు. చదువు పూర్తయ్యాక విదేశాల్లోనే తండ్రి తాలూకు వ్యాపారాన్ని విస్తరింపచేసి అక్కడే సెటిల్ అయ్యాడు.

ఈ లోపులో తండ్రి మరణించాడు. ఆ సందర్భంలో కొడుకు స్వదేశం వచ్చాడు. తండ్రి గదిలో పాత పేపర్లు ఫైళ్లు సర్దుతూ వుండగా అడుగున అప్పుడెప్పుడో తండ్రి ఇచ్చిన బహుమతి కనపడింది. సగం విప్పిన కాగితం పాకెట్ అలాగే వుంది.

గత జ్ఞాపకాలతో అతడి మనసు విషాదభరితం అయింది. మరణించిన తండ్రిని గుర్తు తెచ్చుకుంటూ, దాన్ని పూర్తిగా విప్పాడు. పేజీల మధ్య అతడికి ఒక చెక్ కనపడింది. అతడు కోరిన కారు కోసం, పుట్టిన రోజు నాడు తండ్రి వ్రాసిన పదిహేను లక్షలకి చెక్ అది.

*(విజయానికి ఆరో మెట్టు)*

# గమ్యం

ఈ కథలో రెండు రకాలైన కథాంశాలు ఉన్నాయి.

ఒకటి : తృప్తి గురించి.

రెండు : ఒక కుర్రవాడు తన లక్ష్యం చేరుకున్న విధానం గురించి.

ఒక ఇంగ్లీషు బుక్ తాలూకు కథాంశం ఇది.

క్రిష్టఫర్ అనే కుర్రవాడికి పదేళ్ళు. లెక్కల్లో జీనియస్. ఖాళీ సమయాల్లో మనసులోనే 187×336 ఎంత? లాంటి లెక్కలు వేసుకుంటూ ఉంటాడు.

అతడికి ఫీలింగ్స్ ఏమీ వుండవు. ఎవరయినా తన శరీరం మీద చెయ్యి వేసి స్పృశించినా కూడా సహించలేడు. కేవలం ప్రశ్నలకి సమాధానం చెప్పటమే తప్ప, పక్కవాళ్ళతో మామూలు సంభాషణ కూడా జరపలేడు. జరపడు కూడా.

ఇంట్లో ఒక ఎలుకపిల్లని పెంచుతూ వుంటాడు.

క్రిష్టఫర్ తండ్రి చాలా మంచి వ్యక్తి. అతడి తల్లి కూడా చాలా మంచిది. కానీ ఇద్దరు మంచివాళ్ళు, మంచి దంపతులు అవ్వాలని రూల్ లేదు కదా. వారు నిరంతరం ఘర్షణ పడుతూ ఉండేవారు. ఆ టైమ్‌లో ఆమె జబ్బుచేసి ఆస్పత్రిలో చేరుతుంది. క్రిష్టఫర్‌కి పదేళ్ళే కాబట్టి ఆస్పత్రి లోపలికి రానివ్వరు. తండ్రితో తల్లికి పువ్వులు పంపిస్తూ ఉంటాడు. ఆమె అక్కడే మరణిస్తుంది.

క్రిష్టఫర్, అతని తండ్రి... ఇద్దరే కలసి జీవిస్తూ ఉంటారు. కొడుకు తల దువ్వటం నుంచీ స్కూల్‌కి పంపటం వరకూ అన్ని పనులూ ఆయనే చేస్తూ ఉంటాడు. ఆ విధంగా కొడుకు బాగోగులు తండ్రి చూసుకుంటున్న సమయంలో, పక్కింటావిడ అప్పుడప్పుడు ఆయనకి సహాయపడుతూ వుంటుంది. ఆమె కూడా ఆ కుర్రవాడిని ప్రేమగానే చూసుకుంటూ ఉంటుంది గానీ, అతడికి అటువంటి ప్రేమా ఆప్యాయతల పట్ల అంతగా పట్టింపు ఉండదు. అతడి ప్రపంచం అంతా లెక్కలే.


పక్కింటావిడ మొగుడు ఎక్కడో దూరంగా ఉద్యోగం చేస్తూ వుంటాడు. ఒంటరిగా ఉంటుంది కాబట్టి ఆమె ఒక కుక్కని పెంచుకుంటూ ఉంటుంది. ఒకరోజు రాత్రి దాన్ని ఎవరో దారుణంగా హత్యచేస్తారు.

ఆ కుక్కని ఎవరు చంపారా అని పదేళ్ళ క్రిష్టఫర్ పరిశోధన ప్రారంభిస్తాడు. కొడుకు అలాంటి డిటెక్టివ్ పని చెయ్యటం తండ్రికి ఇష్టం ఉండదు. కానీ క్రిష్టఫర్ రహస్యంగా ఆ పని కొనసాగిస్తాడు.

ఆ పరిశోధనా క్రమంలో తండ్రి బెడ్‌రూమ్‌లో అతనికి ఒక ఉత్తరాల కట్ట దొరుకుతుంది. 'కనీసం ఒకసారైనా చూసి పొమ్మని' తల్లి తనకి వ్రాసిన ఉత్తరాలు అవి.

తల్లి మరణించలేదని తెలిసి అతడు ఆశ్చర్యపోయినా, షాక్ అవడు. షాక్, వేదన, దుఃఖం లాంటి భావాలకి అతడు వ్యతిరేకి. ఇలా ఎందుకు చేసావని తండ్రిని నిలదీసి అడుగుతాడు. 'నీ తల్లి లేచిపోయిందని నీతో చెప్పలేక' అంటూ సెంటిమెంటల్‌గా తండ్రి దుఃఖిస్తాడు. రాత్రిళ్ళు తన పక్కింటి రహస్య రాకపోకలకు అడ్డుపడిన కారణంగా పక్కింటావిడే కుక్కని చంపిందని కూడా ఒప్పుకుంటాడు.

కొడుకు దీన్నంతా ఏ ఫీలింగ్ లేకుండా నిర్లిప్తంగా వింటాడు. ఆ తరువాత తండ్రిని వదిలి తల్లిని వెతుక్కుంటూ బయల్దేరతాడు. ఎంతో కష్టపడి లండన్‌లో వున్న తల్లి దగ్గరకు చేరుకుంటాడు. పక్కింటావిడ మొగుడుతో ఆమె అక్కడ రహస్యంగా కాపురం చేస్తూ వుంటుంది.



మానవ సంబంధాలకి పునాదులైన "ప్రేమ, దయ, తృప్తి" మొదలైనవన్నీ... మనిషి తన ఆనందానికీ, ఇతరులకిచ్చే ఆనందానికీ మధ్య ఉన్న 'లెక్కలే' అని నమ్మిన క్రిష్టఫర్‌కి, ఇతరులకెవరికీ ఇబ్బందిలేని, తమకి నచ్చిన ఒక పని చెయ్యటానికి మనుష్యులు ఎందుకు ఇంత వెనుకాడతారో అర్థంకాదు.

తల్లిని వచ్చి ఎదురింట్లో ఆమె ప్రియుడితో కలసి ఉండమంటాడు. తండ్రి ఇంటికి ఎదురింటావిడని తల్లిగా ఆహ్వానిస్తాడు. చాలా పెద్ద పరిష్కారాన్ని చిన్న లెక్క ద్వారా చూపిస్తాడు. అంతే కథ. ఈ చివరి ముగింపుని చాలా సింబాలిక్‌గా చెప్తాడు రచయిత.

*(తప్పు చేద్దాం రండి..!)*

# గుణపాఠం

ఒక వాణిజ్యవేత్త 'మదర్స్‌డే' రోజున ఒక పుష్పగుచ్ఛాలమ్మే బొకే షాప్‌కొచ్చాడు. అతని ముసలి తల్లి దూరంగా వేరే ఊళ్ళో ఉంటోంది. ఆవిడ అడ్రెస్ ఇస్తూ, పుష్పగుచ్ఛాన్ని ఆ రోజు అక్కడికి పంపించమని ఆర్డర్ ఇచ్చి మెట్లు దిగుతూండగా – ఒక చిన్న పాప కళ్ళనీళ్ళతో షాప్ ముందు నిలబడి ఉండడం చూసి 'ఏమైందని' అడిగాడు.

'మదర్స్‌డే'నాడు తన తల్లి కోసం ఓ గులాబీ పువ్వు కొనడానికి వస్తే, షాపువాడు ఆ పువ్వుని రూపాయి చెబుతున్నాడని, తన దగ్గర అర్ధరూపాయి మాత్రమే ఉందని ఆ అమ్మాయి సజల నయనాలతో చెప్పింది. ఆ వాణిజ్యవేత్త హృదయం ద్రవించింది. పాపకి గులాబి కొనిపెట్టి, తానే స్వయంగా ఇంటి దగ్గర దింపుతానని, కారులో ఎక్కించుకున్నాడు.

పాప డైరక్షన్స్ ఇస్తూ వుంటే కారు నడిపాడు.

ఒక శ్మశానం దగ్గర ఆపమని కారు దిగి శ్మశానం లోపలికి వెళ్ళింది. వాణిజ్యవేత్త ఆశ్చర్యంగా చూడసాగాడు. ఆ పాప తల్లి కొద్దిరోజుల క్రితమే మరణించి నట్టుంది. అందరానంత సుదూర తీరాలకి వెళ్ళిపోయిన తల్లి కొత్తగా తవ్విన సమాధి మీద ఆ పువ్వు పెట్టి ఆకాశం కేసి చూస్తూ చేతులు జోడించి "హ్యాపీ మదర్స్‌డే మమ్మీ" అంది. ఇదంతా గమనిస్తున్న వాణిజ్యవేత్త తడికళ్ళతో అక్కణ్ణుంచి నిశ్శబ్దంగా వెనుదిరిగాడు.

తర్వాత షాప్‌కు వెళ్ళి ముందిచ్చిన ఆర్డర్ కాన్సిల్ చేసాడు. వందమైళ్ళ దూరంలో వున్న తల్లికి తానే స్వయంగా ఇవ్వడానికి పూలగుత్తి కొనుక్కొని, తృప్తితో బరువెక్కిన హృదయంతో బయలుదేరాడు...



*(విజయానికి ఆరో మెట్టు)*

# గ్రంథసారం

ఏ వృత్తిలో ఉంటే ఆ వృత్తి గురించి కొంతయినా తెలిసి ఉండాలి. లేకపోతే ఎన్నో అవకాశాలు కోల్పోతాం. అపహాస్యం పాలవుతాం.

ఒక మత బోధకుడు కార్లో వెళ్తుంటే, అందమైన అమ్మాయి లిఫ్ట్ అడిగింది. ఆ పెద్దాయన దానికి సంతోషంగా ఒప్పుకున్నాడు. ఆమె పొట్టి స్కర్ట్ వేసుకుని ఉండటం వల్ల తెల్లటి మోకాలు బంగారంలా మిలమిలా మెరిసిపోతూ కనిపించింది.

అటువైపు చూసిన ఆ పెద్దమనిషి ఇక దృష్టి మరల్చుకోలేకపోయాడు.

అది గమనించిన ఆ పిల్ల అందంగా సిగ్గుపడి స్కర్ట్ క్రిందికి లాక్కుంటూ "...మన మత గ్రంథంలో 129వ గీతం గుర్తుందా సర్" అని అడిగింది.

ఆయన కంగారుపడి చూపు తిప్పుకున్నాడు. కానీ వెధవ మనసు ఆగదు కదా! అందులోనూ ఆ పొట్టి స్కర్టు గాలికి ఈసారి మరికాస్త పైకి జరిగింది. ఆయన మళ్ళీ చూస్తూ పెద్ద ఆక్సిడెంట్ చేయబోయి అదృష్టవశాత్తు తప్పించాడు.


ఆ అమ్మాయి మళ్ళీ "...మన గ్రంథంలో 129వ గీతం గుర్తున్నదా?" అని అడిగింది. ఆ మత బోధకుడు సిగ్గుపడి దృష్టి మరల్చాడు.

తను దిగాల్సిన చోటు వచ్చాక ఆ అమ్మాయి 'థాంక్స్' చెప్పి వెళ్ళిపోయింది.

ఆయన వేగంగా ఇంటికి వెళ్ళి తొందర తొందరగా ఆ మతగ్రంథం తీసి 129వ గీతం ఏమిటా అని చూశాడు.

అది ఈ విధంగా వుంది.

"క్రింద చూసిన ఏమియు దొరకదు. చూపు పైకెత్తి నన్ను ప్రార్థింపుము. స్వర్గము లభ్యమగును."



*(తప్పు చేద్దాం రండి..!)*

# కోరిక – తృప్తి

'కోరిక తగ్గించుకోవాలి. అప్పుడే జీవితంలో తృప్తి లభిస్తుంది' అంటారు కొంతమంది. 'విజయం సాధించాలంటే కోరిక ఉండాలి' అంటారు మరికొంత మంది. ఏది కరెక్టు?

'ఆలస్యం అమృతం విషం, నిలబడి నీళ్ళు తాగు' లాంటి పరస్పర విరుద్ధమైన సామెతల్లా రెండూ కరెక్టే. కోరిక ఉండాలి. కోరిక తీరడం ద్వారా తృప్తి రావాలి. ఆ తరువాత ఇంకో కోరిక కలగాలి. దాన్ని పూర్తి చేయడం కోసం చేసే పనిలో తృప్తి చెందాలి. **ఇలా నిరంతరం తృప్తిగా ఉండటమే జీవితం**. ఓపిక ఉన్నంత వరకూ పని చేయడమే కోరిక. విజయం సాధించే వ్యక్తికి అలసట ఉండదు. లాభాపేక్ష కూడా ఉండకపోవచ్చు. అది వేరే సంగతి. కానీ పని మాత్రం నిరంతరం చేస్తూనే ఉండాలి.

'నేను చాలా కష్టపడుతున్నాను. కానీ దానికి తగ్గ ప్రతిఫలం దొరకటం లేదు' అని ఎవరైనా అనుకుంటే అతడు తనకున్న అవకాశాన్ని సరిగ్గా వినియోగించుకోవటం లేదన్న మాట.

కోహే అన్న రచయిత తన కొడుకు పుట్టినరోజుకి ముందురాత్రి కొన్ని బహుమతుల్ని ఇంట్లో, వేర్వేరు ప్రదేశాల్లో దాచి పెడతాడు. పుట్టినరోజునాడు కొడుకు లేవగానే ఆ విషయం చెప్తాడు. కొడుకు అమితమైన ఉత్సాహంతో ఇల్లంతా వెతికి మూడు బహుమతులు సంపాదించుకుని తండ్రికి చూపిస్తాడు.

"ఇంకా ఉన్నాయి వెతుకు" అంటాడు తండ్రి. కొడుకు ఇంకా కష్టపడి మరో రెండు బహుమతులు సంపాదిస్తాడు.

"మొత్తం పది బహుమతులు నీ కోసం దాచాను" అంటాడు తండ్రి.

కొడుకు అమితమైన ఆనందాశ్చర్యాలతో వెతికి వెతికి మొత్తం పది బహుమతులూ సంపాదిస్తాడు. ముక్తాయింపుగా కోహే, పాఠకులకు ఈ విధంగా చెప్తాడు "... నేను గానీ ఆ విషయం చెప్పకపోయుంటే, మొదటి మూడు బహుమతులతోనో, లేక అయిదిటితోనో నా కొడుకు సంతృప్తి చెంది వుండేవాడు. ఆగిపోవటం సంతృప్తినిస్తుంది. కానీ నిరంతర శోధన "ఆనందాన్ని" ఇస్తుంది. పది ఉన్నాయని చెప్పాక, కొడుకు వాటిని శోధించి వెతికి పట్టుకున్నాడు. తృప్తికీ ఆనందానికీ అదే తేడా. తృప్తి ఫుల్‌స్టాప్. ఆనందం కామా."

*(మైండ్ పవర్ నెం. 1 అవటం ఎలా ?)*

# అజ్ఞానం

ఈ క్రింది కథ ఒక అజ్ఞాని గురించి చెప్తుంది. అయితే జాగ్రత్తగా ఆలోచిస్తే, మనం కొన్ని సందర్భాల్లో ఇంతకన్నా మూర్ఖంగా ప్రవర్తిస్తాం. ప్రాణాంతకమైన రోగం వచ్చినప్పుడు డాక్టరు మీద నమ్మకం లేక భగవంతుడిని ప్రార్థిస్తాం. భగవంతుడి మీద నమ్మకం లేక డాక్టరు దగ్గరకి వెళ్తాం. పైగా 'ఇది మానసిక ధైర్యాన్ని ఇస్తుంది. ఇందులో తప్పు ఏముంది' అని వాదిస్తాం. 'భగవంతుడి ఆశీర్వాదం డాక్టరు మనని రక్షించేలా చేస్తుంది' అని మనసుకి నచ్చచెప్పుకుంటాం. ఇంకా ముందుకి వెళ్లి 'అసలు భగవంతుడే డాక్టరు' అని కూడా అంటాము. అయితే అన్నిటికన్నా చిత్రమేమిటంటే, రోగం తగ్గితే భగవంతుడికి నమస్కారం చేస్తాం. రోగం తగ్గక మరణిస్తే డాక్టరు మీద నెపం వేస్తాం.

ఒక వూళ్ళో 'వెంగళాయ్' అనేవాడు ఉండేవాడు. వాడిని అందరూ 'వెర్రి వెంగళాయ్' అనేవారు. వాడికి కోపం వచ్చి, ఆ వూరి మనసబు గారి దగ్గరకి వెళ్ళాడు. ఆయనొక పెద్ద చెట్టుకి ఆనుకుని వున్నాడు.

"ఇంగిత జ్ఞానం అంటే ఏమిటి?" అని ఆయన్ని అడిగాడు.

ఆయన తన చేతిని చెట్టుకి ఆన్చి, "...నీ పిడికిలి బిగించి బలంగా నా చేతిమీద కొట్టు" అన్నాడు. వెంగళాయ్ అలా కొడుతూండగా ఆయన తన చెయ్యి తీసేసాడు. "అలా తీసెయ్యటమే ఇంగిత జ్ఞానమంటే" అన్నారు మున్సబు గారు.

వెంగళాయి పిడికిలి పచ్చడైంది. అయినా అతడు విచారించలేదు. కరణంగారి దగ్గరకి వెళ్ళి, 'తెలివంటే ఏమిటో నాకు తెలిసింది' అన్నాడు.

ఏమిటో చెప్పమన్నాడు కరణం. దగ్గిరలో ఏ చెట్టూ కనపడలేదు.

వెంగళాయి తన మొహానికి అడ్డంగా చెయ్యి పెట్టుకుని, "మీ పిడికిలి బిగించి నా చేతిమీద బలంగా కొట్టండి" అన్నాడు - ఆయన కొడుతున్నప్పుడు తను చెయ్యి తీసెయ్యటానికి రెడీ అవుతూ.



*(తప్పు చేద్దాం రండి..!)*

# ప్రజ్ఞ

ఈ పుస్తకంలో మనిషి హేతురహిత అజ్ఞానాన్ని హేళన చేసే కథలు కొన్ని, ఉదాత్త గుణాల్ని ఆకాశానికెత్తే కథలు కొన్నీ కనపడతాయి. మూర్ఖత్వాన్ని ఛెర్నాకోలాతో కొట్టి, మంచితనాన్ని పెంచుకోవటం స్థితప్రజ్ఞత. అది మనిషికి నష్టంలో కూడా నవ్వటం నేర్పుతుంది. కష్టాన్ని ఇష్టంగా ఎలా మార్చుకోవాలో చెబుతుంది. "మూర్ఖభక్తి, వాస్తు, అక్షరాల మార్పు, చేతికి తాళ్ళు, వేళ్ళకి రాళ్ళు" అని తరచూ వాడింది, ఆ ప్రజ్ఞ పెంచటానికే. స్థితప్రజ్ఞత మంచి స్థైర్యాన్ని కూడా ఇస్తుంది. దేవుడు కలగచేసిన ప్రమాదాన్ని కూడా పరిహసించేలా చేస్తుంది. ఈ కథ చదవండి.

అతడొక మంచి కుర్రవాడు. సాధారణ యువకుడికి కావాల్సిన చదువు, సంస్కారం మొదలైన మంచి లక్షణాలన్నీ అతడికి వున్నాయి. వాటితోపాటు ఒకే ఒక అవలక్షణం కూడా వుంది. గూని. పుట్టుకతోనే వచ్చింది. అతడొక అమ్మాయిని ప్రేమించాడు. ఆమె ఒక ధనవంతుడి కూతురు. పేరు సుశీల. పేరుకి తగినది.

ఆమె పుట్టినరోజు. అతడు వెళ్ళాడు. తన ప్రేమ గురించి చెప్పాలనుకున్నాడు. ఆమెకి తన మీద ఎటువంటి అభిప్రాయమూ లేదని తెలుస్తూనే వుంది. ఇప్పుడు చెప్పలేకపోతే మరెప్పుడూ చెప్పలేననుకున్నాడు. సంభాషణ కొనసాగించాడు.

"పెళ్ళిళ్ళు స్వర్గంలో అవుతాయి. మీకు తెలుసా?" అని అడిగాడు.

"అవునట. ఎక్కడో చదివాను" అంది ఆమె.

"మనిషిని సృష్టించేటప్పుడు దేవుడు భాగస్వామిని కూడా నిర్ణయిస్తాడు..." అంటూ ఆగాడు. "ఆ విధంగానే నన్ను భూమ్మీదకు పంపబోయే ముందు నాక్కాబోయే భార్యని నాకు చూపించాడు."

"ఎలా వుంది" నవ్వుతూ అడిగింది.

"అంతా బావుంది. ఆ అమ్మాయిలో ఒకటే లోపం. గూని."

సుశీల మొహంలో నవ్వు మాయమైంది. అవాక్కయి చూసింది. అతడు కొనసాగించాడు. "... ఒక గూని స్త్రీని ప్రజలు ఎంతగా నిరాదరిస్తారో తెలియనిదేముంది? అందుకే దేవుణ్ణి అప్పుడే ప్రార్థించాను. నాకు చదువూ, తెలివితేటలూ, సంస్కారమూ ఇస్తానన్నావు. వాటితోపాటు ఆ 'గూని' కూడా నాకే ఇవ్వు స్వామీ! నా భార్యని మాత్రం మామూలుగా సృష్టించు అని అడిగాను..."

ఆమె స్తబ్దురాలైంది. నోట మాట రాలేదు. అతడి కళ్ళలోంచి అవ్యాజమైన ప్రేమ జాలువారుతోంది. "...ఆ విధంగా నేను గూని వాడినయ్యాను" అంటూ నవ్వేడు. ఆమె అప్రయత్నంగా అతడి చేతిని తన చేతిలోకి తీసుకుంది. *(విజయంలో భాగస్వామ్యం)*

# సంసారంలో ఉప్పు - కారాలు



నలభై ఏళ్ళు ఎంతో ప్రశాంతంగా కాపురం చేసిన ఒకాయన్ని సైకాలజిస్ట్ ప్రశ్నిస్తూ, "...కనీసం ఒక్కసారి కూడా దెబ్బలాట రాకుండా మీరిద్దరూ ఇంతకాలం ఎలా సంసారం చేయగలిగారు?" అని అడిగాడు.

దానికాయన దీర్ఘంగా నిశ్వసించి సమాధానమిస్తూ, "అది చెప్పాలంటే మా హనీమూన్ ప్రయాణం గురించి చెప్పాలి. పెళ్ళయి మేము హనీమూన్‌కి వెళ్తున్నప్పుడు మా టాక్సీ డ్రైవర్ రాళ్ళలోంచీ గతుకుల్లోంచీ పోనిస్తూండగా నా భార్య, "...ఫస్ట్ వార్నింగ్. గతుకుల్లోంచి పోనివ్వకు' అంది గంభీరంగా. అరగంట తరువాత టాక్సీ మళ్ళీ గతుకుల్లో పడింది. ఆమె క్లుప్తంగా 'సెకెండ్ వార్నింగ్' అంది."

"తరువాత ఏమైంది?" సైకాలజిస్టు ఉత్సుకంగా అడిగాడు.

"మళ్ళీ మూడోసారి కారు గతుకుల్లో పడినప్పుడు ఆమె అతడిని కారు ఆపు చెయ్యమని చెప్పి, కాలర్ పట్టుకుని క్రిందికి దింపి మొహంమీద బలంగా చరిచింది. అతడు వెళ్ళి మురిక్కాలవలో పడ్డాడు. అక్కణ్ణుంచి లేపి నడుము విరిగేలా కాలితో కొట్టింది."

"ఇంత చిన్న తప్పుకి అంత పెద్ద శిక్షా? దారుణం."

"నేనూ అదే అన్నాను."

"ఆవిడేమంది?"

"ఫస్ట్‌వార్నింగ్ అంది."

"తరువాత ఏమైంది?"

"అప్పట్నుంచి మా మధ్య గొడవలు లేవు."

*(తప్పు చేద్దాం రండి..!)*

# వదిలేయి

పిల్లల ప్రవర్తనకి తామే కారణభూతులు అవుతారు కొంతమంది తల్లిదండ్రులు. దానికి 'ప్రేమ' అని పేరు పెట్టుకుంటారు. ప్రేమ వేరు, గారాబం వేరు.

ఆరోగ్యాన్ని ఇచ్చేది ప్రేమ. అనారోగ్యాన్ని ఇచ్చేది గారాబం.

కఠోర నిర్ణయాలు తీసుకోకపోతే పిల్లలు బాగుపడటానికి వీల్లేనంతగా చెడిపోతారు. ఆ స్టేజీలో వారిని 'నీ బ్రతుకు నువ్వు బ్రతుకు' అని వదిలిపెట్టడానికి కూడా భవబంధం అడ్డొస్తుంది.

ఒక వ్యక్తి స్వామీజీ దగ్గరకు వెళ్ళి "నా కూతురు ఒక దౌర్భాగ్యుణ్ణి ప్రేమించింది. మీరే ఆమె మనసు మార్చాలి" అన్నాడు.

"తండ్రివి కదా. నువ్వే చెప్పు" అన్నాడు స్వామీజీ.

"నే చెప్తే వినడం లేదు. అసలు నా మాటే వినదు" అని ఆమె గురించి మరి కొంత వివరిస్తూ "ఏం చెప్పను స్వామీ! చదువు వంటబట్టలేదు. ప్రొద్దునే పదింటి దాకా లేవదు. లేచిన తరువాత స్నానం చెయ్యకుండా టి.వి. చూస్తూ కూర్చుంటుంది. ఫోన్‌లో మాట్లాడితే గంట అయితే గానీ క్రింద పెట్టదు. పైగా కోపం ఎక్కువ. చెల్లినీ, తమ్ముడినీ తెగ కొడుతూ ఉంటుంది. తను చూసే టి.వి. ఛానెల్ మారిస్తే నానా యాగీ చేస్తుంది. తిన్న కంచం ఎత్తదు. తన పక్క బట్టలు కూడా తను సర్దదు" అంటూ కూతురి గుణగణాలన్నీ చెప్పుకుంటూ వచ్చాడు.

అంతా విన్న స్వామి "అటువంటి అమ్మాయిని వదిలి పెట్టడానికి నీకెందుకు అభ్యంతరం నాయనా?" అన్నాడు.

ఆ వ్యక్తి దిగ్భ్రాంతితో విచలితుడై "ఏం చెప్తున్నారు మీరు?" అన్నాడు.

స్వామి అతనితో "నీ కూతుర్ని నీవు 18 సంవత్సరాల పాటు సరిగ్గా పెంచలేక పోయావు. పనికిరాని అమ్మాయిగా తయారయ్యింది. ఇప్పుడా అమ్మాయి పెళ్ళి ఇంకెవరితోనో చేసావనుకో. ఒక అమాయకుడిని మోసం చేసిన వాడివి అవుతావు. నువ్వు చేసిన తప్పుకు మరెవడో బలి అయిపోతాడు. ఇప్పుడు అలా కాదు. ఒక దౌర్భాగ్యుడు ఆ అమ్మాయి విలువని పరిశీలించకుండానే తీసుకుపోతానంటున్నాడు. అది వాడి ఖర్మ. నువ్వు అదృష్టవంతుడివి! వెంటనే మీ అమ్మాయిని వీలైనంత తొందరగా ఇచ్చేసెయ్!" అంటూ సలహా ఇచ్చాడు.

Don't Love at First Sight అన్న అధ్యాయంలో 'ప్రేమింపబడటానికి కొన్ని అర్హతలు ఉండాలి' అన్న ఉదాహరణ కోసం వ్రాసిన కథ ఇది.

*(విజయానికి ఆరో మెట్టు)*

# కమ్యూనికేషన్

"నీ భార్యని నగ్నంగా వేరే వ్యక్తితో చూస్తే సంతోషించు. ఆనందంతో గెంతులు వెయ్యి" అని ఒక ప్రవక్త చెప్పాడనుకుందాం. టమోటాలు ఖరీదైపోయాయి కాబట్టి కోడిగుడ్లతో కొడతారు.

నిజానికి అతడి ఉద్దేశ్యం వేరు. "నీ భార్య నీకు అన్యాయం చేసింది. కోపమూ వద్దు. దుఃఖమూ వద్దు. దుఃఖిస్తే నీకే నిద్ర ఉండదు. కోపగించుకుంటే నీ ఆరోగ్యానికే నష్టం. ఆమెని కొడితే నీకే జైలుశిక్ష. కాబట్టి నీకు రెండే దార్లు ఉన్నాయి. జరిగినదంతా మర్చిపోయి మరింత సుఖంగా సంసారం చెయ్యటం! నీతో ఉన్నప్పుడు కూడా నీ భార్యకు ఎల్లప్పుడూ తన ప్రియుడే గుర్తొస్తున్నట్టయితే విడాకులు ఇవ్వటం! ఇహ–సంతోషం ఎందుకంటావా? నీ పడగ్గదినీ, ఫ్యాన్‌నీ, కరెంట్‌నీ, వాళ్ళు మరింతకాలం వాడుకోకుండా ఈ రహస్యం ఇంత తొందరగా నీకు తెలిసినందుకు! అందుకు ఆనందంతో గంతులు వెయ్యి. అంతే తప్ప దాని గురించి రాత్రులు నిద్రలేకుండా కుమిలిపోకు. ఆమెని క్షమించి సంసారం చెయ్యి. లేదా భవబంధాలు తెంచుకో! విచారించి ఏమీ లాభం లేదు."

ఇదీ అతడి ఉద్దేశ్యం. ఎంత కరెక్టుగా వున్నదో చూడండి. కుమిలిపోవటం వలన గానీ, కోపం వలనగానీ పరిష్కారం లభించదు. చాలా మంచి సూచన. కానీ అతడి ఉద్దేశ్యం అవతలి వారికి అర్థం కాలేదు. కొట్టారు.



*(తప్పు చేద్దాం రండి..!)*

# ఎమోషన్

ఈ గొప్ప "కథ" చదవండి. దీన్ని 'జాన్‌గ్రే' వ్రాసాడు.

మాకు పాప పుట్టిన నెల రోజుల తర్వాత నేను తిరిగి ఆఫీసుకు వెళ్ళాను. బిడ్డ పుట్టిన సంతోషమంతా ఈ నెల రోజులలో ఎగిరిపోయింది. ప్రతి రాత్రీ మా యిద్దరినీ మెలకువగా ఉంచడమే తను ఈ భూమి మీద చేయవలసిన ప్రథమ కర్తవ్యంగా మా పాప భావించినట్టుంది. ప్రతి అరగంటకీ లేచి అయిదు నిమిషాలపాటు అలారంలా ఏడ్చేది.

కాన్పు తర్వాత నా భార్య ఆరోగ్యం అంత బాగాలేదు. రెండు గంటలకొకసారి పెయిన్ కిల్లర్ వేసుకోమని డాక్టర్ చెప్పాడు. ఓరోజు నేను ఆఫీసుకి వెళ్ళాక ఆమె దగ్గర మాత్రలు అయిపోయినట్టున్నాయి. కొద్ది దూరంలో మా తమ్ముడి కుటుంబం ఉంది. అక్కడికి ఫోన్ చేసి, మెడికల్ షాప్ నుంచి మాత్రలు తెమ్మని నా భార్య మా తమ్ముడికి చెప్పింది. వాడు ఒక అరగంటలో తీసుకువస్తానని చెప్పి, ఆ తర్వాత కన్వీనియెంట్‌గా మరిచిపోయాడు. నా భార్య దాదాపు రెండు గంటలపాటు అతడి కోసం చూసింది. ఈలోగా నొప్పి ఎక్కువైంది. మళ్ళీ ఫోన్ చేస్తే అక్కడ ఇంట్లో ఎవరూ లేరు. తనే మెడికల్ షాప్‌కి వెళ్లడానికి ప్రయత్నించింది. కానీ, కాస్త దూరం నడిచేసరికి భరించలేని నిస్సత్తువ ఆవరించి వెనక్కి తిరిగి వచ్చేసింది. (ఈ విషయాలన్నీ నాకు తర్వాత తెలిశాయి.) ఆ సాయంత్రం నేను ఇంటికొచ్చేసరికి పరిస్థితి చాలా దారుణంగా వుంది.

"ఈ రోజంతా నేను బతికున్నానో, చచ్చిపోయానో చూసేవాళ్లు ఒక్కరూ లేరు. బాధతో విలవిల్లాడిపోయాను" అంటూ అరిచింది.

సానుభూతితో, "నాకు ఫోనెందుకు చెయ్యలేదు?" అన్నాను.

ఆమె వినే మూడ్‌లో లేదు. "మీ ఇంటికి ఫోన్ చేశాను. మీ తమ్ముడు గారికి చెప్పాను. ఆయన మరిచిపోయాడనుకుంటా. తర్వాత ఫోన్ చేస్తే ఎవరూ లేరు. చివరికి నేనే మెడికల్ షాప్‌కి వెళదామనుకున్నాను. ఓపిక లేకపోయింది. ఒంట్లో బాగున్నంత సేపూ సేవలు చేయించుకుంటారు. పిల్లలు కావాలి. కానీ, ఏదైనా కొద్దిగా అనారోగ్యం వస్తే మాత్రం ఎవరూ పట్టించుకోరు. ఎందుకీ వెధవ బతుకు!" అంటూ కోపంగా అరవసాగింది.

సరిగ్గా ఈ పాయింట్ దగ్గర నేను బరస్ట్ అయ్యాను. నిజానికి నేను కూడా గత వారం రోజుల నుంచీ చాలా అలసిపోయి వున్నాను. నెలరోజులపాటు నేను ఆఫీసులో

లేకపోవడంతో పని చాలా పేరుకుపోయింది. మరొక వైపు నిద్ర. ఏదో తప్పంతా నాదైనట్టు నా భార్య నిష్ఠూరమాడడం నేనలా కోపంతో బద్దలవ్వడానికి కారణం. అంతేకాదు. సాధారణంగా ఒక పాప పుడితే నెల రోజులపాటు ఏ భర్తా సెలవు పెట్టి ఇంట్లో కూర్చోడు. నిజంగా నేనెంతో ఆత్మీయంగా సేవలు చేసాను. నేను చేసినదంతా ఒక్కమాటలో తీసిపారేసింది. తన మాత్రలు అయిపోయాయన్న విషయం నాకు ఎలా తెలుస్తుంది? ఇంత చిన్న సంగతి తను గుర్తించకుండా ఈ విధంగా మాట్లాడడం బహుశా నేను బరస్ట్ అవడానికి కారణమై ఉంటుంది. ఇద్దరం మాట మీద మాటనుకున్నాం. నేను విసుగుతో ఆ గదిలో నుంచి బయటపడడానికి ద్వారం దగ్గరికి వెళ్లాను. అప్పటికే మేమిద్దరం సభ్యతాయుతమైన మానవ సంబంధాల సరిహద్దుల్ని అధిగమించి మాట్లాడుకున్నట్టుగా నాకు తోచింది.

తలుపు విసురుగా వేస్తూ ముందుకి నడవబోయాను. సరిగ్గా అప్పుడు ఒక చిన్న విషయం జరిగింది. అది మొత్తం నా ఆలోచనా దృక్పథాన్నే మార్చేసింది. ఈ పుస్తకం రాయడానికి కారణం అదే!

ఆమె అంది – "వెళ్ళకండి. ప్లీజ్... వెళ్లకండి! ఇప్పుడే... ఇప్పుడే నాకు మీ అవసరం చాలా వుంది. నాకు నిజంగా... నిజంగా చాలా బాధగా వుంది. చాలా రోజుల నుంచి నిద్ర లేదు. మరొకవైపు బాధ. ప్లీజ్... నన్నర్థం చేసుకోండి."

నేనొక క్షణం ఆగాను. ఆమె కొనసాగించింది. "మనిద్దరం బాగున్నప్పుడు నిజంగా ఎంతో బాగున్నాం. ఇప్పుడు నేను కాస్త బాగా లేకపోయేసరికి మీరు అలా అంత కోపంగా వెళ్ళిపోతారా?" అంది. ఆమె కంఠం రుద్ధమైంది. "ప్రస్తుతం నా ఒంట్లో ఏమీ బాలేదు! నేను మీకేమీ చేయలేకపోవచ్చు. కానీ ఇప్పుడే... ఇప్పుడే మీరు నాకు కావాలి. కాస్త దగ్గరికి రండి. ప్లీజ్! ఏం మాట్లాడొద్దు. నన్ను... నన్ను..." ఆమె వెక్కి వెక్కి ఏడవసాగింది.

ఒక అపరాధ భావన నన్ను చుట్టుముట్టింది. నెమ్మదిగా ఆమె దగ్గరికి వెళ్ళాను. భుజాల చుట్టూ చేయివేసి దగ్గరికి తీసుకున్నాను. ఆమె నా గుండెల మీద తలాన్చి కొంచెంసేపు అలా ఏడుస్తూండిపోయింది. ఆపై నెమ్మదిగా ఏడుపు తగ్గిపోయింది. కొన్ని క్షణాలపాటు మౌనంగా ఉండి, నెమ్మదిగా మొహం పైకెత్తి నా గడ్డం మీద ముద్దు పెట్టుకుంది.

ఏ భాషలోనూ చెప్పలేని ఒక కృతజ్ఞతా భావం అది!

అలా మేమిద్దరం ఒకరినొకరు పొదివి పట్టుకున్న సమయంలో నా మనసులో ఒక గొప్ప సత్యం నెమ్మదిగా పొరలు విప్పుకుని బయటపడుతున్నట్లు అనిపించింది. సరిగ్గా ఆ సమయంలోనే ప్రేమకి సరైన అర్థం తెలిసింది. ప్రేమ... అన్ కండిషనల్ ప్రేమ! ఏ నిబంధనలూ లేని ప్రేమ... ఇప్పటివరకూ చాలా గొప్ప ప్రేమికుడిగా నన్ను

నేను ఊహించుకుంటూ ఉండేవాణ్ణి. ఇప్పటికీ నేను గొప్ప ప్రేమికుడినే – అవతలి నుంచి నాకు అన్ని సౌఖ్యాలూ లభిస్తున్నంతవరకూ!

అవతలి వ్యక్తి వేదననీ, విషాదాన్నీ నేను సరిగ్గా అర్థం చేసుకోలేక పోయాను. నా వాదన కరెక్ట్ అయుండవచ్చు. కానీ వాదన కరెక్ట్ అవడం వేరు. అవతలివారి వాదనని అర్థం చేసుకోవడం వేరు. అవతలివారి వాదన కరెక్ట్‌గా లేదని అర్థం చేసుకుని కూడా వారి బలహీనత మీద ఆడుకోవడం దారుణం. అలా కాకుండా అవతలివారి మానసిక స్థితిని అర్థం చేసుకున్నప్పుడే గొప్ప ప్రేమికుడు అవుతాడు.

ఆ క్షణం నుంచి నేను ఆమెని వదల్లేదు. వదలడమంటే ఇక్కడ శారీరకంగా, భౌతికంగా కాదు. మానసికంగా! వీలైనంతవరకూ ఆమెకి మానసిక ధైర్యాన్ని ఇవ్వడానికి ప్రయత్నించాను. నిజమైన ప్రేమంటే ఏమిటో తెలిసింది.

ప్రేమంటే అది అవతలి వారి పట్ల మనం తీసుకునే శ్రద్ధ. ఒక నమ్మకాన్ని కలిగించడం! అవసరమైనప్పుడు నేనున్నానన్న ధైర్యాన్నివ్వడం. అదే ప్రేమంటే! ఇదేమీ పెద్ద కష్టమైన విషయంగా నాకు తోచలేదు. అంతే కాదు. ఇలాంటి ప్రవర్తన వల్ల నేను



మునుపటి కన్నా ఎక్కువ ఆనందం పొందసాగాను. ఇదంతా నాకింతకు ముందెందుకు తెలియదు? ఆమె ఏమడిగింది? తను కష్టంలో వున్నప్పుడు భుజాల చుట్టూ చేయివేసి కాస్త మానసిక స్థైర్యాన్నివ్వడం... చిన్న కోరిక అది! అదే స్థానంలో నేను కాకుండా ఇంకో స్త్రీ ఉన్నట్టయితే (ఉదాహరణకి ఆమె తల్లికానీ, అక్కకానీ) ఆమె అడక్కుండానే ఆ విధమైన ధైర్యాన్ని ఇచ్చి వుండేది. కానీ ఒక మగవాడిగా నాకు అప్పటివరకూ తెలియదు. ఒక చిన్న స్పర్శ, సున్నితమైన కౌగిలి, అవతలి వారి మాటలు శ్రద్ధగా వినడం – ఇలాంటి చిన్న చిన్న విషయాలు ఒక స్త్రీకి ఎంతో ఆనందాన్నిస్తాయని... నిజంగానే అప్పటి వరకూ నాకు తెలియదు. ఇది చెప్పుకోవడానికి నేనేమీ సిగ్గుపడను.

*(విజయంలో భాగస్వామ్యం)*

# స్థాన చలనం

"కలువ పువ్వు అక్వేరియంలో ఉండకూడదు. కొలనులో ఉండాలి. బంగారం బ్యాంకు లాకరులో ఉండకూడదు శరీరం మీద ఉండాలి. అప్పుడే వాటికి అందం" అని చెప్పే చక్కటి కథ ఇది.

"అమ్మా! మనకింత పెద్ద పెద్ద మూపురాలు ఎందుకున్నాయ్?" అని తల్లిని ఒక పిల్ల ఒంటె అడిగింది.

"ఎడారుల్లో నీళ్ళు దొరకవు. దొరికినప్పుడు వాటిని చాలా కాలంపాటు దాచుకోవటానికమ్మా" తల్లి ఒంటె చెప్పింది.

"మన కాళ్ళు ఇంత పొడుగ్గా ఎందుకున్నాయ్?" పిల్ల అడిగింది.

"ఇసుకలో వేగంగా నడవటానికి" అంది తల్లి.

"కనుబొమ్మలు ఎందుకింత దట్టంగా ఉన్నాయ్?" అంది పిల్ల.

"దుమ్ము తుఫాన్నించి రక్షించటానికి" జవాబిచ్చింది తల్లి.

అప్పుడు ఆ పిల్ల ఒంటె చుట్టూ చూస్తూ, "...నీటిని దాచుకోవటానికి మూపురాలూ, పరుగెత్తటానికి పొడవాటి కాళ్ళూ, తుఫాను నుంచి రక్షించుకోవటానికి దట్టమైన కనుబొమ్మలూ వున్న మనం, ఇక్కడ 'జూ'లో ఎందుకున్నామమ్మా" అని ప్రశ్నించింది.

*(తప్పు చేద్దాం రండి..!)*

# ఆశ – అత్యాశ

మనిషికి ఆశ ఉండాల్సిందే కానీ, నెరవేరలేని కోరికలు ఉన్నా, అవతలి వారికి అన్యాయం చేసే ఆశ ఉన్నా, అది వినాశనానికే దారి తీస్తుంది.

ముప్పై సంవత్సరాలు కలిసి బ్రతికారట ఒక దంపతులు. అతడి వయసు 60. ఆమె వయసు 50.

ఒక దేవత ప్రత్యక్షమై ఇద్దర్నీ చెరో కోరికా కోరుకొమ్మన్నదట.

"నాకు నా భర్తతో కలిసి ప్రపంచమంతా ఆనందంగా తిరగటానికి కావలసినంత ధనమివ్వు" అన్నదట భార్య.

"తథాస్తు" అన్నదట దేవత.

"నాతో కలిసి ప్రపంచం అంతా తిరగటానికి నాకంటే ముప్పై సంవత్సరాలు తక్కువ వయసున్న అమ్మాయిని ప్రసాదించు" అని భర్త కోరుకున్నాడట.

"తథాస్తు" అన్నదట దేవత.

అతడు మరుక్షణం ఎనభై ఏళ్ళ వృద్ధుడై పోయాడట. *(తప్పు చేద్దాం రండి..!)*

# హక్కు - బాధ్యత

పద్దెనిమిదేళ్ళ కొడుకు పట్ల ఒక తండ్రి చాలా విసిగిపోయాడు. ఇంటి పెద్దగా తనకున్న హక్కుతో అతన్ని దాదాపు ఇంటి నుంచి బయటకు గెంటివేయాలనే నిర్ణయానికి వచ్చాడు. కొడుకు ఇంటికి రాగానే ఆ విషయం చెప్పి అతన్ని పంపించేద్దామను కున్నాడు.

అలా పంపించేముందు అతడు చేసిన తప్పులన్నీ ఒక కాగితం మీద వ్రాద్దామని కూర్చున్నాడు. ఏయే తప్పులు సరిద్దుకుంటే అతనికి తిరిగి తమ ఇంట్లో స్థానం లభిస్తుందో కూడా చెప్పాలనుకున్నాడు. వరసగా కొడుకు చేసిన తప్పులు వ్రాయటం ప్రారంభించాడు.

కొంతసేపయింతర్వాత అతడి ఆలోచన మరోరకంగా సాగింది. కొడుకు ఒకవేళ తప్పులు సరిదిద్దుకుని ఇంటికి తిరిగి వస్తే దానికి ప్రతిగా తాము ఏం ఇవ్వగలమో వాటిని అతడికి చెప్పటం, తన బాధ్యతగా భావించి కాగితానికి రెండోవైపు వ్రాశాడు. ఆశ్చర్యకరంగా, కొడుకు చేసిన తప్పులకన్నా తన మార్పుల లిస్టు ఎక్కువ ఉండటంతో అతడి తల తిరిగిపోయింది.

దుఃఖం కూడా వచ్చింది.

ఒక్కసారిగా అతడిలో ఏదో లోపించినట్లు అనిపించింది.

ఆ రాత్రి కొడుకు వచ్చాక ఆ కాగితం ముందు పెట్టుకుని తండ్రీ కొడుకులు ఇద్దరూ చాలాసేపు సంభాషించుకున్నారు.

ఇంతకుముందు గతంలో జరిగిన సంభాషణకీ, దీనికీ ఉన్న తేడా వేరు. మనసులో ఉన్న భావాలు వారు బయట పెట్టుకున్నాక, సమస్య తాలూకు తీవ్రత చాలా తగ్గిపోయినట్లు అనిపించింది.

*(విజయంలో భాగస్వామ్యం)*

# కరివేపాకు కథ

ఆత్మ సంతృప్తి అనేది అన్నిటి కన్నా ముఖ్యం. నువ్వు ఒక పని చేస్తే దాన్ని కొంతమంది విమర్శించవచ్చు. మరి కొంతమంది మెచ్చుకోవచ్చు. చాలామంది పట్టించుకోకపోవచ్చు. నువ్వు చేస్తున్న పని నీకు ఎంతవరకు సంతృప్తినిస్తుంది అన్నదే ముఖ్యం. అలా బ్రతికిన నాడు, నీకు బయట ప్రపంచపు విమర్శలతో సంబంధం ఉండదు.

నువ్వు ఒక కారు డ్రైవర్‌వి అనుకో. నీ యజమాని కుటుంబాన్ని నువ్వొక పార్టీకి తీసుకువెళ్ళాలి. పార్టీ సరిగ్గా 10.00 గంటలకి మొదలవుతుంది. కొండమీద హోటల్లో పార్టీ!

అందరూ తీరిగ్గా తయారై వచ్చేసరికి 9.45 అయింది. నిన్ను తొందరపెట్టసాగారు. నువ్వు మామూలుగా తీసుకెళ్తే 10.30 గ్గానీ చేరుకోలేవు. వేగంగా వెళ్తే 10.00 గంటలకి వెళ్తావు. నిన్ను వేగంగా పోనివ్వమని అందరూ బలవంతపెట్టారు. ఊరు దాటాక ఒక ముసలమ్మని గుద్దావు.

'మరీ అంతవేగమా?' అని మళ్ళీ వాళ్ళే నిన్ను తిట్టారు. ఓ వంద ఇచ్చి పోదామన్నారు.

ఆమెకు పెద్ద దెబ్బలు తగల్లేదు గానీ, 'దాహం' అంటోంది. రోడ్డు మీద ఎవరూ లేరు. నీవే వెళ్ళి నీరు తీసుకొచ్చి ఇచ్చి తిరిగి బయల్దేరావు. మొత్తం కుటుంబం అంతా నిన్ను తిట్టింది. పిల్లలు నీ పరోపకార బుద్ధిని ఎగతాళి చేసారు. అంతా మవునంగా భరించావు. అక్కడొక అడ్డదారి వుంది. అలా పోనిమ్మన్నారు. అది One-way Traffic. వారి సలహా వినపడనట్టు నటించి నువ్వు మామూలు దారిలో పోనిచ్చావు. మళ్ళీ తిట్టారు.

వెళ్ళేసరికి 11.00 అయింది. అక్కడికి వెళ్ళేసరికి సరిగ్గా అయిదు నిమిషాల క్రితమే కొండచరియ విరిగి, హోటల్ ధ్వంసమై అందరూ మరణించారు అని తెలిసింది.

తాము ఎంత కొద్దిలో ప్రమాదాన్ని తప్పించుకున్నామో ఆ తరువాత కథలుగా అందరికీ చెప్పుకున్నారు. **అందులో ఎక్కడా నీ ప్రసక్తి లేదు.** అయినా నీకేమీ బాధగా లేదు. ఎందుకంటే... ఆత్మ చెప్పినట్టూ వినని వారే ఇతరుల కామెంట్స్‌కి బాధ పడతారని నీకు తెలుసు. అలాంటి 'ఇతరుల' మెచ్చుకోళ్ళు కూడా నీకు అనవసరం.

నీకు మా అభినందనలు.

*(తప్పు చేద్దాం రండి..!)*

# నోట్

కొన్ని విషయాల్లో ఆడవాళ్ళు ఎంత తెలివిగా చిన్న చిన్న ప్రమాదాల్ని అధిగమించి, పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకుంటారో చెప్పే కథ ఇది.

కింగ్ హీరో అన్న ఒక రాజు, తన శత్రువుని జయించి నిండు సభలో సంకెళ్ళు వేసి అవహేళన చేస్తూ "ఎంత సులభంగా నిన్ను జయించానో చూసావా" అంటూ అవమానించాడట.

అప్పుడా ఓడిపోయిన రాజు తన మాటల్తో ప్రతీకారం తీర్చుకుంటూ, "...ఇంతదూరం వరకూ వస్తోన్న నీ నోటి దుర్వాసనని చేతనైతే జయించు" అన్నాడట. అవమానంతో రాజప్రాసాదం చేరుకున్న రాజు, మహారాణీని పిలిపించి, "ఇంతకాలం ఈ విషయం నాకెందుకు చెప్పలేదు? నిన్ను ఉరితీయిస్తాను" అని అరిచాడట.

అప్పుడా రాణి వినయంగా, "నాకు తెలియదు మహారాజా! ప్రతి మొగవాడినుంచీ సహజంగా అటువంటి పరిమళమే వస్తుందనుకున్నాను" అందట. *(తప్పు చేద్దాం రండి..!)*

# నమ్మకం

మనలో ఉన్న ఎన్నో బలహీనతలకి మనం మూర్ఖ నమ్మకాన్ని ప్రహరీ గోడగా కడతాం. మన ఆలోచనా విధానం ఎంత పెళుసుగా ఉన్నా, దాన్ని కాపాడుకోవటానికి ఈ గోడ వెనుక దాక్కుంటాం. నిరంతరం అజ్ఞానంలో ఉండిపోవడానికైనా సిద్ధపడతాం కానీ, మూఢ విశ్వాసాన్ని వదులుకోడానికి ఇష్టపడము.

ఒక మానసిక శాస్త్రవేత్త దగ్గరకి ఒక రోగి వచ్చాడట. తాను చచ్చిపోయానని అతడి ప్రగాఢ విశ్వాసం. ఎంత చెప్పినా విన్లేదు. చివరకి ఆ డాక్టర్ కోపం పట్టలేక విసుగ్గా, "... శవం నుంచి రక్తం కారుతుందా?" అని అడిగాడట.

"కారదు. నిశ్చయంగా కారదు" అన్నాడా రోగి తల అడ్డంగా వూపుతూ.

డాక్టరు అతడి చేతివేలు పట్టుకుని, కసక్కున సూది గుచ్చి, "... ఇదిగో రక్తం. ఇప్పుడయినా నమ్ముతావా?" అని అన్నాడట.

రోగి తన చేతివేలు కేసీ, డాక్టర్ కేసీ క్షణంపాటు కన్నార్పకుండా చూసి, "... ఇంతకాలం ఎంత తప్పు అభిప్రాయంలో ఉన్నానూ...! శవాన్నించి కూడా రక్తం కారుతుందన్న మాట" అన్నాడట. *(మైండ్ పవర్ నెం. 1 అవటం ఎలా?)*

# బ్రతుకు బంగారం కోసం

మనుష్యులు కేవలం డబ్బు కోసమే బ్రతికితే అది భూతం అయి పీడిస్తుంది. ప్రేమ, ఆరోగ్యం, కీర్తి, జ్ఞానం మొదలైన ఐశ్వర్యాలన్నిటినీ వెనక్కి నెట్టేసి తనే ముందు వరుసలో నిల్చుంటుంది. అప్పుడు మనిషి తాను ఎందుకు బ్రతుకుతున్నాడో ఆ జ్ఞానాన్ని కోల్పోతాడు.

ఒక మధ్య వయస్కుడయిన వ్యాపారస్థుడు ఘోరమైన కారు ఆక్సిడెంట్‌లో దెబ్బతిని ఆస్పత్రిలో జాయిన్ అయ్యాడు. భార్యా పిల్లలు చుట్టూ వున్నారు. అతడికి స్పృహ రాగానే డాక్టరు ఒక్కొక్క షాకింగ్ న్యూస్ క్రమంగా చెప్పసాగాడు. "చాలా అదృష్టం ఉండి మీరు బ్రతికారు. వెన్నెముక విరిగింది. అయినా ఫర్వాలేదు. ఆర్నెల్లలో లేచి తిరగ్గల్గుతారు. నుజ్జు నుజ్జు అయిన ఆ కారులోంచి మిమ్మల్ని బయటకు తీయటమే ఒక అద్భుతం..."

"నా కారు... అయ్యో... నా టయోటా కారు నుజ్జునుజ్జయిందా..." అని వాపోయాడట ఆ వ్యాపారస్థుడు.

"మీ ఎడమ చెయ్యిని మాత్రం అతికించలేకపోయాం. అది కారులో స్మాష్ అయిపోయింది."

"అయ్యో... దానికి చాలా ఖరీదైన డైమండ్ వుందే... స్విట్జర్లాండ్‌లో కొన్నాను..."

"మీరేమీ బాధపడకండి. అందరికీ దొరకని అదృష్టం మీకుంది. వారం రోజుల్నుంచీ మీకు స్పృహ వచ్చేవరకూ మీ వాళ్ళందరూ మిమ్మల్ని కనిపెట్టుకుని ఇక్కడే వున్నారు" అని అనునయించాడట డాక్టరు.

అతడు అందరి వైపూ తేరిపారా చూస్తూ ఒక్కక్షణం ఆగి, బిగ్గరగా, "అందరూ ఇక్కడే ఉంటే షాపు దగ్గర ఎవరున్నార్రా?" అని అరిచాడట.

*(తప్పు చేద్దాం రండి..!)*

# ఆనందానికి అసలు అర్థం

'కోవే' పుస్తకంలోని ఒక అద్భుతపాఠం.

❁ ❁ ❁

**ఈ దిగులు అనేది నన్నీమధ్య వదలటం లేదు. నేను చాలా సాధించానని చెప్పుకోలేను కానీ, కొంతవరకూ ఫర్వాలేదు. కానీ అంతా అసంతృప్తే. అలా అని నా జీవితం పూర్తిగా అయిపోలేదు. సాధించాల్సింది చాలా వుందని నాకు తెలుస్తోంది. కానీ దిగులు.**

సరీగ్గా ఆ సమయంలో, మనసుకు సంబంధించిన రోగాల్ని నయం చేసే డాక్టర్ని కలుసుకున్నాను. నా బాధ, ఓటమి, ఒంటరితనం, అకారణ దుఃఖం, వగైరా రోగాలలిస్టు ఆయన ముందు పెట్టాను. నా అనారోగ్యాలన్నీ నయం చేయటానికి ప్రపంచంలోని మందులన్నీ సరిపోవని నాకు తెలుసు.

నేను ఆయన వైపు జాలిగా చూసాను.

ఆయన నవ్వుతో నావైపు చూసాడు.

ఆ తరువాత నాలుగు పొట్లాలు ఇచ్చాడు.

"మూడు గంటల కొకసారి ఒకటొకటే విప్పాలి" అన్నాడు.

'నాకేమీ శారీరక రుగ్మతలు లేవే' - అందామనుకుని, "పథ్యమేమీ అవసరం లేదా?" అని అడిగాను.

"ఉన్నది. నువ్వు పన్నెండు గంటలపాటు ఎవరితో మాట్లాడకూడదు. పుస్తకాలు చదవకూడదు. నీవు చిన్నప్పుడు, అంటే బాల్యంలో ఏ ప్రదేశంలో అత్యంత ఆనందంగా గడిపావో అక్కడ ఒంటరిగా ఈ ట్రీట్‌మెంట్ ప్రారంభించాలి. అదే కండిషను" అన్నాడు.

"మీరు జోకుచేస్తున్నారా డాక్టర్‌గారూ?" అని అడిగాను.

"నా బిల్ చూసాక నీ అభిప్రాయం మార్చుకుంటావ్" అన్నాడాయన గంభీరంగా.

❁ ❁ ❁

చిన్నప్పుడు గడిపిన ఊరికి వెళ్ళటానికి నాకు రెండు రోజులు పట్టింది. మరుసటి రోజు ప్రొద్దున్న అక్కడికి చేరుకున్నాను. నేను చిన్నప్పుడు ఆడుకున్న ఇసుక తిన్నెలు అవి. ఆ ప్రదేశమేమీ మారలేదు. నా బాల్యమంతా అక్కడే గడిచింది కదా! ప్రతీదీ నాకు గుర్తే. చిన్న సెలయేరు. చుట్టూ సరుగుడు చెట్లు.

క్యారియర్ విప్పి బ్రేక్‌ఫాస్ట్ చేసాను. తిండి విషయంలో డాక్టరేమీ నిబంధనలు పెట్టలేదు కదా అనుకున్నాను.

ప్రొద్దున్న సరీగ్గా ఆరింటికి మొదటి పొట్లాం విప్పాను. అందులో ఏమీ లేదు. "జాగ్రత్తగా విను" అని మాత్రం వ్రాసుంది. నాకేమీ అర్థం కాలేదు. ఏం వినాలో తెలియటం లేదు. మూడు గంటలపాటు ఏం వినాలి? నిజంగా డాక్టర్‌కి పిచ్చెక్కిందనుకున్నాను. అయినా మాట ఇచ్చాను కదా. సాయంత్రం వరకూ వెనక్కి వెళ్ళటానికి వాహనం కూడా లేదు. అందుకని వినటం (?) ప్రారంభించాను.

పక్షుల చప్పుళ్ళు, దూరంగా పొలాల్లో కూలీల అరుపులు వినపడ్డాయి. కానీ కొంచెం సేపయ్యాక, మొదట్లో తెలియని ధ్వనులు కూడా వినపడసాగాయి. ఏటి అలల చప్పుళ్ళు, గాలి చేసే ధ్వనులు, మధ్య మధ్యలో నిశ్శబ్దం... చాలా ఓర్పుగా వాటిని వినసాగాను. ఏదో స్థబ్ధత, అందులోంచి వచ్చే ప్రశాంతత.

నా **ఒంటరితరం** క్రమక్రమంగా నా **ఏకాంతంగా** మారుతున్నట్టు అనిపించింది.

సరీగ్గా తొమ్మిదింటికి రెండో కాగితం విప్పాను. మళ్ళీ రెండే పదాలు "వెనక్కి వెళ్ళు".

ఎక్కడికి వెళ్ళాలి? నాకు మళ్ళీ అర్థం కాలేదు. బాల్యంలోని ఆనందప్రదమైన సంఘటనల వైపా? మొత్తం గతం వైపా? లేదా – తిరిగి డాక్టర్ దగ్గరికా?

నేనా సెలయేటి దగ్గర గడిపిన నా బాల్యం గురించి ఆలోచించసాగాను. అందులో కొన్ని ఆనందప్రదమైన సంఘటనలు కూడా లేకపోలేదు. నన్నూ నా తల్లినీ కలిపి నా తండ్రి తిట్టిన సంఘటనలు గుర్తు రాలేదు. నా తండ్రి నన్నూ నా తల్లినీ ఎంత కష్టపడి పోషించాడో గుర్తొచ్చింది. అప్పట్లో అతడి చిరాకునీ, (ఇప్పుడు నేనున్నట్టే) జీవితంపట్ల అతడి విసుగునీ గ్రహించ గలిగాను.

నా బాల్యం ఒక నోటు పుస్తకమైంది.

ఏయే లైన్లు అండర్‌లైన్ చేయాలో గుర్తిస్తుంటే మూడు గంటల కాలం గడిచిపోయింది.

క్రమక్రమంగా నేను ద్వేషించే తండ్రితో సహా, అందరూ నాకు అర్థమయ్యారు.

మూడో పొట్లం విప్పాను.

"ముందుకెళ్ళు" అని వుందందులో. పై రెండిటి కన్నా విభిన్నమైనది.

ఈసారి నా ఆలోచన్లు అంత వేగంగా సాగలేదు. గతం గురించి వెనక్కి వెళ్ళటం సులభం. ముందుకెళ్ళటం అంత సులభం కాదు. ఆర్థిక స్థిరత్వం గురించి, గొప్పవాడిని అవటం గురించి ఆలోచిద్దా మనుకున్నాను. బాల్యం గుర్తొచ్చింది. నా గమ్యాల్లో, గమ్యాల ఎంపికలో ఏదో తప్పున్నట్టు తోచింది. నాలో శక్తిని గుర్తించకుండా, కేవలం గమ్యం

పెట్టుకుంటే ఏం లాభం? గమ్యాలు అందరూ పెట్టుకుంటారు. అది అన్నిటికన్నా సులభం. అన్ని సెలయేళ్ళూ జీవనదులు అవలేవు కదా. అవునంది నా బాల్యపు సెలయేరు.

అకస్మాత్తుగా నాలో ఏదో వెలిగినట్టు అయింది.

ఇంతకాలం నేను నా విషాదాన్ని 'ఆలోచన' అనుకున్నాను. నా విషాదం, నా మెదడులో శాశ్వతంగా స్థిర నివాసం ఏర్పర్చుకోవటానికి దానికి కావలసినంత చోటు ఇచ్చాను. అనుకోని అతిథిలా అది హాయిగా స్థిరపడిపోయే వీలు కల్పించాను.

ఇంకేమీ పనిలేని నా మెదడు, నా చేతకానితనంతో పోచికోలు కబుర్లు సాగించింది. నా ఆనందం కోసం సినిమా చూసాను. నటుడు నాట్యం చేస్తుంటే ఆ స్థానంలో నన్ను ఊహించుకున్నానే తప్ప, ఆ నటుడిలా అవ్వాలను కోలేదు. ఆ సౌష్టవం నాకు లేదని సర్ది చెప్పుకున్నాను. నాకు సీటు చూపించిన ఆ సినిమా హాలు కుర్రాడు – అర్ధరాత్రి చలిలో ఎంత దూరం ఇంటికి నడిచి వెళ్ళాలో ఆలోచించలేదు. నటుడితో నా దురదృష్టాన్ని పోల్చుకున్నానే కానీ, ఆ కుర్రాడితో నా అదృష్టాన్ని పోల్చుకోలేదు. అప్పటికే కోటీశ్వరుడైన ఆ సినిమా దర్శకుడు, హిమాలయాల్లో తెల్లవారుఝాము సూర్యోదయాన్ని చిత్రీకరించటానికి ఎంత కష్టపడ్డాడో, ఎందుకు(!) కష్టపడ్డాడో అర్థం చేసుకోలేదు. నేను చూస్తున్న సినిమా హాలు టాయిలెట్ కడిగేవాడు రోజుకి యాభై రూపాయలకే ఆ పని చేస్తాడని నాకు తెలిసినా, దానికంత ప్రాముఖ్యత ఇవ్వలేదు. వెండితెర నన్ను తదాత్మ్యతలో ముంచెత్తింది.

ముందు కెళ్ళాలంటే ఏం చెయ్యాలో నాకు అర్థమైంది. ముందుకెళ్ళాలంటే, 1. ఎక్కడున్నామో ముందు తెలుసుకోవాలి. 2. ఎక్కడికి వెళ్ళాలన్నది తెలుసుకోవాలి. 3. వాహనాన్ని, ఇంధనాన్నీ సమకూర్చుకోవాలి. 4. అన్నిటికన్నా ముఖ్యంగా, అక్కడికి ఎందుకు వెళ్ళాలో కరెక్టు అవగాహన వుండాలి.

నాకు నవ్వొచ్చింది. సెలయేరు కూడా నవ్వింది. పక్షులూ, గాలీ, ప్రకృతి, నా బాల్యం మా నవ్వుతో శృతి కలుపుతోండగా, నాలుగో పొట్లం విప్పాను.

"నీ బాధల్ని క్రింద వ్రాయి" అని ఉన్నదందులో. వంగి, ఒక ఆల్చిప్పతో ఏటి పక్క ఇసుకలో ఆ రెండు పదాల్నీ వ్రాసి, వెనుదిరిగాను. అచ్చు తప్పుల్ని కూడా చూసుకోలేదు. కొంచెం చీకటి పడగానే సెలయేరు పొంగి ఆ పదాల్ని తనలో కలిపేసుకుని ప్రక్షాళనం చేస్తుందని నాకు తెలుసు.

"ఏమీ లేవు" అన్న రెండు పదాలే కదా!

*(విజయంలో భాగస్వామ్యం)*

# లాజిక్

మానసిక శాస్త్రంలో హేతువాదం (లాజిక్) అని ఒక సబ్జెక్ట్ ఉంది. లోతుకి వెళ్ళే కొద్దీ ఎంతో ఉత్సాహభరితమైన అంశం ఇది. దానికి ఉదాహరణగా ఈ కథ చదవండి.

ఒక సీనియర్ లాయర్ దగ్గర ఒక కుర్రాడు పదివేల రూపాయలు ఫీజు ఇస్తానని చెప్పి జూనియర్‌గా చేరాడు. కోర్సు పూర్తయింది. ప్రస్తుతం తన దగ్గర డబ్బులేదనీ, ప్రాక్టీసు పెట్టిన మొదటి కేసు గెలవగానే ఆ డబ్బు ఇస్తాననీ సీనియర్‌ని వప్పించాడు.


ప్రాక్టీసు పెట్టిన ఎంత కాలానికీ ఒక్క కేసు కూడా గెలవలేదని అంటూ, కుర్ర లాయరు డబ్బు ఇవ్వటం వాయిదా వేస్తూ వచ్చాడు.

విసుగు చెందిన సీనియర్ కోర్టులో కేసు వేసాడు. అతడి వాదన ఇలా వున్నది. “అయ్యా! ఈ కేసు నేను గెలిస్తే మీ తీర్పు ప్రకారం పదివేలు నాకొస్తాయి. నేను ఓడితే, అతడు మొదటి కేసు గెల్చాడు కాబట్టి నా పదివేల ఫీజు అతను నాకు ఇవ్వవలసి ఉంటుంది.”

సత్యమే కదా!

అయితే దానికి జూనియర్ ఈ విధంగా వాదించాడు. “ఈ కేసు నేను గెలిస్తే సీనియర్ గారికి కోర్టు ఆర్డర్ ప్రకారం నేను ఏమీ ఇవ్వనవసరం లేదు. కేసు నేను ఓడిపోతే, పాత ఒప్పందం ప్రకారం ఏమీ ఇవ్వనవసరం లేదు.”

మీరైతే ఏమి తీర్పు ఇస్తారు?



*(తప్పు చేద్దాం రండి..!)*

## అద్దానికి ఆవలి వైపు

వ్యాపారంలో విపరీతంగా నష్టం వచ్చి దిగులుగా వున్న ఒక వర్తకుడి వద్దకు అతడి కూతురు వచ్చి, అతడి పుట్టినరోజు బహుమతిగా బంగారు రంగు కాగితంలో చుట్టబడిన ఒక ప్యాకెట్ ఇచ్చిందట.

అసలే డబ్బులేని స్థితిలో వుంటే, అనవసరంగా అంత ఖర్చుపెట్టినందుకు చిరాకు పడుతూ పెట్టె విప్పాడట ఆ వ్యాపారి.

అది ఖాళీగా వుంది!

అసలే దిగులు. ఆపై చిరాకు.

తన పుట్టిన రోజునాడు కూతురు చేసిన పనికి ఒక్కసారిగా కోపం కట్టలు తెంచుకుని, చెంపమీద గట్టిగా కొట్టాడట. ఆ పాప వెక్కి వెక్కి ఏడుస్తూంటే జాలి కలిగి, "అలా ఖాళీ పెట్టె ఇవ్వకూడదమ్మా" అని దగ్గరకు తీసుకుని అన్నాడట.

ఆ పాప అమాయకంగా, "అది ఖాళీది కాదు నాన్నా. అందులో నావి చాలా ముద్దులున్నాయి" అన్నదట. *(తప్పు చేద్దాం రండి..!)*

## దురద

చర్మంపై దురద కన్నా నాలుకపై దురద మరింత ప్రమాదకరం. గబుక్కున ఒక మాట అనేసి, తరువాత దాని పరిణామాలకి తీరిగ్గా బాధపడటం కొందరికి అలవాటు. ఇది అలవాటైతే బయట పడటం చాలా కష్టం. తక్కువ మాట్లాడటం ద్వారా కొంతవరకు ఈ బలహీనత నించి బయట పడవచ్చు. నోటి దురద వల్ల చాలా మంది స్నేహితులు దూరమవ్వటం మనకి తెలిసిన విషయమే.

1825లో నికోలస్ అనే రాజు ఒక విదేశీ విప్లవకారుడికి ఉరిశిక్ష విధించాడు. కానీ ఉరివేస్తుండగా తాడు తెగి, అతడు క్రిందపడిపోయాడు.

సాధారణంగా అటువంటి పరిస్థితుల్లో దాన్ని భగవంతుడు నేరస్థుడికి ఇచ్చిన వరంగా భావించి అతడిని ప్రాణాలతో వదిలేస్తారు. క్షమాపణ పత్రంమీద సంతకం పెడుతూ నికోలస్ రాజు సైన్యాధిపతితో, "అతడు సంతోషించాడా? ఏమన్నాడు?" అని అడిగాడు.

సైన్యాధిపతి నమ్రతగా, "ఈ రష్యన్లకు ఉరితాడు పేనటం కూడా సరిగ్గా రాదు– అన్నాడు ప్రభూ" అని జవాబు ఇచ్చాడు. "...అలాగా! అయితే ఈ సారి సరిగ్గా వస్తుందని నిరూపిద్దాం" అంటూ ఆ విడుదల పత్రాన్ని చింపేసేడట రాజు. *(తప్పు చేద్దాం రండి..!)*

# నిర్వాణ యోగం

"ఒక రోజు నేను కారు తుడుస్తూ ఉండగా పక్కనే గేటు దగ్గర ఒక భిక్షగాడు నిలబడి ఉన్నాడు. మాసికలు వేసిన కోటు, చిరిగిన పాంటుతో అతడు నావైపే సూటిగా చూస్తూ నా చర్యల్ని గమనిస్తున్నాడు. అతడేమైనా అడుగుతాడేమోనని నేను అతడిని గమనించనట్టే నా పనిలో నిమగ్నమయ్యాను. అతడు కూడా చాలా సేపు ఏమీ మాట్లాడలేదు. కారు తుడవడం పూర్తయింది. లోనికి వెళ్ళి పోదామనుకున్నాను. అతడు కారునే చూస్తూ 'చాలా అందమైన కారు' అన్నాడు.

నన్నేదో అడగబోతున్నాడని తెలిసిపోయింది. సమయం వృథా చేయడం ఇష్టంలేక "ఏమైనా సాయం కావాలా?" అనడిగాను.

అప్పుడు అతను చెప్పిన రెండు మాటలూ నాకు ఆ తర్వాత జీవితాంతం గుర్తుండి పోయాయి. అతడు చాలా సింపుల్‌గా "ఎవరికి వద్దు?" అన్నాడు.

అతడికి కొంత డబ్బు ఇచ్చి పంపించేసాను. కానీ ఆ రాత్రంతా అతడన్న ఆ రెండు మాటల గురించే ఆలోచిస్తూ ఉన్నాను. ఎవరికి వద్దు? నేను కొనబోయే మరో కారు అప్పు కోసం ప్రస్తుతం ప్రయత్నిస్తున్నాను. అదే విధంగా నా పిల్లవాడి సీటు కోసం పెద్ద యూనివర్సిటీలో పలుకుబడి ఉపయోగిస్తున్నాను. **ఎవరికి వద్దు**? ఫుట్‌పాత్ మీద పడుకునే వాడు, హంసతూలికా తల్పం మీద శయనించేవాడు – అందరికీ కావాలి.

నీకెంత ఉన్నది అని కాదు. నీకన్నా కింద వాళ్ళకి సాయం చేయడం మొదలు పెడితే 'ఎవరికి వద్దు?' అన్న ప్రశ్న ఎక్కువ వినపడ్డం తగ్గిపోతుంది.

నువ్వెంత చిన్నవాడివైనా సరే, నీకన్నా చిన్నవాడు మరొకడుంటాడు.

నేను అప్పుడప్పుడూ అనుకుంటూ ఉంటాను. భగవంతుడు ఒక దేవతను పిలిచి, నన్ను చూపించి "క్రింద ఆ కారు తుడుస్తున్న వ్యక్తి దగ్గరకు బిచ్చగాడి రూపంలో వెళ్ళు. అతడికి మరొక కారు, కుర్రవాడికి కాలేజీలో సీటు కావాలనుకుంటాను" అని పంపించాడేమో అనిపిస్తూ ఉంటుంది.

అప్పట్నుంచి నేను 'ఏమైనా కావాలా?' అని అడగడం మానేసి, వీలైనంత వరకూ 'ఇది తీసుకో' అనటం ప్రారంభించాను.

*(విజయానికి ఆరో మెట్టు)*

# మాట... చివరి వరకూ విను

చాలా మంచి కథ ఇది. అవతలి వారు చెప్పేది చివరి వరకూ సరిగ్గా వినకపోతే వచ్చే పరిణామాల గురించి ఒక గొప్ప ఉదాహరణ ఈ కథ.

ఒక కుర్రవాడికి పదమూడేళ్ళు. మేనత్త ఇంట్లో వుండి చదువుకుంటున్నాడు.

“మీ కుర్రవాడు అమ్మాయికీ, అబ్బాయికీ తేడా తెలియనట్టు ప్రవర్తిస్తున్నాడు. కాస్త శ్రద్ధ తీసుకోండి” అని టీచర్ చీటీ పంపింది. అది చదివిన మేనత్త కంగారుపడింది. కుర్రాడు చదువుకుంటున్న గదిలోకి వెళ్ళి ఎదురుగా నిలబడి, “నా జాకెట్ విప్పు” అంది.

ఉపన్యాసకుడు ఇలా చెప్పేసరికి సభికులు నివ్వెరపోయారు. గుసగుసలు మొదలయ్యాయి. అతడు మాత్రం కొనసాగించాడు.



“కుర్రవాడు భయంగా చూసాడు. ఆమె మళ్ళీ తన మాటలు రిపీట్ చేసింది. అతడు వణుకుతున్న వేళ్ళతో జాకెట్ విప్పాడు. ఆవిడ అతడి వైపే చూస్తూ “...ఇప్పుడు బ్రా” అంది. వాడికి హుక్స్ తీయటం రాకపోతే చేతులు వెనక్కి పెట్టి ఆమె సాయం చేసింది.

...ఇలా చెప్తోంటే సభికులు హాహాకారాలు చేసారు. ఉపన్యాసకుడు పట్టించుకోలేదు. అవతలివాడు చెప్పేది చివరి వరకూ వినకుండా అడ్డుపడితే వచ్చే సమస్య గురించి అతడు మాట్లాడుతున్నాడు. రణగొణధ్వనుల మధ్య అతడు చివరి వాక్యం పూర్తి చేసాడు. “ఇంకెప్పుడయినా ఇలా నా బట్టలు తొడుక్కుంటే వళ్ళు చీరేస్తాను” అన్నదామె.

*(తప్పు చేద్దాం రండి..!)*

# ఇష్టం + శ్రద్ధ = విజయం

మనం మన గురించి ఆలోచించినంత శ్రద్ధగా అవతలివారి గురించి ఆలోచించము. కనీసం మన దగ్గరవాళ్ళ గురించి కూడా ఆలోచించము. మనని మనం ఎంత ప్రేమించుకుంటామో, అందులో కనీసం సగమైనా అవతలివారిని ప్రేమించడం మొదలుపెడితే, జీవితం ఎంతో సంతోషంగా ఉంటుంది.

ఒక కాంట్రాక్టర్ దగ్గర ఎన్నో ఏళ్ళుగా ఒక వడ్రంగి మేస్త్రీ పని చేసేవాడు. వృద్ధాప్యం వచ్చేసరికి అతడు రిటైరవుదామని అనుకున్నాడు. ఆ విషయం కాంట్రాక్టరుతో చెబితే "ఒక చివరి ఇల్లు నిర్మించి, ఆ తర్వాత రిటైరవ్వు" అని కోరాడు.

అతడు "సరే" అన్నాడు. కానీ ఏ మాత్రం ఉత్సాహం లేదు. ఏదో చెయ్యాలి కాబట్టి ఇల్లు పూర్తి చేసాడు.

అప్పుడా కాంట్రాక్టర్ వడ్రంగితో "నమ్మకంగా నా దగ్గర ఇంత కాలం పనిచేసినందుకు నీ కోసమే ఆ ఇల్లు కట్టాను. నా బహుమతిగా తీసుకో" అన్నాడు.

వడ్రంగి షాకయ్యాడు.

"ఈ విషయం ముందే తెలిసుంటే నా ఇంటిని మరింత శ్రద్ధతో నిర్మించేవాడిని కదా" అని మనసులోనే వాపోయాడు. *(విజయానికి ఆరో మెట్టు)*

# నెల జీతం

గ్రూచో ఒకరోజు తన ఇంటి ముందు తోటలో పనిచేసుకుంటున్నాడు. రోడ్డుమీద వెళ్తూన్న మధ్య వయస్కురాలు ఆ తోట అందానికి ముచ్చటపడి, "ఈ తోటకి మాలివి నువ్వేనా" అని అడిగింది.

"అవును" అన్నాడు గ్రూచో.

"చాలా అద్భుతంగా వుంది. మా ఇంటికొచ్చెయ్యి. మంచి జీతం ఇస్తాను".

గ్రూచో ఆమెవైపు ఇబ్బందిగా చూసాడు. అతడి ఇబ్బందిని మరోలా అర్థం చేసుకుని, "చెప్పు ఇక్కడ నీకు వీళ్ళు ఎంత ఇస్తారు? దానికి రెట్టింపు ఇస్తాను" అంది గర్వంగా.

గ్రూచో నమ్రతగా, "మా ఆవిడ వారానికి రెండుసార్లు తన పక్కమీద నన్ను పడుకోనిస్తుంది" అన్నాడు. *(విజయానికి ఆరో మెట్టు)*

# ఎత్తుకి పైయెత్తు

మనమే తెలివైన వాళ్ళమనీ అవతలి వాళ్ళు మనకన్నా మూర్ఖులనీ అనుకోవడం వల్ల వచ్చే పరిణామాలు ఒక్కోసారి చాలా దారుణంగా ఉంటాయి. తెలివికి, అతితెలివికి తేడా అదే.

విన్స్టన్ చర్చిల్ మరణానంతరం, అతడి చుట్టల్ని ఛార్లెట్ అనే న్యాయవాది పెద్ద మొత్తం ఇచ్చి వేలంపాటలో కొనుక్కున్నాడు. దొంగతనానికీ, అగ్నిప్రమాదానికీ రక్షణగా వాటిని పదివేల డాలర్లకి బీమా చేయించాడు. ఒక వర్షాకాలపు సాయంత్రం కాస్త చలిగా వుంటే, వెచ్చగా చుట్ట తాగాలనిపించి, ఒకదాని తరువాత ఒకటి చొప్పున అన్ని చుట్టల్నీ కాల్చేశాడు.

ఆ తరువాత అతడు పదివేల డాలర్లకి ఇన్సూరెన్స్ కంపెనీకి తన చుట్టలు 'చిన్న' అగ్నిప్రమాదంలో ధ్వంసం అయిన కారణంగా తనకి నష్టపరిహారం ఇవ్వమని అర్జీపెట్టాడు.

చుట్టలు శుభ్రంగా కాల్చేసి, ఇన్సూరెన్స్ డబ్బు ఇమ్మని అడగటం ఏమిటని ఇన్సూరెన్స్ కంపెనీ గోలపెట్టింది.

ఛార్లెట్ కోర్టుకి వెళ్ళాడు. తీర్పు అతడికి అనుకూలంగా వచ్చింది. 'మంటలో రకాలుండవనీ' ఏ రకమయిన మంటలో కాలిపోయినా అది అగ్ని ప్రమాదం క్రిందే వస్తుందనీ జడ్జి చెప్పాడు.

కోర్టు ఫీజుతో సహా పదివేల డాలర్లు ఇన్సూరెన్స్ కంపెనీ అతడికి చెల్లించాల్సి వచ్చింది.

అయితే ఈ కేసు ఇక్కడితో అయిపోలేదు. ఛార్లెట్‌కి డబ్బు చెల్లించిన తరువాత భీమా కంపెనీ అతడి మీద తిరిగి కేసు పెట్టింది. తన స్వాధీనంలో ఉన్న సరుకుని అజాగ్రత్తగా వుంచినందుకు పదిహేనువేల డాలర్ల జుల్మానా, ఇన్సూర్ కాబడిన ఆస్థిని స్వహస్తాలతో ధ్వంసం చేసినందుకు ఛార్లెట్‌కి ఒక సంవత్సరం కారాగార శిక్ష విధింపబడింది.

*(తప్పు చేద్దాం రండి..!)*

# చిన్న గీత – పెద్ద గీత

మనకున్నన్ని కష్టాలు మరెవరికీ ఉండవని మనం అనుకుంటూ ఉంటాం. కాన్సర్ బాధతో విలవిలలాడుతున్న పేషంటునీ, అర్ధరాత్రి టాంక్–బండ్ పక్కన చలికి వణుకుతూ పడుకున్న బీదవాళ్ళనీ, పెళ్లాం బిడ్డల పస్తులని చూస్తూ కూడా ఏమీ చెయ్యలేక దుఃఖించే మనిషినీ గమనిస్తే, మన కష్టాలు ఎంత చిన్నవో అర్థమవుతాయి. కష్టానికి కావల్సింది విచారం కాదు. పరిష్కారం. కష్టం వచ్చినప్పుడు మనకన్నా పెద్ద కష్టాలలో ఉన్నవారిని తలచుకుంటే విచారం తగ్గి, ఆలోచన పెరుగుతుంది.

ఒక వ్యక్తి దాదాపు పిచ్చివాడిలా ఏడుస్తూ ఒక ప్రవక్త దగ్గరికి వచ్చాడు. "అల్లాహొ అక్బర్! మీరు నాకు సహాయం చెయ్యకపోతే నేను చచ్చిపోతాను."

"ఏమిటి నీ సమస్య?" ప్రవక్త అడిగాడు.

"ఒక చిన్న గదిలో అయిదుగురం ఉంటున్నాం. నేనూ, నా భార్యా, పిల్లలూ... అందరం ఒకే ఒక చిన్న గదిలో నివసిస్తున్నాం. పైగా నా తండ్రి ఉబ్బసం వల్ల రాత్రంతా దగ్గుతూనే ఉంటాడు. ప్రొద్దున్నే లేచిన దగ్గర నుంచీ ఒకర్నొకరు తిట్టుకోవటం, పిల్లల ఏడుపులు, కొట్టుకోవటం... నాకు పిచ్చెక్కిపోతోంది."

"మీరందరూ ఎలా బ్రతుకుతున్నారు?" అడిగాడు ప్రవక్త.

"ఒక బర్రె, రెండు గొర్రెలు, ఆరు కోడిపెట్టలు ఉన్నాయి."

"నేను ఒక సలహా చెప్తాను. మారు మాట్లాడకుండా చెయ్యి. కాదనకు. నీ సమస్య తీరుతుంది."

"తప్పకుండా"

"వాటన్నిటిని నీ ఇంట్లోనే తెచ్చిపెట్టుకో..."

ఆ వ్యక్తి అవాక్కయి, ఏదో అనబోయి, ప్రవక్త మాటలు గుర్తొచ్చి మారు మాట్లాడకుండా వెనుదిరిగాడు. కానీ వారం తిరక్కముందే పరుగెత్తుకు వచ్చాడు. కళ్ళు ఎర్రగా, జుట్టు తైల సంస్కారం లేక – పిచ్చివాడిలా ఉన్నాడు. బిగ్గరగా రోదిస్తూ "నా జీవితం నరక ప్రాయమైపోయింది. కోళ్ళ అరుపులు, బర్రె పేడ, గొర్రె రొచ్చు... ఆ వాసన... ధ్వనులు నేను బ్రతకలేను, చచ్చిపోతాను" అని కూలబడ్డాడు.

"తిరిగి ఇంటికి వెళ్ళు" అన్నాడు బైరాగి... "వెళ్ళి వాటిని తిరిగి యథాస్థానంలో ఉంచు."

మరుసటి రోజు తిరిగి వచ్చిన వాడి కళ్ళు ఆనందంతో మెరుస్తున్నాయి. "అబ్బ! ఇప్పుడు నా ఇల్లు స్వర్గంలా వుంది. నరకంలోంచి బయటపడినట్టు వుంది."

*(మైండ్ పవర్ నెం.1 అవటం ఎలా ?)*

# ద్రోహానికి ఒక కోడిగుడ్డు

పెళ్ళయిన ముప్ఫై సంవత్సరాలకు భర్త పెర్సనల్ బీరువా తీసి చూసింది ఆమె. అందులో రెండు కోడిగుడ్లు, రెండువేల నూట ఇరవై రూపాయిలూ కనబడ్డాయి. భర్త వచ్చాక క్షమాపణగా "మీ పెర్సనల్ డ్రాయర్ తీసి చూసాను. సారీ" అంది.

అతడు ఆప్యాయంగా "ముప్ఫై సంవత్సరాల వైవాహిక జీవితం తరువాత నువ్వు ఆ మాత్రం స్వేచ్ఛ తీసుకోవటంలో తప్పేముంది?" అని అనునయించాడు.

"నాదో చిన్న అనుమానం. డ్రాయర్‌లో రెండు కోడిగుడ్లు ఉన్నాయి. ఏమిటవి?" అంది.

అతడు ఇబ్బందిగా, "క్షమించు, ఏ భర్తా తన భార్యకి చేయకూడని ద్రోహం చేసినప్పుడు, ఆ తప్పుకి పరిహారార్థంగా ఒక కోడిగుడ్డు అందులో పెట్టాను. సారీ" అన్నాడు.

ఆమె ఆప్యాయంగా "ముప్ఫై సంవత్సరాల వైవాహిక జీవితంలో నాకు రెండు సార్లే కదా ద్రోహం చేసింది. ఫర్వాలేదులెండి... మరి ఆ రెండు వేల నూట ఇరవై రూపాయలు ఏమిటి?" అని అడిగింది.

అది చెప్పడానికి అతడు కాస్త మొహమాటపడి "పాడయిపోతాయని, డజను అవగానే గుడ్లు అమ్మేస్తూ వచ్చాను" అన్నాడు.



*(తప్పు చేద్దాం రండి..!)*

# అపూర్వ సంగమం

ఒకరోజు న్యూయార్క్‌లో దట్టంగా మంచు కురుస్తున్నదంట. పాదచారులు చెవులకు కోటు కాలర్లు అడ్డంగా పెట్టుకుని నడుస్తున్నారు. పక్కవాడు కూడా కనపడనంత దట్టంగా మంచు కురుస్తున్నది.

అటువంటి వాతావరణంలో బూకర్ టి. వాషింగ్టన్ అనే ఒక నల్లజాతి వ్యక్తి రెండు చేతుల్లోనూ రెండు బరువైన పెట్టెలు పట్టుకుని స్టేషన్ వైపు నడుస్తున్నాడు. (నీగ్రోల స్వతంత్రం కోసం మన మహాత్మాగాంధీలా ఎంతో కృషి చేసి చరిత్ర కెక్కినవాడు ఈ బూకర్ వాషింగ్టన్.)

బురదగా వున్న బాటపై అతడి కాళ్ళు జారిపోతున్నాయి. ఎంతో కష్టపడుతూ అతడు ఆ విధంగా నడుస్తూ వుండగా ప్రక్కనుంచి "ఒక పెట్టె నాకు ఇవ్వు మిత్రమా" అన్న శ్వేత జాతీయుడి మాట వినపడింది.

నల్లజాతీయుడు నిర్ఘాంత పోయాడు. దశాబ్దాల క్రితం మాట ఇది. అప్పట్లో ఒక తెల్లవాడు నీగ్రోతో అంత స్నేహంగా, ఆప్యాయంగా మాట్లాడటం కలలో కూడా ఊహించలేని విషయం.

బూకర్ కాస్త మొహమాటపడి "ఫర్వాలేదు" అని అంటూ ఉండగానే, ఆ ప్రక్కనున్న తెల్లజాతి యువకుడు అతడి చేతి నుండి పెట్టె తీసుకుని అతడితో పాటు నడవసాగాడు.

ఇద్దరూ మాట్లాడుకుంటూ ఒకరి వివరాలు ఒకరు తెలుసుకుంటూ ప్రయాణం సాగించారు. స్టేషన్ వరకూ ఆ విధంగా వెళ్ళి అక్కడ పెట్టె అందించి కరచాలనం చేసి ఆ శ్వేత జాతి వ్యక్తి వెళ్ళిపోయాడు. ఆ తరువాత వారిద్దరూ ఆ పరిచయాన్ని ఉత్తరాల ద్వారా కొనసాగించారు.

ఆ తరువాత కొన్ని దశాబ్దాలకి బూకర్ వాషింగ్‌టన్ "నేను రూజ్‌వెల్ట్‌ని మొదటిసారి కలుసుకున్న సమయమూ, ప్రదేశమూ" అని వివరాలు వెల్లడించాడు. ఇద్దరివీ రెండు వేర్వేరు సిద్ధాంతాలు. ఒకరు అమెరికాలోని నీగ్రోల హక్కుల కోసం పోరాడిన బూకర్ వాషింగ్టన్. మరొక తెల్లజాతి యువకుడి పేరు రూజ్‌వెల్ట్.

సిద్ధాంతరీత్యా పరస్పరం శత్రువులు. అయినా ఇద్దరి స్నేహమూ కొనసాగింది.

టాపాడో రూజ్‌వెల్ట్ అప్పుడు అమెరికాకు ప్రెసిడెంట్.

*(విజయానికి ఆరో మెట్టు)*

# కష్టం పైమెట్టు ఆనందం

ఒక వ్యక్తి, తన జీవితంలో వస్తున్న సమస్యల్ని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుందామని అనుకున్నాడు. అడవిలో ఒక బైరాగి ఇలాటి సమస్యలకి పరిష్కారం చెపుతాడని ఎవరో చెప్పగా, తిండీ నీరూ మూటకట్టుకుని బయల్దేరాడు. మూడు రోజులు గడిచాయి. నాల్గు రోజులు గడిచాయి. బైరాగి కనపడలేదు. తిండి అయిపోయింది. ఒక్కరోజుకి సరిపడా నీరు మాత్రమే సంచిలో మిగిలింది.

అడవిలో తాను దారి తప్పానని ఆ వ్యాపారి తెలుసుకున్నాడు.

ఎటుచూసినా కీకారణ్యం. ఎంతదూరం నడిచినా గమ్యం కనపడలేదు. మరణం తథ్యమనుకున్నాడు. అతని ఆలోచన్లని నిజం చేస్తూ ఒక పులి వెంటపడింది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగెత్తాడు. చెట్టు ఎక్కి కూర్చున్నాడు. పైన అతడు. క్రింద పులి.

వణికిపోతూ పన్నెండు గంటలపాటు అలాగే వున్నాడు. అతడికి ప్రాణభయంతో దుఃఖం వస్తోంది. అంతలో చీకటి పడటం వల్ల పులి వెళ్ళిపోయింది.

అతడికి ఒక్కసారిగా వెసులుబాటు కలిగి హాయిగా అనిపించింది. క్రిందికి నెమ్మదిగా దిగాడు. అప్పుడు తెలిసింది అతడికి – ఆ కంగార్లో నీటి సంచి ఎక్కడో పడిపోయిందని...! మిన్ను విరిగి మీద పడ్డట్టయింది. పిచ్చివాడిలా వెతకటం ప్రారంభించాడు. వళ్ళంతా చెమటలు పట్టాయి. గొంతు తడారిపోతోంది.

అంతలో ఒక పొద దగ్గర నీటి సంచి దొరికింది. ఉద్వేగంతో అతడు సన్నగా కేకపెట్టాడు.

అంత సంతోషం జీవితంలో అతడు అనుభవించలేదు. ఆనందంగా నీరు తాగుతూ ఉండగా, వెనుకనుంచి "అదే నాయినా జీవితం" అన్న మాటలు వినిపించాయి. ఉలిక్కిపడి వెనుదిరిగాడు. వెనుక బైరాగి వున్నాడు. నవ్వుతూ అతడు కొనసాగించాడు. "ఒక ఆనందం కలగాలీ అంటే ఒక కష్టం వుండాలి. ఒక సంతోషం కలగాలీ అంటే ఒక సమస్య తీరాలి. ఒకటి లేకపోతే మరొకటి లేదు. పులి 'సమస్య'! నీటి సంచి పోగొట్టుకోవటం 'కష్టం'!! చివరికి ఆ రెండూ ఆనందాన్నే ఇచ్చాయి చూడు" అన్నాడు.

వ్యాపారికి కనువిప్పు కలిగింది. సమస్య వల్ల వచ్చే ఉపయోగం తెలుసుకున్నాడు.

*(తప్పు చేద్దాం రండి..!)*

# తప్పు పంథా

ఒక వ్యక్తి ఒక పిల్లిని పెంచుకుంటున్నాడట. పంచదార కలపని పాలు త్రాగిస్తే అది ఆరోగ్యంగా పెరుగుతుందని ఎవరో చెప్పారు. ఆ రోజు నుంచీ పిల్లిని వళ్ళో కూర్చోపెట్టుకుని సీసా బలవంతంగా నోట్లోపెట్టి పంచదారలేని పాలు తాగించసాగాడు. అది గింజుకుంటూంటే గట్టిగా పట్టుకుని నోరు తెరిచేవాడు. ప్రతిరోజూ ఒక యుద్ధంలా జరిగేది. ఒకరోజు ఆ విధంగా ఘర్షణ పడుతూవుండగా చేతిలోంచి క్రిందికి జారి సీసా బ్రద్దలైపోయింది. అతడి వళ్ళోంచి చటుక్కున పిల్లి క్రిందికి దూకి ఆత్రంగా నేలమీది పాలు తాగటం ప్రారంభించింది. అతడు ఆ దృశ్యాన్ని దిగ్భ్రాంతుడై చూడసాగాడు. అప్పుడతనికో విషయం అర్థమైంది. పిల్లికి పాలు ఇష్టమే. కానీ తను పట్టుకున్న విధానమే నచ్చలేదు. ఇదే పిల్లల్ని పెంచే రహస్యం. *(తప్పు చేద్దాం రండి..!)*

# తల్లి ప్రేమ

గ్రేట్ బ్రిటన్‌లో చాలా కాలం క్రితం ఒక స్థూపం వుండేది. అక్కడి ప్రజలు ఆ స్థూపాన్ని తల్లి ప్రేమకి చిహ్నంగా భావించేవారు.

మొదటి ప్రపంచ యుద్ధానికి కొంతకాలం ముందు ఒక రాజ వంశస్థురాలు సౌత్‌వేల్స్ కొండల మధ్య నుంచి ప్రయాణిస్తూ వుండగా పెద్ద మంచు తుఫాను వచ్చి చాలామంది మరణించారు. అది తగ్గిన తరువాత ఆమె కోసం వెతికితే మంచు అడుగున ఆమె శరీరం కనపడింది. అయితే ఆమె వంటి మీద ఏమీ బట్టలు లేవు. దాన్ని చూసి ఆశ్చర్యపోతూ వారామె శరీరాన్ని మంచు నుండి బయటకు తీస్తూ వుండగా అడుగున నెలల పసికందు కనబడ్డాడు. ఆమె వంటిమీద ఎందుకు బట్టలులేవో వారికి అర్థం అయ్యింది. తన బట్టలన్నీ తీసి ఆ పసికందు మీద కప్పి అతడిని తన కౌగిలిలో వెచ్చగా పడుకోబెట్టుకుని ఆమె మరణించింది.

ఆ కుర్రవాడి పేరు డేవిడ్ జార్జి. అతడే పెరిగి పెద్దవాడై గ్రేట్ బ్రిటన్‌కి ప్రధానమంత్రి (1916–21) అయ్యాడు. తల్లి ప్రేమకి సూచనగా అతడు కట్టించిన స్థూపం చాలాకాలం బ్రిటీష్ ప్రజలకి గర్వకారణంగా వుండేది. *(విజయానికి ఆరో మెట్టు)*

# పూల వర్షం

ప్రతి మనిషికీ ఆత్మాభిమానం ఉంటుంది. ఐతే అతిశయం ఉన్నవాళ్ళు అవతలి వారి ఆత్మాభిమానాన్ని గుర్తించరు. ముఖ్యంగా మగవాళ్ళు.

ఒక రాజుగారికి ఒక అనుమానం వచ్చింది. మంత్రిని పిలిచి, "మహామంత్రీ! బాల్యం నుంచి యవ్వనంలోకి అడుగుపెట్టిన స్త్రీ కోటి కోరికల్తో తన వివాహం గురించి ఆలోచిస్తుంది కదా!" అన్నాడు.

అవునన్నాడు మహామంత్రి.

"మరి అటువంటప్పుడు, వైవాహిక జీవితంలోకి తొలి అడుగుపెడుతున్న పెళ్ళికూతురు కోరికల్లో అన్నిటికన్నా ప్రధానమైనది ఏమిటంటావు?" అని అడిగాడు.

"నాకు తెలీదు ప్రభూ" అన్నాడు మంత్రి.

"రేపు సాయంత్రంలోగా తెలుసుకుని రా! లేకపోతే రేపు సూర్యాస్తమయానికి శిరచ్ఛేదనకి సిద్ధంగా వుండు" అన్నాడు రాజు. మిన్ను విరిగి మీదపడ్డట్టు అయింది మంత్రికి. విషాదంగా ఇంటికొచ్చాడు.

ఆ రాత్రి  అతడికి దిగులుతో నిద్రపట్టలేదు. నట్టింట్లో పచార్లు చేయసాగాడు. నడిరేయి దాటినా నిదురించని తండ్రి వ్యాకులపాటును కొడుకు గమనించాడు. అతడు పాతికేళ్ళవాడు. తండ్రి అంటే విపరీతమైన ప్రేమ ఉన్నవాడు. కారణం ఏమిటని తండ్రిని అడిగాడు. మరుసటి రోజు సాయంత్రం తనని ఉరిదీయబోతున్న సంగతి కొడుక్కి చెప్పాడు మంత్రి.

కొడుకు విలవిలలాడిపోయాడు. ఆందోళనతో ఇల్లు వదిలాడు. అర్ధరాత్రి పిచ్చివాడిలా నగరమంతా తిరిగాడు. ఒక గమ్యం అంటూ లేకుండా ఊరు చివరకు చేరుకున్నాడు. ఊరు దాటాక దారి పక్కన ఒక పాడుపడిన సత్రం ఉన్నది. పూర్తిగా కూలిపోయి అది శిథిలావస్థలో వున్నది. దానిలో ఒక ఒంటరి బిచ్చగత్తె నివసిస్తోంది.

పీలికలైన బట్టలు, సంస్కారంలేని జుట్టు, వికృతమైన శరీరాకృతితో వున్న ఇరవైఏళ్ళ ఆ బిచ్చగత్తె, మంత్రి కుమారుడిని గుర్తించి, 'మంత్రి కుమారా! అర్ధరాత్రి బికారిలా ఎందుకలా తిరుగుతున్నావు' అని అడిగింది.

జరిగింది చెప్పి, "అప్పుడే పెళ్ళయిన స్త్రీ అన్నిటికన్నా ప్రప్రథమంగా ఏమి కోరుకుంటుంది? దీనికి సమాధానం ప్రొద్దున్నకల్లా తెలుసుకోకపోతే నా తండ్రి ప్రాణం పోతుంది. అందుకే ఈ విధంగా మతిచెడి తిరుగుతున్నాను" అన్నాడు.

"సమాధానం నాకు తెలుసు. ఒక షరతు మీద చెప్తాను" అన్నది బిచ్చగత్తె.

మంత్రి కొడుక్కి ప్రాణం లేచివచ్చినట్టు అయింది. "...నా తండ్రి కోసం ఏదైనా చేస్తాను. ఏమిటా షరతు?" అని అడిగాడు.

"నన్ను వివాహం చేసుకోవాలి."

మిన్ను విరిగి మీదపడ్డట్టు అయింది. అయినా క్షణంలో సర్దుకున్నాడు. అమితంగా ప్రేమించే తండ్రి కన్నా అతడికి ఏదీ ఎక్కువ కాదు. మొహంనిండా స్ఫోటకపు మచ్చల్తో, మూర్తీభవించిన కురూపిలా ఉన్న ఆ బిచ్చగత్తెతో, "...చేసుకుంటాను" అన్నాడు ఒక నిర్ణయానికి వచ్చినవాడిలా.

మరుసటి రోజు నిండుసభలో ఆమె చెప్పింది. "మహారాజా! ఏ స్త్రీ అయినా వివాహం జరిగి అత్తవారింటికి వెళ్ళబోతూ కోరుకునే కోరిక ఒకటే! పుట్టింట్లో ఉన్నట్టే, తన స్వాతంత్ర్యము తనకే ఉండాలని! అదే ప్రథమ కోరిక. అదే ప్రధాన కోరిక..." అన్నది.

క్లుప్తంగానూ, అర్థవంతంగానూ ఉన్న ఆ సమాధానానికి సభ యావత్తూ కరతాళ ధ్వనుల్తో హర్షధ్వానాలు చేసింది. రాజు సింహాసనం దిగివచ్చి, "భేష్! ఏ స్త్రీ అయినా సరే, వివాహం జరిగాక కూడా 'తన స్వవిషయాల్లో' నిర్ణయం తీసుకునే హక్కు తనకే ఉండాలని కోరుకుంటుంది. చిన్న కోరిక. కానీ చాలామంది స్త్రీలకి అది తీరని కోరిక. చక్కగా చెప్పావు" అంటూ అభినందించాడు.

ఇప్పుడిక కొడుకు వివాహం బిచ్చగత్తెతో చేయించవలసిన బాధ్యత మంత్రిపై పడింది. పదివేల వరహాలిచ్చి వదిలించుకుందామనుకున్నాడు.

"వద్దు మంత్రిగారూ!" అన్నదా బిచ్చగత్తె. "...నాకు డబ్బు వద్దు. మీ కొడుకు భార్య విలువ పదివేల వరహాలనుకోను. పర్వాలేదు. వదిలెయ్యండి" అన్నది అక్కడ నుంచి వెళ్ళబోతూ.

"ఆగు" అన్నాడు మంత్రికొడుకు. "నా తండ్రిని నువ్వు రక్షించావు. నీకిచ్చిన మాట నేను కాదనను. నేను నిన్ను వివాహం చేసుకుంటాననీ, నీ అందంతో నిమిత్తం లేకుండా మనసా వాచా కర్మణా నీతోనే వుంటాననీ, మనస్ఫూర్తిగా నిన్ను అర్ధాంగిగా స్వీకరిస్తూ పంచభూతాలపై ప్రమాణం చేస్తున్నాను" అన్నాడు.

ఆ మాటలకి సభికులు తిరిగి హర్షధ్వానాలు చేసారు. స్వచ్ఛమయిన నిజాయితీతో కూడిన ఆ యువకుడి అస్థిత్వానికి ఆకాశం రెండుగా చీలి, ఒక దేవకన్య క్రిందికి దిగివచ్చి అతడికో వరమిచ్చింది. "నీ మంచితనానికి బహుమతిగా నీ భార్యని సగము దినము అద్భుత సౌందర్యరాసిగా మారుస్తాను. పగలు కావాలో, రాత్రి కావాలో కోరుకో" అన్నది.

సభ మొత్తం స్థబ్దమైంది. అతడేమని కోరుకోవాలి? నట్టింట్లో కళకళలాడుతూ

తిరగటానికీ, స్నేహితుల ఇళ్ళకి సగర్వంగా తీసుకెళ్ళటానికీ, ఇంటిలో విందు వినోదాలలో పాలు పంచుకోవటానికీ సౌందర్యవతి అయిన భార్య 'పగలు' కావాలని కోరుకోవాలా? రాసకేళిలో అలరించటానికి రాచకన్నెల్ని తలదన్నే రసరమ్య మోహనమూర్తిగా 'రాత్రి' కావాలని కోరుకోవాలా? ఆ యువకుడు ఏమి అడగాలి?

దేవకన్యకు నమస్కరించి మంత్రి కుమారుడు తనకి ఏం కావాలో చెప్పాడు.

అతడు అడిగింది విని అందరూ హర్ష పులకాంకితులు అయ్యారు.

ఆకాశం నుంచి పూల వర్షం కురిసింది.

దేవకన్య కూడా సంతసించి అతడి భార్య దినములో సగము కాకుండా పగలూ రాత్రీ కూడా పూర్తిగా సౌందర్యముతో ప్రభవించేట్టూ వరమునిచ్చి అదృశ్యమయింది.

ఇంతకీ మంత్రి కుమారుడు దేవకన్యతో అంత అద్భుతంగా ఏమి చెప్పి ఉంటాడు? ఏమని కోరి ఉంటాడు? దీనికి సమాధానం తెలియాలంటే, కాస్త వెనక్కి వెళ్ళాలి.

బిచ్చగత్తె ఏమి చెప్పింది?

స్త్రీ కోరుకునే ప్రథమ కోరిక, 'వివాహం జరిగాక కూడా, తన విషయంలో నిర్ణయం తీసుకునే హక్కు తనకే వుండాలని'.

అది చెప్పే కదా బిచ్చగత్తె అందరి హర్షధ్వానాలూ పొందింది.

మరి – తన భార్య పగలు అందంగా వుండాలా? రాత్రి అందంగా వుండాలా అన్న నిర్ణయం తీసుకునే హక్కు భర్తకెలా ఉంటుంది? అది ఆమె ఇష్టం.

ఆ విషయమే మంత్రి కుమారుడు చెప్పాడు.

అలా చెప్పగానే ఆకాశం నుంచి అందుకే పూలవర్షం కురిసింది.

*(తప్పు చేద్దాం రండి..!)*

# తలకింద పరిష్కారం

దండకారణ్యం మధ్య కొండల నడుమ ఆశ్రమంలో ఉండే ఒక యోగి దగ్గర అపురూపమైన నాణెమొకటి ఉన్నదని శోకభోజనునికి తెలిసింది. అది చెంతనున్న వారికి అశాంతిగానీ, దుఃఖముగానీ కలగదని ప్రతీతి.

పేరుకు తగ్గట్టే శోకభోజనునికి ఎన్నో సమస్యలున్నాయి. ఆర్థిక సమస్యలు, కుటుంబ సమస్యలు, ఆరోగ్యం, అన్నిటికి మించి నిరంతరం ఏదో తెలియని అశాంతి!

అందుకని అతడు యోగినుంచి ఆ నాణెం సంపాదించాలనుకున్నాడు. దినమంతా అడవిలో పయనించి ఎంతో కష్టపడి సాయంత్రానికి ఆశ్రమానికి చేరుకున్నాడు. అయితే యోగి ఆ నాణాన్ని ఇవ్వటానికి ఇష్టపడలేదు. "దాన్ని నిరంతరం జాగ్రత్తగా శుద్ధి చేయాలి నాయనా! నీ వద్ద అది దాని ప్రభావం చూపదు" అన్నాడు.

బాగా చీకటి పడుతూ ఉండటంతో, అంత రాత్రిపూట అడవిలో ప్రయాణం ఆమోదయోగ్యం కాదు కాబట్టి, యోగి ఆ అతిథిని తన ఆశ్రమంలో ఆ రాత్రి ఉండి పొమ్మని కోరాడు. పక్కనే పక్క వేసాడు.

పరున్నాడే కానీ శోకభోజనునికి నిద్ర పట్టలేదు. నాణెం ఇవ్వటానికి ఇష్టంలేక యోగి అబద్ధం చెప్పాడని అర్థమవుతూనే ఉన్నది. ఎలాగైనా ఆ నాణేన్ని తన స్వంతం చేసుకోవాలనుకున్నాడు.

యోగి నిదురించాక ఆశ్రమం అంతా వెతికాడు. నాణెం దొరకలేదు. తెల్లవారు ఝామునే యోగి కాలకృత్యాలకు వెళ్ళినప్పుడు అతడు పరుండిన పక్క కూడా వెతికాడు. కానీ నాణెం దొరకలేదు. దాన్ని యోగి ఎక్కడ దాచాడో అర్థం కాలేదు.

అపరాధ భావనకన్నా అనుమాన పీడన ఎక్కువ అవటంతో చేతులు జోడించి "తప్పు చేసాను స్వామీ! కానీ ఆ నాణెం ఎక్కడ?" అంటూ దాని జాడ అడిగాడు.

అప్పటి వరకూ అతడి తపననంతా లీలగా గమనిస్తూన్న యోగి చిరునవ్వుతో శోకభోజనుడు పడుకున్న పక్క తలదిండు పైకెత్తాడు. దాని క్రింద వున్నది నాణెం...!

దిగ్భ్రాంతుడై చూస్తున్న అతడితో యోగి ఈ విధంగా అన్నాడు. **"తన అశాంతిని ఎలా పోగొట్టుకోవాలా అని మనిషి అన్ని దిక్కులా వెతుకుతాడు. తన తల క్రిందే పరిష్కారం వున్నదని తెలుసుకోడు.** నాణెంలో ఏ శక్తి లేదు నాయనా! అది నీ ఆలోచనలోనే ఉన్నది".

శోకభోజనునికి ఒక విశ్వరహస్యం తెలిసినట్టయింది. *(వీళ్ళనేం చేద్దాం?)*

# భార్య తెలివి

ఒక వ్యాపారస్తుడు ఏడాదిపాటు వ్యాపార నిమిత్తం ఓడమీద సరుకులు వేసుకుని విదేశాలకు వెళ్ళి వస్తాడు. ఆ రాత్రి భార్యతో శృంగారకేళిలో ఉండగా, భార్య రొమ్ముపై నఖక్షతాల్ని చూస్తాడు. చంద్రవంక ఆకారాన్ని పోలి ఉన్న ఆ గోరుగిచ్చుడిని చూసి అనుమానించగా, భార్య సంస్కృతంలో ఒక శ్లోకం చెపుతుంది. దాని అర్థం ఈ విధంగా ఉంటుంది.

"నా మనసునీ, శరీరాన్ని దోచుకున్న నా మగడా! నా స్థనాలవైపు అలా అనుమానంగా చూడకు. నీవు లేని రోజుల్లో విరహతాపంతో నేను చంద్రుడి వైపు దీనంగా చూస్తోంటే, చంద్రుడి భార్య ఈర్ష్య పడింది. 'అంత అందగత్తె నీ వైపు అలా కళ్ళప్పగించి చూస్తోందనా – మరింత ప్రకాశిస్తున్నావు' అని భర్తతో దెబ్బలాడింది. అప్పుడు చంద్రుడు నాతో ఇలా అన్నాడు 'ఓ తిలోత్తమా! నావైపు అంతలా చూస్తూ నీవేమో నీ భర్తని తల్చుకుంటున్నావు. నా భార్యేమో నాపై అనుమాన పడుతోంది. ఈ సమస్యకి ఒక పరిష్కారం చెపుతాను. నీ గుండెల్లోనే కదా నీ భర్త ఉన్నది. స్త్రీల విరహానికి ప్రతీకమైన నేను వచ్చి నీ గుండెలపై చేరతాను. అప్పుడిక నీకు ఆకాశం వైపు చూసే పని ఉండదు. రెండు నిండు చంద్రుల్లాటి నీ గుబ్బల ద్వయం పైభాగాన చంద్రవంకల్నీ, గుండెల్లోపల భర్తనీ చూసుకుంటూ ఏడాదికాలం గడిపెయ్యవచ్చు' అన్నాడు. కాబట్టి ఓనాథా! నా స్థనములపై నెలవంకలు నీపై నా ప్రేమకు గుర్తులు".

అతడు తన భార్య మాటలకి సంతృప్తి చెంది, ఆమెని బిగియార కౌగిలించుకున్నాడు. ఆ రాత్రి ఆ దంపతులిద్దరూ శృంగార సమయాల్లో గడియారాలు ఆగిపోతాయని ఋజువు చేసారు.

నిజానికి ఆ వ్యాపారస్తుడు సంతోషించింది భార్య ఆశువుగా చెప్పిన శ్లోకానికి కాదు.

తాను లేని సమయంలో ఏ అనామకుడితోనో కాకుండా, ఒక గొప్ప సంస్కృత పండితునితో సంపర్కం ఏర్పర్చుకున్నందుకు.

*(వీళ్ళనేం చేద్దాం?)*

# త్యాగం

ధైర్యం గురించి వ్రాస్తూ ఒక అజ్ఞాత రచయిత తన బాల్యాన్ని ఇలా వివరించాడు. “ముప్పై ఆరో ఏట మా తండ్రిగారికి బ్లడ్‌లో షుగర్ వున్నట్టు తేలింది. ఎంత చేసినా అది కంట్రోల్ అయ్యేది కాదు. అప్పుడు నాకు మూడేళ్ళు. అంబులెన్స్ మా ఇంటికొచ్చి నిశ్శబ్దంగా నాన్నని హాస్పిటల్‌కి తీసుకెళ్ళి తీసుకు వెళ్ళటం నాకు ఇంకా గుర్తుంది. నాన్న బాస్కెట్‌బాల్ కోచ్. షుగర్ మూలాన ఆయన దాన్ని మానుకోవలసి వచ్చింది. క్రమక్రమంగా నాన్న మత్తుగా, బద్ధకంగా ఉండసాగాడు. ఒకసారి వంటింట్లో నిలువునా వెనక్కి పడిపోవటం నేను కళ్ళారా చూసాను. చేతులు ఆన్చటానికి కూడా టైమ్ సరిపోలేదు. విరిగిన చెట్టులా వెనక్కి నిటారుగా పడిపోయాడు. తలకి పెద్ద దెబ్బ తగిలింది. అప్పటికి మందులు ఇంతగా లేవు. నలభై అయిదేళ్ళు వచ్చేసరికి నాన్న నడవలేక పోయాడు. చేతికర్ర సాయం కావలసివచ్చింది. ఆ తరువాత అయిదేళ్ళకి ఆయన కిడ్నీలు రెండూ పాడయ్యాయని తెలిసింది. ఎన్నో అర్ధరాత్రులు ఆయన మవునంగా బాధని అనుభవించడం నేను గమనించాను. ఎంత బాధవున్నా చెప్పేవారు కాదు.

అందరిలోకీ, నాన్నకి పెదనాన్న కిడ్నీ సరిపోతుందని డాక్టర్లు ధృవీకరించారు. పెదనాన్నకి అరవై ఏళ్ళు. ఆ వయసులో ఆ వృద్ధుడిని ఇబ్బంది పెట్టటానికి నాన్న వప్పుకోలేదు.

వారానికి రెండుసార్లు చెయ్యాల్సిన డయాలసిస్, రెండ్రోజుల కొకసారికి వచ్చింది. ఆ తరువాత నాన్న డయాలసిస్ కూడా వద్దన్నాడు. మేము ఎంతచెప్పినా వప్పుకోలేదు. చెల్లి పెళ్ళి చేసాము. రక్తశుద్ధి మానేసాక నాన్న ఆరోగ్యం క్రమక్రమంగా, వేగంగా క్షీణించసాగింది. మా కళ్ళముందే ఆయన మరణానికి దగ్గరయ్యాడు. ఆయనకప్పుడు యాభై నాలుగేళ్ళు. ఒక అర్ధరాత్రి మేమందరం చుట్టూ ఉండగా ఆయన నెమ్మదిగా ప్రాణాలు వదిలేడు.

అప్పుడు నా వయస్సు 21 ఏళ్ళు. మా దేశంలో ఉద్యోగానికి రిటైర్మెంటు వయసు 55. పదవిలో వుండగా మరణిస్తే, ఆ ఉద్యోగాన్ని సంతానానికి ఇస్తారు. ఆ విధంగా నాకా ఉద్యోగం వచ్చింది.

ప్రతి రాత్రీ పడుకోబోయేముందు నేను తండ్రిని తల్చుకుంటాను. ఆయన ఇప్పుడు నాకు స్పష్టంగా కనపడుతున్నాడు. ఒక తండ్రిగా కాకుండా, మూర్తీభవించిన ధైర్యంలా ఆయన నాకు కనపడతాడు. ఒకవైపు కూతురి పెళ్ళికోసం డయాలిసిస్ ఖర్చు మానేసి, మరోవైపు కొడుకు ఉద్యోగం కోసం మరణాన్ని తొందరగా ఆహ్వానించటం కన్నా గొప్ప ధైర్యం మరేముంటుంది? *(విజయానికి ఆరో మెట్టు)*

# భగవద్గీత సారాంశం

ఒక పాప దగ్గిర పెట్టెలో కొన్ని ముత్యాలున్నాయి. వాటిని జాగ్రత్తగా చూసుకుంటూ ఉండేది. ఒకరోజు ఆ పాప పడుకుని ఉండగా తండ్రి పక్కనే కూర్చుని, “నీ ముత్యాలు నాకివ్వవా అమ్మా” అని అడిగాడు.

“అవంటే నాకిష్టం డాడీ. నేను పెద్దవుతున్నాగా, కావాలంటే నా బేబి డాల్ తీసుకో” అంది.

“థాంక్యూ. వద్దులే అమ్మా. ఐ లవ్యూ” అని నుదుటి మీద ముద్దు పెట్టుకుని వెళ్ళిపోయాడు తండ్రి.

ఐదు సంవత్సరాలు గడిచాయి. ఒక రోజు పక్క మీద పాప పడుకుని ఉండగా, తండ్రి వచ్చి పక్కన కూర్చొని “నీ ముత్యాలు ఇవ్వవా తల్లీ” అని అడిగాడు.

“సారీ డాడీ, కావాలంటే నా సైకిల్ తీసుకో. పెద్దయ్యాగా” అంది.

“వద్దులే అమ్మా, థ్యాంక్యూ, డాడీ లవ్స్‌యు” అని వెళ్ళిపోయాడు. అలా కొంత కాలం గడిచింది.

ఒకరోజు ఆ అమ్మాయి తల్లితో కలిసి గుడికి వెళ్ళింది. అక్కడ భగవద్గీత పారాయణం జరుగుతోంది. పాప శ్రద్ధగా విన్నది.

ఆ రోజు రాత్రి తండ్రి వచ్చి మళ్ళీ అదే అడిగాడు. ఆ అమ్మాయి ముత్యాల పెట్టె ఇచ్చేస్తూ, “తీసేసుకో డాడీ. నాకివి అవసరం లేదు” అంది.

అప్పుడా తండ్రి జేబులో నుంచి అలాంటి పెట్టెనే మరొక దాన్ని తీసాడు. దాన్ని ఆమెకిస్తూ “వీటిని నీకిద్దామని ఎప్పటినుంచో నా దగ్గిరే వుంచుకున్నాను. ఇవి నిజమైనవి. ఇప్పటివరకూ నువ్వు భద్రంగా దాచుకున్నవి నకిలీవి” అంటూ అందించాడు.

ముందువాటి కన్నా ఇవి ఎంతో స్వచ్ఛంగా మెరుస్తున్నాయి.

ఆ పాప కళ్ళలాగే!

భగవంతుడు కూడా ఇలాగే అసలు ముత్యాలయిన భావుకత్వం, సాహిత్యం, ప్రేమ, ప్రకృతి పట్ల ఇష్టం, సంగీతం పట్ల ఆరాధన, కరుణ, ఆప్యాయత లాటి గుణాల్ని ‘ఇవ్వటానికి’ సిద్ధంగా వుంటాడు. కానీ మనం తాత్కాలిక ఆనందాన్నిచ్చే అసూయ, ద్వేషం, కోపం, స్వార్థం, సాడిజం లాంటి నకిలీ ముత్యాల్ని పట్టుకుని అవే నిజమైనవనుకుని ఆనందం పొందుతూ వుంటాం. వాటిని వదిలేస్తే తప్ప నిజమైనవి దొరకవని తెలుసుకున్న మనిషే అసలైన తృప్తి పొందుతాడని పురాతన కథ! *(విజయానికి ఆరో మెట్టు)*

# పెదవి దాటిన మనసు మాట

నేను హొటల్లో దిగిన గంటకి, నిర్వాహకులు వచ్చి నన్ను డిన్నర్‌కి తీసుకెళ్లారు. మరుసటి రోజు నుంచీ నేను ఉపన్యాసం ఇవ్వాలి. వారం రోజుల కోర్సు అది. యూనియన్ లీడర్స్‌కీ, మానేజ్‌మెంట్‌కీ వ్యక్తిత్వవికాస కోర్సు చెప్పటం కోసం ఆ కంపెనీ వాళ్ళు నన్ను పిలిపించారు.

నేను ఇచ్చే ఉపన్యాసానికి ఎలాంటి వాళ్ళు హాజరవబోతున్నారో నిర్వాహకులు నాకు వివరించారు. అందులో ముఖ్యుడు 'ఎడ్‌భీమ్'. ఇతడు ఒక పెద్ద సంస్థలో లక్షల మంది కార్మికుల్ని తన చిటికెన వేలి మీద ఆడించే యూనియన్ లీడర్.

మరుసటి రోజు అతడిని చూసాను.

చాలా గంభీరంగా, ఆరున్నర అడుగుల ఎత్తులో ఆజానుబాహువులా వున్నాడు. మొహం మీద చిరునవ్వు లేదు. లక్షల మంది కార్మికులు ఒకవైపు, దృఢమైన యాజమాన్యం మరో వైపు నిలచి – అతడికా కర్కశత్వాన్ని ఆపాదించి వుంటారు.

నన్ను సభకి పరిచయం చేయటానికి అతడినే నియమించారు. అతడు చాలా క్లుప్తంగా, తన బొంగురు గొంతుతో అన్నాడు. "ఈయన వారం రోజులపాటు మనకి వ్యక్తిత్వం గురించి నేర్పుతారు. ఇంతకాలం మనకి లేనిదేదో చెపుతార...ట! నేర్చుకుందాం" క్లుప్తంగా అంటూ వెళ్ళి తన సీటులో కూర్చున్నాడు.

నేను నవ్వి అతడికి థాంక్స్ చెప్పాను.

ఆ వారం రోజులూ అతడు అందర్లాగే విన్నాడు. అప్పుడప్పుడు అసహనంగా కదలటం గమనించాను. అయితే ఆ అసహనం నా ఉపన్యాసాల 'బోర్' వల్ల వచ్చింది కాదని నాకు తెలుసు. అతడిలో ఎక్కడో ఏదో కదుల్తోంది.

దాదాపు మూడు సంవత్సరాల తరువాత మళ్ళీ అదే కంపెనీ నన్ను పిలిచింది. ఎడ్‌భీమ్ కూడా అలాగే అక్కడే వున్నాడు. బ్యాచ్ మాత్రం వేరే.

నేను కోర్సు ప్రారంభించబోతూండగా ఎడ్ లేచి "జో... ఈ కొత్త బ్యాచ్‌కి నేను రెండు నిమిషాలు ఉపోద్ఘాతం చెప్పొచ్చా" అని అడిగాడు.

"తప్పకుండా–" అన్నాను ఆశ్చర్యం అణుచుకుంటూ.

అతడు సభ్యులవైపు తిరిగి, "... నేనెవరో మీకందరికీ తెలుసు. నాకు జరిగిందేదో మీకు తెలియాలని నా ఉద్దేశ్యం. నేను చాలా కఠినమైన నిర్ణయాలు తీసుకుంటానని, గంభీరంగా వుండటం వల్లనే గౌరవం అనేది కలుగుతుందని నమ్మేవాడిననీ కూడా మీకు

తెలుసు. ఈ కఠినత్వం పొర క్రింద, మనిషి తాలూకు అహం, ఆత్మన్యూనత, ఒకరకంగా చెప్పాలంటే పిరికితనం దాగి వుంటాయి అని మూడు సంవత్సరాల క్రితం (నన్ను చూపించి) ఈయన చెప్పారు. ఆ రాత్రంతా అదే ఆలోచించాను. గత పాతికేళ్ళలో నా భార్యతో నేను '...ఐ లవ్యూ' అని చెప్పలేకపోవటానికి కారణం ధైర్యం లేకపోవటమా? పిరికితనమా? మొహమాటమా? అహమా? గంభీరమా?" అంటూ ఒక సెకను ఆగాడు.

...సభలో సూదిపడితే వినపడేటంత నిశ్శబ్దం వ్యాపించింది. నేను కూడా ఆశ్చర్యంగా వినసాగాను. ఎడ్ కొనసాగించాడు. "...నువ్వు నీ భార్యని నిజంగా ప్రేమిస్తే ఈ మాట బెడ్‌రూమ్‌లో రాత్రి పూట కాకుండా, మామూలుగా ఏ కాఫీ తాగే టైమ్‌లోనో ఆమెతో చెప్పగలగాలి, అన్నారు. నేను పేపరు చదువుతుండగా ఆమె కప్పు తీసుకుని ముందు హాల్లోకి వచ్చింది. నేను గొంతు సవరించుకుని ఏదో గొణిగాను.

ఆమె కళ్ళెత్తి నా వైపు చూసి "ఏమన్నారూ" అంది.

తడబడి "ఏం లేదు" అన్నాను.

మనసులోని ఒక చిన్న మాట చెప్పటానికి నేనెందుకింత మొహమాటపడుతున్నానో తల్చుకుంటే నాకే ఆశ్చర్యమూ సిగ్గూ కలిగాయి... నా భార్య కప్పు తీసుకుని వెనుదిరిగింది.

నేనొక నిర్ణయానికి వచ్చినట్లు – పేపరు నేలమీద పడేసి, ఆమెని పేరు పెట్టి పిలిచి, వెనుదిరగ్గానే "...ఐ లవ్యూ" అన్నాను.

నేనేం చెప్పానూ అన్నది ఆమెకో క్షణం అర్థం కాలేదు. ఆమె కళ్ళ వెంట నీళ్ళు జలజలా రాలాయి. దగ్గరగా వచ్చి 'ఎడ్... నేనూ నిన్ను ప్రేమిస్తున్నాను. కానీ మనిద్దరం ఈ మాట చెప్పుకుని పాతిక సంవత్సరాల పైగా కాలేదూ?' అంది.

ఆ తరువాత మా ఇద్దరి మధ్యా చాలాసేపు సంభాషణ జరిగింది. ఇంతకు ముందు జరిగిన వాటికీ దీనికీ తేడా వుంది. ప్రేమ అన్నది 'టెన్షన్'కి వ్యతిరేకంగా ఎంత బలంగా పనిచేస్తుందో అర్థమైంది.

ఆ టైమ్‌లో వెంటనే ఎందుకో నా పెద్ద కొడుకుతో మాట్లాడాలనిపించింది. న్యూయార్క్‌లో ఉంటాడు వాడు. బాగానే ఉంటాం గానీ మేమిద్దరం ఎప్పుడూ ఒకరితో ఒకరు సరిగ్గా మాట్లాడుకోము. వాడికి ఫోన్ చేసి "నేనీ మాట చెప్పగానే నువ్వు ఏమనుకుంటావో నాకు తెలుసు. 'మందు' ఫుల్‌గా కొట్టి అన్నాననుకుంటావు. అటువంటిదేమీ లేదు, మామూలుగానే చెప్తున్నాను, నువ్వంటే నాకు చాలా ఇష్టంరా కన్నా!!" అన్నాను.

కొంచెం నిశ్శబ్దం తర్వాత వాడన్నాడు "– ఆ విషయం నాకు తెలుసు డాడీ. కానీ నువ్వు చెప్పటం ఇంకా చాలా బాగుంది."

ఆ తరువాత మేము కొంచెం సేపు సంభాషించుకున్నాము. ఆ రాత్రి నాకు చాలా బాగా అనిపించింది. ఏవో తలుపులు తెరుచుకున్న ఫీలింగు కలిగింది. యూనియన్లు, మానేజ్‌మెంట్లు, బల ప్రయోగాలు, కండరాలు – వీటితో గెలిచినప్పుడు కూడా అంత బాగా అనిపించలేదు. అయితే, నా భార్యతోనూ కొడుకుతోనూ మాట్లాడటం – ఇదంతా నేను ఒక ఎమోషన్‌లో తాత్కాలిక ఆవేశంలో చేసానా అనిపించి నాకు నేను ఒక పరీక్ష పెట్టుకున్నాను" అంటూ నా వైపు చూపించాడు.

"... ఈ సైకాలజిస్ట్ మళ్ళీ మన దగ్గర ఉపన్యాసం ఇవ్వటం కోసం రావటానికి ఏ రెండు మూడు, సంవత్సరాలో పడుతుంది. అప్పటికి కూడా నేనీ మాట నా భార్యా పిల్లలతో చెప్పగలిగితే, నాది తాత్కాలిక ఆవేశం కాదన్నమాట...! అలా నిశ్చయించుకుని ఆ రాత్రి నిద్రపోయాను. ఈ గత మూడేళ్ళలో నేను ఆయన సూచించిన అన్ని పుస్తకాలు చదివాను. ఫలితం...? ఫలితం...?" ఆగి అందరి వైపు చూసాడు. అందరూ అతనేం చెప్తాడా అని చూస్తున్నారు.

"... పాతిక సంవత్సరాల వైవాహిక జీవితంలో 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను' అని భార్యతో ఒక్కసారి కూడా చెప్పలేక, నాకు పరీక్షపెట్టుకున్న నేను – ఈ క్షణంలో మైక్‌లో ఈ మాట గర్వంగా చెప్పగలుగుతున్నాను. మీరంతా నన్ను పిచ్చి వాడనుకున్నా సరే, నేను నా భార్యనీ నా కుటుంబాన్నీ ప్రేమిస్తున్నాను. నేను నా కార్మికుల్ని ప్రేమిస్తున్నాను. ప్రపంచాన్ని ప్రేమించటం నేర్చుకుంటున్నాను. ఈ మాట చెప్పటానికి సిగ్గు పడటం మానేసాను."

అతడి మాటలు పూర్తి కాలేదు. ముందొకరు చప్పట్లు కొట్టారు. ఆ తరువాత సభ కరతాళ ధ్వనుల్తో నిండిపోయింది. ఎడ్ నావైపు తిరిగి, "ఇక మీరు మీ కార్యక్రమం మొదలు పెట్టుకోవచ్చు–" అన్నాడు.

*(విజయంలో భాగస్వామ్యం)*

# మూడ్

మూడ్‌ని జయించడం అంత సులభం కాదు. కోపం, భయం, దుఃఖం మొదలైనవన్నీ మానసిక వైపరీత్యాలు. అవే మన ప్రవర్తనని నిర్దేశిస్తాయి. ఆత్మవిమర్శ ద్వారా సరిదిద్దుకోవడమే దీనికి ఏకైక పరిష్కారం.

ఎంతో బ్రతిమాలగా జానకి తన పన్నెండేళ్ళ కూతురు సౌమ్యని ఆమె స్నేహితురాలి ఇంట్లో ఒక్క రాత్రి గడపటానికి ఒప్పుకుంది. కష్టం మీద ఒప్పుకుందే తప్ప కూతురు వెళ్ళిన దగ్గర్నుంచీ ఆమె మనసు మనసులో లేదు.

వెళ్ళగానే ఫోన్ చేస్తానని సౌమ్య చెప్పింది. కానీ అక్కడ స్నేహితురాలి కబుర్లలో పడి ఆ పన్నెండేళ్ళ పిల్ల ఆ విషయం మర్చిపోయింది!

తల్లికి మొదట అలజడి ప్రారంభమయింది. చీకటి పడేకొద్దీ అది ఆందోళనగా మారింది. రాత్రయ్యే సరికి దుఃఖం వచ్చింది. అర్థరాత్రి అయ్యేసరికి ఆ నిస్సహాయత భరించలేనంత కోపంగా మారింది. ఆ సమయంలో ఫోన్ మోగింది. ఆమె చివాలున ఫోన్ ఎత్తి, "వెళ్ళగానే ఫోన్ చేస్తానన్నావ్. ఇక్కడ మీ అమ్మ చచ్చిందనుకున్నావా?" అని అరిచింది.

అట్నుంచి "అది గవర్నమెంటు హాస్పటల్ కాదాండీ" అని ఎవరో అడిగారు.

ఆమె కోపం చెలియలికట్ట దాటి, రిసీవర్ విరిగిపోయేట్టు పెట్టేసింది.

అయిదు నిమిషాల తర్వాత మళ్ళీ ఫోన్ మోగింది. ఆమె విసుగ్గా "హల్లో" అంది.

అట్నుంచి మళ్ళీ "ఇది గవర్నమెంట్ హాస్పటల్ కాదాండీ?" అని వినిపించింది.

"కాదు. ఎన్నిసార్లు చెప్పాలి?" అని తారాస్థాయిలో అరిచింది.

అట్నుంచి ఆ అబ్బాయి "మీరు చెప్పలేదు కదండీ" అన్నాడు.

ఆమె అపరాధభావంతో మరింత గట్టిగా "సరే, ఇప్పుడు చెప్తున్నాను. పెట్టెయ్యి" అంది కటువుగా.

అట్నుంచి "... బయటెక్కడా మా అమ్మ గ్రూపు బ్లడ్ దొరకటం లేదండీ, ఆస్పత్రిలో వున్న మా నాన్నకి చెప్పాలి. ఎలా?" అని అబ్బాయి దీనంగా అడిగాడు. ఆమె కోపం ఒక్కసారిగా దిగిపోయింది. వళ్ళంతా చల్లబడినట్లు అనిపించింది. తనమీద తనకే కోపం వచ్చింది. సిగ్గేసింది. టెలిఫోన్ డైరెక్టరీ లాక్కుంటూ, "ఒక్క నిమిషం ఉండు బాబూ. ఆస్పత్రి కరెక్టు నెంబరు చెప్తాను" అంది.

*(విజయానికి ఆరో మెట్టు)*

# సంతోషం - సుఖం

ఒకసారి బెర్నార్డ్‌షా ఒక పార్టీకి వెళ్లాడట. ఆ పార్టీలో అందరూ డాన్స్ చేస్తుండగా అతను మాత్రం కామ్‌గా, దూరంగా కూర్చున్నాడు.


ఒక స్త్రీ ఆయనను "మీకు డాన్స్ చేయడం ఇష్టం ఉండదా?" అని ప్రశ్నించింది.

"నాకిష్టమే, చాలా ఇష్టం. కానీ ప్రస్తుతం నేను రాయబోతున్న ఒక పుస్తకం గురించి ఆలోచిస్తున్నాను" అన్నాడు షా.

ఆమెకు సమాధానం అర్థంగాక "డాన్స్ చేస్తూ కూడా ఆలోచించవచ్చు కదా" అంది.

"అవును. కానీ నేను అలా చేయదల్చుకోలేదు" అని షా అన్నప్పుడు ఆమె కొద్దిగా హేళన మిళితమైన స్వరంతో "మీకు జీవితాన్ని ఎలా ఆనందించాలో తెలీదు" అని వెక్కిరించింది.

షా కూడా నవ్వేసి ఇలా వివరణ ఇచ్చాడు. "నాకు వ్రాయడం కన్నా డాన్స్ అంటేనే ఎక్కువ ఇష్టం. ఎందుకంటే డాన్స్ చేయడంలో వున్న 'కిక్' రాయడంలో లేదు. **నాట్యం చేయడంలో తాత్కాలిక మత్తు వుంటే, రాయడంలో ధనము, కీర్తి, అన్నిటికన్నా ముఖ్యంగా శాశ్వత సంతృప్తి వున్నాయి.** తాత్కాలిక కిక్‌లిచ్చే ఆనందాలవైపు ఒక్కసారి వెళితే, శాశ్వత ఆనందాలనిచ్చే పనులను మళ్లీ చేయలేను" అన్నాడు.



*(విజయరహస్యాలు)*

# లై డిటెక్టర్



ఎప్పుడైతే మనం ఒక అబద్ధం చెప్పామో మానసికంగా బలహీనులమౌతాం. ఆ తప్పు మరో తప్పుని చేయిస్తుంది.

దొంగల్ని లై డిటెక్టర్స్ (అబద్ధం చెప్తే కనుక్కునే మిషన్స్)తో పరీక్షిస్తారు. ఒక దొంగకి ఈ సాధనం మీద నమ్మకం లేదు. నమ్మకం లేని దొంగల నుంచి ఇటువంటి సాధనాల ద్వారా నిజం చెప్పించడం కాస్త కష్టం. పోలీసులు ఈ విధంగా ప్రశ్నించారు. “నీకెన్ని వివాహాలు జరిగినయ్?”

“ఒకటి” అన్నాడు దొంగ. వెంటనే ఆ మిషన్ అబద్ధం చెప్పినట్లు సూచించింది.

దొంగ నిర్ఘాంతపోయాడు.

“నీ భార్య తండ్రి కూడా దొంగే కదూ.”

“నాకు తెలియదు” అన్నాడు అతను.

మళ్ళీ అబద్ధం చెబుతున్నట్లు మిషన్ సూచించింది. అలా పది ప్రశ్నలు వేసేసరికి దొంగకి తాను ఆ మిషన్ దగ్గర నిజం దాచలేనని తెలిసిపోయింది. తాను చేసిన నేరం ఒప్పుకున్నాడు.

నిజానికి వాళ్ళు పెట్టింది లై డిటెక్టింగ్ మిషన్ కాదు. ఆ దొంగ భార్యని కొన్ని ప్రశ్నలు వేసి విషయాలు రాబట్టారు. ఆ విధంగా వాళ్ళు దొంగని దొంగ దెబ్బ తీసారు.

*(విజయానికి ఆరో మెట్టు)*

# గతమొక గర్వం

చాలా పెద్ద వర్షం రావడంతో ఒక తాత, అతని మనవడు ఓ పాడుబడ్డ దేవాలయంలో తల దాచుకుంటారు. అక్కడ వాళ్ళకొక శిలాఫలకం కనబడుతుంది. అందులో ఇలా రాసి వుంటుంది.

"ఏ వయసులో వున్నవారైనా సరే, ఈ దేవాలయం ఎదురుగా వున్న కొలనులో మునిగి, మూడుసార్లు ఇష్టదైవాన్ని ధ్యానించి పైకి లేస్తే, మళ్ళీ పదేళ్ళ వయసు పిల్లలుగా మారిపోతారు."

ఆ శిలాఫలకాన్ని చదివిన మనవడు చాలా ఉత్సాహంగా తాతయ్యకు చూపించి కొలనులో మునిగి, పసివాడుగా మారమని చెబుతాడు. అప్పుడు వాళ్ళ తాతయ్య ఇలా అంటాడు–

"నేను చిన్నప్పుడు చాలా అందంగా వుండేవాడిని. మా రోజుల్లో నేనూ, మా స్నేహితులు ఎంతో సరదాగా కాలం గడిపేశాం. ఆ అనుభవాలు గుర్తొచ్చినప్పుడల్లా నాకు ఎంతో ఆనందంగా అనిపిస్తుంది" అంటూ కొనసాగించాడు. "తినడానికి తిండిలేనప్పుడు ఎంతో కష్టపడి సంపాదించేవాడిని. నా కృషితో సంపన్నుడినయ్యాను. అప్పుడే మన దేశంలో స్వతంత్రం కోసం పోరాటం జరుగుతోంది. నేను కూడా గాంధీగారితో కలిసి తిరిగాను. జైళ్ళకు ఉత్సాహంగా వెళ్ళేవాళ్ళం. లాఠీదెబ్బలు తిన్నరోజు కూడా వందేమాతరం పాడుకునేవాళ్ళం. ఉప్పు కూడా ఓ సమస్యగా మారిన రోజు, సముద్రం దగ్గర ఉప్పు వండాము. ఒక సమస్య, దానికి పరిష్కారం... అలాగే స్వతంత్రం వచ్చింది. ఏదో త్యాగం చేసి కోల్పోయామన్న భావన లేదు. అలా నిస్వార్థంగా, ప్రేమగా బ్రతికిన వాళ్ళతో తిరిగాను. నా మనసు నిండా ఆ అనుభూతులే చోటు చేసుకున్నాయి. ప్రతి జ్ఞాపకం నాకు సంతోషాన్ని కలిగిస్తుంది. ఎంతో ఆనందంగా జీవించిన నేను, సంతృప్తిగా మరణించాలని అనుకుంటున్నాను. ఇప్పుడు పదేళ్ళ పిల్లవాడిగా మారి నేను సాధించేది ఏముంటుంది? నా జీవితంలో ప్రతీ అనుభవమూ నాకు ఒక గొప్ప అనుభూతే. నా ప్రతీ ఓటమీ నా విజయానికి ఒక మెట్టు. నా నిద్రలేని రాత్రులన్నీ ఒక విజయపూరితమైన ప్రణాళిక కోసం ఆలోచిస్తూ గడిపిన రాత్రులే."

*(విజయంవైపు పయనం)*


# కారులో జోరీగ

"ఒకరోజు నేను చాలా పెద్ద సమస్యలో వున్నాను. విసుగ్గా వచ్చి కార్లో కూర్చొని స్టార్ట్ చేయబోతూ వుండగా లోపల ఒక జోరీగని చూసాను. అది కిటికీ ముందు వున్న అద్దం దగ్గిర పెద్ద శబ్దంతో తిరుగుతూ బయటకు వెళ్ళటానికి ప్రయత్నం చేస్తోంది. నా విసుగు మరింత ఎక్కువైంది. పక్కకి వంగి, అటువైపు అద్దం దింపాను. నేను దాని వైపు వంగటంతో అది నా వెనుక కిటికీ దగ్గరికి వచ్చి గోల చెయ్యసాగింది. అటు కూడా తెరిచాను. కొంచెంసేపటికి నా కారు నాలుగు అద్దాలూ తెరవబడినాయి. జోరీగ మాత్రం లోపలే వుంది.

ఈసారి అది స్టీరింగ్ పైన ముందు వైపు అద్దం ద్వారా బయటికి వెళ్ళటానికి ప్రయత్నం చేస్తోంది. అద్దాన్ని బలంగా కొట్టి వెనక్కి పడిపోతోంది. మళ్ళీ అక్కడికే వెళ్తోంది. నిశ్శబ్దంగా దాన్నే చూస్తూ కూర్చొన్నాను. కాస్త వెనక్కో పక్కకో చూస్తే, తెరచి ఉన్న దార్లు కనపడేవి. కానీ, అది గట్టిగా తన ప్రయత్నమే చేస్తోంది.

నా సమస్యకి పరిష్కారం ఇంతకాలం ఎందుకు దొరకలేదో నాకు అర్థమైంది.

మనందరం చాలా కష్టపడి పని చేస్తూ ఉంటాం. అయినా ఒక్కోసారి ఫలితం రాదు. విసుగ్గా వుంటుంది. 'మిగతా వారందరూ చాలా సుఖంగా వున్నారే. ఇంత కష్టపడినా మనకి ఫలితం రావటం లేదేమిటి?' అనుకుంటూ వ్యాకులం (Depress) చెందుతాం. పరిష్కారమార్గం వెతక్కుండా జోరీగలా అక్కడే తిరుగుతూ ఉంటాం. చేస్తున్న పని మానెయ్యటమో, ఆ విసుగులో ఏదో తప్పు చెయ్యటమో చేస్తాం.



*(విజయానికి ఆరో మెట్టు)*

# ప్రమాదం

జీవితంలో ప్రమాదాలు సహజం. కష్టాలు వచ్చినప్పుడు ప్రతి మనిషీ విలవిలలాడుతాడు. అయితే, ఎంత తొందరగా నిలదొక్కుకుని తిరిగి తన కర్తవ్యాన్ని నిర్వర్తించడానికి సిద్ధపడతాడు – అనేది, ఆ మనిషి తాలూకు మనఃస్థైర్యం మీద ఆధారపడి ఉంటుంది. దానికి సంబంధించిన ఒక యథార్థ సంఘటన.

"రాత్రి పన్నెండు కావొస్తూంది. గుంటూరు ప్లాట్‌ఫాం రష్‌గా వుంది. S-11 కోచ్ నాది. గుమ్మం దగ్గిర జనం అడ్డుగా వున్నారు. సామాన్లు ఎలాగో లోపల పెట్టగలిగాను. ఆఖరి వ్యక్తిగా నేను ఎక్కుతూ వుండగా రైలు కదిలింది. గుమ్మం దగ్గిర రాడ్‌ని పట్టుకున్న నా చెయ్యి కాస్త జారింది.

నా పైన రైలు వెళ్తూ వుండటం తెలుస్తోంది. 'ఎవరో క్రింద పడ్డట్టున్నారు. చైన్ లాగండి' అన్న కేక వినపడింది. నా మీదుగా రైలు పెట్టె క్రింది భాగాలు కదలటం భయంకరంగా వుంది. నా మనసులో ఒకటే భావం. 'నువ్వు మాత్రం కదలకు. అదృష్టవశాత్తు నీకేమీ కాలేదు. కదిల్తే మాత్రం ఏదైనా జరగొచ్చు.'

రైలాగింది. రెండు పెట్టెల నడుమ పట్టాల మధ్యలో నేనున్నాను. ఒక ప్రయాణీకుడు బిగ్గరగా 'చచ్చినట్టున్నాడు. రైలు కాస్త ముందుకు పోనివ్వండి' అంటున్నాడు తొందరగా ఊరు వెళ్ళిపోవాలన్న ఆతృతతో. అప్పుడు నేను సర్వశక్తులూ కూడగట్టుకుని అరిచాను. 'నేను బ్రతికే వున్నాను' అని.

నా మాటలు ఎవరికయినా వినిపించాయో లేదో తెలీదు కానీ, నాకు క్రమంగా మైకం కమ్మేసింది. స్ట్రెచర్ మీద ఎక్కిస్తూండగా నేనన్న ఆఖరి మాట, "నా బ్యాగులు కంపార్ట్‌మెంట్‌లో వున్నాయి S-11".

.... నాకు స్పృహ వచ్చేసరికి గుంటూరు ఆస్పత్రిలో వున్నాను. అదొక తిరణాలలా వుంది. రోగులు ఎక్కువై డాక్టర్లు తక్కువయితే ఎలా వుంటుందో, వాడేవారు ఎక్కువై శుభ్రం చేసేవారు తక్కువయిన బాత్‌రూమ్ ఎలావుంటుందో అలా వుంది.

నాకు స్పృహ రావటం గమనించి, టించర్ రాస్తున్న డాక్టర్ "మీకేం పర్వాలేదు. బాగానే వున్నారు. తెలిసిన వారి పేర్లు, ఫోన్ నెంబర్లు చెప్పండి" అన్నాడు. నా స్నేహితుడు, ప్రముఖ రచయిత కేతు విశ్వనాథరెడ్డి ఫోన్ నెంబరు జేబులో ఉంది. తీద్దామని చెయ్యిపెట్టబోతే...

చెయ్యిలేదని తెలిసింది.

ఎవరిమీదో తెలియని కసి డాక్టర్‌పై కోపంగా మారింది. 'చెయ్యి పోతే ఏమీ పర్వాలేదంటా రేమిటి?' అన్నాను.

'ప్రాణం పోలేదు. అందుకు సంతోషించండి. కాలూ చెయ్యీ పోయినా బ్రతకటం మీ అదృష్టం.'

అప్పుడు తెలిసింది నా ఎడమకాలు కూడా దెబ్బతిందని.

ఎవరో ఇచ్చిన పాలిథిన్ పేపర్లో నా చెయ్యి ఐస్‌లో పెట్టి ఆస్పత్రికి తీసుకొచ్చారట. డాక్టర్ వెళ్ళిపోయాడు. నేనూ... దూరంగా నా చెయ్యి...నిశ్శబ్దంగా మిగిలాము.

❦ ❦ ❦

సగం ప్రాణాల్తో వ్యాన్‌లో రాత్రికి రాత్రి నన్ను హైదరాబాద్ తీసుకొస్తున్నారు. నా చెయ్యి, నా పక్కనే ఐస్‌లో వుంది. మా ఇంట్లో ఈ విషయం చెప్పవద్దనీ, చిన్న ఆక్సిడెంట్ మాత్రమే జరిగినట్టు చెప్పమనీ చెప్పాను. నా భార్య చాలా సెన్సిటివ్.

నాకు రెండు సార్లు ఏంజియోప్లాస్టీ జరిగింది. పైగా డయాబెటిక్. అందుకని త్రాగటానికి నీళ్ళు ఇవ్వకూడదట. ఇస్తే మైకంలోకి వెళ్ళి ఇక బయటకి రానట. ట్రాఫిక్ జామ్స్‌వల్ల హైద్రాబాద్ పొలిమేరల్లోకి వచ్చేసరికి మధ్యాహ్నం కావొస్తోంది. శివార్లలో 'కామినేని హాస్పిటల్స్' బోర్డులు కనపడ్డాయి. నాకు ఒకటే దాహం. తట్టుకోలేక "నాకు ఒక ఫ్లాట్ వుంది. అవసరమైతే అది అమ్మేస్తాను. ఇక్కడ నా ట్రీట్‌మెంట్‌కు సందేహించకండి" అన్నాను.

నా చెయ్యీ, కాలూ పనికి రావన్నారు. నేనిక ఒంటి కాలితో, ఒక చేత్తో బ్రతకాలని అర్థమైపోయింది.

మొత్తం రెండు లక్షలదాకా ఖర్చయింది. ఖర్చును మా సంస్థే భరించింది. అంతేగాక నా తోటి ఉద్యోగులు, ప్రచురణకర్తలు, రచయితలు ఎంతో సహాయపడ్డారు. ఆస్పత్రిలో దాదాపు నలభై రోజులు ఉన్నాను. కాస్త తేరుకుంటూ ఉండగా, మేనేజిమెంట్ ప్రతినిధులు నా దగ్గరికి వచ్చారు. ఒక పెద్ద సంస్థ మాది. ఆ బాధ్యతల నుంచి నన్ను తప్పించాలన్న సందిగ్ధావస్థలో వారు ఉన్నారన్న విషయం తరువాత నాకు తెలిసింది.

❦ ❦ ❦

నేను ఆస్పత్రిలో ఉన్నప్పుడు కూడా నా సూచనల (ఆస్పత్రి నుంచి) మేర సంస్థ పనులు యథావిధిగా జరిగిపోతూ ఉండటం, ముఖ్యమైన నిర్ణయాలు ఆఫీసు కొచ్చిన తరువాత తీసుకుంటానని నేను చెప్పటం, బహుశ వారికి నామీద నమ్మకం కలుగచేసి ఉంటుంది.

ఇప్పుడు నాకొక విషయం అర్థమైంది. ఒంటిచేత్తో, ఒక కాలితో నేను ఈ వయసులో మరే వృత్తీ చేపట్టలేను. నా సంస్థని అభివృద్ధి చేయటానికి నా ఒక మెదడు, ఒక చెయ్యి, ఒక కాలు చాలు. ఇప్పుడు ముఖ్యంగా కావలసింది – నన్ను నేను నిరూపించుకోవటం...!

ఈ ఆలోచన నాకు కొత్త స్ఫూర్తినిచ్చింది. మరింత శ్రద్ధతో పని చేయటం ప్రారంభించాను. నాకు జీవితం పట్ల అవగాహన పెరిగింది.

విధి నాతో ఆడుకుంది. నేను దాన్ని జయించాను.

రైలు చక్రాల క్రింద పడిన క్షణం నుంచీ, ఆస్పత్రి నుంచి బయటపడే వరకూ నన్ను ధైర్యంగా నిలబెట్టిన ఒక పుస్తకం – ప్రేమ్‌చంద్ 'రంగభూమి'. అదొకటే కాదు. నేను చదివిన పుస్తకాలే ఆ క్షణంలో నాకు శక్తినిచ్చాయి.


మా అమ్మకాలు ప్రస్తుతం పెరగటానికి కారణం **నా ఎడమ చెయ్యి, కాలుల మీద చూపించ వలసిన శ్రద్ధ కూడా నా వృత్తి మీదే పెట్టగలిగే వెసులుబాటు నాకు దొరకటమే** అని నేను భావిస్తున్నాను."

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ రాజేశ్వరరావు జీవితంలో సంభవించిన యథార్థ సంఘటన ఇది. వళ్ళు గగుర్పొడిచే ఈ సంఘటన జరిగిన తరువాత ఆయన మానసికంగానూ, వృత్తిలోనూ ఎలా ఎదిగారో, ఆయన పరిచయస్థులందరికీ తెలుసు.



*(విజయానికి ఆరో మెట్టు)*

# కక్కుర్తి



ఒక విలుకాడు అడవిలో ఒక లేడిని చంపబోయాడు. అదే సమయానికి పాముకాటు వేసింది. అతడు మరణిస్తూ కత్తితో పాముని చంపేశాడు. అతడు వదిలిన బాణం లేడికి తగిలే లోపులో ఒక పులి దాని మీదకు దూకి, పంజా విసిరింది. లేడి చచ్చింది. బాణం పులికి తగిలి అది నేల కూలింది. ఆ బరువుకి క్రింద వున్న కుందేలు మరణించింది.

అంతలో అటువైపుగా ఒక నక్క వచ్చింది. అయిదు శవాల్ని చూసి, పండగే అనుకుంది. వేటగాడు, పాము, లేడి, పులి, కుందేలు...! వీటిలో దేన్ని ముందు ఆరగించాలో అర్థం కాలేదు. మనసారా మరుసటి రోజు నుంచి విందు ఆరగిద్దామనుకుని, ఆ రోజుకి వింటి నారితో సరిపెట్టుకుందామనుకుంది. దాన్ని కొరగ్గానే, విల్లు ఉవ్వెత్తున లేచి నుదుటికి తగిలి అది మరణించింది. ఇది ఒక పంచతంత్ర కథ.

లంచాలు తీసుకుంటూ పట్టుబడిన వాళ్ళ ఇళ్ళల్లో కోట్ల కొద్దీ విలువ చేసే నగలూ, బంగారం దొరకడం గమనిస్తూనే ఉన్నాం. బయటకి చూపిస్తే పోలీసులు ఎక్కడ అరెస్టు చేస్తారో అన్న భయంతో కక్కుర్తిపడుతూ జీవించే లంచగొండులు, రిటైరు అయ్యాక జీవితపు ఆఖరి రోజుల్లో అన్నీ అనుభవిద్దామని అనుకుంటారు. అప్పటికే అనారోగ్యం పాలయి ఖాళీ చేతులతో స్వర్గానికి వెళ్ళిపోతారు. మరికొందరు శేషజీవితం జైలులో అనుభవిస్తారు. స్వంత సుఖానికన్నా మించిన ఆస్తులు సంపాదించి భావితరాలను నాశనం చేయడం తప్ప సాధించేది ఏమీ ఉండదు.

*(మైండ్ పవర్ నెం. 1 అవటం ఎలా ?)*

# విజయానికి పైప్ లైను

ఒక ఇంగ్లీషు పుస్తకంలో కథ ఇది.

చాలాకాలం క్రితం పాబ్లో, బ్రూనో అనే ఇద్దరు యువకులు వుండేవారు. ఇద్దరూ కష్టపడి పని చేసేవారే. కానీ చాలాకాలం వరకూ వారికి అవకాశం రాలేదు.

ఒకరోజు పల్లెటూర్లో గ్రామస్థులు అందరూ కలిసి, దూరంగా కొండ మీద ఉన్న చెరువు నుంచి ఊరి మధ్యనున్న స్టోరేజి టాంక్‌కి ప్రతిరోజూ నీరు నింపటానికి ఇద్దరు వ్యక్తులు కావాలనుకున్నారు. ఈ ఇద్దర్నీ పిలిచి, పని అప్పగించారు.

ప్రొద్దున్నే ఇద్దరూ రెండు బకెట్లు పట్టుకుని చెరువు దగ్గిరకి వెళ్ళారు. అక్కడ నుంచి నీరు తెచ్చి ఊరిమధ్య టాంక్‌లో పోయాలి. సాయంత్రానికి టాంక్ నిండింది. గ్రామపెద్ద ఇద్దరికీ ఆ రోజు కూలీగా చెరొక అయిదొందలూ ఇచ్చాడు.

అయిదొందలు...!

"మన కలలు నిజమయ్యాయి" ఆనందంగా అన్నాడు బ్రూనో. "నేను ఇంత అదృష్టం కలుగుతుందనుకోలేదు. రోజుకి అయిదొందలు..." ఉద్వేగంతో పరవశించాడు.

కానీ పాబ్లో అంత సంతోషంగా లేడు. అప్పటికే ఇద్దరికీ కొండ ఎక్కడం వల్ల కాళ్ళు, బకెట్లు మోయటం వల్ల చేతులు నొప్పి పెడుతున్నాయి. ఆ రాత్రంతా ఆలోచనల్తో అతడికి నిద్రపట్టలేదు. ప్రొద్దున్నే స్నేహితుడితో చెప్పాడు. "బ్రూనో! నాకో ఆలోచన తట్టింది. చెరువునుంచి ఊరికి ఒక పైప్ లైన్ వేద్దాం. ఆ తరువాత మనం ఇలా కష్టపడనవసరం లేదు".

బ్రూనో అదిరిపడి చూసాడు. "ఇద్దరం కలిసి పైప్ లైన్ తవ్వుదామా? నీకేమయినా మతిపోయిందా? రోజుకి మనకి అయిదొందలు ఇస్తున్నారు తెలుసా? అ...యి...దొం...ద...లు!! వారం పూర్తయ్యేసరికి నేను కొత్త చెప్పులు కొనుక్కుంటాను. కొత్త బట్టలు, పార్టీలు... మొత్తం నా జీవితానికి స్థిరత్వం లభించింది."

అయితే పాబ్లో తన ఆలోచన మానుకోలేదు. ప్రతి శని, ఆదివారాలు పూర్తిగా పైపులైను తవ్వే పనికే వినియోగించేవాడు. బకెట్లు మోసే పని లేనప్పుడు చెరువు దగ్గరే గడిపేవాడు. రాతినేలని తవ్వటం చాలా కష్టంగా వుండేది. గెడ్డం పెరిగింది. అరచేతులపై చర్మం కొట్టుకుపోయింది. అయినా అతడు తన కలని నమ్మేవాడు. ఊరి జనం అతడిని "పాబ్లో – ది పైప్‌లైన్ మాన్" అని వెక్కిరించేవారు.

మరోవైపు బ్రూనో జీవితం పచ్చగా సాగుతోంది. గ్రామస్థులు అతడిని గౌరవంగా "మిస్టర్ బ్రూనో" అని పిల్చేవారు. అతడు వారాంతాల్లో పార్టీ ఇచ్చేవాడు. అతడి జోకుల

కోసం ఊరి జనం పడిచచ్చేవారు. అతడలా హాయిగా గడుపుతూ వుంటే, పాబ్లో కొండరాళ్ళ మధ్య కాలువ తవ్వేవాడు. అతడికి కష్టంగానే ఉండేది కానీ, తన వెన్ను తనే తట్టుకునేవాడు. "... కొందరే అధిపతులు. అడుగులేస్తూ అలసిపోనివాళ్ళు" అనుకుంటూ, సుదూర తీరాల్లో వున్న కలల దీపాన్ని వూహించుకునేవాడు. దాంతో కష్టం యొక్క సాంద్రత తగ్గేది. **చేస్తున్న పనిలో ఇష్టం వున్నప్పుడు, అది అంత కష్టంగా అనిపించదు.**

ఆ విధంగా రోజులు నెలలు గడిచాయి. పైప్‌లైన్ సగం పూర్తయింది. అప్పుడతడొక అద్భుతమైన విషయాన్ని కనుక్కున్నాడు. నీటికోసం తనిక చెరువు వరకూ వెళ్ళనవసరం లేదు. ఊరి నుంచి సగం దూరం వెళ్తేచాలు.

ఆ విధంగా పని తొందర తొందరగా పూర్తి అవసాగింది. ఎక్కువ విశ్రాంతి దొరకటం ప్రారంభించింది. అప్పుడు గమనించాడు తన స్నేహితుడిని!

పరిశీలనగా చూస్తే బ్రూనో భుజాలు కృంగిపోయి ఉన్నాయి. పూర్వంలా నవ్వుతూ లేడు. జోకులు వెయ్యటం లేదు. చిరాగ్గా ఉన్నాడు. అతడికి పార్టీలిచ్చే ఓపికలేదు. అతడిని ప్రస్తుతం జనం "బ్రూనో–ది బకెట్ మాన్" అని పిలుస్తున్నారు.

చివరికి పైప్‌లైన్ పూర్తయింది. జివ్వున చిమ్ముకుంటూ స్టోరేజీ టాంక్‌లోకి చెరువు నీరు ధారగా పడుతూంటే గ్రామస్తులు హర్షధ్వానాలు చేస్తూ పాబ్లోని అభినందించారు. బ్రూనో కూడా స్నేహితుడిని ఏమాత్రం ఈర్ష్య లేకుండా కౌగిలించుకున్నాడు. ఆ నీటి వలన క్రమంగా ఆ గ్రామం హరిత భరితమయింది.

ఆ తరువాత ఇక పాబ్లోకి బకెట్‌లు మొయ్యవలసిన అవసరం రాలేదు. సమయం అతడి చేతిలో ఉండటం ప్రారంభించింది. అతడు నిద్రపోతున్నా, గోల్ఫ్ ఆడుతున్నా కూడా నీరు ప్రవహిస్తూనే వుంది. ఆ విధంగానే అతడి దగ్గరికి డబ్బు కూడా!

అయితే అతడు ఖాళీగా వుండటానికీ, విందులూ, వినోదాలతో కాలం గడపటానికీ ఇష్టపడలేదు. ప్రపంచంలోని గ్రామాలన్నిటినీ పైప్‌లైన్‌తో కనెక్ట్ చేద్దామనుకున్నాడు. బ్రూనోని వ్యాపారంలో భాగస్వామిగా తీసుకున్నాడు.

కొన్ని దశాబ్దాలు గడిచాయి. ఇద్దరూ వృద్ధులయ్యారు. కానీ వారి వ్యాపారం మాత్రం నిత్యయవ్వనంతో వున్నది. వారి సంతతి దాన్ని చూసుకుంటోంది.

*(విజయానికి ఆరో మెట్టు)*

# తాడు


చాలా కష్టాలకి మూల కారణం 'తాడు'. అవును నిజం. బంధమే మనని ఎన్నో విషాదాల వైపు తోసేస్తుంది. పద్నాలుగు ఏళ్ళ కొడుకుకి కారు బహుమతిగా ఇచ్చే ధనవంతులూ, 'తాము ఎన్ని కష్టాల్లో ఉన్నా, పిల్లవాడు మాత్రం బావుండాలి' అని వళ్ళు గుల్ల చేసుకునే తల్లిదండ్రులూ, ఈ బంధాలని కాస్త కంట్రోలులో ఉంచుకుంటే మరింత ఆనందంగా ఉండగలరు. ఆ విషయాన్నే ఈ క్రింది ప్రవక్త వివరిస్తాడు.

ఒక ప్రవక్త దగ్గరకు ఒక వ్యక్తి వచ్చి, "నా కొడుకు ఫలానా వస్తువు కావాలంటున్నాడు. నా దగ్గర అట్టే ధనం లేదు. వాడి బాధ చూసి నాకు దుఃఖం కలుగుతోంది. ఏం చెయ్యమంటారు?" అని అడిగాడట.

"నచ్చ చెప్పు. నీ స్థితి వివరించు."

"వాడు వినడు."

"వాడి ఖర్మకు వాడిని వదిలిపెట్టు."




"వాడు నా కొడుకు. వాడి బాధ చూస్తే నాకు దుఃఖమొస్తోందని చెప్పానుగా స్వామీ".

"నీ పక్కింటివాడి కొడుకు ఇదే కారణంగా బాధపడితే నీకు దుఃఖమొస్తుందా?" అని అడిగాడు స్వామి.

"ఛా... ఎందుకొస్తుంది? ఇది రక్త సంబంధం?" అన్నాడు ఆ వ్యక్తి.

"నీ తండ్రి రెండో భార్య మనవడు బాధపడితే?" అని తిరిగి ప్రశ్నించాడట ప్రవక్త.

"వాడెవడో నాకేమిటి సంబంధం?"

"వాడూ నీ కొడుకేగా... అదీ రక్తసంబంధమేగా."

సమాధానం లేదు.

*(మైండ్ పవర్ నెం.1 అవటం ఎలా ?)*

# ఆకాశానికి నిచ్చెన

ముందు కథా ఇదీ కూడా రెండు పాపులర్ అయిన ఇంగ్లీషు నవలల సారాంశాలు. క్లుప్తంగా చెప్పడం జరిగింది.

'సీగల్ అంటే పొట్టి రెక్కలున్న సముద్రపు కాకిలాంటి జంతువు. సముద్రపు ఒడ్డునే ఆహారం కోసం రెండు కాళ్ళమీద తిరిగే ఈ సీగల్ గుంపులో ఒకదాని పేరు "జొనాథన్ లివింగ్‌స్టన్".

ఆ సాయంత్రం డిన్నర్ అయ్యాక మిగతా సీగల్స్ అన్నీ హుషారుగా ఆ సముద్రాన ఇటూ అటూ తిరుగుతూ వుంటే, జొనాథన్ మాత్రం విపరీతంగా అలసిపోయి నిద్రకు జోగుతూ ఉండేవాడు. అయితే దానికి కారణం చాలాకాలం క్రితమే ప్రారంభం అయింది.

ఇసుక కొండల మీదకి ఎగిరి, ఆకాశం లోంచి సముద్రంలోకి నిలువుగా 'డైవ్' చెయ్యాలన్న ఆకాంక్షతో ఆ పక్షి ఎన్నో రోజులుగా ప్రయత్నిస్తోంది. ఫెయిల్ అవుతోంది.

ఇదంతా గమనించిన ముసలి నాయకుడు గుంపు మధ్యలో నిలబడి జొనాథన్‌ని క్షమాపణ చెప్పమన్నాడు.

"మనజాతికి వీలుకాని ఒక అసందర్భపు పని మొదలు పెట్టావు. మనం పేరుకి మాత్రమే పక్షులం. అంతే తప్ప సీగల్స్ ఆకాశంలో ఎగరటం అన్న ఆలోచన ఎవరికయినా వచ్చిందా? పైగా నిన్ను చూసి చిన్న పిల్లలు పాడయిపోతున్నాయి. దొరికింది తినటం మానేసి ఎగరటానికి వృథా ప్రయాస చేస్తున్నాయి. దీనికి నీ సంజాయిషీ ఏమిటి?" అని అడిగాడు.

అప్పుడా పొట్టి రెక్కల స్థూలకాయపు పక్షి ఈ విధంగా అన్నది. "ఒడ్డుకు కొట్టుకొచ్చిన చేప పిల్లల తలలు తినటం తప్ప కొన్ని వేల సంవత్సరాలుగా మనం మరేం చెయ్యలేదు. ఒక కొత్త విషయం కనుక్కోవటంలోనూ, మన బ్రతుక్కి అర్థం తెలుసుకోవటం లోనూ తప్పేముంది?"

"జాతిని చీలుస్తున్నావు నువ్వు" అన్నాడు నాయకుడు.

సీగల్స్ అన్నీ వెనక్కి తిరిగి వీపులు చూపించి హేళనగా నాట్యం చేస్తూ జొనాథన్‌ని బహిష్కరించాయి.

అప్పటి నుంచీ జొనాథన్ యజ్ఞం తిరిగి ప్రారంభం అయింది. రాత్రింబవళ్ళు సముద్రం మీదుగా ఎగరటానికి ప్రయ్నతం చేసేవాడు. నీటిలో పడిపోయేవాడు. మళ్ళీ లేచేవాడు. పడేవాడు. శరీరం చీరుకుపోయేది. రాళ్ళ అంచులకి రక్తం అంటేది. అయినా ప్రయత్నం ఆపలేదు. పిల్ల పక్షులన్నీ అబ్బురంగా చూసేవి. కొంత కాలానికి నెమ్మదిగా

వాలుగాలిలో ప్రయాణం చేయటం చేర్చుకున్నాడు. తరువాత ఎదురుగాలిలో...

చిన్న కొండ శిఖరం పైకి నెమ్మదిగా ఎక్కి అక్కణ్ణుంచి సముద్రపు నీటిలోకి దూకటం.

ఈ విధంగా ప్రాక్టీస్ చేస్తూ వుండగా–

స్వర్గం నుంచి దిగి వచ్చిన మరొక పక్షి చెపుతుంది. "...ఈ స్పీడ్ సరిపోదు. వాయువు కన్నా వేగంగా వెళ్ళాలి. స్వర్గం చేరుకోవాలంటే రెప్పపాటు కాలంలో అదృశ్యమయ్యేటంత వేగంగా పయనించాలి. అయినా 'స్వర్గం' ఒక చోట ఆగదు. వెళ్ళే కొద్దీ మరింత సౌఖ్యవంతంగా, ఆనందంగా, ఆహ్లాదంగా కనబడుతుంది" అంటుంది.

జొనాథన్ ఆ వేగంతో ప్రయాణించటం నేర్చుకుంటాడు. సముద్రం మొదలులోనే అలలు వుంటాయనీ, కొంతదూరం వెళ్ళాక వుండవనీ తెలుసుకుంటాడు.

అస్తమిస్తున్న సూర్యుణ్ణి సముద్రపు అంచులో చూస్తాడు.

నీటిపై ఎగిరే చేపల్ని, సముద్రం చివర వున్న అవతలివైపు ఒడ్డునీ చూస్తాడు.


మేఘాల్లోంచి సముద్రాన్ని మొట్టమొదటిసారి వీక్షిస్తాడు.

మేఘంపై నుండి క్రిందికి జారే అనుభవాన్ని ఆస్వాదిస్తాడు.

ఏ సీగల్ తన కలలో కూడా వూహించలేని అనుభవాన్ని స్వంతం చేసుకుంటాడు చివరికి–

**"ఎంత ఎత్తుకి ఎగిరితే – పక్షి అంత దూరాన్ని చూడగలదు"** అన్న సామెతకి అర్థం తెలుసుకుంటాడు.

వెలివేసిన పక్షుల్లోంచి కొన్ని యువ సీగల్స్ జొనాథన్ దగ్గర శిష్యులుగా చేరతాయి. కొంతకాలం వాటికి ఆ విద్య నేర్పి, తన ప్రథమ శిష్యుడిని వాటికి గురువుగా చేసి, ఎగురుతూ 'స్వర్గా'నికి వెళ్ళిపోతాడు జొనాథన్ లివింగ్‌స్టన్.



*(విజయానికి ఆరో మెట్టు)*

# ఆస్తి

'భగవంతుడు నాకు డబ్బు ఇవ్వలేదు. నా తండ్రికి డబ్బు లేకపోబట్టే నేను సరిగ్గా చదువుకోలేకపోయాను. అందుకే నాకు మంచి ఉద్యోగం దొరకలేదు. నా జీవితం ఇలా అయిపోవడానికి అదే కారణం' అని అనుకునే నిరాశావాదులందరూ చదవవలసిన కథ ఇది.

ఒక రాజుగారు మారువేషం వేసుకుని పురవీధుల్లో తిరుగుతూ ఉండగా ఒక భిక్షగాడు సత్రం అరుగుమీద కూర్చొని భగవంతుణ్ణి తిడుతూ ఉండడం గమనించాట్ట.

ఎందుకు తిడుతున్నావని అడిగితే "నేనేం తప్పుచేసాను? నన్నెందుకిలా భిక్షగాడిలా సృష్టించాలి? ఆ రాజుని ఎందుకంత ధనవంతుడిగా సృష్టించాలి?" అని అడిగాట్ట.

"నేను నీకు లక్షరూపాయలిస్తాను. నీ కాళ్ళు ఇవ్వగలవా?" అని అడిగాట్ట రాజు.

భిక్షగాడు ఇవ్వనన్నాట్ట.

"పోనీ ఐదులక్షల వరహాలిస్తాను. నీ చేతులివ్వగలవా?" అంటే అవి కూడా ఇవ్వనన్నాట్ట.

అప్పుడా రాజు "కోటి వరహాల విలువ చేసే అవయవాలు భగవంతుడు నీకిచ్చాడు. నిన్ను బీదవాడిగా సృష్టించాడని ఎవరన్నారు?" అని ప్రశ్నించాడు.

*(విజయానికి ఆరో మెట్టు)*

# ప్రేమకు పరాకాష్ట

ఒక ధనవంతురాలైన స్త్రీ, మదర్ థెరిస్సా నిర్వహించే ఆస్పత్రికి వెళ్ళిందట. రోగులు నానా విధాలయిన కుష్టు, క్షయ మొదలైన భయంకరమైన వ్యాధులతో బాధ పడుతున్న వారున్నారు అక్కడ.

ఆ అసహ్యకరమైన వాతావరణం చూసి, ఆమె ముక్కుకి చేతి రుమాలు అడ్డు పెట్టుకుంటూ, "కోటి రూపాయలిచ్చినా నేనీ పని చేయను" అన్నదట.

రోగి తాలూకు చీమూ, నెత్తురూ తుడుస్తూన్న థెరెస్సా తలెత్తకుండానే "అవును. నేను కూడా" అన్నదట.

*(విజయానికి ఆరో మెట్టు)*

# స్వర్గం - నరకం

ఒక మహారాజు తన మాస్టర్‌ని 'స్వర్గానికీ నరకానికీ గల తేడా ఏమిటో చెప్పమ'ని అడిగాడట.

మాస్టర్ నవ్వి, 'నీలాంటి మూర్ఖుడికీ, అజ్ఞానికీ చెప్పినా అర్థం కాదు' అన్నాడు.

మహారాజు ఆవేశంతో వణికిపోయాడు. కళ్లు ఎర్రబడ్డాయి. చివాలున కత్తితీసి, 'నేను నిన్ను చంపెయ్యబోతున్నాను' అన్నాడు ఎర్రబడిన మొహంతో.

గురువు మౌనంగా నవ్వి, '... ఇదీ నరకం అంటే' అన్నాడు.

మహారాజు స్తబ్ధుడయ్యాడు. సిగ్గుపడ్డాడు. తన తప్పు గ్రహించాడు. మోకాళ్ళ మీద వంగి కూర్చుంటూ, 'నా తప్పు తెలిసింది. నిజంగా నేను అజ్ఞానినే' అన్నాడు నమ్రత వల్ల ప్రకాశవంతమైన మొహంతో.

'ఇదీ స్వర్గం అంటే' అన్నాడు మత గురువు. *(విజయానికి ఆరో మెట్టు)*

# ఆవేశపు నిర్ణయం

ఆవేశంలో మనం తీసుకునే నిర్ణయాలు చాలా దుష్పరిణామాలకి దారి తీయవచ్చు.

ఒక పెద్ద ఫ్యాక్టరీ యజమాని అకస్మాత్తుగా తన ఆఫీసు నుంచి, ఫ్యాక్టరీకి పరీక్షకి వచ్చాడు.

సామాన్లు స్టోర్ చేసే గోడౌన్ పక్కన ఒకడు నిద్రపోతూ కనిపించాడు. యజమానికి విపరీతమైన కోపం వచ్చి అతన్ని లేపి "నీ జీతం ఎంత?" అని అడిగాడు.

"నెలకు వెయ్యి రూపాయలు" అన్నాడు ఆ వ్యక్తి.

యజమాని జేబులోంచి వెయ్యి రూపాయలు తీసి అతడివైపు విసిరేస్తూ "రేపట్నుంచి ఈ పరిసరాల్లో కనపడకు. నీ సర్వీస్ నాకు అక్కర్లేదు" అన్నాడు.

మారు మాట్లాడకుండా ఆ వ్యక్తి డబ్బు తీసుకుని వెళ్ళిపోయాడు.

మేనేజర్ ఇదంతా కాస్త అయోమయంగా చూడటం గమనించి, ఫ్యాక్టరీ యజమాని చిరాగ్గా "ఎంత కాలం నుంచి ఇతను ఈ విధంగా పనిచేస్తున్నాడు" అని అడిగాడు.

మేనేజర్ నమ్రతగా "అతను మన దగ్గర పనిచేయట్లేదండి. గోడౌన్‌లో సరుకు దింపటానికి వచ్చిన డెలివరీ ఏజంట్" అన్నాడు. *(విజయానికి ఆరో మెట్టు)*

# ప్రేమ ఎంత గొప్పది

పదేళ్ళ జాన్, తన చెల్లితో ఆడుకుంటూ వుండగా, ఆ పాప పడిపోయి, తలకి గాయం తగిలి రక్తం చాలా పోయింది.

జాన్‌ది కూడా ఆగ్రూప్ రక్తమే.

"నువ్వు నీ చెల్లికి కొంచెం రక్తం ఇస్తావా?" అని డాక్టర్ అడిగాడు.

ఆ కుర్రవాడు కొంచెంసేపు మౌనంగా ఉండిపోయాడు.

ఆ కుర్రవాడి సంశయాన్ని డాక్టరు మరోలా అర్థం చేసుకున్నాడు. "పెద్ద నొప్పిగా ఉండదు. అయిదు నిమిషాల్లో అయిపోతుంది. తరువాత చాక్‌లెట్ ఇస్తాను" అన్నాడు.

తన శరీరంలోంచి రక్తం నెమ్మదిగా సీసాలోకి ఎక్కుతూంటే, జాన్ మొహం క్రమక్రమంగా తెల్లబడసాగింది.

పాప ఆపరేషన్ విజయవంతంగా పూర్తయింది.

జాన్ అలాగే పడుకుని వున్నాడు. డాక్టర్ దగ్గరకొచ్చి "లే... చాక్‌లెట్ ఇస్తాను" అన్నాడు.

ఆ కుర్రవాడు భయపడుతూ నెమ్మదిగా అడిగాడు. "ఇంకా ఎంత సేపటికి నేను చచ్చిపోతాను డాక్టర్?"

డాక్టర్ విభ్రాంతుడై, "రక్తం తీస్తే మనిషి చచ్చిపోతాడనుకున్నావా?"

"అవును"

డాక్టర్ గొంతు వణికింది. "అనుకునే ఇచ్చావా?" అన్నాడు కంపిస్తూ.

కుర్రవాడు అమాయకంగా తలూపుతూ "చాక్‌లెట్ కోసం కాదు" అన్నాడు.



*(విజయానికి ఆరో మెట్టు)*

# పరోపకారం

దట్టంగా మంచు కురుస్తున్న ఒక రాత్రి, అమెరికన్ ప్రెసిడెంట్ అవక ముందు (అమెరికాలో పదవీ కాలం పూర్తి చేసాక కూడా అధ్యక్షుల్ని 'మాజీ' అనరు. వారిని కూడా ప్రెసిడెంట్‌లుగానే పిలుస్తారు.) రీగన్ కార్లో వేగంగా వెళ్తుండగా ఒక రాయి వచ్చి వెనుక భాగాన పెద్ద చప్పుడుతో బలంగా తగిలింది. ఒక్కసారిగా కంగారుపడి అతడు రోడ్డుపక్కగా కారు ఆపుచేసి దిగాడు.

అక్కడో కుర్రవాడు చేతిలో మరో రాయితో సిద్ధంగా నిలబడి వున్నాడు. కట్టలు తెంచుకున్న కోపంతో రీగన్, అతడి చెంప బ్రద్దలు కొట్టాలన్న ఆవేశాన్ని బలవంతంగా అణుచుకుని 'పిచ్చెక్కిందా? ఎందుకిలా చేసావ'ని నిలదీసాడు.

అప్పుడా కుర్రవాడు, ప్రవాహంలా వెళ్తూన్న కార్లని చూపిస్తూ, "ఏం చెయ్యను? రోడ్డు మీద కాలి నడకన నడుస్తూన్నవారు ఎవరూ లేరు. చేత్తో ఆపితే ఎవరూ కారు ఆపటం లేదు" అన్నాడు.

"అందుకని రాయితో కొడతావా? ఇంతకీ ఎందుకు కొట్టావ్?" అతడిని పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలన్న ఆవేశంతో అడిగాడు రీగన్.

అప్పుడా కుర్రవాడు రోడ్డుకి ప్రక్కగా చక్రాల కుర్చీలోంచి గడ్డిలో పడిపోయిన వృద్ధుడ్ని చూపించాడు "... నేనొక్కడినే ఎత్తి కూర్చో పెట్టలేకపోయాను. అరగంట నుంచీ ప్రయత్నిస్తూంటే ఎవరూ ఆగటం లేదు" అన్నాడు.

రోడ్డు ప్రక్కన వరుసగా చెట్లు వున్నాయి. ఆ చెట్లని ఆనుకుని ఎత్తయిన కాలిబాట వుంది. ఈవెనింగ్ వాక్‌కి జనం ఆ కాలిబాట మీద నడుస్తారు. చక్రాల కుర్చీ అక్కణ్ణుంచి క్రింద చెట్ల మధ్యకి జారిపోయిందన్నమాట. కుర్రవాడు ఒక్కడే ఆ వృద్ధుడి బరువు మోయలేక పోయాడనుకున్నాడు రీగన్. వృద్ధుడిని ఎత్తి కుర్చీలో సరిగ్గా కూర్చోపెట్టి ఆ కుర్రవాడితో "పెద్ద వాళ్ళని షికారు తీసుకొచ్చినప్పుడు జాగ్రత్తగా నడపాలి కుర్చీని" అన్నాడు.

ఆ కుర్రవాడు అయోమయంగా రీగన్ వైపు చూస్తూ, "ఆయన నాకేమీ కాడే" అన్నాడు అమాయకంగా.

❀ ❀ ❀

రీగన్ అమెరికన్ ప్రెసిడెంట్ అయ్యాక కూడా ఆ కారుని చాలాకాలం తనతోపాటే వుంచుకున్నాడట. "దానిమీద రాయి దెబ్బ నాకు మానవత్వానికి గుర్తుగా కనపడుతుంది" అని ఆ తరువాత ఎన్నోసార్లు మీటింగుల్లో ఆయన చెప్పారట. *(విజయానికి ఆరో మెట్టు)*

# టీమ్ మానేజ్‌మెంట్

ఎనిమిది మంది ఎమ్.బి.ఏ స్టూడెంట్లు మరుసటిరోజు 'టీమ్ వర్క్' అన్న సబ్జెక్టుపై పరీక్ష వ్రాయాలి. ముందురోజు ఫ్రెండ్‌షిప్ డే. రాత్రంతా బాగా ఆనందించి పరీక్షకి అసలు ప్రిపేర్ కాలేదు. అందువల్ల వాళ్ళు తెలివిగా ఒక ఎత్తు వేసారు.


చేతులకి గ్రీజూ, దుమ్మూ వ్రాసుకుని ప్రొఫెసర్ దగ్గరకి వెళ్ళారు. రాత్రి ఫంక్షన్ నుంచి వస్తూండగా టైరు పంచర్ అయిందనీ, స్పేర్ టైర్ లేనందువలన, పంచరయిన దాన్నే తీసుకుని ఎంతో దూరం వెళ్ళి బాగుచేయించుకు రావలసి వచ్చిందనీ, అందువల్ల రాత్రంతా నిద్రలేదనీ, పరీక్ష వాయిదా వేసి మరో పది రోజుల తరువాత పెట్టమనీ కోరారు. ప్రొఫెసర్ వప్పుకున్నాడు.

పదిరోజుల తరువాత వారిని దూరదూరంగా కూర్చోబెట్టి టీమ్‌వర్క్‌కి సంబంధించిన పరీక్షా పత్రం ఇచ్చాడు. అది ఈ విధంగా వుంది.

1) పది రోజుల క్రితం మీరు వెళ్ళిన కారు ఏ చక్రం పంచరైంది? ముందుదా వెనుకదా? కుడివైపుదా ఎడమవైపుదా? (95 మార్కులు)

2) టీమ్‌వర్క్‌కి కావలసిన ముఖ్య లక్షణం ఏమిటి? (5 మార్కులు)

అందరికీ అయిదు మార్కులే వచ్చాయి. తమ తప్పు తెలుసుకున్న అందరూ దాదాపు ఒకే సమాధానం వ్రాసారు. "... ఏ పని చేసినా, ఏ అబద్ధం ఆడినా మొత్తం టీమ్ అంతా కలిసి చర్చించి పూర్తి అవగాహనతో చెయ్యాలి..."



*(విజయానికి ఆరో మెట్టు)*

# ప్రేమ బిల్లు

ఇది కల్పిత కథో, నిజమో తెలీదు కానీ చాలా చక్కటి కథ. జర్మనీ రెండుగా విడిపోక ముందు బెర్లిన్‌కి దూరంగా ఒక పట్టణంలో 'కెల్లీ' అనే కుర్రవాడుండేవాడు. ఇంటింటికీ వెళ్ళి పాతవి తీసుకుని కొత్త సామాన్లు అమ్ముకొనే వృత్తి అతడిది. ఆ అమ్మకాల్లో ఎక్కువ డబ్బులు మిగిలేవి కావు.

ఒకరోజు అతడు ఒక ఇంటి తలుపు తట్టాడు. నిజానికి అతనికి చాలా ఆకలిగా వుంది. కానీ తలుపు తీసిన యువతిని చూసి, భయపడి "కొంచెం మంచినీళ్ళు కావాలి" అని అడిగాడు. అతడి ఆకలిని గమనించి ఆమె ఓ గ్లాసు నిండా పాలు తీసుకొచ్చి ఇచ్చింది. దాన్ని తాగిన తరువాత అతడు "ఎంత డబ్బులు ఇవ్వాలి" అని అడిగాడు.

"ఏమీ అవసరం లేదు. దయతో ఇచ్చిన దానికి ఏమీ వసూలు చేయొద్దని నా తల్లి చెప్పింది" అన్నదామె. అతడు కృతజ్ఞతలు చెప్పుకుని అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు. ఆ తర్వాత చాలా సంవత్సరాలు గడచినాయి.

ఈ లోపులో రెండవ ప్రపంచ యుద్ధం జరిగింది. హిట్లర్ మరణించాడు. జర్మనీ రెండుగా విడిపోయింది. ఒకటి కమ్యూనిస్టు, మరొకటి కాపిటలిస్టు దేశం అయింది. ఆ తరువాత బీదరికం భరించలేక ప్రజలు కమ్యూనిస్టు రాజ్యాన్ని త్రోసిపుచ్చి రెండు దేశాల్ని ఒకటిగా కలిపారు. ఇది ఇలా జరుగుతూ ఉండగా కెల్లీ మెడిసిన్ చదివి ప్రపంచ ప్రఖ్యాతి చెందిన డాక్టరు అయ్యాడు. ఆ సమయంలో అతడికి పాలు ఇచ్చిన యువతికి తీవ్రమైన అనారోగ్యం చేసింది. ఆ పట్నంలో వైద్య సదుపాయం లేక అక్కడి డాక్టర్లు బెర్లిన్ పంపించారు. ఆమెను చూడగానే డాక్టర్ కెల్లీ గుర్తుపట్టాడు. దాదాపు నెలరోజుల పాటు ట్రీట్‌మెంట్ జరిగింది. ఎన్నో ఖరీదయిన మందులు వాడారు. ఆమె ట్రీట్‌మెంట్‌ని ఒక సవాలుగా తీసుకున్నారు. ఎంతో కష్టపడి డాక్టర్లు ఆమెని బ్రతికించగలిగారు. ఆ తర్వాత ఫైనల్ బిల్ తన దగ్గర కొచ్చినపుడు అతడు దాని మీద సంతకం పెడుతూ, ఆ మొత్తాన్ని తన అకౌంట్‌లోంచి తీసుకొమ్మని వ్రాసాడు. ఆ తర్వాత బిల్లు ఉన్న కవరు ఆమెకి పంపించబడింది. అంత డబ్బు తనెలా చెల్లించగలదా? అని భయపడుతూ ఆమె దాన్ని తెరచినపుడు బిల్‌పై ఈ విధంగా రాసుంది.

"గ్లాసు పాలతో మీ బిల్లు పూర్తిగా చెల్లించబడింది." – డాక్టర్ హొవార్డ్ కెల్లీ.

కళ్ళనుంచి ఆనంద బాష్పాలు రాలుతూ వుండగా, ఆమె భగవంతుడితో ఇలా అన్నది "కృతజ్ఞతలు ప్రభూ! మనం మరొకరికి ఇచ్చిన ప్రేమ, ప్రపంచం అంతా వ్యాపిస్తుందని మరోసారి నిరూపించావు". *(విజయానికి ఆరో మెట్టు)*

# స్టాన్‌ఫోర్డ్

ఇది ఎంత వరకు నిజమో తెలీదు కాని ఒకవేళ కల్పిత కథ అయితే, ఇంత గొప్ప కల్పితాన్ని సృష్టించిన ఆ రచయితకి అభినందనలు. ఒకవేళ నిజం అయితే, ఆ తల్లిదండ్రులకి ప్రణామాలు. 1884లో హార్వర్డ్ యూనివర్సిటిలో చదివే స్టాన్‌ఫోర్డ్ అనే యువకుడు ప్రమాదవశాత్తూ మరణించాడు. అతడి తల్లిదండ్రులు కొడుకు జ్ఞాపకార్థం ఏదైనా స్థూపంగానీ, మీటింగ్ హాలు గానీ నిర్మించాలనుకొన్నారు. దాని నిమిత్తం వారు హార్వర్డ్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ చార్లెస్ ఎలియార్ట్‌ని కలుసుకొన్నారు. ఆ దంపతులు చాలా సాదాసీదాగా, అణుకువగా సామాన్య దుస్తుల్లో వున్నారు. చాలాసేపు బయట వేచివున్న తరువాత వారికి లోపలికి వెళ్ళటానికి అనుమతి దొరికింది. తన దగ్గరకు వచ్చింది మరణించిన విద్యార్థి తాలూకు తల్లిదండ్రులనీ, తమ కొడుకు పేరు మీద వారు యూనివర్సిటీ క్యాంపస్‌లో ఒక గది నిర్మాణానికి వచ్చారనీ తెలిసి చార్లెస్ ఎలియార్ట్ కాస్త సందేహంతో "మీరు ఒక గది నిర్మించాలంటే దానికి చాలా ఖర్చవుతుంది. పెద్ద పెద్ద ఆశలు పెట్టుకోకండి" అని సలహా ఇచ్చాడు. అప్పుడు వృద్ధురాలైన ఆ కుర్రవాడి తల్లి ఎలియార్డ్‌తో "ఈ యూనివర్సిటి కట్టడానికి ఎంత ఖర్చయి వుంటుంది సార్" అని అమాయకంగా అడిగింది. ఎలియార్డ్ కాస్త గర్వంగా "దాదాపు 10 మిలియన్ల డాలర్లు" అని చెప్పాడు. అప్పుడా ముసలి దంపతులిద్దరూ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. కళ్ళతోనే ఒకరితో ఒకరు సంభాషించుకున్నారు. ఒక నిర్ణయానికి వచ్చిన వాడిలా ఆ యువకుడి తండ్రి ఎలియార్డ్ వైపుకు తిరిగి "అయితే మా కొడుకు పేరు మీద ఒక యూనివర్సిటియే కట్టిస్తే బాగుంటుంది అనుకుంటున్నాము సర్" అన్నాడు నమ్రతగా. 26 మిలియన్ డాలర్ల ఖర్చుతో ఆ విధంగా స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ స్థాపించబడింది.



*(విజయానికి ఆరో మెట్టు)*

# భూలోకంలో యమలోకం

ప్రజల్ని మోసం చేస్తూ బ్రతికే ఒక లంచగొండి, బద్ధకస్తుడు, లౌక్యుడూ అయిన వ్యక్తి మరణించి నరకానికి వెళ్ళాడట. అతడు చేసిన పాపాలకి శిక్షగా యముడు ఆర్నెల్లపాటు ప్రతిరోజూ మూడు శిక్షల్ని వరుసగా అనుభవించమన్నాడట. అవి 1. ప్రొద్దున్నే లేవగానే మూడు గంటల పాటు విద్యుత్ షాకులు 2. సాయంత్రం వరకూ వెయ్యి కొరడా దెబ్బలు 3. మేకుల మంచం మీద రాత్రి పడక.

ఆ పాపి యముడికి కూడా లంచం ఇచ్చి, "ఈ శిక్షలన్నీ మీలోకంలో కాకుండా, మా దేశంలో అనుభవించేలా అనుమతి ఇవ్వు" అని కోరుకున్నాడట.

యముడు దానికి అంగీకరించాడట.

ఆర్నెల్లు శిక్ష అనుభవించి తిరిగి వచ్చిన ఆ లౌక్యుడు, ఏ మాత్రం బాధగా లేకపోవటాన్ని గమనించి ఆశ్చర్యపోయిన యముడు కారణం అడిగాడట.

పక్కనున్న యమభటుడు ఈ విధంగా చెప్పాడట. "ఏమున్నది స్వామీ? ప్రతి ఉదయమూ మూడు గంటలపాటు అక్కడ విద్యుత్తు లేదు. మంచం మీద కొట్టిన మేకుల్ని ఒక్క రోజులోనే ఎవరో దొంగిలించారు. కొరడా దెబ్బలు కొట్టవలసిన ప్రభుత్వోద్యోగి ఆ పనిపై వచ్చి అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం పెట్టి క్యాంటిన్‌కి వెళ్ళిపోయేవాడు."




*(విజయానికి ఆరో మెట్టు)*

# పై ఎత్తు

ఒక ఖరీదైన హొటల్లో ఒక మూల టేబుల్ దగ్గర ఒక యువకుడు కాఫీ తాగుతున్నాడు. అతడు అందంగా, అమాయకంగా వున్నాడు. అతడికి దూరంగా ఒక అమ్మాయి ఐస్‌క్రీం తింటోంది. అబ్బాయిని చూసి మనోహరంగా నవ్వింది.

కుర్రవాడు కంగారు పడ్డాడు. ఏమీ ఎరగనట్టు ఆమె ఐస్‌క్రీం తినటం కొనసాగించింది. మళ్ళీ కొంచెం సేపటికి అతడిని చూసి ఆహ్వానిస్తున్నట్టుగా తల ఊపి నవ్వింది.

అతడు లేచి ఆమె దగ్గరికి వెళ్ళి... "నేనిక్కడ మీతో పాటు కూర్చోవచ్చా?" అని అడిగాడు. ఆమె ఒక్కసారిగా లేచి, హొటల్‌లో వారందరూ వినేటట్టుగా గట్టిగా, "ఏమనుకుంటున్నావ్ నా గురించి? అంత చీప్‌గా కనపడుతున్నానా? టేక్ కేర్" అని అరిచింది.

చుట్టూ వున్న వారందరూ మాటలు ఆపి అతడివైపు చూసారు. అవమాన భారంతో ఆ యువకుడు తలదించుకుని తన టేబుల్ వద్దకు వెనక్కి వచ్చి కూర్చున్నాడు.

ఆ అమ్మాయి బిల్ పే చేసి వెళ్ళిపోతూ, దిగులుగా కూర్చున్న అబ్బాయి వద్దకు వచ్చి, "క్షమించు. నేను మానసిక శాస్త్ర స్టూడెంట్‌ని. ఊహించని ఇబ్బందికర పరిస్థితి ఎదురైనపుడు మనుష్యులు ఎలా ప్రవర్తిస్తారో ప్రయోగం చేస్తున్నాను" అంది. అతడు చప్పున లేచి, అందరూ వినేలా గొంతు హెచ్చించి, "నువ్వెంత ఖరీదైనా సరే, రెండొందల కన్నా ఎక్కువ ఇవ్వను" అన్నాడు.





*(విజయానికి ఆరో మెట్టు)*

# దుఃఖ కారణం

కష్టం వచ్చినప్పుడు ఎంతసేపు ఏడవాలన్నది ప్రతి మనిషికీ ఒక సమస్యే. ఎవరైనా చనిపోయినప్పుడు, వెనకాల భుజాలు పట్టుకుని లాగేవాళ్ళు ఉంటే గుండెలు కొట్టుకుంటూ ఏడ్చే కొందరు, వెనుక ఎవరూ లేకపోతే మౌనంగా దుఃఖిస్తారు.

బాధ ఒక్కటే కానీ, దుఃఖం అనేది ఒక రెలెటివ్ టర్మ్ అని చక్కగా చెప్పే కథ ఇది.

ఓ యాభై ఏళ్ళ వ్యక్తి నట్టింట్లో బిగ్గరగా రోదిస్తున్నాడు. రోడ్డునపోయే ఒక యోగి ఆ ఏడుపు విని లోపలికి వచ్చాడు. ఆ వ్యక్తి అది కూడా గమనించే స్థితిలో లేకపోవటంతో రెండు నిమిషాలు వేచి చూసి, యోగి "ఏం నాయనా? చాలా సంతోషంగా వున్నట్టున్నావ్" అన్నాడు.

ఆ వ్యక్తి ఏడుస్తూనే, "సంతోషమా? నేను ఏడుస్తున్నాను. కనబడటం లేదా?" అన్నాడు.

"అంత తాదాత్మ్యంగా ఏడుస్తూంటే, ఏడుపులో సంతోషం పొందుతున్నావను కున్నాను. మరి నీకు అందులో సంతోషం లేకపోతే దాన్ని వదిలి పెట్టవచ్చు కదా!"

ఆ వ్యక్తి ఏడుపు కోపంలోకి మారింది. "ఇదెక్కడి వితండం వాదం స్వామీ? దగ్గిర వాళ్ళు పోతే మనుషులు ఏడవటం అనేది సహజం."

"అవునా? దగ్గర వాళ్ళు పోతే మానవులు, 'బాధపడటం' సహజం అనుకుంటాను."

"ఆ బాధని ఏడుపు ద్వారా ప్రకటిస్తాం."

స్వామి అర్థంకానట్టు చుట్టూ చూసి, "... ఇక్కడెవరూ లేరే. ఎవరికి ప్రకటిస్తావు?" అని అడిగాడు.

ఆ వ్యక్తి గతుక్కుమన్నాడు – "స్వామీ! మాటల్తో మీరు నన్ను తికమక చేస్తున్నారు. ఏడవటం ద్వారా ఉపశమనం పొందుతున్నానని చెప్పటం నా ఉద్దేశ్యం."

"నీ ఇంటిలో ప్రవేశించగానే నేను అన్నమాట కూడా అదే కదా! ఏడుపు ద్వారా ఆనందం పొందుతున్నావా అని అడిగాను" అన్నాడు యోగి.

ఆ వ్యక్తికి ఏం సమాధానం చెప్పాలో తోచలేదు.

యోగి జాలిగా, "... పాపం నిన్ను ఓదార్చటానికి కూడా ఎవరూ లేరనుకుంటాను" అన్నాడు సానుభూతితో.

"అవును. ఓదార్చటానికి ఎవరూ లేరు. మొన్న నా మొత్తం ఆస్తి పోయి దివాళా తీశాను. దాంతో నా భార్య నిన్న రాత్రి ఎవరితోనో లేచిపోయింది. ఈ రోజు నా కుమారుడు

అమెరికాలో దేన్నో పెళ్ళి చేసుకున్నాను అని కబురు చేశాడు. ఇలాంటి పరిస్థితుల్లో నన్ను ఓదార్చే ప్రాణ స్నేహితుడు గంటక్రితం మరణించాడు. అందుకే దుఃఖిస్తున్నాను."

"ఓదార్చేవాడు కావాలనుకుంటున్నావా?"

"కష్టమొచ్చినప్పుడు ఓదార్చటానికి మనకంటూ ఒక స్నేహితుడు కావాలి కదా."

"నువ్వు చెప్పేది నాకు అర్థం కావటం లేదు. కష్టమొచ్చినప్పుడు బాధ సహజమన్నావు. అప్పుడు దుఃఖం కలుగుతుందన్నావు. దుఃఖం వల్ల ఉపశమనం లభిస్తుందన్నావు. ఇప్పుడు మళ్ళీ – దుఃఖాన్ని మాన్పటానికి ఓదార్పు కావాలంటున్నావు. ఇంతకీ నీకేది కావాలి? బాధా? దుఃఖమా? ఓదార్పా? ఉపశమనమా?"

"మీరు యోగులు. ఎన్నైనా చెప్పగలరు. మాటల్తో మనుష్యుల్ని మభ్యపెట్టగలరు. మేము మామూలు మనుష్యులం. కష్టమూ, దుఃఖమూ ఓదార్పూ, ఉపశమనమూ అంతా మానవ సహజమే–"

"నిన్నెవరూ ఓదార్చలేదనుకుందాం. అయితే, ఎంతసేపు దుఃఖిస్తే నువ్వు ఉపశమనం పొందుతావు?"

"అదేమి ప్రశ్న? నాకర్థం కాలేదు."

"నీ స్నేహితుడు మరణించినందుకు లేదా నీ భార్య లేచిపోయినందుకు, పైగా నీ కొడుకు పెళ్ళి చేసుకున్నందుకు, ఎన్ని నెలలు ఈ గదిలో ఇలాగే కూర్చుని దుఃఖిస్తావు? అని అడుగుతున్నాను."

"కాలమే గాయాల్ని మాన్పుతుందని మీలాటి పెద్దలే సెలవిచ్చారు కదా."

"రెండు నెలలు అనుకుందామా పోనీ."

"రెండు నెలల పాటూ నిద్రాహారాలు మాని ఏడవటమా?"

"పోనీ గుండెలు బాదుకుంటూ రెండు గంటలు ఏడుస్తే ఉపశమనం పొందుతావా?"

"చాల్లెండి స్వామీ మీరు మరీనూ. జనం నవ్విపోతారు."

"సరే! ఆ విషయం పక్కన బెట్టు. నీకు చాలా ఇష్టమైనది ఏది? దాపరికం లేకుండా చెప్పు. అంటే... నీకు తీరిక దొరికినా, మనసు బాగోకపోయినా చేసేది ఏది? అబద్ధం చెప్పకూడదు సుమా."

"మీరు యోగులు. మీతో చెప్పటంలో తప్పేముంది? నాకు ఐటెమ్‌సాంగ్ నాట్యం ఇష్టం."

"మరింకేం? టి.వి. పెట్టుకుని ఆ నాట్యం చూడు. ఉపశమనం దొరుకుతుంది."

"అపచారం స్వామీ. అపచారం. భార్య ఎవడితోనో లేచిపోయిందని తెలిసి, టి.వి.లో డాన్స్ చూడమంటారా? జనం నాకు పిచ్చెక్కిందంటారు."

"నీకు కాదు నాయనా. నీ సమాధానాలు వింటే నాకు పిచ్చెక్కుతుంది. ఏడవకపోతే జనం ఏదో అనుకుంటారంటావు. గుండెలు బాదుకుంటే జనం నవ్వుతారంటావు. నాట్యం చూస్తే జనం పిచ్చెక్కిందంటారంటావు. ఇంతకీ నువ్వు ఏడ్చేది నీ కోసమా? జనం కోసమా? పోనీ ఇది చెప్పు... నువ్వు ఎంతసేపు ఏడిస్తే జనం నిన్ను గొప్పవాడిగా గుర్తిస్తారు?"

"నన్ను మాటల్తో బోల్తా కొట్టించారుగానీ, ఇప్పుడు సరీగ్గా చెప్తాను వినండి. మనసు బావో లేనప్పుడు, బాధ కలుగుతుంది. అది కంటి వెంట నీటి రూపంలో బయటకి వస్తుంది. కొంచెంసేపటికి బాధ తగ్గుతుంది. ఏడుపు ఆగిపోతుంది. ఓదార్చే వారుంటే దుఃఖం తొందరగా తగ్గి మరింత ప్రశాంతంగా వుంటుంది. మీకు అర్థమైందనుకుంటాను. ఇప్పుడు వాదించండి ఏం వాదిస్తారో..."

యోగి నవ్వేడు. "... ఇక వాదించటానికి ఏమీ లేదు నాయనా. నేను చెప్పదల్చుకున్నదే నువ్వా చెప్పావు. బాధ తగ్గించుకోవటం కోసం ఐటెమ్‌సాంగ్ చూడటం ఎంత నిరర్థకమో, ఏడవటం కూడా అంతే నిరర్థకం అని చెపుతున్నాను."

"ఓహో! మీరు భగవద్గీత గురించి చెప్తున్నారా? అది నేను చాలాసార్లు చదివాన్లెండి..."

"కేవలం చదివి వుంటావు. ఆకళింపు చేసుకొని ఉండవు. చదవటం వేరు. అర్థం చేసుకుని ఆచరించటం వేరు. ఆచరించని పక్షంలో ఎన్ని భగవద్గీతలు చదివినా, వ్యక్తిత్వ వికాస కోర్సులకి హాజరయినా ఏం లాభం? నీ స్నేహితుడు మరణించిన ఈ సమయంలో నీవు భగవద్గీత చదివి ఉంటే నీకు నిజమైన ఉపశమనం లభించి ఉండేది. అలా చదివితే జనం కూడా నవ్వుతారని నేను అనుకోను. మరణించిన నీ స్నేహితుడి కుటుంబం పట్ల జాలి, అతడితోపాటు నువ్వు గడిపిన మధుర క్షణాలు, కొంతకాలానికి నువ్వా అక్కడికే వెళ్ళిపోతావన్న నిజం– నిన్ను నిజమైన స్నేహితుడుగా ఓదార్చేవి. అదే భగవద్గీత చెప్పేది. ATTACHMENT WITH DETACHMENT. రెండ్రోజులు ఏడ్చి మర్చిపోతే అది బాధ ఎలా అవుతుంది? అతడు లేకపోవటం నీకు లోటు. అందుకు బాధపడుతున్నావంటే, నీ స్వార్థం కోసం దుఃఖిస్తున్నావు. పోయిన వాడికి ఏ కష్టమూ లేదు. అవునా. వాడు పోవటం వలన ఎవరికయినా నష్టం కలిగితే అతడి కుటుంబానికి..! అవసరమైతే, నీ కర్తవ్యంగా భావించి వారి కుటుంబానికి సాయం చెయ్యి. జీవితాంతం ఒంటరిగా ఉన్నప్పుడల్లా వాడిని తల్చుకో... అది నిజమైన ప్రేమ...! **ప్రేమించు. దుఃఖించకు**. అన్నిటికన్నా ముఖ్యంగా, అన్ని పనులూ మానేసి దుఃఖించకు. జనం కోసం 'ఎలా దుఃఖించాలా, ఎంతసేపు దుఃఖించాలా' అని ఆలోచించకు. 'ఓదార్పు లేదే! ఎంతసేపు ఇలా దుఃఖించను?' అన్న బాధతో మళ్ళీ

దుఃఖించకు. దుఃఖం కర్తవ్యానికి ప్రథమ శత్రువు! నువ్వు దుఃఖించకపోతే నీ దుఃఖానికి కారణం దొరికి వుండేది!! నీ కర్తవ్యం బోధపడి వుండేది!! ఉదాహరణకి, ఇన్నేళ్ళు కాపురం చేసేక నీ భార్య నిన్ను వీడి వెళ్ళిపోయిందంటే, ఆమెని ఎంత హింస పెట్టి ఉంటావో కదా!"

"మీ మీదొట్టు. నేను అటువంటి వాడిని కాను. నా ఆస్తి పోయిందని ఆవిడ నా స్నేహితుడితో లేచిపోయింది."

"మరి అలాంటి స్త్రీ నీ నుంచి వెళ్ళిపోయినందుకు నలుగుర్నీ పిల్చి పార్టీ ఇవ్వాలి గానీ ఏడుస్తారా ఎక్కడయినా."

"ఇంకా నయం. దండోరా వెయ్యమన్నారు కాదు. ఇప్పటికే నవ్వుల పాలయ్యాను."

"ఓహో! నువ్వు ఏడుస్తోంది భార్య లేచిపోయినందుకు కాదు. నలుగురూ నవ్విపోతారని అన్నమాట. అవునా. సర్లే. నీ కొడుకు సంగతేమిటి? అతడు అమెరికాలో ఎవర్నో పెళ్ళి చేసుకుంటే నీ కెందుకు దుఃఖం? నీకా విషయం ముందు చెప్పలేదంటే తప్పు నీదే! అంతటి బాంధవ్యమూ, నమ్మకమూ నీవు అతడిపట్ల కలిగించుకోలేదన్న మాట. అతడు నీ చేతుల్లోంచి జారిపోతున్నాడనేది నీ బాధ! అవునా."

"ఏం జరిగినా మనకి పట్టనట్టు మెటీరియలిస్టిక్‌గా వుండటం నాకు చేతకాదు."

"నిజానికి నువ్వే పెద్ద మెటీరియలిస్ట్‌వి. జనం ఏమనుకుంటారు అన్న కాంక్ష మెటీరియలిజం. కొడుకు చేజారిపోయాడన్న బాధ మెటీరియలిజం."

"మరి ఇప్పుడు నన్నేం చెయ్యమంటారు?"

"ఏడవటం మానేసి ఆస్తి తిరిగి సంపాదించు. అది అసలైన ఆర్థిక రియలిజం. కొడుకుతో మంచి సంబంధం పెట్టుకో. అదీ ప్రేమ పట్ల రియలిజం. స్నేహితుడి కుటుంబానికి సాయం చెయ్యి. అది మానవ సంబంధాల పట్ల ఉండవలసిన రియలిజం."

*(విజయానికి ఆరో మెట్టు)*

# టెన్షన్‌లో నిర్ణయం

కోపంలోగానీ, భయంలోగానీ మనం ఎంత తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటామో ఉదాహరణగా ఈ యథార్థ సంఘటన చదవండి.

ఆమె ఆఫీసు నుంచి ఇంటికొచ్చేసరికి వంటింట్లో నుంచి పెద్దగా అరుపులు వినిపిస్తున్నాయి. ఆ గొంతు ఆమె భర్తది. కెవ్వు కెవ్వున అరుస్తున్నాడు. ఆమె పరుగెత్తుకుంటూ లోపలికెళ్లి అక్కడి దృశ్యం చూసి స్తంభించిపోయింది. ఒక్క క్షణం కాళ్లూ చేతులూ ఆడలేదు.

భర్త ఎలక్ట్రిక్ వైరు పట్టుకుని గజగజా వణికిపోతున్నాడు. కాఫీ కెటిల్‌లోకి కరెంట్ వెళ్తోంది. కెటిల్ ముందు నిలబడి అరుస్తున్నాడు. ఆమెకి మొత్తం విషయం అర్థమై అటూ ఇటూ చూసింది.

ఒక మూల బూజులు దులిపే కర్ర కనపడింది. చప్పున దాన్ని అందుకుని అతడి మణికట్టు మీద వెనుకనుంచి బలంగా కొట్టింది. ఎముక విరగటంతో అతడు ఆఖరిసారి గట్టిగా అరిచాడు.

వాక్‌మెన్ కిందపడటంతో టేప్ నుంచి వస్తూన్న పాట ఆగిపోయింది. ఆమె అతడిని తప్పుగా అర్థం చేసుకుంది!

అప్పటి వరకూ అతడు టేప్‌లో పాట వింటూ ఊగుతున్నాడన్న మాట!

*(విజయరహస్యాలు)*

# దేవుడి తీర్పు

ఎర్రచీమలు, నల్లచీమలూ పోట్లాడుకుని కోతిని తీర్పు అడుగుతాయి. కోతి నల్లచీమల పట్ల పక్షపాతంతో వ్యవహరిస్తుంది. అప్పుడు ఎర్రచీమల పక్షం దేవుడికి పూజలు చేసి హుండీలో డబ్బులు వేసి దేవుణ్ణి సాయం అడుగుతుంది. అతడు రెండువైపులా నాటకమాడి, తాను లాభపడటానికి ప్రయత్నిస్తాడు. అప్పుడు చీమలన్నీ కలిసి దేవుణ్ణి చంపేస్తాయి. అంతే కథ. అసలైన కమ్యూనిస్టు భావాన్ని చెప్పే గొప్ప నాటకం.

*(తప్పు చేద్దాం రండి..!)*

# తప్పు

తప్పు రెండు రకాలు : మానసికం – శారీరకం. 'శారీరకంగా చేస్తేనే అది తప్పు. మానసికంగా ఏం చేసినా ఫర్వాలేదు' అని నమ్మేవాళ్ళ కోసం ఈ కథ.

ఒక వేశ్య ఇంటి ఎదురుగా ముని ఉంటాడు.

ఆమె ఇంటికి విటుడు వచ్చినప్పుడల్లా ఇంటి ముందు ఒక రాయిని వుంచుతాడు. కొన్నేళ్ళు గడిచేసరికి ఒక పెద్ద గుట్ట తయారవుతుంది.

ఒకరోజు ఆమెకు ఆ గుట్టని చూపించి, "చూసావా నువ్వు ఎంత పాపం చేసావో" అని తిడుతూ మందలిస్తాడు. ఆ పాపపు గుట్టను చూసి ఆమె చాలా భయపడుతుంది. బాధపడుతుంది.

ఆ తరువాత ఇద్దరూ మరణిస్తారు. ఆమెని స్వర్గానికీ, అతడిని నరకానికీ తీసుకువెళ్తారు భటులు.

భగవంతుడు తన తీర్పుకి కారణాలు వివరిస్తూ, "ఆమె తన పనేదో తాను చేసుకుపోయింది. నీవు నిరంతరం ఆమె గురించే ఆలోచిస్తూ పాపం చేసావు" అంటాడు.

*(తప్పు చేద్దాం రండి..!)*

# విజయరహస్యాలు

ఒక సైకాలజిస్టు దగ్గరకి ఒక కుర్రవాడిని తీసుకొచ్చారు దంపతులు. వారు బీదవారు, అమాయకులుగా వున్నారు. కుర్రవాడు చాలా చురుగ్గా, హైపర్ ఆక్టివ్‌గా వున్నాడు.

ఏకాగ్రత లేమి సమస్య.

"... మీ కుర్రవాడిని తరచు నా దగ్గరకి తీసుకొచ్చి ట్రీట్‌మెంట్ ఇప్పించటం కంటే, మీరు సిద్ధుల్ని నమ్ముతానంటే నేనొక భస్మం ఇస్తాను. హిమాలయాల్లో పవిత్ర కైలాసగిరిపై పూజించిన భస్మమది. దాన్ని ప్రయత్నించి చూడండి. ఉచితంగా వస్తుంది కాబట్టి మీకూ నష్టం ఏదీలేదు. ఇది ఫలించకపోతే నా ట్రీట్‌మెంట్ ఎలానూ వుంటుంది కదా!" అన్నాడు.

ఆ దంపతులు దానిని తప్పక వాడతామని భక్తిగా చెప్పాక, నెలకి సరిపోయేటంత ఇచ్చి "రోజుకి రెండుసార్లు, ప్రొద్దున్న సాయంత్రం నుదుటన పెట్టండి. రెండు గంటలపాటు ఇది వుండాలి. ఇది నుదుటన వున్నప్పుడు మాట్లాడటం కానీ, తినటం కానీ చేయరాదట. దానికన్నా ముఖ్యమైనది ఏమిటంటే ఈ బొట్టు నుదుట ఉన్నప్పుడు అల్లరి గానీ, ఆవేశం గానీ, మితిమీరిన ఆనందం, దుఃఖం, కోపం ప్రదర్శిస్తే ఫలించదని చెప్పాడు. మరోలా చెప్పాలంటే నాలుగ్గంటల పాటు టి.వి. గురించి గానీ, క్రికెట్ గురించి గానీ ఆలోచించ కూడదు, చూడకూడదన్న మాట. ఒక మానసిక శాస్త్రవేత్తగా నేను దీనిని ప్రచారం చేయరాదు. కానీ ప్రయత్నిస్తే తప్పులేదు కదా" అన్నాడు.

నెల రోజుల తరువాత ముగ్గురూ వచ్చారు. కుర్రవాడు వినమ్రంగా నమస్కరించాడు.

"మా అబ్బాయి పూర్తిగా మారిపోయాడు" అన్నారు తల్లిదండ్రులు ఆనందంగా. తల్లి కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. "ఆ విభూది మా కొడుకుని మార్చేసింది బాబూ" అన్నది.

సైకాలజిస్టు చిరునవ్వుతో తలూపాడు. అది బూడిద అని అతడికి మాత్రమే తెలుసు.

*(విజయరహస్యాలు)*

# మూలకారణం

ఒక పెద్ద కంపెనీకి నగరం మధ్యలో అద్భుతమైన భవంతి వున్నది. టూరిస్టులు కూడా వచ్చి చూసే ఆ భవంతిని ఆ కంపెనీవారు ఎంతో ప్రతిష్టాకరంగా భావిస్తారు. చీకటి పడకముందే దేదీప్యమానంగా లైట్లు వెలిగిస్తారు. ఆర్నెల్లకొకసారి రంగులు వేసి నిత్యనూతనంగా వుంచుతారు. దానికి దాదాపు పది లక్షల ఖర్చు అవుతుంది.

బిల్లులపై సంతకం పెడ్తూన్న అధికారికి, ఆర్నెల్లకొకసారి ఎందుకు రంగులు వేయాలో అర్థంకాక ఆ విషయం ఛైర్మన్‌కి తెలిపాడు. కారణాలు వాకబు చేస్తే, పక్షుల రెట్టల వల్ల భవంతి పాడవుతోందని తెలిసింది. పక్షులు రాకుండా ఏం చెయ్యాలా అని అధికారులు ఆలోచించసాగారు. అసలు అన్ని పక్షులు తమ భవంతికే ఎందుకు వస్తున్నాయి అని అన్వేషిస్తే పురుగుల వలన అని తెలిసింది. చీకటి పడగానే ముసురుకునే పురుగుల్ని తినటం కోసం పక్షులు చేరుతున్నాయి అని తెలుసుకున్నారు.

వారానికొకసారి పురుగుల మందు చల్లటానికి టెండర్లు పిలుద్దామనుకున్నారు. రెండు లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేసారు. సంతకం కోసం ఫైలు ఛైర్మన్‌కి పంపారు. కానీ నగరంలో ఇన్ని మురికివాడలుండగా పురుగులు తమ భవంతికే ఎందుకొస్తాయన్న అనుమానం ఆఖరి నిమిషంలో ఛైర్మన్‌కి కలిగింది. భవంతి చుట్టూ దట్టమైన చెట్లు కారణమన్నారు అధికారులు! కొమ్మలు కొట్టెయ్యటం గురించి తర్జన భర్జనలు జరిగాయి. అలా చేస్తే అందం పోతుంది. మరేం చెయ్యాలా అని అసురసంధ్య వేళ భవంతి బాల్కనీలో నిలబడి ఆలోచిస్తున్న ఛైర్మన్‌కి అసలు కారణం అర్థమయింది.

తమ భవనాన్ని అందరికీ గర్వంగా చూపించాలనే మితిమీరిన ఉత్సాహంతో, అందరికన్నా ముందుగా లైట్లు వెలిగిస్తూ వుండటంతో, నగరంలోని పురుగులన్నీ అక్కడికే వచ్చి చేరుకుంటున్నాయన్న మాట. వాటికోసం పక్షులు వస్తున్నాయి. అసలు కారణం అది! అరగంట ఆలస్యంగా భవనం తాలూకు లైట్లు వేయటం ద్వారా, ఆ విధంగా పదిలక్షల ఖర్చు తగ్గించారు.

సమస్యని పరిష్కరించాలంటే దాని అసలు కారణం తెలుసుకోవాలనటానికి ఇంతకన్నా మంచి ఉదాహరణ మరింకేం కావాలి?

*(విజయరహస్యాలు)*

# విజయంలో భాగస్వామ్యం

మంచి వ్యక్తిత్వం వున్న మనిషి, తనని పలాయనవాదం వైపు తోసే అంశాల్ని పట్టుకుని – వాటిని ఛిద్రం చేసి, వాటిలో తన బలహీనత ఎక్కడుందా అని వెతికి పట్టుకుంటాడు. జరిగిన దాంట్లో అవతలివారి తప్పెంత అని నిష్కర్షగా ఆలోచిస్తాడు. అన్ని తప్పుల్ని అవతలివారి మీదకి (ఏడు చేపల కథలో లాగా) తోసెయ్యడు.

ఠీవిగా, గర్వంగా వెళ్తున్న చీమని ఆపి అడిగాను. "...ఏమిటి ఈ రోజు చాలా సంతోషంగా వున్నట్టున్నావే" అని.

"అవును. ఇప్పుడు నా బంగారు కన్నంలో వేలుబెట్టిన ఓ చిన్న పిల్లాడ్ని కుట్టి ఏడిపించాను" అంది.

"పాపం. పిల్లాడిని ఏడిపించి సంతోషిస్తున్నావా? వాళ్ళ నాన్నకీ విషయం తెలిసిందంటే నీ పుట్టలో గమాక్సిన్ వేసి చంపేస్తాడు."

"ఏడిచాడు. వాడికి పిల్లాడి పట్ల అంత ప్రేమే వుంటే – పాలు ఎందుకు పట్టడు?"

"పిల్లాడికి పాలు పట్టలేదా? ఎందుకు?"

"తన పిల్లాడు ఏడుస్తున్నాడు కదా అన్న దిగుల్తో ఆవుని ఆ రైతు బయటకు వదల్లేదు. అది గడ్డి మేయలేదు. అందుకని పాలివ్వలేదు."

"పోన్లే. ఈ రోజు గడ్డి రేపటికి మిగిలింది కదా! రైతు బాగుపడ్తాడు."

"అబ్బే. అంత అదృష్టం కూడానా... ఆ గడ్డిదుబ్బుని సైనికులు నాశనం చేసారు."

"ఎందుకట?"

"రాజకుమారులు వేటకెళ్ళి ఏడు చేపల్ని తెచ్చి ఎండబెడితే అవి ఎండలేదట. చాటొచ్చిన దుబ్బుని తవ్విపడెయ్యమని ఆర్డరిచ్చారు."

నేను నవ్వేను.

"ఎందుకు నవ్వుతున్నావ్?" అడిగింది చీమ.

"నువ్వెందుకు అంత ఠీవిగా హుందాగా వున్నావో నాకు అర్థమైంది."

"ఎందుకనుకుంటున్నావ్?"

"చిన్న పిల్లాడు ఏడిస్తేనే, రైతు తన కర్తవ్యం మర్చిపోయి ఆవుకి మేత వెయ్యలేదు. అందుకు అతడికి నష్టం వచ్చింది. దుబ్బు చాటుంటే చేపలు ఎండవన్న చిన్న సత్యం తెలుసుకోలేకపోయారు రాకుమారులు. అందుకని, మాంచి ఎండు చేపల విందు మిస్ అయ్యారు వాళ్ళు. పైగా తమ తప్పుకి గడ్డి మీద కోపం చూపించారు. ఫలితంగా, దేశాన్ని

రక్షించే బాధ్యత వదిలిపెట్టి, సైనికులు నిష్ఫలమైన పని చేపట్టవలసి వచ్చింది. ఇందులో మూడు జీవిత సత్యాలున్నాయి.

ఒకటి : చిన్న సమస్యకే కర్తవ్యం మర్చిపోవటం.

రెండు : ఎంతో అనుభవం వుండి కూడా, చిన్న జీవిత సత్యాన్ని తెలుసుకోలేక పోవటం.

మూడు : తన చేతకానితనాన్ని కోపంగా మార్చుకోవటం..." అన్నాను చీమ వైపు విజయం సాధించిన విక్రమార్కుడిలా చూస్తూ.

"ఇంకొకటి కూడా వుంది" అంది చీమ.


"ఏమిటది?" అని అడిగాను ఆశ్చర్యంగా.

"అవతల వారి సామ్రాజ్యంలో అనవసరంగా వేలుపెడితే కాటు తప్పదు. ఇది నాలుగో సత్యం" అంటూ నవ్వింది.

ఆ విషయం నాకు తోచనందుకు సిగ్గు పడుతూ "అవును. ప్రమాదం జరిగిన తర్వాత 'అయ్యో-నాకు తెలీదే, నాకు తెలియక పుట్టలో వేలు పెట్టానే, నాది అమాయకత్వమే' అంటూ వాపోతే ప్రయోజనం ఉండదు" అంటూ అక్కణ్ణుంచి కదిలాను.

మనిషి వ్యక్తిత్వాన్ని నిర్మించే నాలుగు అంశాలూ నాకు బోధపడ్డాయి.

ఇకనుంచీ చిన్నపిల్లలకి ఏడు చేపల కథని ఈ విధంగా చెప్పాలని నిశ్చయించు కున్నాను.




*(విజయంలో భాగస్వామ్యం)*

# దుఃఖ కారణం

అభిమన్యుడు యుద్ధంలో మరణించినప్పుడు శవం పక్కనే కూర్చుని కృష్ణార్జునులు భోరున ఏడుస్తున్నారట.

అర్జునుడ్ని ఎవరో, "ఎందుకంత దుఃఖిస్తున్నావు?" అని అడిగారట.

"కొడుకు మరణించినందుకు ఈ దుఃఖం" అన్నాడట.

అదే ప్రశ్న "కృష్ణా! నీకెందుకు విచారం" అని కృష్ణుడిని అడిగారట.

"... ఇంత కష్టపడి భగవద్గీత బోధించానే. అయినా అర్జునుడు దుఃఖాన్ని వదల్లేకపోయాడే అని విచారిస్తున్నాను" అన్నాడట కృష్ణుడు.



*(మైండ్ పవర్ నెం.1 అవటం ఎలా ?)*

# అంతర్గత శక్తి

అతడు కస్టమ్స్ హవుస్‌లో ఉద్యోగి. ఆ రోజు మామూలుకన్నా ముందుగానే ఇంటికొచ్చాడు, తన ఉద్యోగం పోయిందని భార్యకి చెప్పటానికి!

"కస్టమ్స్ ఉద్యోగిగా నేను పనికిరానని నాకు తెలుసు. ఇన్నేళ్ళపాటు నన్ను భరించారంటేనే ఆశ్చర్యంగా వుంది" విషాదంగా అన్నాడు.

"...నాకు మాత్రం ఆనందంగా వుంది" అంది అతడి భార్య. "మనం తీసుకోలేని నిర్ణయాన్ని వాళ్ళు తీసుకొన్నారన్నమాట. ఇప్పుడిక మీరు హాయిగా పుస్తకాన్ని వ్రాయటం ప్రారంభించవచ్చు..."

"ఏమిటి నువ్వు అంటున్నది?"

"మీరెప్పట్నుంచో అనుకుంటున్న ఆ కథాంశంతో మీ రచన ప్రారంభించండి. ఇంత ఖాళీ మళ్ళీ దొరకదు... **మీలో నిరర్థకంగా పనిచేసే కస్టమ్స్ ఉద్యోగి లేడు**. ఒక మంచి రచయిత వున్నాడు..."

"కానీ తిండి?"

ఆమె చూపించిన డబ్బు చూసి అతడాశ్చర్యపోయాడు. "ఎక్కడిది ఇది?" అని అడిగాడు.

ఆమె అతడి దగ్గరగా వచ్చి అన్నది "ఏదో ఒకరోజు మీరొక మాస్టర్ పీస్ వ్రాస్తారని నాకు తెలుసు. అందుకే మీరిచ్చిన జీతంలోంచి కొద్దికొద్దిగా తీసి దాస్తూ వచ్చాను. కొంతకాలం వరకూ పొదుపుగా వాడుకుంటే అది చాలు..." ఆమె కంఠం నమ్మకంగా, స్థిరంగా పలికింది.

ఆ నమ్మకం లోంచి, స్థిరత్వం లోంచి – అమెరికన్, సాహిత్యాన్ని కుదిపేసిన THE SCARLET LETTER అన్న నవల పుట్టింది.

దానిమీద ఆ దంపతులకి మూడున్నర కోట్లు రాయల్టీ లభించింది.




*(విజయంలో భాగస్వామ్యం)*

# ప్రేమ - నమ్మకం

మార్క్ అనే రచయిత (కార్ల్‌మార్క్స్ కాదు) 1989లో జరిగిన ఒక భూకంపం గురించి వ్రాసాడు. అర్మేనియాలో 8.2 స్కేలులో వచ్చిన ఈ భూకంపం కేవలం నాలుగే నాలుగు నిమిషాల్లో ముప్పైవేల మందిని పొట్టన బెట్టుకుంది.

ఆ సమయంలో ఒక తండ్రి తన కొడుకుని వెతుక్కుంటూ ఆ స్కూలుకి వెళ్ళాడు. భూస్థాపితమైన భవంతి తాలూకు శిథిలాలూ, రాళ్ళూ మాత్రమే ఉన్నాయక్కడ. ఒకప్పుడు స్కూలు ఉన్న ఛాయలు కూడా లేవు.

అతడికి బాగా దుఃఖం వచ్చింది. "ఏ కష్టమొచ్చినా నేను నీకున్నాననుకో బాబూ" అని తరచు కొడుకుతో అనేమాట గుర్తొచ్చి, ఆ దుఃఖం మరింత ఎక్కువైంది.

చుట్టూ పరిస్థితి మరింత భయానకంగా వుంది. కొన్ని మైళ్ళ దూరంలో పేలిన అగ్నిపర్వతపు సెగలు వేడిగా తగుల్తున్నాయి. మరోవైపు ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఊరంతా మంటలు వ్యాపించాయి. మరణించిన వారి ఆప్తుల ఆర్తనాదాలు, సర్వనాశనం అయిన వారి ఏడుపులు, మరికొన్ని గంటల్లో ఇంకొక భయంకరమైన భూకంపం రాబోతున్నదని రేడియో హెచ్చరిక, సురక్షిత ప్రాంతాలకి చేరుకొమ్మని ప్రకటనలు... వీటన్నిటితో ఆ ప్రదేశమంతా గందరగోళంగా వుంది. మరణించిన వారిని వదిలేసి మరికొందరు సురక్షిత ప్రాంతాలకి చేరుకుంటున్నారు కూడా.

తన కొడుకుని స్కూల్లో దిగపెట్టినప్పుడు, వాడు క్లాస్ రూమ్‌కి ఎటువైపు వెళ్ళేవాడో తండ్రికి లీలగా గుర్తుంది. ఆ విధంగా మనసులోనే లెక్కకట్టుకుంటూ, శిథిలాలకి వెనుక వైపు వెళ్ళాడు. అక్కడే కొడుకు తాలూకు క్లాసు రూమ్ ఉంటుందని నిశ్చయించుకున్నాక, వంగి మట్టిని పక్కకి తొయ్యటం ప్రారంభించాడు.

కొద్దిసేపట్లోనే అక్కడికి మిగతా తల్లిదండ్రులు వచ్చారు. 'బాబూ... నాయనా' అన్న రోదనలతో ఆ ప్రదేశం మార్మోగింది. అందరు తల్లిదండ్రులూ లేరక్కడ. కొన్ని కుటుంబాలు మొత్తంగా భూకంపంలో తుడిచిపెట్టుకుపోయాయి.

పెద్ద పెద్ద రాళ్ళనీ, మట్టినీ తీస్తున్న అతడితో "... ఎందుకిదంతా" అన్నారు కొంతమంది.

మనుష్యులతో సాధ్యమయ్యేపని కాదది. కొందరు తండ్రులు ఫైర్ డిపార్ట్‌మెంట్‌ని పిలిపించటానికి ప్రయత్నించారు. వారి నుంచి ఒకటే సమాధానం. "... బ్రతికున్న వాళ్ళని బయటకు తీయటానికే సమయం సరిపోవటం లేదు. అక్కడికెలా రాగలం?"

వారు చెప్పింది కూడా కరెక్టే. అర్మేనియా బీదదేశం. క్షణాల్లో ఏర్పాట్లు జరగవు. నగరమంతా మంటల్లో చిక్కుకుని వుంది. ఉన్నది నాలుగే ఫైర్ ఇంజన్లు.

వాటివల్ల లాభం లేదనుకుని, ఇద్దరు ముగ్గురు తండ్రులు అతడికి సాయం చేయబోయారు. క్రింద సమాధుల్లో శరీరాలు కుళ్ళిపోవటానికి ఒకటి రెండు రోజులు చాలు. ఈ లోపులో వాటిని బయటకి తీస్తే కనీసం పిల్లల్ని గుర్తుపట్టవచ్చు. అందుకే వారి ప్రయత్నం.

అయితే వారి పట్టుదల రెండు గంటల్లోనే నీరు కారిపోయింది. సిమెంటు దిమ్మెలు, దుమ్ము ధూళి, పెద్ద పెద్ద రాళ్ళు – అన్నిటికన్నా ముఖ్యంగా, ఎంత క్రిందకి, ఎక్కడ తవ్వితే పిల్లలు దొరుకుతారో తెలియని పరిస్థితి. రెండంతస్థుల భవంతి పూర్తిగా భూమిలో కప్పబడి పోయివుంది.

చీకటి పడగానే అక్కడ ఉన్నవారు రోదిస్తూనే ఇళ్ళకు తిరిగిపోయారు. అతడు మాత్రమే రాత్రంతా అక్కడి రాళ్ళు తొలగిస్తూ వుండిపోయాడు. మరుసటి రోజు ప్రొద్దున్న చాలామంది తల్లిదండ్రులు రాలేదు. పోలీసులు వచ్చారు. “ఏమీ లాభం లేదు. మా చీఫ్ సాయంత్రం మరికొంత మందిని పంపుతారు. రేప్రొద్దున్నకల్లా మీకు శరీరాల్ని అప్పగించే పూచీ మాది” అన్నారు.

అతడిది  ఒకటే సమాధానం. “మీరు నాకు సాయం చేసేటట్టయితే ఇక్కడుండండి. లేనట్టయితే నా సమయం వృధా చెయ్యొద్దు.”

అతడికి పిచ్చెక్కిందనుకున్నారు కొందరు. కొందరు ఆ తండ్రి హృదయాన్ని అర్థం చేసుకున్నట్టు జాలి (?)తో తలూపారు. అతడొక్కడే గునపంతో తవ్వుతూ, పారతో మట్టి తీస్తూ అక్కడే వుండిపోయాడు. చేతులు రక్తంతో తడిసిపోయాయి. పన్నెండు గంటల్నుంచీ అలా తవ్వుతూనే వున్నాడు.

18 గంటలు... 24 గంటలు ... 36 గంటలు ...

ఆ తరువాత 38వ గంటలో ఒక పొడవాటి దూలం పక్కకి తొలగిస్తుంటే అడుగునించి, “...నాన్నా!” అని వినపడింది కొడుకు కంఠం.

అర్ధరాత్రి చీకటిలో, ఆ నిశ్శబ్దంలో, అట్టడుగు సమాధిలో బ్రతికివున్న ఒక నమ్మకం!

కంఠం దుఃఖంతో, ఆనందంతో పూడుకుపోగా “అర్మాండ్” అని కొడుకుని ఎలుగెత్తి పిల్చాడు.

“నాన్నా. నేనే! నువ్వొస్తావని ఇక్కడ అందరికీ చెప్తూనే ఉన్నాను” కొడుకు క్రింద నుంచి అంటున్నాడు.

ఈ లోపులో అతడు మరికొంత మట్టి తొలగించి రంధ్రం పెద్దది చేసాడు. లోపలికి కాస్త వెలుగు పడింది. ఒక దూలం అడ్డంగా పడటం వల్ల, ఇంటికప్పు త్రిభుజాకారంలో నిలబడి కొందరు పిల్లల్ని రక్షించింది. దాహంతో, ఆకలితో, భయంతో బిక్కచచ్చిపోయి వున్నారు వాళ్ళు. ఏడవటానికి కూడా వారికి ఓపిక లేదు.

"లోపల ఎంత మంది వున్నారు?"


"మొత్తం ముప్పై రెండు మంది. పద్నాలుగు మందిమి మిగిలివున్నాము."

అతడు చెయ్యి అందిస్తూ "దీన్ని పట్టుకో. జాగ్రత్తగా పైకి రా" అన్నాడు.

"ముందు వీళ్ళని పైకి తియ్యి డాడీ. నువ్వు నా కోసం ఎలాగు ఉంటావుగా."

ప్రేమంటే నమ్మకం. ఒక మనిషి ప్రేమపై మరొక మనిషికి వున్న నమ్మకం గురించి చెప్తుందీ సంఘటన. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవటం కోసం ఎంత నిజాయితీ గల ప్రేమ వుండాలో కూడా చెప్తుంది.

".... మనిద్దరం" అంటే అది! కష్టమొచ్చినప్పుడు 'నేనున్నాను' – అన్న నమ్మకం ఇవ్వగలగటం! చివరి వరకూ నిలబడగలగటం!! ప్రతిఫలం ఆశించనిది ప్రేమ అంటారు. ట్రాష్. నీరు పొయ్యకపోతే చెట్టు కూడా బ్రతకదు.



*(విజయంలో భాగస్వామ్యం)*

# బూమరాంగ్

క్రమశిక్షణ గురించి ఒక సరదా అయిన కథ చదవండి. పైకి చాలా మామూలుగా కనపడినా... చిన్నచిన్న సూచనల ద్వారా, కటువైన మంచి నిర్ణయాల ద్వారా పిల్లల్ని సరయిన మార్గంలోకి ఎలా తీసుకురావచ్చో చెప్పే గొప్ప సందేశం ఉన్న కథ ఇది.

వేసవి శెలవుల్లో నా ముగ్గురు పిల్లల్ని తీసుకుని మా అక్కగారి ఇంటికి వెళ్ళాను. అదే సమయానికి మా బావగారి చెల్లెలు తనవాళ్ళని కూడా తీసుకొచ్చింది. మొత్తం ఆరు కోతులు ఒక ఇంట్లో చేరితే ఎలా ఉంటుందో మీకు తెలిసిందే కదా.

నగరానికి దూరంగా ఉన్న హాలిడే రిసార్ట్‌కి మా బావగారు ఆదివారం ప్లాన్ చేసారు. దాని గురించి మా అక్క కథలు కథలుగా చెప్పింది. వాటర్ గేమ్స్, హార్స్ రైడింగ్, రోప్ వాక్, రాక్–క్లైబింగ్... ఇలా ఎన్నో చెప్పి ఊరించింది. కాటేజ్ కూడా బుక్ చేసారు. మొత్తం పదిహేనువేలు. ధర కాస్త ఎక్కువే అయినా పిల్లల సంతోషానికి మించింది ఏముంటుంది అనుకున్నాం. వాళ్ళు ఎంత ఎగ్సైట్ అయ్యారంటే శనివారం రాత్రి దాదాపు నిద్రపోలేదు.

ఆదివారం పొద్దున్నే బావగారి వాన్‌లో అందరం బయల్దేరాం. మొత్తం పదిమంది. వాన్ పెద్దది అవ్వటంతో ఇబ్బంది లేదు. వెళ్ళే ముందే బావగారు పిల్లలతో స్ట్రిక్ట్‌గా 'దారి మధ్యలో అది కొనిపెట్టు, ఇది కావాలి' అని అడగకూడదు, ఒకళ్ళమీద ఒకళ్ళు ఫిర్యాదు చేసుకోకూడదు, అరగంటకి ఒకసారి ఎవరైనా కిటికీ దగ్గర కూర్చోవాలనుకుంటే తమ స్థానం ఖాళీచేసి వారికి ఇవ్వాలి. వాదనలు, గట్టిగా దెబ్బలాడుకోవటం సహించను. ఇలాంటివి ఏమాత్రం జరిగినా మనం వెనక్కి వచ్చేస్తాం' అని చెప్పారు. కారు బైల్దేరిన మొదట్లో కాస్త బాగానే ఉన్నారు కానీ, అయిదు నిమిషాలయ్యేసరికి వాళ్ళు అందులో ఏ ఒక్క నిబంధనా పాటించలేదు. ఆకలి అని ఒకళ్ళు, ఐస్‌క్రీం అని మరొకరు. ఆ పై మరో పది నిముషాల్లో ఎవరు ఎక్కడ కూర్చోవాలి అనే విషయమై ప్రారంభమైన గొడవ, గోలగోలగా అరుచుకుంటూ ఒకర్నొకరు పిడిగుద్దులతో కొట్టుకోవటం వరకూ వెళ్ళింది. మా ఆయన చెల్లెలి ఆఖరిపిల్ల గట్టిగా ఏడవటం మొదలు పెట్టింది. ఇలా దాదాపు అరగంట జరిగే సరికి అందరి సంభాషణా అకస్మాత్తుగా ఆగిపోయింది. దాని స్థానే తమ కళ్ళని తామే నమ్మలేనంత ఆశ్చర్యం చోటు చేసుకుంది.

కారు ఆగుతూంటే పిల్లల్లో ఒకరు 'ఇదేమిటి మనం తిరిగి ఇంటికి వచ్చేసాం' అని గట్టిగా అరిచాడు. బావగారు స్టీరింగ్ దగ్గర నుంచి దిగుతూ మొహంలో ఏ భావమూ


లేకుండా 'చెప్పాను కదా' అని క్లుప్తంగా లోపలికి వెళ్ళిపోయారు. అందరూ షాక్. గాఢమైన నిశ్శబ్దం. నాకు తెలిసినంతలో మా పిల్లలు అంత షాక్ అవటం నేనెప్పుడూ చూడలేదు. మా ఇంట్లో వాళ్ళు ఆడింది ఆట, పాడింది డ్యూయెట్.

పిల్లలకి దాదాపు ఏడుపు ఒకటే తక్కువ. క్రికెట్ బ్యాటూ వగైరా సామాన్లన్నీ సణుక్కుంటూ లోపలికి తీసుకెళ్ళారు. వారం రోజుల తర్వాత తిరిగి అదే రిసార్టు బుక్ చేస్తామని ప్రామిస్ చేసాక భోజనం చేసారు.

చిత్రం ఏమిటంటే ఈసారి వ్యాన్‌లో ఒక్కళ్ళు కూడా కిటికీ సీటు కోసం అరిచి గీపెట్టలేదు. అంతకు ముందుసారి ఐస్‌క్రీం కావాలని ఒకళ్ళూ, 'పానీపూరీ' అని మరొకళ్ళూ మంకు పట్టుపట్టటం గుర్తొచ్చింది. సరదాగా జోకులేసుకుంటూ, అంత్యాక్షరి ఆడుకుంటూ ప్రయాణం సాగించారు. క్రమశిక్షణతో ఉన్న హుషారుకీ, మొండితనంతో కూడిన అల్లరికి తేడా ఆరోజు నాకు ప్రాక్టికల్‌గా తెలిసింది. రిసార్ట్ చేరుకున్నాం. కళ్లెం వదిలేసిన గుర్రాల్లాగ పిల్లలు ఆడుకోసాగారు.

'అంతా బావుంది కానీ పోయిన వారం అనవసరంగా ఈ రిసార్ట్‌కి డబ్బుకట్టాం' అన్నాను. అక్కయ్య నవ్వి 'నిజానికి మా ఆయన ఈ రోజే కట్టారు. గత వారం కాదు. ఇలాగే జరుగుతుంది అని మాకు ముందే తెలుసు' అంది.

ఈ కథ అందరికీ నచ్చకపోవచ్చు. 'పిల్లల మీద మరీ ఇంత ప్రాక్టికల్ జోకా!' అని వాదించవచ్చు. కానీ నేర్చుకోగలిగితే ఇందులో మంచి పాఠం ఉంది.





## YANDAMOORI VEERENDRANATH

VELUGU VENNELA DEEPALU

“విజయానికి అయిదు మెట్లు” నుంచీ “టీన్స్ పిల్లల పెంపకం” దాకా
నా వ్యక్తిత్వవికాస పుస్తకాల్లో, Subject matterతో పాటూ
నా అనుభవాలూ, కథలూ కూడా వ్రాస్తూ వచ్చాను. మిగతా రచయితల
పుస్తకాలకీ, వీటికీ తేడా బహుశా ఇదే అనుకుంటాను.

దురదృష్టవశాత్తూ, ఇటువంటి పెర్సనాలిటీ డెవలప్‌మెంట్ పుస్తకాలు పిల్లలు చదవరు. కానీ ఈ పుస్తకాల్లో కొన్ని కథలు పిల్లలకి ఉత్సాహాన్నీ, ఉత్తేజాన్నీ ఇస్తాయి. అన్నిటినీ క్రోడీకరించి ఒక చోట చేరిస్తే, వాటిని పిల్లలు తెలుసుకునే అవకాశం ఉంటుందనే అలోచనే ఈ పుస్తకం.

నా వివిధ వ్యక్తిత్వ పుస్తకాల్లో నుంచి ఏరి కూర్చిన కథల సమాహారం ఇది. ఇందులో కొన్ని విదేశాలకి సంబంధించిన పురాతన గాథలు, మరి కొన్ని బౌద్ధానికి సంబంధించిన పుస్తకాల్లోంచి, ఇంకా కొన్ని ఇంటర్నెట్ నుంచీ స్వీకరించినవి. చాలా వరకూ నావి.

పెద్దలు పిల్లలికి బెడ్‌రూం కథలు చెప్పటం తగ్గిపోయింది.
‘అసలు మాకు తెలుస్తే కదా చెప్పటానికి’ అంటున్నారు కొందరు.
ఈ పుస్తకం ఆ లోటు తీరుస్తుందనే అశిస్తూ...

– యండమూరి వీరేంద్రనాథ్

నవసాహితి బుక్ హౌస్
కార్ల్‌మార్క్స్ రోడ్, రామమందిరం వద్ద
విజయవాడ-520 002.
ఫోన్ : 0866-2432885